
పురాణములు

# భాగవత,వామన, మార్కండేయ మహాపురాణాలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ధనసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# శ్రీ భాగవత, వామన, మార్కండేయ
# మహాపురాణములు

రచయిత:

విద్వాన్ కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులుగారు

పబ్లిషర్సు:

వేంకట్రామ అండ్ కో.

బెజవాడ- మద్రాసు

1939

కాపీరైటు రిజిష్టరు]

[వెల రు 4—0—0

# శ్రీ భాగవతము

## విషయసూచిక

---


ప్రథమ స్కంధము

అవతారిక 1

హయగ్రీవావతారము 2

మధుకైటభ సంహారము 3

వ్యాసుడు తపమొనర్చుట 6

తారాశశాంకము 7

పురూరవు కథ 8

శుకుని చరిత్ర 10

శుకుడు జనకునికడ కరుగుట 11

శుక జనక సంవాదము 13

శుకుని వివాహము 16

ద్వితీయ స్కంధము

వ్యాస జన్మకథ 17

మహాభిషుని చరిత్ర 18

గంగా శంతనుల వివాహము 19

యయాతి చరిత్ర 20

తృతీయ స్కంధము 21

త్రిమూర్తులు విచిత్రసృష్టి దిలకించుట 23

పరాశక్తి త్రిమూర్తుల కాత్మతత్త్వము

విశదీకరించుట 24

బ్రాహ్మణుని కథ 25

ధ్రువ సంధి చరిత్ర 27

చతుర్థ స్కంధము 30

వాసుదేవ పూర్వ వృత్తాంతము 31

నరనారాయణ చరిత్ర 32

ప్రహ్లాదుడు నారాయణునితోఁ

బోరుట 33

హరికి భృగు శాపము కల్గుట 35

కృష్ణావతారము 37

పంచమ స్కంధము 40

మహిషాసుర వృత్తాంతము 40

ఇంద్రాదులు మహిషునితోఁ బోరుట 41

ఆదిశక్తి స్వరూప వర్ణనము 43

మహిషాసుర యుద్ధ సన్నాహము 46

మండోదరియను రాజకన్య కథ 48

మహిషాసుర వధ 49

శుంభనిశుంభ వధ 50

శుంభుండు దండు వెడలుట 51

శుంభనిశుంభులు దేవితోఁ బోరి

చచ్చుట 53

సురథుండను సత్యవ్రతుని కథ 54

బ్రహ్మ విష్ణు సంవాదము 55

షష్ఠ స్కంధము

వృత్రాసుర జననము 58

వృత్రాసుర విజృంభణము 60

వృత్రాసుర సంహారము 62

నహుషుని చరిత్ర 63

కర్మప్రభావము 66

హరిశ్చంద్రుఁడు సంతానార్థి యగుట 68
వశిష్ఠ పూర్వ వృత్తాంతము 69
మిత్రావరుణుల కగస్త్య వశిష్ఠు లుదయించుట 70
నిమి కడమ చరిత్ర 71
హైహయుల చరిత్ర 72
హైహయులని పేరుగల్గుట 73
ఏకవీర చరిత్ర 75
యశోవతి వృత్తాంతము 77
పర్వతనారదుల చరిత్ర ,,
నారదునకు మాయావిశేష సంసారము నెఱపుట 78
నారదుఁడు స్త్రీరూపు గనుట 79

## సప్తమ స్కంధము

బ్రహ్మ మొదటి సృష్టి 82
ప్రతిసృష్టి 83
సుకన్య భర్తయగు చ్యవనునికి నేత్రంబు లొదవించుట 84
చ్యవనుఁ డశ్వినులకు సోమం బిచ్చుట 86
రేవతీ బలరామ వివాహము 87
ఇక్ష్వాకు చరిత్ర 89
మాంధాత జననము 90
త్రిశంకు శాపవిమోచనము 92

## అష్టమ స్కంధము

ఆది వరాహావతారము 95
ఆదిసృష్టి 96

## నవమ స్కంధము

ప్రకృతి స్వరూప నిరూపణము 98
సరస్వతి గంగాశాపంబున నదియగుట 99
గంగ రాధాకృష్ణులవలన నుదయించుట 100
గంగ హరిపాదమునఁ బుట్టిన విధము 101
తులసీ చరిత్ర 104
కుశధ్వజు చరిత్ర 105
ధర్మధ్వజు చరిత్ర 106
హరి శంఖచూడుని పూర్వవృత్త మెఱుక పఱచుట 107
హరి శంఖచూడుని భార్యావ్రతము చెఱచుట 110
ఇంద్రుఁడు లక్ష్మీకృపకుఁ బాత్ర మగుట 112
స్వాహోపాఖ్యానము 113
స్వధోపాఖ్యానము 114
దక్షిణోపాఖ్యానము ,,
దేవసేన యను శక్తి చరిత్ర 115
కామధేను చరిత్ర 117
రాధాచరిత్ర ,,
సుయజ్ఞు చరిత్ర 119

## దశమ స్కంధము

అగస్త్యుండు వింధ్యగర్వం బణఁచుట 120

## ఏకాదశ స్కంధము 122

## ద్వాదశ స్కంధము 123

# వామనపురాణము

## విషయసూచిక


| | |
|---|---|
| వామన పురాణ స్వరూపము | 1 |
| హరలలితము | 2 |
| శంకరుడు కపాలమును ధరించిన కథ | 4 |
| హరిహర సంవాదము కపాలమోచన తీర్థప్రశంస | 6 |
| హరి వీరభద్రుల యుద్ధము | 7 |
| శివుని కాలస్వరూపము | 9 |
| మేషాది రాశుల స్వరూపము | 10 |
| నరనారాయణుల చరిత్ర | 11 |
| దేవతల వాహనములు | 13 |
| రాక్షసుల వాహనములు | ,, |
| అంధకాసుర యుద్ధము | 14 |
| సుకేశి చరిత్రము | 16 |
| హరిహరారాధన వ్రతములు- దేవతలు నిద్రించుట | 19 |
| కురుక్షేత్ర మేర్పడిన కథ | 21 |
| హిమవంతునికి ఉమాదేవి జనించుట | 24 |
| వినాయక జననము | 25 |
| దేవతలు విష్ణుహృదయమున శివుని దర్శించుట | 28 |
| దండోపాఖ్యానము | 29 |
| చిత్రాంగదోపాఖ్యానము | 30 |
| దండదహనము | 37 |
| శ్రీదాముని చరిత్ర | 39 |
| ఫలశ్రుతి | 41 |

# మార్కండేయ పురాణము

## విషయసూచిక


| | |
|---|---|
| భారతప్రశంస | 2 |
| దూర్వాసుండు వపువను నప్సరసను శపించుట | 4 |
| ద్రోణపుత్రులు పక్షులయి వపువునకు జనించుట | 5 |
| పక్షులు తమ పూర్వజన్మము తెలుపుట | 7 |
| విష్ణుమూర్తి నాలుగుమూర్తులు | 9 |
| పాండవుల వృత్తాంతము | 10 |
| విశ్వేదేవు లుపపాండవులయి పుట్టుట | 12 |
| హరిశ్చంద్ర కథ | 14 |
| సుమతియను ముని తండ్రికి సృష్టి ప్రకారము తెలుపుట | 16 |
| జీవుల పాపపుణ్యములంబట్టి కలుగు ఫలములు | 18 |
| నరకములు-వానిఁబొందువారు | 20 |
| పాపములంబట్టి వచ్చు జన్మములు | 26 |
| దత్తాత్రేయ చరిత్ర | 28 |
| ఋతధ్వజుఁడను పేరుగల కువలయాశ్వుని చరిత్ర | 33 |
| మదాలసా వివాహము | 39 |
| మదాలసా వియోగము | 40 |
| నాగరాజు మదాలసను గుమార్తెగా బడయుట | 41 |
| మదాలసా పునస్సమాగమము | 44 |
| మదాలస తన సంతానమునకు విజ్ఞానోపదేశము సేయుట | 45 |
| మదాలస యలర్కునకు ధర్మోపదేశము చేయుట | 46 |
| అలర్కుఁడు తల్లియిచ్చిన యుంగరముం జూచుట | 48 |
| దత్తాత్రేయుఁడలర్కునకు జ్ఞానముపదేశించుట | ,, |
| యోగ రహస్యములు | 52 |
| యోగ విఘ్నములు-చికిత్సలు | 56 |
| అరిష్ట లక్షణములు | 64 |
| బ్రహ్మప్రాప్తి కుపాయము | 67 |
| ఉత్తమగతులకు బోవువారు | 71 |
| భారతవర్ష ప్రశంస | 72 |
| కూర్మ సంస్థానము | ,, |
| లోకపాదములు | 76 |
| కూర్మసంస్థానమున దేవతలు-రాసులు | 77 |
| స్వారోచిషమను చరిత్ర | 79 |
| నవనిధుల వృత్తాంతము | 87 |
| ఔత్తమ మన్వంతర చరిత్ర | 90 |
| తామస మన్వంతరము | 95 |
| రైవతమను వృత్తాంతము | 97 |
| చాక్షుష మన్వంతరము | 99 |
| వైవస్వత ,, | 102 |
| 'సప్తశతి' యను దేవీచరిత్రము | 105 |
| బ్రహ్మకృత దేవీస్తవము | 107 |
| దక్షసావర్ణి మన్వంతరము | 115 |
| బ్రహ్మ సావర్ణి | ,, |
| ధర్మ ,, | 116 |
| రుద్ర ,, | ,, |
| రౌచ్య ,, | ,, |
| భౌత్య ,, | 117 |
| సూర్యుఁడాయుష్కారకుఁడు | 119 |
| నాభాగ చరిత్ర | ,, |
| వత్సప్రి చరిత్ర | 121 |
| అవీక్షిత్తు చరిత్ర | 122 |
| మరుత్తను చక్రవర్తి కథ | 124 |
| నరిష్యంతుని చరిత్ర | 125 |
| దముని చరిత్ర | 126 |
| ఫలశ్రుతి | ,, |

శ్రీరస్తు

# శ్రీ భాగవతము

## అవతారిక

శ్రీదేవీపదకంజముల్ దలఁచుచున్ జేమోద్భసంధించి బ్ర
హ్మాదుల్ సన్నుతిసేసినట్టి కథ లయ్యో ముఖ్యఘట్టమ్ములన్
వాదోడై స్ఫురియింప బాలకులకున్ భక్తిప్రబోధమ్ముగా
నాదిన్ శ్రీగణనాథు వాణి మదిలో నర్చించి కీర్తించెదన్॥

శ్రీమంతంబగు నైమిశంబున సూతుండు శౌనకాదుల ప్రార్థన మంగీకరించి దేవీభాగవతంబును దాను మున్ను వ్యాసునివలన శుకునితోడ విన్నచందంబున నిట్లని వినిపింపఁ దొడంగె.

వ్యాసుడు సరస్వతీతీరంబునం దాశ్రమంబునఁ దపోనిష్ఠాగరిష్ఠుండై యున్నతఱి, పక్షిదంపతు లనురాగంబునఁ దమ పిల్లలం బొదిగి, పెంచుకొనుచుండుటగని, పుత్రవ్యామోహపరవశుండై, తనకు సంతతి లేదని వగచి, నారదుం గనుఁగొని నాకు సంతానం బనుగ్రహింపఁగల వేల్పెవ్వండని ప్రశ్నించె. అంత నారదుండు మౌనివర్యా! మున్ను చతుర్ముఖుండు విష్ణువును వినుతించి తండ్రీ! నీకన్న మిన్నయగు దేవుడెవ్వండుం

గానరాదు. ఇమ్మాట నిక్కంబగునే? తత్వం బెఱింగింపుమని వేడిన, బ్రహ్మకు విష్ణు విట్లనియె.

వత్సా! నీవును నేనును శివుండును సృష్టి స్థితి లయంబులకు కారణులమని మానవు లనుకొందురు. రాజసశక్తిచే నీవు సృజింతువు. సాత్వికశక్తిచే నేను పాలింతును. తామసశక్తిచే హరుడు హరించును. కాని యీ కార్యముల మనము స్వతంత్రులము కాము. నా శక్తియగు లక్ష్మి కధీనుండనై నేను జరించుచున్నాను. ఒకప్పుడు నాశిరంబు వింటికొనవలన తెగిపడిన నన్నిసీ దేవతలు శక్తిప్రేరణంబున నశ్వశిరంబు నామేననతికిరి. అట్లాన నేను హయగ్రీవుండనై రాక్షససంహారం బొనర్చితి. ఇది పరాశక్తియాజ్ఞమేరకు ప్రవర్తిల్లుటయ కాని వేఱుగాదు అనియె. అయ్యవతారవిశేషంబు వినిపించెద వినుండు.

## — హయగ్రీవావతారము —

శ్రీహరి మున్ను చక్రంబు బూని శార్ఙ్గంబుపట్టి గరుడు నెక్కి రక్కసుల నుక్కడంప యుద్ధంబున కరిగె. అటు సని పదివేలయేండ్లాయోధనంబు నెఱపి, విశ్రాంతిగైకొననొక్కచో బద్ధాసనంబున గూరుచుండె. అల్లల్ల నిద్రావశుండయ్యె. అత్తఱి నే బ్రహ్మ శంకరాది దేవబృందంబుల గలిసికొని యజ్ఞంబొనర్ప సమకట్టి నిద్రాముద్రితుండైన హరి మేల్కొల్పంగోరి వజ్రదంష్ట్రంబను నొక్కకీటంబును సృష్టించి పంపె. అది మోపెట్టియున్న హరి ధనువునారి మొదలు గొఱికిన, నది జగి పెటిల్లున నెగసిపడి హరిశిరంబు హరించె.

అంతట బ్రహ్మాదులు వెఱఁగంది యప్పుడుగలఁచి శోకించుచు నింక నెట్లని హరికై పరితపింప పద్మగర్భుండను సురలారా! విషాదంబు పడవలదు. కర్తవ్యంబుఁ జింతింపుడు. మీరు జగదీశ్వరిని వినుతింపుడు. శ్రీమాత మీ మన్నను గ్రహింపగలదు. శోకము తరించుట కిదియ యుపాయం బనియె. వారప్పితామహు నానతి యథోక్తగతి జగదంబ నాశ్రయించిన నద్దేవి ప్రసన్నయై యిట్లనియె. హయాననుం డను యాతుధానుండు మానుల వేధించుచు లోకత్రయంబు బాధించుచున్నాఁడు. వానిం జెగటార్ప హరి హయాననుండై యవతరింపగలఁడు. కావున విశ్వకర్మచే నితని మొండెంబున నశ్వశిరంబు నతికింపఁ జేయుడు పొండనిన, పరాంబికయాన నౌదల దాల్చి బృందారక బృందంబు తరలిచని యట్ల యొనరించిరి. అంత హరి నిదుర నుండి మేల్కొన్నరీతి హయగ్రీవుండై లేచి హయాననుం డను నా రక్కసుం బరిమార్చి ముల్లోకంబులకు హర్షం బావహిల్లంజేసె.

## —♦ మధుకైటభసంహారము ♦—

సంయములారా! వింటిరిగదా దేవి ప్రభావము. ఆమె త్రిమూర్తులకును శరణ్యంబు. మున్ను ఫణితల్పశాయియై హరి యోగనిద్రనున్నతఱి మధుకైటభు లను నిద్దరన్నదమ్ములు రక్కసులు సముద్రంబున నిరాఘాటసంచారం బొనర్చుచుండి యజ్జలధి పొంగినదని నిర్విణ్ణులై, యిదియేమి? నీరధి యెట్లు నిలచియున్నది? దీని కాధార మెయ్యది? దీని యుత్పత్తికి కతంబేమి? యని సంశయించి యున్నతఱి సంవృ

తాకాశంబున నొక్క శబ్దంబు వినవచ్చె. వా రది విని తపో
నియమం బూని నిరంతర మననంబున నమ్మంత్రం బుపాసింప
జగన్మంగళ సింహయానయై వచ్చి వరమ్ము కోరుఁడన నమ్మధు
కైటభులు వినయ వినమితులై లేచి మ్రొక్కులిడి స్వేచ్ఛా
మరణంబు యాచించిరి. అంబ యనుగ్రహించె. అంత వా
రవ్వారాశి నలుకెలంకుల గలయంబార నీఁది యాలోకించిన
నొక్కెడ విధాత గానుపించె. తామరపూవు గద్దియ
నధివసించియున్న యన్నలువ నాలోకించి, బెదరించి గద్దియ
డిగ్గ నాజ్ఞాపించిన నవ్వారిదారుణవృత్తి కడలి కడలిం
జొబ్బారి యవ్విరించి శేషశాయియైయున్న విష్ణువును శరణు
సొచ్చె. కాని యతండు నిద్రావశుండై లేవకున్నంగని, దేవిని
వినుతించె. అంబసాకతంబున వెన్నుని యోగమాయ తొలంగి
చనియె.అంతట శ్రీమన్నారాయణుండు పరాశక్తి వైభవము
వినుతించి ముద్దుపట్టికి వివరించిన, నంబుజాసనుండును
మధుకైటభులవలని భయం బెఱింగించి వారలఁ దెగటార్చు
మని తండ్రిని వేఁడుకొనియె. అంబుజోదరుండు సుతు ననుకంపం
గనుంగొని యభయం బిచ్చితి. మధుకైటభుల నిదె యెది
రించి తుదముట్టింతు ననియె. అట్లంబుజాక్షుం డంబుజాసను
ననుగ్రహించుచున్నంతలోనన నా రాక్షసద్వయంబు దారసి
పోరొనర్పంబూనిన హరి యెదిరి నడచె. అంత నయ్యాయోధ
నంబు పంచవర్షసహస్రంబులు జరిగె. వెన్నుం డలసి విశ్ర
మింపం గోరి, వారికి తన తలం పెఱింగించి బవరంబు తొలంగి
చని మనంబున కొండొకవడి చింతించి వారి యక్షయ్యవీర
ప్రభావంబు గుఱుతించి యిచ్ఛాశక్తివలన వీరి కిచ్ఛామరణం

ననుగ్రహింపంబడియె. గావున నా శక్తియే నాకు జయంబను సంధానించుం గావుత మని తచ్చరణంబె శరణంబని నిరంతర ధ్యానసమాధిం దత్పదకంజంబుల స్మరించి నమస్కరించినంత నయ్యంబ పసిడివాన్నెయై యాకసంబున నెట్టయెదుటఁబొడసూపె. హృషీకేశుం డీశ్వరి జెక్కు తెఱంగుల వినుతించె. తల్లి ప్రసన్నయై వరబలదర్పితులైన వీరిపై నాచూపు వక్రమైన తఱి వీరు నిహతులౌదురు. కాని యిది నీచేసయ్యెడు పనికాదు. కాలం బనుకూలంబగుం గాత మనిన హరి సని వారల డీకొని పిసిపి వేసారి యలసి దీనుండై యున్న తఱి గని యంబ ప్రత్యక్షమయ్యె. దైత్యాధము లయ్యిరువురు నయ్యరవింద నయన సరసాలోకనంబుల కుసుమశరాసారంబున బీరమ్ము సెడి యొరసిల్లినఁ దారసిల్లి, వారిజనయనుండు వారిం గని మిమ్ముఁబోలిన నెఱజోదుల నే నీమున్నెఱుంగ. మీ మగం టిమికి మెచ్చ వచ్చె. మీ యిచ్చ తెలుపుం డిచ్చెదనన, యివి యేటి మాటలని సాభిమానులై యంగనసన్నిధానం బగుట నినుమడించిన దర్పంబున కన్నుగానక బళి భళి మేము వేడువారము నీ విచ్చువాఁడవునా ? యవు లెమ్మని యీ సడించి నీవ యాచించికొమ్ము వరమిచ్చెదమని దట్టించి లికిన నక్కమానార్థి సత్యార్థివలె వారల డాసి మీ ప్రాణమ్ము లిమ్మని యడిగె. వా రది విని వెఱచి తపించి చేయిజాఱెనని కంపించి మాట తిరుగ వాటంబుగామి మోమోటంబడి సరి యనిరి. మఱియు మేము నిలువ నిర్జలస్థలంబు జూపు మనిరి. వైకుంఠుండు తన తొడను సముద్రంబు నీట కలయం బెంచి, యిందు నిలువుండన వా రట్లొనర్చిరి. అంతట శౌరి తన

చక్రాయుధంబును స్మరియించె. అని వారిశిరంబుల దఱుగ నియమించినంత వారును వారి దేహంబులఁ బెంప యయ్యాయుధంబు వారి కంఠంబుల జిదిమె. అప్పాలదిండుల మేనిపాలకుప్పలుదిప్పలుగఁ బడి మెదడెల్ల నేలనిండె. అందుచే నియ్యెల మేదినినాఁ బఱగె. ఇట్లు దేవి కృపసూపుట హరి యేపు సూపి వైరుల గీటడంచి గెలుపుగొనె. కావున పరాశక్తి యపార కరుణకు బాత్రంబులై త్రిమూర్తులు తమ తమ కృత్యంబుల కృతకృత్యులైరి. కాన శక్తియే పరమశరణంబని నారదుండు ద్వైపాయనునకు విన్నవించె.

## —♦ వ్యాసుండు తప మొనర్చుట ♦—

నారదుండట్లు తెలియబల్కి యేకాక్షరమంత్రంబువాగ్బీజంబు నుపదేశించిన పరాశరసూనుండు ఘోరతపంబొనర్చె. అమ్ముని నిష్ఠ కమరమునీంద్రకోటి బెగ్గడిలి దిగ్గన నింద్రునికడ కరిగి తత్తపంబు దుర్భరమ్మగుట దెల్పిన నతఁడు త్రిలోచను వేఁడిన గరళకంధరుఁడు శశికళాధరుఁడు హరుండు ప్రత్యక్షమై ప్రసాదమేదురంబుగ సుతు నిత్తునని వరంబిచ్చె. అవ్వరం బంది మునివరుండు నిజాశ్రమంబునకు మఱలి గార్హస్థ్యంబు నడుప ననువగు నిల్లాలెవ్వత లంభించునని భావనసేయుచు భావజు కుసుమశరాపాతంబున కడులోఁగినతఱి ఘృతాచియను నచ్చర యెదురయ్యె. తపస్వి యమ్మచ్చకంటి సుందరాకారంబు నాలోకించి ధైర్యసారంబు గఱంగిన నాని కే లంటంబోయి మానులు నవ్వుదురని జ్ఞానులు దవ్వగుదురని వెఱచి చింతాకులుండై యుండె. వెండియు నమ్ముని నాయకుండు పాయని

కాంక్షను సురవనితలఁ బొందుట పరంబు పూరంబుగాదు. స్వర్గంబు చేకూరదని మున్ను దేవర్షి వలన విన్నవాఁడ. ఇంత మాత్రమనుమంత పురూరవుం డూర్వశి వలపుఁ జిక్కి చెడి యెనే? అతఁ డబ్బోటి సంగంబున దివ్యసౌఖ్యంబు చూర గొనె నని తలచి ఘృతాచికలయిక కొండంబడె. అవ్వాల్గంటియు నత్తపసితపంబున కులుకుచు కులుకుమిఠారి రాచిలుకవై మింట కెగసినఁ జూచుచు నమ్మౌని గడువ సేరని తత్తరంబున చిత్తం బుత్తలింప నింధానోత్పత్తికై యరణీమథనము నత్తఱి నమ్మౌనిసత్తముపేర్యం బరణిమధ్యంబునం బడియె. ఆ య్యరణిం బడిన ఋషివీర్యంబునుండి అగ్నివోలె నొక బ్రహ్మర్షుం డుద యించె. శుకి కుదయించిన యబ్బాలునకు విధాత శుకుండని నామకరణంబుఁ జేసె. అక్కుమారుడు తండ్రి సన్నిధి నఖిలవిద్యా పారంగతుండై తండ్రియంతవాఁడై పఱగెనని తెల్పిన సూతుం గని శౌనకాదులా చంద్రుని కథయు, పురూరవుకథయు విన వలతుము వినిపింపవేయని యడుగుటయు నతం డిట్లని చెప్పం దొడంగె.

## — ♦ తారా శశాంకము ♦ —

బృహస్పతిభార్య తార నవమోహనాంగుడగు చంద్రుని శిష్యునింగని మోహించి యతులరతులఁ బెనంగిన వానికి బుధుం డుదయించె. గురుదార సంగమించిన యప్పాపి దురంతంబుగని సురగురుండు సురవరునకు విన్నవించిన నతం డక్కలువలరాయని కెడకు దూతసంపె. వాడు వేయి యర్థాంబులగు వచనంబు లాడి తార నిమ్మని కళాధరునకు

బోధించిన, నాలంబు వినక యభంగురరోషకషాయితహృదయుండై "శక్తిగలకాంతతో గార్హస్థ్యంబు నెఱపుట యందంబుగాని కాని నా డట్టి కాపురముసేయుట చందంబుగాదని నొవ్వనాడి నాగురునిల్లాలు విరాళిగొని పైకొన నంగీకరించిన వాఁడ. నాయెడ దోసంబు వొరయదు. నే నద్దాని విడువనొల్ల" ననిచెప్పి ప్రవర్తించిన నింద్రుం డది విని దండెత్తిపోయె. అట్లిందు సురేంద్రులకు నడుమ నడరిన కయ్యంబు పెక్కు వర్షంబులు జరిగి బ్రహ్మాండంబు సంచలించిన విరించి యడ్డంబు సని తారను గురునకిప్పించి తగవు దీర్చె. పిమ్మట నుదయించిన నందనుండు నావాఁడని తారాపతియు, నావాఁడని బృహస్పతియు వాదులాడిన నగ్గురుశిష్యులవివాదంబున బ్రహ్మాదిసురవరులు తగవరులై మాధ్యస్థ్యంబు వహించి న్యాయంబు విచారించియు నిఱుకుగానక తుదకు తార నడుగుదమని యడిగి దాని సాకూతవచనంబుల, లజ్జానుభావంబుల భావంబు దెలిసికొనియు సురాచార్యు ననునయించిన నతం డాకొడుకునకు బుధుండని నామకరణంబు చేసె. ఇది ప్రసంగాగత కథ. ఇక నబ్బుధునికి నిలాకాంతయందు పురూరవుండుదయించు కత నెఱింగింతు నని యిట్లనియె.

## — పురూరవు కథ —

సుద్యుమ్నుండను చక్రవర్తి గలఁడు. అత డింద్రియవశుండుగాక నిత్యసత్యవ్రతుండై పరాక్రమాటోపంబున నిలాభారంబుఁ బూని పాలించుచుండె. అతఁడొకతఱిఁ గుమారవనికి మృగయావిహారార్థంబరిగి వేటాడి విశ్రమించి మేల్కొనునంతట

స్త్రీ యయ్యె. అతని గుఱ్ఱంబు నాఁడయయ్యె. అందులకుఁ గారణ మేమన యవ్వనంబున నొకపరి శంకరునంకంబున శాంకరి యలంకరించియుండ తాపసులు పశుపతిసందర్శనార్థము వచ్చిన, వారింజూచి లజ్జించి భవాని తటాలున వలువదాల్చె. అమ్మును లవసరంబు కాదని బదరికావనంబున కేగిరి. ఆ యమ్మయు సిగ్గున శివుని జూడ నొల్లక మారొమొగమయ్యె. అప్పుడు చంద్రశేఖరుండు శాంభవి తెలంగు గని ఆమెకు హర్షంబు గూర్చువాఁడై యివ్వని కెవ్వండువచ్చు నవ్వాఁ డాఁడుదియగునని శపించె. అది కారణంబుగా నీతని కీగతి గల్గె. అతండే ఇల యను కన్యయై బుధునియెడ విరాళిగొనిన నయ్యిరువుర కన్యోన్యానురాగంబు సుసమృద్ధంబై వారు కలిసిన, వారికిఁ బురూరవుం డుదయించె.

అవ్వల నిల కులగురుం డగు వసిష్ఠుఁ గొల్చి యాతని వలనఁ దెలిసి ఫాలాక్షు నర్చించిన శ్రీకంఠుండు నొక్కమాసంబు స్త్రీత్వంబు, నొక్కమాసంబు పురుషత్వంబు గల్గునని యానతిచ్చె. పురూరవుండును నారదు ననుగ్రహంబున దేవీమంత్రరాజంబు వడసి జపించిన దేవితామసీశక్తి ప్రసన్నయైన, నయ్యంబను వినుతించె. ఆపె యాతనికి ముక్తి ననుగ్రహించె. ఊర్వశి శాపవశంబున మర్త్యయై పురూరవుపొందు గోరి వచ్చె. ఆమె మేషద్వయంబును గాపుమనియు, నేను నేయి యాహారంబుగాఁ గొందుననియు, సురతసమయంబునఁ గాని నిన్ను నగ్నుని (దిగంబరుని)గాఁ జూడననియు నియమంబుల దెల్పినఁ నాతం డందుల కియ్యకొని యామె పొందొనర్చె. ఇట్లు కొండొకకాలంబు జరుగ, వాసవుండు నిజసభయం

నూర్వశి లేనందునఁ జింతించి తోడి తెమ్మని భటుల నంపె. వారు ప్రహారి పుత్రులో నేకతం బున్న యయ్యప్సరసని దాని చేరువ నున్న మేషయుగంబు దోలుకొనిపోవ పురూరవుండు దిగ్గన లేచి తా దిగంబరియగుట గమనింపక య య్యింద్రచారుల వెన్నంటి తరిమి ఆమ్మేషద్వయంబు దెచ్చిన నూర్వశి తొంటి నియమంబుల బాటింపమి రోజెంగి యాతని విడిచిపుచ్చె. అనుకై వన గిరి కందరారామభూముల వెదకి కురుక్షేత్రంబున దానింగని కౌగిట చేర్చియున్న, యా భూవరు నుదారవచన రచన నచ్చేసవనిత విరక్తి గొలిపి చనిన న ప్పురూరవచక్రవర్తి మూలప్రకృతిచరణంబులు వట్టి దివ్యపదంబుః జెందె. ఇది ప్రసంగానుప్రసంగంబుగ నడిగిన కథ దెల్పితి నని సూతుండు శుకుని చరిత్రం బిట్లని చెప్పం దొడంగె.

## —♦ శుకుని చరిత్ర ♦—

వ్యాసుండు శుకకుమారునికి వివాహం బొనరింప కుతూహలంబు గొని సంసారసారంబుం గూర్చి బోధింప మొదలిడెను. పలుమారు తండ్రి యొనర్చు బోధల ననుమతింపక యమ్మునిబాలకుండు వనవాసంబున కుత్సుకుండై యుండె. ద్వైపాయనుండు కొడుకుమతి మఱల్పం జాలమికి మిక్కిలి తపించి దెంపమునందలి కుందు దెమలింప సాధనంబు గానక యొకనాడు శుకుం బిలిచి దేవీమహిమానుభావంబులు వర్ణించి తెలిపి నీవు నీతోడివారలును నీ దేవీభాగవతంబు బఠింపుడనిన శుకుండును రోమహర్షణియు నీ గ్రంథంబుం బఠించిరి. కాని దాన నాతనికి శాంతి యొదవదయ్యె. అంత

కుమారునిఁ బలికి నగచి వేదవ్యాసుండు కుమారా! నీవిపుడు బోయి శుచియు, యోగియు, శాంతుండు, వస్త్రీయు, యోగప్రియుండును నగు విదేహపతి జనకు సన్నిధికి జెలివలంచు సందియంబులఁ దెలిసి రమ్మనియె.

## —♦ శుకుండు జనకునికడ కరుగుట ♦—

దంభాదిగుణములం గొని వైరిరాజన్యశిఖామణుండైన యొకరాజన్యుం డేడ? పరతత్వంబేడ? గృహస్థునికి నందును రాజ్యభోగోన్మత్తునికి మానివర్తనంబు గల్గుట యబ్బురంబు. దండంబునకు ధర్మంబు మూలంబు. అట్టి దండంబుఁబూని ప్రజల నడపు ప్రవృత్తిపరుండైన రాజు నివృత్తిపరుండెట్లయ్యె. ఇది కేవలము దంభవృత్తిగాఁ దోఁచెడిని. ఐనను జూచి వచ్చెదఁగాక యని తండ్రి యనుజ్ఞవేడిన నాతండును శుకుని కౌగిటఁజేర్చి శిరంబు మూర్కొని తనయా! నిస్పృహుండవై యామొడన నిలువక పోయి రమ్మని దీవించి యనిచిన నమ్ముని దారకుండు మిథిలానగరంబు తెరవంటి పోయిపోయి యొక వత్సరంబు నడచి యటఁ జేరుకొనియె.

శుకుం డటు సని మిథిలాపురద్వారంబు దరిసిన నట దౌవారికుండు బాలకా! ఎట కరిగెదు? ఏమి వాంఛితంబు? అని యడుగుచున్నఁ బలుకక యతఁ డతనివైపు కన్నెత్తిచూడ నైనఁ జూడక మదిలో నుప్పొంగుచుఁ జిఱునవ్వు నవ్వుచు జలింపక మందరగిరివోలె ద్వారంబుకడ నిలిచియుండె. అది గని భటుండు ఓయీ! అజ్ఞాతకులగోత్రులకు మారాజువీడు చొరరాదు. నీ నవ్వున నన్ను వంచింపఁజూచెదుగాని నీ దంభ విధా

గంటున దనివిసని దారి యిచ్చువాఁడను గాను. అని ధీరంబుగా ననియె. అంత శుకుండు ఓరీ! యాచన కరుదెంచినాఁడఁ గాను. వేఱొండు వాంఛయు లేదు. ప్రారబ్ధం బనుభవింపవలసినది శేషించుట నిట కరుదెంచితి నని తోఁచెడిని. ఇది కాశిగాదు గంగయుం గాదు. ఇందు గోరఁబడు వస్తు వేమున్నది ? కోరిననది లభింపని తావున్నదే ? అని నిరపేక్షంబుగా మఱి కొంతగా పలికిన పలుకు లాలకించి యా ద్వారపాలుండులికిపడి యతని యనుభావం బనన్యసామాన్యంబని గమనించి యంజలి ఘటించి క్షమింపు మని వేడి యమ్మునికులతిలకు ననునయించె. శుకుండును నీకుచితమైన ధర్మంబు నెఱపితి వింతేకాని యింక సైరింపవలసిన దేమి గలదనియె. అంతట నప్వారికాంక్షి మునికుమార! సుఖము దుఃఖము లననేమి ? మేలుగోరి చేయఁదగిన పనియేమి ? శత్రుమిత్రుల గుర్తించుటెట్లు? యని మూఁడు ప్రశ్నల నడిగిన నతఁడు ఓయీ! హింస సేయుమి, పుత్ర దార ధనాదులఁ దగులొందమి యనునది సుఖంబు. దీనికి భిన్నంబు దుఃఖంబు. గార్హస్థ్యధర్మంబున సుఖసాధనములు ధనము దారయుంగాఁ జూపట్టు. వానియెడఁ జతురుండు భ్రాంతి గొనండు; మొఱకు వద్దాన ముచ్చటపడి సంసారగాధల మునింగి తేలు. కావున వాని కవి దుఃఖదంబు లగుచుండు. సరాగులలో జతురుఁడగువాఁడు భోగమ్ములను యదృచ్ఛాలాభంబున ననుభవించు. మూర్ఖుండు మోహాగతుండై తెలివిసెడి యుం దంటువడు. ఎవడు తనదు సుఖంబునకుఁ దాన తావలంబని యెఱుంగు నాతఁడు హితుండు. అద్దానికన్యథాత్వంబు భావించువాఁ డహితుండు. విరాగి కాత్మచింతన

మును, ఏకాంత వాసంబును, ఉపనిషద్విచారంబును సుఖంబు. తదితరంబు దుఃఖంబు. వాని సుఖసాధనమునకు విరోధులు కామరోగాది వర్గంబు, హితకోటి సర్వభూతదయ యని మేఘ గంభీర నిర్ఘరస్వనంబున నంతరంగంబున నుప్పొంగుచున్న జ్ఞానతపఃపూరంబున జిందిన నొండు రెండు చిఱుచిందులవోలె పలుకు లలరించి తాపంబుఁ జల్లార్పంజాలు నమ్మునిబాలుఁ జూచి ప్రతీహారి వార్షించి లోనికిం జను మన, నతం డాగక యాగతిఁ జనియె. వచ్చిన మునిపతి కెదురుగవచ్చి విదేహపతిమంత్రి యతిథిసత్కారంబు నడపి విడిదిజూపి యుండుండ నియోగించె. మఱియు నుచిత సమయంబుల విలాసవతుల నరవింద ముఖుల గొందఱఁ దత్సేవకు నియోగించిన,వారు వెలయించు సోయగంబుల యుగులకు దలంగి యతడు వారియెడ మాతృభావంబు పాటించిన నది యెఱింగి జనకచక్రవర్తి యతనివర్తనంబు గ్రహించి పురోహితు నంపి శుకమౌని రావించి తానుగ నర్ఘ్యపాద్యాదు లిచ్చి యర్చించి ధేనువు నొసంగి యమ్ముని రాక రాకాసుధాకరోదయంబుం బోలె నైన సంతరంగంబుప్పొంగి యథోచితకుశలప్రశ్నంబులు నడపె.

## శుక జనక సంవాదము

శుకుండు జనకునిదిక్కు మొగంబై "జనకా! మజ్జనకుండు నన్నుపనీతుఁ జేసి విద్యలం గఱపి ద్వితీయాశ్రమంబగు గార్హస్థ్యంబు ప్రశస్త్యంబు, సర్వాశ్రమంబుల కాశ్రయంబు. ఇది నడపుటకు దారపరిగ్రహంబు సేయు మని యానతిచ్చె. అది నా కంగీకారంబు గాకున్నయది. తోడి మునులు తండ్రియాన

మీఁదఁ బాసీగా నసిరి. నామనసెట్టులు నందుల కొఁడంబడ డయ్యె. ఎట్టకేలకు నాతండ్రి నీకడ కేగి ధర్మతత్త్వంబు దెలిసి చూచిరమ్మనియె. వేదాంత సిద్ధాంతముల గుఱించి యందలి సారము దెల్పి తెలుప నీవ సమర్థుఁడవని తోఁచెడిని. దయసూప గదే" యన జనకుఁడు:

"వేదచోదితములైన యాశ్రమంబులు నాలుగు. యవి యొండొకండుగా పాటించి తుద ముక్తిం బడయుట క్రమం'బనియె. శుకుండు జ్ఞానముచే వైరాగ్యము నిరూపితంబైన వెనువెంటనే వనంబునకుఁ జనవలెనని సద్వాదులందురు. ఇందులకు నీవాక్యము భిన్నంబుగా దోఁచు"ననియె. జనకుడు: తండ్రీ! విహంగమ మాకసంబున కెగిరి వృక్షమెక్కి ఫలరసం బానునట్లు, ఒకండు బ్రహ్మచర్యంబునం దుండియే తురీయాశ్రమంబు చేపట్టంజూచు. అది విహంగమమార్గంబు. అజిత చిత్తుల కది దుర్లభంబు. చీమ మెలమెల్ల నడచి గమ్యంబగు వృక్షశాఖాగ్రంబు చేరి ఫలరసం బానునట్లొకండు ఆశ్రమంబునుండి యాశ్రమంబునకు నడచి కృతార్థుండగు. అది పిపీలికామార్గంబు. తొలుతటి దానికన్న నిది ప్రమాదరహితంబు. ఎత్తున బరుండువాఁ డిలమీఁదఁ బడుట కలదు. కాని, నేలఁ బవళించువాఁడు పడుటలేదుగదా! దృశ్యంబులు భూతంబులు. సద్గుణంబు లదృశ్యంబు లట్లు ఆత్మ యదృశ్యుఁడు. అతండు నిరంజనుండు, నిర్మలుఁడు, నిరాశ్రయుఁడు, నిర్గుణుండు గావుననతఁడు వశ్యుండుగాఁడు. బంధమోక్షంబులకుమనస్సు కారణము. కావున నది తలయెత్తిన ద్వంద్వభేదము తలయెత్తు. అది లేకున్న నైకాత్మ్యం బాదవు. అట్టి భేదవృత్తికి సంస్కారము

మూలము. అట్టి సంస్కారమునకు మూల మవిద్య. అవి లయిం
చిన విద్య యుదయించు. అందులకు శ్రుతి చోదితమార్గము
నాశ్రయింపక తీరదు. అయ్యది సుకరము కావున నది విడు
వక నడపుటయే కర్తవ్యంబు. మోక్షంబు సిద్ధంబై యున్న
యదియ. దాని ప్రతిబంధకంబులం దొలగించు కొనుటయే
సాధ్యంబైన యది. అనిన విని శుకుండు,

చక్రవర్తీ! గార్హస్థ్యంబునకు మోక్షంబునకు నైక
మత్యం బెవ్వండేని సాధ్యమగునే? వెన్నెలయుం జీకటి కలి
యునే? ఏటిపెట్టి? నైరులయెడ ద్రోహచింతయు, దారాదుల
యెడ భ్రాంతియు, పుత్రులయెడ వ్యామోహంబుం బూరించి
గృహస్థుండవగు నిన్ను నిశ్చింతుంగాం దలంచు టెట్లు? గురుశాపం
బున మీ వంశ్యుండు నిమి యనువాండు దేహంబు విడిచిన నది
కారణంబుగా మీకు విదేహతగల్గె. కాని జ్ఞానంబుచేఁగాదని
నా మతంబు. అని పలికిన, జనకుండు మునికుమారా! సంతా
నము లేదని తపించి తపించి కానక కన్నసంతానంబ వగు
నీవు నీ తండ్రి నడవిపాలు సేసి తపమొనరింపఁ బోదునంటివి.
ఇది యెట్లయగునే! ఇద్దాన నీ కొకవేళ తండ్రి యనుబంధంబు
తప్పినఁ దప్పుగాక. అడవిని జంతుసంతానంబుతోడి తగులం
బెట్లు తప్పును? పంచభూతములసంగము ప్రాణికోటి కవ
శ్యమైయుండ నిస్సంగత ఘటించు టెట్లు? అది మాటల దేట
పడునదిగాం దలంచెదు గాంబోలు. సంకల్పంబు పెకల్చి సందే
హంబు మరల్చి నిశ్చింతుండవై నంగాక సౌఖ్యరూపివగుట దుర్ల
భంబు కాన, దేహేంద్రియాదుల యెడ నిర్మోహంబు వాటించి
మతి దృఢపరచుకొని "సర్వం నాహం నమమ" (ఇదియంతయు

నేఁగాను నాది కాదు, అను నూహఁగొని నిలుమని తత్త్వరహస్యంబు దేటతెల్లమ్ముసేసిన శుకుండు రాజు పల్కిన మాటల నమృతంబు గాని తండ్రియాశ్రమంబునకు మఱలి యరుదెంచె.

## — ♦ శుకుని వివాహము ♦ —

వ్యాసుం డట్లు మఱలివచ్చిన కుమారుం గౌఁగిటచేర్చి యాదరించి సంతుష్టాంతరంగుం డయ్యె. శుకుండును తండ్రి యానతి యాశ్రమంబున వసించుచు జనకరాజు చరిత్రంబు చిత్తంబునకు సత్త్వమయు విశ్రాంతి నిచ్చిన పీవరి యను కన్యకం బరిగ్రహించి కృష్ణుండు గౌరప్రభుండు భూరి దేవశ్రుతుం డను కొడుకుల, గీర్తియను కన్యకనుం గనియె. శుకునికూతురు కీర్తి విభ్రాజియను రాజుకొమరుని నణుహుని చెట్టవట్టె. వారికి బ్రహ్మదత్తుం డను సుతుం డుదయించె. బ్రహ్మదత్తుండు సుతవిన్యస్త రాజ్యుండై నారదోపదేశంబున బదరికాశ్రమంబున కేఁగె. శుకుండును తండ్రి సంగంబు విడిచి కైలాసంబున నిర్వికల్పసమాధినిష్ఠుండై యుండి యుండి భూనభోంతరాళంబులు తట్టాడ నొకనాఁ డాకసంబున కెగసిపోయిన దండ్రి యది గని హా! పుత్రా! హా! పుత్రా! యని ఘోషించి శోకించిన శంకరుండు సన్నిధిసేసి మునీంద్రా!. కొడుకునకై యడలవలవదు. అతండు బ్రహ్మజ్ఞుఁడై యపునరావృత్తమైన పదంబు నధివసించె. అతనినీడ నీకు దోడై నడచు, నడలకు మని వరం బిడిన నతఁ డూరడిల్లె. అసితుండు దేవలుండు వైశంపాయనుండు జైమిని సుమంతుం డను శిష్యప్రముఖులతో కర్మ జ్ఞాన మార్గంబులు రెండును నడపి తన తల్లికై తహతహగొని యామె

జూచిపో నట కరుదెంచె. అటఁ దల్లిలేమి దెలిసి యామె శంతను జేపట్టుట మొదలుగా జరిగిన చరిత్రం బెఱింగి యట కేగి యామెకు చిత్రాంగదవిచిత్రవీర్యు లను నిర్వురు కొడుకు లుదయించుట దెలిసి, తల్లియానతి నంబికయందు ధృతరాష్ట్రి పాండురాజులఁ బుట్టించి, వేఱొక్కతయందు విదురుం బడసి కౌరవాన్వయంబు నిలిపె - అని సూతుండు శౌనకాదులకు బాదరాయణవృత్తాంతంబు వినిచిన వా రపరిమితానందభరితు లైరి.

---

# ద్వితీయస్కంధము

## — ♦ వ్యాసజన్మ కథ ♦ —

సూతుండు శౌనకాదుల కిట్లనియె. ఉపరిచరవసుం డను రాజు తపోనిష్ఠుండై యింద్రునివలన నొక్క విమానంబు వడసె. అతనికి గిరికన్య యను సతి గలదు. ఆమెయం దిరువురు పుత్రు లుదయించిరి. అతఁ డొకనాఁడు తండ్రియానతి వేటకేగి ఋతుమతియైన తనసతిఁ దలంచి మోహాభరంబు నాపలేక యున్నంత నతనివీర్యము ధరణిం బడియె. రా జంతట చింతించి దాని నొక్క మఱ్ఱియాకుదొన్నె నింపి తన చేతనున్నడేగ కిచ్చి తన ప్రియాంగన కిచ్చి రమ్మని పంపె. ఆశ్యేన మేగునెడ నొక్కపక్షి పలలాశచే నెదిరించిన నా డేగ పోరునెడ న వ్వీర్యంబుదొన్నె కాళిందిం బడియె. అద్రిక యను నొక యచ్చర యొకనదీమధ్యమున సమాధిగతుం డైన యొక మునిపాదంబులు వట్టిన నతండు

పసిగ్ఫలంగంబునకుం గనలి చేప వగుమని శపింప, నది యుక్కాళిందీ నది మీనంబై చరించుచు నివ్వీర్యంబు భక్షించె. దాన నామెకు మత్స్యుండు మత్స్యగంధి యను నిరువురు శిశువులుదయించిరి. పరాశరుం డొక్కనాఁడు అమ్మత్స్యగంధిఁ గని మోహించి యత్తీరమున నీహారంబు గల్పించి యయ్యంగనం బొంది రమించె. అంత నామెకు గర్భంబై యచ్చట ద్వీపంబున నొక్క సుతుం డమోఘతేజస్వి యుదయించె. అతండె ద్వైపాయనుండు. విష్ణుతేజంబువాఁడగుట కృష్ణుం డనఁ బఱగె. అతం డష్టాదశపురాణ సంహితల నొనర్చి సపాదలక్షం బగు భారతంబు నిర్మించి సుమంత జైమిని వైశంపాయ నాసిత దేవలు లను శిష్యులను యారణేయుండైన శుకునిం జదివించి యైహికాముష్మికఫలనిరూపణప్రవణుం డయ్యె.

## —♦ మహాభిషుని చరిత్ర ♦—

ఇనవంశంబున మహాభిషుం డను రా జుదయించె. అతఁడు సుగుణి. వాజపేయాది సత్రంబులు పెక్కులొనర్చి సత్యలోకంబున కరిగె. అట సర్వనదీ దేవత లంబుజాసను సేవింప వచ్చియుండిరి. అందు గంగాదేవి యూరువస్త్రంబు గాలిచేఁ దలఁగిన నతఁడు గాంచి మోహావశుం డయ్యె. ఆమెయు నతని భావము గ్రహించి వానిపై మోహంబుఁగొనె. బ్రహ్మ వారి కామవర్తనముగని మీరు మర్త్యలోకంబున జనింపుఁ డని శపించె. దాన నతఁడు ప్రతీపభూతికి శంతనుఁడై పుట్టె.

అట్టుండ వసువులు భార్యాసహితులై పోవునెడ నందుత్తముఁ డను వసుభార్య వసిష్ఠుధేనువుంజూచి నాచెలి యు

శీనరుకూఁతున కీ గోరత్నము బహుమానముగ నిచ్చెదనని తెచ్చి యిమ్మని పతి నడిగిన నతం డట్లు చేసె. వసిష్ఠుఁ డెఱింగి వారల నందఱిని శపించె. వా రమ్ముని ననునయించిన నతండు నందఱఁ గరుణించియు ధేనుచౌర్యంబుఁ జేసినవానికి నీశాపము గ్రమ్మరింప నలవికా దనియె. అష్టవసువులు శాపంబున వచ్చువారు దారిలో గంగాదేవిం గాంచి మహాభిషుం డను శంతనుఁడుగా నీవు నదిగా నుదయింతురుగాన మీయం దేము సుతుల మయ్యెదమనిరి.

## గంగా శంతనుల వివాహము

శంతనుఁ డట్లుదయించి వేట కేగి గంగాదేవి యనూనలావణ్య విభ్రమయై నటించిన మోహించె. గంగ నిజవృత్త మెఱుంగుఁ గాని శంతనుఁడు దాను మహాభిషుండ నని యెఱుంగఁడు. గంగాదేవి రాజుం జూచి నేను శుభ మశుభం బేదేని గావించిన నీవు గాదన కుండవలయు. ఇది సమయము. కాదన్నపుడు నిన్ను దొలఁగిచనియెదనన నాతఁడంగీకరించి యామెం జేపట్టె. అవ్వల వారికి నేడ్వురు సుతు లుదయించిరి. ఒక్కొక్కరి నాజాహ్నవి జాహ్నవిం బడవైచె. అష్టమ గర్భంబున నుదయించిన సూనుం గని యారాజు జాలిగొని వీనిం బాలింపు మన నామె తనతొంటిసమయంబు నెంచి యతని వీడిచనియె. ఆ యుదయించిన పుత్రుండు గాంగేయుండు నాఁ బఱగె. అతని గంగ పెంచె. ఒకప్పుడు రాజు గంగాతీరంబునకు వచ్చి యాసుతుఁ గని గంగను స్మరించిన నామె వచ్చి వీఁడు నీ సుతుం డని యప్పగించె. ఆవల శంతనుఁడు మత్స్యగంధినా దాశరాజు

కూతుఁ గని గాంగేయుదృఢప్రతిజ్ఞచే నామెపొందు లభింపఁ జేసికొని యామెయందు చిత్రాంగద విచిత్రవీర్యు లను సుతులఁ బడసె. అదిమొదలు గాంగేయుఁడు భీషణబ్రహ్మచర్యం బూనుట భీష్ముండు నాఁ బఱగె. అతఁడు సోదరులకు నంబికాంబాలికలను దెచ్చి వివాహము సేసె. చిత్రాంగద విచిత్రవీర్యులు సంతతి లేకయె గతించిన వారియంగనలయందు సత్యవతినియోగంబున వ్యాసుండు ధృతరాష్ట్ర పాండురాజులను, వేఱొక్కతెయందు విదురుని బడసె. ధృతరాష్ట్రునకు గాంధారియందు నూఱుగురు సుతులును, వైశ్యయందు యుయుత్సుఁడుం బుట్టిరి. పాండురాజునకుఁ గుంతియందు సూర్యు ననుగ్రహంబున కర్ణుండును, ధర్మాదులవలన ధర్మజాదు లగు పాండవులు నుదయించిరి. వారివర్తనంబు సాకల్యంబుగా వినిచి వారి మనుమండు పరీక్షిత్తు రాజగుట వివరించి యతనిశాపవృత్తాంతము నవాంతరముగ మణి మంత్రౌషధాదులవలన దుర్మరణంబు దప్పననుటకుఁ గా దన్మంత్రులు దెల్పిరని రురుముని చరిత్రం బిట్లనియె.

## — రురుముని చరిత్ర —

భృగుండను మునికిఁ బులోమయను భార్యకలదు. వారికి చ్యవనుఁడనుసుతుండు గలిగె. అతనిభార్య సుకన్య. వారికిఁ బ్రమతి యనుకొమరుండు గలఁడు. వానిభార్య ప్రతాపి. వారికి రురుముని యుదయించె. మేనకవిశ్వావసువలన నొక్కకన్నియం బడసి వచ్చుచు స్థూలకేశుఁడనుమహర్షి యాశ్రమంబున విడిచి చనియె ఋషి యక్కన్యకుఁ బ్రమద్వర యనునామం బిడి

ప్రేమంబునఁ బెంచుచుండె. ఆమె నవయౌవనయై యున్నతఱి రురుండు చూచి మోహించె. అట్లున్నతఱి నామె సర్పదష్టయై మృతినొందె. రురుండు దానికి వగచి ప్రాణత్యాగంబు సేయనెంచిన నింద్రదూత వచ్చి నీ యాయువున సగ మిచ్చిన నీమె బ్రతుకు నన నతం డట్లసేసె. ప్రమద్వరతండ్రి మంత్రులతో దేవదూతతో యమునిసన్నిధి కరిగి తనయవృత్తాంతముఁ జెల్పి యతని దయ న త్తన్వి బ్రతికించె. అవ్వలఁ బ్రమద్వరారురులకుఁ గల్యాణమయ్యె నని ప్రసంగోచితంబుగాఁ దెలిపి పరీక్షిత్తు తక్షకవిషాగ్ని దగ్ధమగుట, జనమేజయుండు సర్పయాగము చేయుట, అస్తీకుండు తక్షకాదుల రక్షించుట, కద్రువ కొడుకులకు శాపం బిచ్చుట, గరుత్మంతుం డమృతంబు గొనివచ్చుట, తల్లికి శాపమోక్షముసేయుట మొదలుగా మహాభారతకథావిస్తరంబు సంక్షేపించి పలికె. జనమేజయునితో శ్రీదేవి మహిమంబు నిట్లు తెలిపె. సూతుం గని శౌనకాదు లవ్వలి కథ విన వలతుమని యర్థించిరి.

---

# తృతీయ స్కంధము

జనమేజయుండు వ్యాసమహామునిఁ జూచి కరుణోదధీ! గుణము లెచ్చట పుట్టినవి? వానికిఁ గారణమెవ్వరు? రూప మేమి? పరమశ్రేయం బెయ్యది? సెల విమ్మని యడిగిన నమ్ముని సత్తముం డవ్విభుసత్తమున కిట్లనియె. కొందరు సూర్యుని, గాయత్రిని, వరుణానిల యమ చంద్ర కుబేరులను,

గజవదనుని గొల్తురు. కొందఱా దిశక్తి నఖిలార్థదాయినింగా నిర్వికల్పపరతత్పరబ్రహ్మమ్ముగా ముక్తిఁగోరి భజింతురు. కొందఱు వే దలలు, వే గాళ్ళు గలిగి విష్ణుపదంబైన గగనంబు విరాట్టుని యర్చింతురు. కొంద ఱీశ్వరుఁ డందురు. కొంద ఱనీశ్వరము జగ త్తందురు. అఖిలంబునకు ప్రకృతి కర్త్రియని యింక కొందఱు వాదింతురు. ఈ విభేద కల్పనంబుల రహస్యంబు దెలిపి నన్ను కరుణింపవే! యని యడిగిన బాదరాయణుం డిట్లనియె.

వేదశాఖల విభజించి పురాణములు పలికి వేదాంతముల వివరించి భారతంబు విరచించి యుండియు, నా మనంబు మూఢంబై యున్నదని నారదునకు సనుదెంచిన నతనికి నా తెఱం గెఱింగించితి. అతఁడుం దా మున్ను తండ్రియగు నజుని వలన విన్నచందం బిట్టి దని యిట్లు విశదీకరించె. అది యెట్లనిన—

కల్పాంతంబున నేకార్ణవమై జగంబు గాఢాంధకార బంధుక మైనదని నేనుకమలకర్ణికాపీఠి నధివసించి యప్పంకజంబు నీటఁ బుట్టుటకు మూలం బఱసెద నని నాళంబుత్రోవ నరిగి వేలవత్సరంబులు వెదకి పోవఁబోవ "తప తప" యను గగన భారతి వీతెంచిన నంత దపంబొనర్చితి. అవ్వల "సృజ సృజ" యని వినఁబడియె. అప్పుడు నే నేమి సృజింతు నని చింతించితి. ఇట్లుండ నప్పారావారంబునఁ దిరుగాడు మధుకైటభులు గుభుల్లునఁ దెరలివచ్చి న న్నెదిరించిరి. నేను శరణంబుగానక నాళంబు వెంబడి జాఱిపోయి నీట మునింగితి. అందు నీలమేఘశ్యాముండు, పీతకౌశేయవాసుండు, అంబుజాక్షుండు, శంఖ చక్ర గదాది సకల పరికరధరుండు, చతుర్భుజుండు, నిస్తులకౌస్తుభ

రత్నోద్భాసి, శ్రీవత్సాంకుండు, శేషపర్యంకశాయి యగు నచ్యుతుఁడు యోగనిద్రాపరుండై గానవచ్చిన నమ్మాయా దేవిఁ ధ్యానించితి. ఆమె తొలఁగి చన న విష్ణుండు తెలివొంది నాయెడఁ బ్రసన్నుఁడై భక్తార్తినాశకుండు నిలింపనాయకుండు నగు హరి వారిం దెగఁ బార్చె. అవలఁ బరాశక్తి సృష్టిస్థితిలయం బులకు మూర్తిత్రయంబుఁ బురికొల్పిన వారు భూతములును నింద్రియంబులు నశించియున్న యుత్తరి సృష్టియొనర్చుట కేమికతం బని య మ్మాతను బ్రశ్నించిరి.

## —♦ త్రిమూర్తులు విచిత్రసృష్టి విలకించుట ♦—

త్రిమూర్తులప్రశ్నంబులకు నుత్తరంబుగా నంబిక వారలం దనవిమానంబునఁ గొంపోయె. అట్లు పోవఁ బోవ వా రింద్రాది లోకంబులు, బ్రహ్మ విష్ణు భువనంబులు, నన్యో భవనంబుల స్వస్వరూపు లగు కొండొక బ్రహ్మ విష్ణు రుద్రులను గాంచి విస్మయం బందిరి. అ వ్విమానం బంబుధి దాటి చన నవ్వలి సంద్రంబున మణిద్వీపంబుగాననయ్యె. అందు సురుచిరతల్పంబు నడుమ కోటిసూర్యప్రభాభాసమానయై విమలదంతకాంతులు వెన్నెల నీన చిఱునగవు గులుకు మోముతో రక్తమాల్య కుసుమాంబర గంధమణిభూషాభూషితాంగియై రక్తనేత్రం బులు, రక్తాధరపల్లవంబునుం గలిగి యరుణభానుసిభంబైన నెమ్మోముతో నలరుచుండె. ఆమెసన్నిధి కోటిమంది పద్మాలయలు గొల్చుచుండిరి. సహస్రసంఖ్యాకములైన అక్షిముఖ కర శ్రవః కుక్షుల మార్తాండకోటిద్యుతి విద్యోతితయై యున్న యాయమ్మ యనాదియు నాదియుంగా దోఁచెడి నని యచ్చెరువందిరి. అన్ని

లింప నాయకులలోఁ దొలుత హరి యీ భగవతి చరిత్రమ్ము బ్రహ్మములకు వివరించి చెప్పి తొల్లిటి తపంబు పండుట నీతల్లి మనకుదర్శనమ్మిచ్చె. ఈయక మనకందర కాదియగుటనిక్కంబు, అని యాదేవిని సమీపింపఁగోరి ద్వారపాలుర దరిసిన వారు వోయి శ్రీదేవికి విన్నపంబుసేసి యనుమతిం బడసి లోనికిం గొంపోయిన నమ్మువ్వురు నీ చరణంబులు శరణంబని ప్రాలి కైవారంబుసేసి కోటిభాస్కర తేజోభాసమానమైన యప్పరా దేవి సింహాసనంబుదరి సన్నిధిసేసి నిలువంబడి, యామె కటాక్షంపు వెన్నెల నెలకొన్న యన్నింటుకొలువున బరిచారిక లాడుచుం బాడుచు దేవిని సేవించుట చూచి, యచ్చెరు వంది, భయంబునొందుచు దేవివైపు చూపు నిల్పినవేళ అమ్మ హాశక్తి పాదనఖాగ్రదర్పణ మణిచ్ఛాయాకదంబబింబంబున నఖిల బ్రహ్మాండ భాండంబులు గానవచ్చె. స్థావర జంగమా త్మకమైన జగంబులును, నేనును, శంకరుండు, కేశవుండు, అఖిలదిక్పాలురు, యక్ష సిద్ధ సాధ్య కిన్నర కింపురుష గరు డోరగ గంధర్వ ముని నికాయంబు మొదలుగ నఖిల విశ్వ విచిత్రచిత్రంబు గోచరించినఁ జకితులమైయుండి, కొండొకవడిఁ దేరి య ద్దేవిని వేరీతుల వేర్వేర వినుతించితిమి. సేవక జన కల్పవల్లియగు నా తల్లి మాయెడ నమందకరుణారససుంద రములగు కటాక్షవీక్షణములఁ బఱపి యాత్మతత్వం బిట్లని యుపన్యసించె.

## — పరాశక్తి త్రిమూర్తుల కాత్మతత్వము విశదీకరించుట —

పురుషుండునుం బ్రకృతియు నను భేదంబు వాస్తవి కంబుగాదు. నేన పురుషుండను: నేన ప్రకృతియునై యుందు.

అద్వితీయం బనామయం బగు బ్రహ్మం బేన యని యెఱుంగరే?
సృష్ట్యుపదేశంబున వ్యష్టిగాఁ దోఁపఁజేసి క్రీడించుట నాకు
స్వభావంబు. నానాత్వము మదిచ్ఛాకల్పితము. శక్తినగు నేను
లేక సృష్టి స్థితి లయంబులఁ జేయ మీకు వశంబగునే ? యని
తెలిపి సరస్వతిని బ్రహ్మకొసఁగి సత్యలోకంబున కరుగు మని
కొండొక మంత్ర ముపదేశించి పనిచె. పిదప హరికి లక్ష్మి నొసంగి
వలయువేళల సత్త్వ రజ స్తమో గుణంబులఁ బూని జగద్రక్షణం
బొనర్పుమని బీజత్రయసంధితంబగు మంత్రరాజం బొసఁగి యను
గ్రహించె. ఆవల హరునకు గౌరి నొసంగి తామసప్రధానవర్త
నమున జగముల సంహరించుట నీపని యని యానతిచ్చె. ఇట్లు
బ్రహ్మ నారదున కెఱింగించిన నయ్యబ్జపట్టి తండ్రీ! సగుణసర్గంబు
వింటి, నింక నిర్గుణసృష్టిరూపంబు దెలుపవే యని పాదంబుల
కెఱగి యడిగిన నిర్గుణతత్త్వంబు దృగ్గోచరంబు గాదని యందలి
కొన్ని రహస్యంబుల నెఱింగించె. మరియు నద్దేవియె పరమ
సేవ్య. అద్దేవిమంత్రంబు వర్ణలోపంబుననేని జపించిన నిష్టార్థ
సిద్ధి యగునని దృష్టాంతంబుగా నొక్కకథ నిట్లు వినిపించె.

## — ♦ బ్రాహ్మణుని కథ ♦ —

ఒక బ్రాహ్మణుఁడు నిరక్షరకుక్షి, యొక పందిమోఱి
నుండి వినఁబడిన 'ఐ' కార మాలించి యది [illegible] నైన
జపించి యా జగజ్జననికరుణా[illegible] శ్రీధన్యుం డయ్యె. కవి
శిరోమణియు నయ్యె. అది యెట్లం [illegible]
తమసానదీతీరంబున [illegible] పుత్రకా
మేష్టి సల్పునెడ, గోబిలుఁ [illegible] సాహంబు

గానంబు చేయుచో స్వరమ్ము దప్పిన దేవదత్తుండు కనలి యతని నధిక్షేపించె. గోభిలుండు క్రోధవేగంబున నీ కట్లు దోచె గాని వేదశాస్త్రము వెంచియు, నీకుంగల్గు కొడుకు మతిమాలిన వాడగును. మూఢుండగు నని శపించె. శాపభీతుండై దేవదత్తుండు గోభిలు ననునయించె. అతండును ప్రసన్నుండై మీవాడు తొలుత మూఢుండయ్యు పదంపడి వేదవేత్తయవుత మ్మని యనుగ్రహించె. అంత నతనికి సుతుండు గలిగె అతండు తథ్యుండు నాఁబడెఁ. వాఁడధ్యయనాదుల నుత్సాహిఁగాక మూఢుండయ్యె. తుద కాతఁడు గంగాతీరంబున పర్ణశాల గల్పించుకొని నిత్య సత్యవ్రతుఁడై నిలిచెగాని, జప తప స్వాధ్యాయాదుల తెన్నున మాత్రము మూఢుండే యై యుండె. అతఁడు తనమౌర్ఖ్యంబునకు వగచి స్వర్గలి పరితపించుచు బమనాలుగేండ్లటనే గడపె అట్టి యెడ నొకయెఱుకు నిశితభల్లంబున నొకవరాహంబు నేసిన నది రక్తంబుపార ఘుర్ఘురించుచు భీతిమై పఱచి యవ్విప్ర బాలకుదరి పఱచి వచ్చిన వాగ్భవబీజంబు బిందుహీనంబుగా నుచ్చరించుచు నొక్కపొదఁదాసిన నా భిల్లుఁడు పందిజాడ దెలుపు మని తన్నడిగిన నతండు డోలాయమానమానసుండై నిజ మాటిన ప్రాణిహింసయు, నాడకున్న ననృతదోషమ్ము నగు ననియు, సందిగ్ధవచనం బనృతప్రాయం బని శంకించి తుద కా బిందుహీనం బైన బీజాక్షరంబు వినిన ఫలమున వాల్మీకి కైన యగు కవియై దేవియనుగ్రహంబున ధీమంతుండై “ఏది పందిని జూచిన నది పలుకనేరదు. ఏది పలుకనేర్చిన దది పందిని జూడలేదు” అని పలికిన నన్నిషాదుండు – నిత్యసత్య వ్రతఖ్యాతి గన్న యీతనిపలుకునెడ విశ్వాసి యగుట తన

పాఱెం బఱచె. అప్పరుని సత్కీర్తి దిగంతంబుల వ్యాపించె. అతండు పరాంబికసాకతంబునకుం బాత్రుండైనాండని మెచ్చంగ హర్షించి తలిదండ్రుల లింటికిం గొంపోయి సుఖం బుండె అని జమదగ్నికి రోమహుండు చెప్పె నని వ్యాసుండు జనమేజయునృప చంద్రునకుం జెప్పె.

## —♦ ధ్రువసంధి చరిత్ర ♦—

సూర్యవంశ్యుండు ధ్రువసంధి యను రాజయోధ్య రాజధానిగఁ గోసల మేలుచుండె. అతఁడు మనోరమయందు సుదర్శనుని, లీలావతియందు శత్రుజిత్తుని గనియె. గుణగరిమం బెద్దయగు శత్రుజిత్తునెడ రాజున కనురాగ మగ్గలమై యుండె. ఒకనాఁడు రాజు మృగయ కరిగి యొక్క కంఠీరవంబుఁ దాకి దాని నిశితనఖదంష్ట్రానికాయంబు ద్రచ్చి కూలిన నారాజు భటు లా మృగరాజు నేసి కూల్చిరి. పిమ్మట నమ్మానవపతి మంత్రివర్గము గుణాధికుం డగుట శత్రుజిత్తునెడ పక్షపాతంబుఁ గొని యతని రాజుం జేయఁగోరిరి. అతని మాతామహుండు యుధాజిత్తును మనుమని రాజుం జేయ నాలోచించి యుండె. సుదర్శనుని మాతామహుండు వీరసేనుండు తన దౌహిత్రుని రాజునకు జ్యేష్ఠసుతుని బట్టము గట్టఁగోరె. ఇవ్విభేదమున నయ్యిరుపక్షములకుఁ బోరితము తప్పనిసరి యయ్యె. అందు వీరసేనుండు వీరశయన మలంకరించె. అతని కూతురు మనోరమ తనయుంగూడి గతిలేక పారిపోయె. పోయి పోయి గంగాతీరంబున దొంగలవలన ధనంబు గోల్పడి పల్లటించుచు నదిదాటి త్రికూటం బను నగంబు జేరి యట భార

ద్వాజాశ్రమంబు పొంత సుతద్వితీయయై సైరంధ్రియు మంత్రి
యుం దోడుఁగా జనుచుండె. అట నొక్క తాపసి నీవెవ్వత వెంద
ఱిగెదె వన తనవృత్తాంతంబు మంత్రిచేఁ జెప్పించిన నమ్ముని యభ
యంబిచ్చి యందుండ నియమించి యాదరించె. అవ్వల నొక
ప్పుడు యుధాజిత్తుండు నిషాదసహితుండై తనకొడుకును
సమయింపవచ్చుచున్నాఁడని యెఱింగి య య్యాఁడుది కుయ్యి
డుచు భరద్వాజుచరణంబులు పట్టుకొనిన నమ్మునివల్లభుం
డన్నృపవల్లభ కభయంబు దయసేసి శత్రువు నాపఁజూచె.
కాని యారాజు బలదర్పితుండగుట నకంటకమైన రాజ్యము
మనుమని కప్పనముసేయ పట్టుగొనిన మంత్రులు విశ్వా
మిత్రుండు వసిష్ఠధేనువుంబట్టి చెడిన కథ యెఱిఁగించి జడుపు
గొలిపిన నతఁడు భయపడి భరద్వాజుపాదములు పట్టికొని
యాదరణంబు వడసి పురికిం జనియె.

సుదర్శనుండు మునిసన్నిధి విద్యలెల్ల గఱచి ప్రసంగం
బున నమ్మునినోట వెడలిన స్మరబీజంబును పఠించుచున్న నది
ధ్యానన్యాసఛందోహీనంబయ్యును మునిదయనై దేండ్లలో
ఫలించె. ఆ రాజసుతునకు పదునొకండవయేట నుపయనము
గావించి ధనుర్వేద నీతిశాస్త్రముల గఱపుచుండ నొకనాఁ డాత
నికి శక్తి దర్శనంబిచ్చె. రక్తమాల్యాంబరభూషాధారిణి యగు
నవ్వైష్ణవిఁ జూచి సాగిలఁబడిన దివ్యశర శరాసన తూణాంబుల
దయసేసి యాయమ్మ తిరోహిత యయ్యె. అత్తఱినె కాశి
రాజతనయ శశికళ స్వప్నంబున శాంకరి పొడసూపి సుదర్శ
నుండు విభుఁడగునని దీవించిన యాపె యతనిపై వలపుగొనె.
అంత వసంతోదయ మయ్యె.

అవ్వేళ నాశ్రమవాసి యగు తపస్వివలన స్వప్నమునందును గలయూ పెఱింగి శశికళ విరాళి గొనియె. ఇంతలో శృంగిబేర పురపతి దుర్దశనున్న యీ బాలున కొకయరపం బీయవచ్చిన నమ్మునివర్యు లీ బాలకు నాతని కొప్పగించిరి. అతఁ డీతనితోఁ బయనమయ్యె.

సుదర్శనుండు శశికళా స్వయంవర సమాకాంక్షచే స్వయంవరసభాలంకార మై యున్నతరి నబ్బాలిక వేరొక రాకొమారునివంకఁ జూడనైనఁ జూడకపరాంబదయచే స్ఫురించిన వనవాసి యగు నాభూవల్లభకుమారు మెడలో మధూక పుష్పమాలవైచిన నయ్యిరువురకుఁ గల్యాణమయ్యె. వధూవరులు స్వరాష్ట్రంబున కరుగుతఱి నంభోరాశిసామ్యంబైన సైన్యం బెదుర్కొన పెనుసంగర మయ్యె. ఆ సుకుమార వీరకుమార శేఖరుఁ డెదిరించియు స్వబలంబులు పురికొనఁ జాలకున్నంత నయ్యంబఁ దలఁచె. ఆయమ్మ అరుణప్రభాభరితవీక్షణపంక్తు లాశలకు రక్తిమ వెంప కరనిహితవివిధాయుధశాళధళ్యంబులు దెసల వెలుంగ సింహనాదంబు సేయుచు దివ్యభూషాధారిణియై మృగేంద్రవాహనయై పఱతెంచి సుదర్శనుసన్నిధి నవతరించి దివ్యాస్త్రసందోహంబు గురియించి సింగంబు దుమికించి శత్రుజిన్ముఖు లగు నరివీరులఁ జించి చెండాడి సుదర్శను కరుణించిన నా దుర్గను సుబాహుండు కాశిరాజు వేనోళ్ళ వినుతించె. వరం బడుగు మన నతఁడు నిజనగరంబున దుర్గవై వేంచేయుమని కోర నాదేవి వల్లె యనె. అవ్వల సుదర్శనుం డద్దేవి మహిమంబు వర్ణించిన నీలానాథులు శత్రుమిత్రులు హర్షించి చనిరి. సుదర్శనుం డవ్వల ద్వితీయాద్వితీయుండై యయోధ్య

కేగి సకలసన్మంగళకరంబుగా గృహప్రవేశంబు గావించి సవతితల్లి శీలావతి నోదార్చి మంత్రులంగూడి హేమసింహాసన మధిష్ఠించి పట్టాభిషేకింపంబడియె. అవ్వల దేవియానతమేఱకు స్వర్ణమయవిమానంబొకండు నిర్మించి యంబ నందుఁ బ్రతిష్ఠించి నిత్యపూజలు, నవరాత్రోత్సవంబులు నొనర్చి తత్కృపకుఁ బాత్రమయ్యెనని తెల్పి నవరాత్రోత్సవవిధానము నారదునిచే దెలిసి కిష్కింధానగరంబున భార్యావియోగతప్తుం డగు శ్రీరాముం డిష్టార్థంబు వడసె నని యా చరిత్రంబు సాకల్యంబుగా వినిపించి, కోమటి యొకండు దారిద్ర్యంబు తొలఁగుట దెలిపి, శక్తిమహిమం బనూనం బని వినిపించి బాదరాయణ వచస్సుధాసారంబునఁ బ్రీతుండై జనమేజయుండు మీఁదికథఁ దెలుపు మనియె.

---

# చతుర్థస్కంధము

శ్రీదేవికిం బ్రణమిల్లి జనమేజయుండు నరనారాయణులు నిస్పృహు లచ్యుతాంశసంభూతులై తపమ్ము సేసిరి. వారె కృష్ణార్జునులై భూభారంబు వాపి రని నారదాదులవలన వింటి. దేవతారూపులు బ్రహ్మణ్యులు నగు నరనారాయణులు క్షత్రియయోని నవతరింపఁ గతమేమి ? ఇది విపరీతంబుగదా ! వివరము వినఁదలఁతు ననిన బాదరాయణుండు కర్మప్రభావంబు తెలియ గట్టిదని తెల్పి యాదవపూర్వచరిత్ర మిట్లని తెలిపె.

## —♦ వసుదేవ పూర్వవృత్తాంతము ♦—

కశ్యపుశాపంబున వసుదేవుండు గోపాలుం డయ్యె. అతని భార్య అదితి, సురభి యను వారిద్దఱును దేవకీ రోహిణియు నై జనించిరి. వారి గర్భంబున భగవానుం డవతరించి, మానుషభావం బభినయించి, బాల్యాద్యవస్థలు, బ్రహ్మచర్యాద్యాశ్రమచర్యలు నడపె. ఇది చిత్రంబు గదా! దీని కతం బేమి, తెలుపు మన నిట్లనియె.

వరుణుండు మున్నధ్వరంబు సేయ, కశ్యపుం డందలి యాగీయపశువుల, భార్యలకోరిక నాహరించె. వరుణుండు పశువుల వెదకి, కశ్యపునిగా నెఱింగి, భార్యాయుతంబుగ గోపకుండవు గమ్మని శపించె. మఱియు నా గోవులం గానక వానిలేగలు దురపిల్లుటఁ గని గోహర్త్రియగు కశ్యపునిసతి మృతపుత్రక యయ్యెడు మనియు, బందెవడు ననియు శపించె. అందులకు జడియక కశ్యపుండు గోవు లీయకున్న, బ్రహ్మ యిమ్మని యడిగినను నతఁ డప్పటికిని భయంబందఁ డయ్యె. అంత బ్రహ్మయు నీశాపంబు శాపంబుగా జరుగుఁగాక యనియె. అప్పుడు కశ్యపుండు బ్రహ్మపాదంబుల వ్రాలి వాపోవ నీ గర్భంబున హరి జన్మించు నని తెలిపె. ఇంతియకాక తొల్లి దితిగర్భంబు ధరియింప నదితి యోర్వక యింద్రుని ప్రయోగించి గర్భంబు విచ్ఛిన్నంబు జేయించె. అందులకు దితి యింద్రుని శపించె. అదితినిగూడ నీ తనయులు పుట్టి చత్తు రని శపించె. ఇక్కతంబున దేవకి పుత్రులం గోల్పోవుటయు, శ్రీకృష్ణుం డామె యష్టమగర్భంబున నవతరించుటయుఁ జరిగె.

## — నరనారాయణచరిత్ర —

వేదవ్రతనిష్ఠుండు ధర్ముం డను విప్రుండు గలఁడు. అతనికి హరి, కృష్ణుఁడు, నరుఁడు, నారాయణుఁ డను సుతు లుదయించిరి. హరికృష్ణులు యోగరతులై విరక్తులైరి. నరనారాయణులు తాపసులైరి. ఇంద్రుండు వీరితపంబు సెఱుపవచ్చిన వారలని కన్నెత్తిచూడకున్న వాఁడు భయంకరమాయామృగంబులకల్పించివెఱపించె. అంతకును వారు తలంగకుండుటయకాక వారి తాపసాగ్ని లోకంబుల నెగజిమ్మకొన నింద్రుఁడు మదనవసంతులకు రంభను తోడిచ్చి పంపిన కుసుమాయుధుండు దేవీధ్యాననిష్ఠాపటిష్ఠులగు నవ్వారిం డాయ వెఱతు నని తెల్పిన వినక యింద్రుం డాజ్ఞాపింప నచ్చట కరిగె. అచట నవవసంతోదయంబయ్యె నంత నరనారాయణులుసంచలించితపంబుసాలించి దేవభామినీజనబృందంబు నందంబున డెందంబు దందడించియు నిదానించి చూచిన నారాయణుండు వారి కపటనాటకమూలం బెఱింగె. అంత నూరుభాగంబు నఖచేతఁ జఱచి వారి కన్న మిన్నయగు నొక్కకన్నియ సౌందర్యఖనిఁ బుట్టించె. ఊరువునం బుట్టుట నది యూర్వశినాఁ బరగె. అయ్యంగన యంగసౌష్ఠవంబు గని కడమ యప్సరఃపాళి మోము మోము జూచుకొని యమ్మునిమోము వెఱగంది చూచి విభ్రాంతినొంది మనయందంబు లిన్నలంతకడ యెంతయని సిగ్గిలి యంజలిసేసి యమ్మునికి మ్రొక్కిరి. అమ్ముని యూరువుచుండి వెండియుఁ ద్రిలోకసుందరు లెందఱో వేల్పుభామ లుదయంబందిరి. అది గని దేవభామినీజనమ్ము సేయునది లేక సామంబునకుఁ జొచ్చి

నీపొందు గోరి వచ్చిన విలాసవతుల మమ్మతులరతులఁ దేల్పక యాకీతుల శోకంబున కగ్గంబుసేయుట సాఁగాదని పాదములఁ బట్టి విడువకున్న నాతఁడు మా కేమిపని యోగులగు మాకు భోగులమాటలు పాటిగా వన వారు చనవుగొని వినక పెనంగిరి. మానముబూని వీరితో పలుకాడకున్న బాగాయెడిది. అట్లుగాక పల్కరించితిమి. ఇందుచే వీరలు సంకటపెట్టుట కవకాశంబయ్యె. ఇపుడు గోపించి శపించినఁ దపంబు సెడు. కృప సేసినం గీడగు. ఇం దుపాయం బేమొకో! యని యమ్మునులు చింతించిరి. ఆవల నరుండు శాంతియె శరణ్యంబనియె. మఱియు నయ్యచ్చరలఁ జూచి యతఁడు కోపంబు సూపక చిఱునవ్వులయఁ జూచి హిత వుపదేశించి యిందుముఖులారా! నేఁనిఱువదెనిమిదవద్వాపరంబునందు భూభారము వాప నవతరింతు. అప్పుడు మిమ్ము కందర్పకేళిఁ దేల్తు నని చెప్పి యూరువునందు జనించిన యయ్యూర్వశి నింద్రున కిమ్మని వారితోడఁ బుత్తెంచిన, వారు సురపతికడ కేగి తమవృత్తాంతము విన్నవించి యయ్యంగన నతని కిచ్చిన నిలింపపతి యమ్మునిపతుల యచంచలతపోనియతి కచ్చెరువంది లజ్జించి యూరకుండె. ఆపైఁ గృష్ణుం డవతరించుట మున్నుగా గోపికలతోడ జఱపిన లీలలు వర్ణించి పరాశరసూనుండు జనమేజయు నలరించె.

## —♦ ప్రహ్లాదుండు నారాయణునితోఁ బోరుట ♦—

ప్రహ్లాదుండు హరిభక్తుం డయ్యు నారాయణునితోఁ బోరితం బొనర్చె నని విందు మది యెట్టులని యడిగిన బుడమి ఱేనికి వ్యాసుం డిట్లనియె.

ప్రహ్లాదుండు పాతాళం బేలుతఱి చ్యవనుండు నర్మదానదిం దోఁగువాఁ డొకసర్పంబుచేఁ బాతాళంబున కీడ్వఁబడి రసానాథుపురంబున దానిబారిం దప్పికొని రసాతలరాజధానియం దొకపక్షిం దిరుగుచుండఁ బ్రహ్లాదుండు చూచి యతని వృత్తాంతం బెఱింగి యతనివలనఁ దీర్థవిశేషంబులన్నియు విని నరనారాయణదివ్యదర్శనకౌతూహలియై నిశ్చల ధ్యాన నిష్ఠ నున్న యమ్మునులను, వారిదాపున రెండువిల్లులుం గని తపస్వులకు విల్లుతోఁ బని యేమి? యిది సెల్లునే యని వారి నెదిరించిన నక్కడ ఘోరసమరం బయ్యె. అది యొక దివ్య వర్షసహస్రంబు వర్తె. అంత నాదినారాయణుండు గరుడారూఢుండై వాత్సల్యంబు మెఱయఁ దోతెంచిన నసురసూనుండు చేతులు జోడించి యవ్వెన్నుని నుతించి 'మున్ను తా మిడిన వరంబులు బొంకు లగునే? దుర్బలు లిర్వురు ద్విజుల నోర్వలేనైతి, ఉపాయం బేమన వీరు మదంశభూతులు, పెద్దలు, వీరితోఁ గయ్యంబురాదు నెయ్యంబు మేలగు బొమ్మన నతండు సేనలఁ గదలించుకొని చనె. అమ్మునులు బదరీవనంబున తపోనియతి నున్నారు' అని తెల్పిన జనమేజయుండు సాత్యవతేయుం జూచి పరమశాంతులగు తపోధనులకు రాగద్వేషకార్యం బగు యుద్ధంబువై వల నేల గలిగె? ఇది యహంకారభావంబు గదా! యన్న బ్రహ్మరుద్ర విష్ణువులు, నింద్రుండు నను వేల్పు లెల్ల రహంకారయుతులే యన దక్కిన మునులమాట దడవనేల ? అక్షయ్యుం డగు జనార్దనుండు మాయావశంబున సంస్పృతింబడెనన నన్యులమాట దెల్పవలెనే? యనఁగేశవునకు భృగుశాపంబు

గల్గెనని వింటి నది యేమికతమున్నన నానతియ్యవె వ్యాసుం శిష్యుని వివరింపఁ దొడంగె.

## —• హరికి భృగుశాపము గల్గుట •—

తొల్లి హిరణ్యాక్ష హిరణ్యకశిపు ప్రముఖు లగు దానవులు సూలుట గని వెఱచి యసురులు కులగురుండగు శుక్రుని వేఁడిన, నతండు శంభు నుపాసించి వత్తునని యరిగినతఱి హరి హరిప్రేరణచే భృగుపత్నిం జక్రాయుధంబుచే ఖండించె. అంత భృగుండు మంత్రశక్తిచే నామెను బ్రతికించుకొని హరిని దుచ్ఛయోనులం బుట్టి గిట్టుచు నిడుమలం గుడిచెద వని శపించె. ఇంద్రుఁ డమ్మునివరుమహిమ గని తపించె. మఱియు నొక నాఁడు తనకూతు జయంతి యనుదాని శుక్రుపరిచర్యకు నియోగించె. ఆపెయు నాతని తపశ్శ్రమం బపనయించి శుక్రు శుశ్రూషించుచుండె. అట్లు వేయువత్సరంబు లఱిగె. అంతట పార్వతీపతి యాతనితపంబున కలరి యవధ్యుఁడ వయ్యెదవు. మంత్రవ్రాతంబు నీవశం బవు బొమ్మని దయసూపిన నతండు హర్షించి వచ్చుచు జయంతి ప్రార్థన దానిం దన భార్యగఁ జేపట్టె. అవ్వల వా రతులభోగానుభూతిఁ బదియేండ్లు జరిపిరి.

సురగురుఁ డీ యంతరంబు వేచియుండి శుక్రువేషంబున రాక్షసుల మోసగించి శ్రుతిస్మృతిపురాణాదుల కన్యార్థంబు లగించి వ్రతాదుల నిరసించుచు బరమార్థవృత్తికి భంగంబు సేసె. శుక్రుండు జయంతీవ్యామోహంబున నుండి యుండి తెలివిగని స్వపక్షంబుదురవస్థం గని తనరూపున నున్న

దేవాచార్యుక్కృత్రిమవర్తనంబు గ్రహించి నేను శుక్రుండ, నీవు కుహనావేషివి అన నాతం డట్లుకాదు. నీవే మాయగాఁడవనియె. అంత శుక్రుఁడు హరుఁ డిచ్చిన శక్తి జూపు మన నాతం డట్ల యనియె. ఇవ్విచిత్రవాదంబున నిరువుర కలరూపపురూపమయ్యె. అంత భార్గవుం డెదిరిమోసంబున కచ్చెరువాటు గని వెడనవ్వు నవ్వె. రక్కసుల కమ్మోసంబు వివరించి చెప్పె. కాని వారు వినక కుహనాశుక్రు నాశ్రయించి తన్ను పోవిడిన నతం డలిగి "మీకు వినాశంబు దాపురించుఁ గాక" యనియె. అది తనకు వాటంబుగాఁ గని బృహస్పతి, నిలింపపతికిఁ దెలిపి యిది యుత్సాహసమయం బని ప్రోత్సహించె. దైత్యులు గురు ద్రోహులై పరాజయ మొంది మగుడ శుక్రుఁజేరిన నతండు "మీరు పాతాళంబున కేగి బ్రతుకుండు. కర్తవ్యం బిద మిత్థం బనఁజాల. ఆలోచించెదఁగాక" యన వారియ్యకొనక ప్రహ్లాదుం బ్రేరేచిరి. అతఁ డింద్రునిపై కెత్తివచ్చె. అప్పుడు సురాసురులకు వేయేండ్లు పోరయ్యె. బృహస్పతియుపదేశంబున నింద్రుండు పరమేశ్వరి నారాధించె. అంత నాదేవి మృగేంద్రవాహనయై విచ్చేసి సింగంబును రంగంబున దుమికించి దైత్యబలంబును నుగ్గునూచగాఁ జెండాడె. ప్రహ్లాదుండు శ్రీమాతను పెక్కుభంగుల ప్రశంసించి శరణుఁజొచ్చె. అంబ యాతని గని "మీ కిపుడు పాతాళంబె శరణ్యంబు. వేల్పులయభివృద్ధికి నిది తరుణంబు" అని తెలిపి యింద్రాదులు హరి హర బ్రహ్మలు ప్రకృతివశులై చరించిన కథలు వివరించి యంతర్హిత యయ్యె.

అంత జనమేజయక్షితీశునకు కృష్ణావతారచరిత్రంబు సాకల్యంబుగా వినిపింప మన బాదరాయణుం డిట్లు చెప్పం దొడంగె.

## —♦ కృష్ణావతారము ♦—

భూదేవి భారము వహింపఁజాలక వాసవుకడ కఱిగి జరాసంధుఁడు, కంసుఁడు, చైద్యుఁడు, నరకుఁడు, వత్సుఁడు, సాల్వుఁడు, భగదత్తుఁడు, ధేనుకుఁడు మొదలగు క్రూరు లొక్క మ్మడి చెలరేగి లోకపీడ గావించుచున్నారు. ఈ ఘోర మ్ముడుపు మన నింద్రుండు మురారి పెక్కు లవతారములెత్తి దుష్టసంహార మొనర్చి నిన్నేలుట క్రొత్తగాదని బ్రహ్మకడ కరిగిన వారలఁదోడ్కొని యతండు రమేశుసన్నిధి కరిగె. అట్లేగి "ద్వాపరాంతం బయ్యె, కలిరాక చీకాకుఁ బఱచె రక్షింపు" మని వేడఁ వైకుంఠుండు "నేను నీవు శంకరుఁడును నింద్ర యమ కుబేరాదులు నహంకారమునఁ గార్యము లేర్పరింతుమనుట కల్ల. మనము పరతంత్రులము. యోగమాయ భూర్భువరాది లోకముల కేలికయై భరించు. నేనె స్వతంత్రుఁ డనువేని తుచ్ఛములైన కూర్మ వరాహాది యోనులఁ బుట్టి గిట్టనేల? శ్రీ రామావతారమున కట్టఁబట్టయుఁ దినఁదిండియు లేక వన మ్ములపాలై యాలిఁగోల్పడి పెక్కువెత లందనే? యోగ మాయ భోగమోక్షప్రదాత్రి. ఆమె నర్చించి విబుధులు తత్ప్రసన్నవీక్షణరాజి మనుట లెస్స" యన నందరు నట్ల యొనర్చిరి. అంత శ్రుతిసీమంతవిహారిణి కారణశక్తి మూల పీఠాధిష్ఠాత్రి యాద్యమజనయిత్రి జగదింద్రజాలవిమోహిని

సింహవాహనయై దర్శన మొసంగె. అవ్వేల్పు లయ్యరవింద లోచన వేడ్కతోఁ బ్రస్తుతించిరి. అంత జగన్మాత "ఇది నాచే నింతకు మున్న చింతింపఁబడినది. నేన యంశావతరణం బొనర్చి రాక్షసాంశసంభూతు లగు మాగధాదుల సంహరింతు. మీరు మీమీ యంశంబుల నవతరింపుఁడు. నా శక్తి మీయం దావేశించు. అదితి కశ్యపులు వరుణశాపమున దేవకీవసుదేవు లయ్యెదరు. భృగుశాపంబున నచ్యుతుండు కృష్ణుండగు. నే నందయశోదలకు నందన నయ్యెద. కారాగారమున నావిర్భవించిన కృష్ణుని గోకుల మందుంచెద. అదితియంశమగు దేవకి యొక్క గర్భంబునఁ బుట్టిన శేషుని సురభియంశమగు రోహిణితోఁ జేర్చెద. ఇంద్రునంశమున నర్జునుఁ డుదయించు. యము నంశమున ధర్మజుఁ డౌదవు. మారుతాంశమున భీముఁడుగలుగు. అశ్వినులభాగంబుల నకులసహదేవు లయ్యెదరు. వసువులయంశంబున గాంగేయుఁ డుదయించు. అసూయ, యీర్ష్య, మతి, తృష్ణ, మమత, అభిమత, స్పృహ, జిగీష, మదమోహములు నా చెలికత్తెలై ప్రళయసమం బొనర్తురు. బ్రాహ్మణశాపమున యదువంశనాశనమగు. కృష్ణుఁడు శాపవశమున నొడలు విడిచి వైకుంఠమునకు వచ్చు" నని తెలిపి జగదంబ యంతర్ధాన మొందె.

సకలభువనంబు లద్దేవిశక్తికి లోఁబడియుండు. అఖిల జగద్బంధువులైన చంద్రసూర్యులకు రాహుపీడ తప్పనిదయ్యె. చంద్రు నొడలు దగ్ధమగుట యెఱుఁగవే? ధాత కుమార్తెతో సంగమించి తలదెగి విఫలుఁడయ్యె. శివుఁ డాలిం గోల్పడి గిరికన్య వరించె. ఈశ్వరుఁడు యమునఁ గని మోహించి పైఁబడిన

సర్వాణి ప్రచండతకుఁ జడిసి యడవి నల్లఁబడుట గనమే? శంకరుఁడు దిగంబరియై భృగుభార్య వెన్వెంట నరిగి త్రిప్పిన లింగమూర్తి దనుజనిర్మితమైన పాశం గల పేరు ప్రాకెఁగదా! ఇంద్రుఁడు గోరూపమొంది తిరుగ లేదుఁగమే? సుఖదుఃఖము లెవ్వరికిఁ దప్పనవి? జయాపజయములు పంచి జంత్రపుం బొమ్మలట్లు సురాసురసిద్ధకోటిఁ ద్రిప్పుచున్న దనఁ దక్కు గొడవ లేల? యని తెల్పి కృష్ణుచరిత్రంబు సాకల్యముగా వినిపించి గుణమయదేహులకు గుణబంధంబు తప్పదని జనమేజయునితో "మీతాత యర్జునుండు తుదకు గాండీవము దివి యఁజాలకపోయెననుట వింటివిగదా! నరనారాయణాంశజు లగు కృష్ణపార్థులయవస్థలు తెలిసెగదా! శక్తి యొకచూపున విశ్వముల సృజించి, యొకటఁ బెంచి, యొకకంట లయంబు సేయు. ఇది గనక ప్రాణు లహంకృతిమొయిఁ దామె నేర్పరుల మందురు. సకలభువనము లహంకారపూరితములు. నలువ సృష్టి కహంకారము మూలము. తద్విలయంబె ముక్తి. కేవల సాత్వికమ్మూర్తినిన దైత్యసంహారం బగునే? దుష్టు లెఱుంగ నేరక శౌరి యొకండు హరుఁ డొకరుండు నజుఁ డొరుండు శక్తి వేఱొకత యని వాదింతు రది మార్గంబు. సాలెపురుగు దానిలో నొదవు తంతువు వేఱు కానేర్చునే? దేవీదేవుల కభేదంబె తత్త్వంబు. శ్రీహరి హరుఁ గొల్చిన గౌరి కరుణించెఁ గదా! యన జనమేజయుం డవ్వలికథ వినఁగోరిన బాదరాయణముని వినిపింపఁదొడంగె.

# పంచమస్కంధము

తొల్లి మహిషాసురుఁ డాశపుఁజిక్కి మేరుగిరి పదివేలేండ్లు తప మొనర్చె. దాన బ్రహ్మాండములెల్ల దద్దరిల్లె. అంతట వారిజాసనుఁ డంచ నెక్కివచ్చి వరమిత్తు నన వాఁడు జరామరణములు లేని గతి యిమ్మని యడిగె. చావుపుట్టువులు జీవులకు వారింపరానివి. అదిగాక వేరొకటి కోరు మని విధి యన నయ్యసుర పురుషుఁ డనంబడువానిచే నాకుఁ జావులేమి నిమ్మన నట్ల యని యజుండు సనియె. అత్తఱి వాఁడు వరబలంబున మత్తిల్లి యీరేడు జగముల నేడిపింప సాగె నన విని రాజు వీనికి మహిషరూప మెట్లువచ్చె నన వ్యాసమౌని యిట్లనియె.

## —♦ మహిషాసుర వృత్తాంతము ♦—

మున్ను దనువను రక్కసునికి రంభుఁడు, కరంభుఁ డను సుతులు గల్గిరి. వారు పుత్రార్థులై ఘోరతపంబు సల్పిరి. తఱివేచి యింద్రుఁడు మొసలియై కరంభుని రూపుమాపె. అంతట రంభుఁడు క్రోధసంరంభుఁడై శిరంబు త్రెంచి యనలంబున వ్రేల్వ సమకట్టిన నగ్ని వారించి యాత్మహింస కేల పూనెదవు? చచ్చి సాధించెడి దేమి? వరమిచ్చెద నడుగు మన, వాఁడు కొడుకు నిమ్మనిన నీ వేజాతివనితఁ బొందుఁ గోరెద వా జాతిమగువకు తనయుండు గలుగునని యరిగె. రంభుం డంత రక్షోరాజ్య మేలువాఁ డొకనాఁ డడవియేనుఁగువోలెనున్న యొక్క గేదెం జూచి దానిలావణ్యంబునకు మోహించి మహిషాకృతిఁబూని దానితో భోగించె. మఱియు వాఁడగ్గేదెను బాతా

శంబునకుఁ గొంపోయి సతివలె నాదరింప నొక్క మహిషంబు దానిపైఁ బడ రోషించి రంభుండు దానితో నెదిరి మడిసె. అంత నమ్మహిషి దుఃఖించుచు యక్షులశరణొందిన వా రమ్మహిషంబుఁ గూల్చిరి. మఱియు వారు రంభునికి దహనక్రియల నొనర్పఁబోవ నమ్మహిషీలలామయు సహగమనంబుసేసె. అ నలంబున దుముకు నాబత్తెకడుపునుండి యగ్నివరంబురూపొందిన రక్కసుఁ డుద్దండుఁడై యవతరించె. వాఁడు మహిషాసురుం డనఁబఱగె.

ఆ యయ్యసుర యవక్రవిక్రమంబున ముజ్జగము లేలించె. వానికి భిక్షుకుఁడు, తామ్రుఁడు, మహావీరుఁడు, అసిలోముఁడు, బిడాలుఁడు, బాష్కలుఁడు, త్రిచక్షుఁడు, కాలబంధకుఁడు నను వారు సేనాపతులై కొల్వ యాగభాగంబు లాహరించి భూభాగంబు వశంబుసేసికొని యింద్రుపై దండెత్తె. అపుడు నందనవనంబు సెఱచి, కామధేనువుఁ గొని, సుధఁ గ్రోలి, గంధర్వులఁ జెఱవట్టి, ఊర్వశీముఖాప్సరోంగనల కాన యిడె. శుక్రుఁ బిలిచి విజయమంగళ మొనర్పించె. అది విని యింద్రుఁడు బృహస్పతితో మంత్రము నడపి బ్రహ్మకడ కరిగి తెరవడిగి యతఁడుం దాను వెడలి వెన్నునిం గూడకట్టుకొని మృత్యుంజయు నర్థించి యతనితోఁ గదలి దిక్పతులుం దాను నేకమై మహిషాసురుపై జగడంబునకు నడచె.

## ఇంద్రాదులు మహిషునితోఁ బోరుట

అపుడు సురాసురులకు ఘోరతరసమరం బయ్యె. వెన్నుండు వెన్నుసూపె. హరుం డుపారె; నజుండు డాగె;

నింద్రుండు ప్రుక్కె. గంధర్వులు కాననంబులు పట్టిరి. యక్షులు సురిగిరి. సిద్ధులు వ్యస్తులైరి. చారణులు తీర్థసంచారులైరి. గరుడులు జడులైరి. గుహ్యకులు గుహలు పట్టిరి. దానవబలంబులు జయఘోషలు మొఱయించుచు సురపురి ప్రవేశంబు గావించిరి. మహిషాసురుండు స్వర్గంబు నేలఁజొచ్చె. ఇట్లు విరిగి సురిగిన సురబలంబులు, చాటుచాటున కూటువగొని కొలిచి వీఁడు స్త్రీచే నిహతుం డగుఁగాని వేఱొక్కటఁగాఁడు. మీ మీ శక్తులలో నెవ్వ రీపనికిఁ జాలువారు ? అరసిచూడుం డన నంబుజాక్షుండు యోజించి లక్ష్మికాని, యుమకాని, వాణికాని యొక్కొక్కరుగ నీ దుర్మదుఁ ద్రుంపఁజాలరని నిరూపించి, మన యంగమ్ములును, మనశక్తుల యంశంబులు, మన యాయుధంబులు నొక్కట ప్రోవుసేసి ఏకశక్తిని పంపవలె నన నజుండు తనమోమునుండి పద్మరాగభాసితంబైన తేజంబు బుట్టించె నది యనలజ్వాల లుమియఁజొచ్చె. శంకరు నంగంబున నీల తేజం బొదవె నది గిరినిభంబై తామసాకార మయ్యె. పద్మనాభుమేన తెల్లని తేజం బుద్భవించె. పురందరుమేన సర్వగుణమయంబైన చిత్ర తేజ మావిర్భవించె. మరియు పావక, శమన, నిరృత, వరుణ, వాయు, కుబేర, దివాకర, సుధాకర ప్రభృతులగు వేల్పులయొడలుల తేజఃపటలంబులు వెడలి ఘనీభావమందె. భార్గవీ భారతీ చండికా పులోమజాది దేవవధూనికరంబులనుండి తేజంబులు గుమిగూడె. ఇ ట్లేకముఖంబైన యా తేజోరాశి యష్టాదశభుజయు, గుణత్రయరూపిణియు, విశ్వమోహినియు, శ్వేతాననయు, కృష్ణనేత్రయు, రక్తాధర రక్తహస్తయు నై శతసహస్రభుజంబులతోఁ గృపాణ శర శరాసన

పట్టిస భుశుండి ముద్గర ముసలాది వివిధాయుధనికరసంశితయై దివ్యసుందరీరూపంబు గొని మహాశక్తి యున్నతరథంబున దేవ మయగాత్రంబుల వాసుకాద్యనంత ఫణి ఫణామణి చకచ్చకిత నానాలంకారంబులు వెలుంగ చూడసూపె. అరూపయయ్యు ని ట్లర్థాపేక్ష సగుణ యగు నవ్విశ్వజనని జగము సృజించి పెంచి లయింపంజేయు న బ్భువనేశ్వరీలీలలు కార్యవశంబునఁ గాని పించు నమ్మూర్తి విశదరూపంబు వివరింతు నని యిట్లనియె.

## —♦ ఆదిశక్తి స్వరూప వర్ణనము ♦—

శ్రీజనని నెమ్మోము చంద్రసంకాశమై తెల్లగ నుండు నది శంకరుని తేజంబు. రోలంబచికురకచరుచి హరినీలవిశ దం బది యామ్య తేజంబు. భువనజననికన్నులు మూఁడు ధవళ కృష్ణ రక్తంబు లనలకాంతికలితంబు లమ్మూఁడును మూఁడగ్నులు. కమలనేత్రు రెండు చాపంబుల తేజంబు శ్రీదేవి కనుబొమలు. పరాశక్తిపీను లనిల తేజోరూపం బులు. తిలకుసుమసన్నిభంబైన దేవినాసిక కుబేరుని తేజము. విశద దంతావళీచ్ఛాయ ప్రాజాపత్య తేజంబు. అధరాధర మరుణుని తేజంబు. ఊర్ధ్వాధరము కుమారస్వామి తళుకు. బాహువులు విష్ణు తేజంబు. అంగుళీనికరము వసుదీప్తి. మృగరాజ వాహన కుచయుగంబు శశిబింబంబు డంబు. నడుము శచీదేవిద్యుతి. అంబయూరుభాగంబును జంఘలు వరుణు తేజఃపుంజంబు. జగదంబిక నితంబము వసుంధరా తేజము. జగదీశ్వరి పాదయుగళము నిఖిల దేవతా స్త్రీ తేజో విలాసము. హావ భావ విలాస లావణ్యంబులు చతుర్వింశతి

తత్త్వరూపంబులు. ఇ ట్లఖిలబ్రహ్మాండజనని జగత్త్రియ తేజః పుంజపుంజీకృత సిద్ధిరూపిణియై విశ్వరూపంబు సూపె.

అట్లు సాక్షాత్కరించిన జగన్మంగళకు మంగళాలంకారములం గైసేయుఁ డని వేల్పుల కానతిచ్చినవారు శ్రీదేవికి నాపాదమస్తంబు నఖిల భూషా నివహంబు భూషించిరి. అవల సురలు తమతమ యాయుధంబుల న య్యసురమర్దనికి శస్త్రంబులుగా నందిచ్చిరి. ఆవల క్షీరసాగరము చిత్రవర్ణంబులగు నంబరంబులఁ గట్టనిచ్చె. విశ్వకర్మహారములఁ గైసేసె. కోటిసూర్య ప్రభాకలితమైన మణికిరీటంబు వెట్టె. కనక కుంతలము లొసఁగె. కేయూరము లలంకరించె. త్వష్ట మంజీరములఁ దొడఁగె. జలార్ణవము కంఠహార మ్మునిచె. సాగరుఁడు రత్నాంగుళీయకంబును గమలమాలికయు నర్పించె. పర్వతరాజు బంగారపుసింహారత్న మిచ్చె. చక్రి చక్రతేజంబువలన బొడమిన సుదర్శన మొసఁగె. శూలి శూలం బొసంగె. జలధి శంఖము దయసేసె. అగ్ని శక్తి నొసంగె. గంధవహుఁడు తూణీరము గాన్కవెట్టె. బలభేది భిదుర తేజంబున నొండొక భిదురంబు కల్పించి యిచ్చె. సైంధవ సింధురంబు ఘంటిక నొసగె. దండధరుఁడు స్వదంతజంబగు దండం బందిచ్చె. అబ్జభవుఁడు గంగాజలపూర్ణ కమండలువును, వరుణుఁడు పాశంబును, యముండు కత్తియుం డాలును, విశ్వకర్మ పరశ్వధంబు నిచ్చిరి. ధనదుఁడు సుగంధభరితం బగు పానపాత్రంబుఁ బట్టి యెదుటనిలచె. సముద్రుండు పంకజంబు కరంబునఁ బెట్టె. రవి సుషుమ్న యను కిరణ మొసగె. ఇట్లు సపరిష్కారయు, సపరికరయు నై నిజ ప్రభాపూరితాఖిలాజాండ మండలి యగు

నా చండికం గని సుపర్వులు పర్వులు జోహారులుసేసి వినుతించిరి. అంత నద్దేవి యట్టహాసంబుసేయుచు సింహగర్జనంబు సేసిన ధరాతలము వడకె. సాగరములు క్షోభించె. కులశైలంబులకటవికటంబులుగాఁ బడియె. గీర్వాణులు భయగ్రస్తులై ప్రోవుప్రోవు మని యక్కాళిని బ్రస్తుతించిరి. ఇట్లు నడచిన జగదంబసంరంభంబున కదరి మహిషాసురుం డిది యేటి యార్భటి. దైవంబొ దైత్యుండొ తెలిసిరాఁ గొంజని నుక్కుమిగిలిన రక్కసుల నంపిన వా రేగి భయానకమూర్తి యగునమ్మహాకాళికఁగని భయమంది దీనులై చకితులై యట కాలు నిలుపనోపక తమదొరకడ కేఁగి భీతావహంబైన య య్యాభామిని యవక్రవిక్రమాటోపంబును రూపంబును వర్ణించి సామాదులచే నక్కొమ్మ లొంగకున్న భండనంబు సల్పు మని చెప్పిన వాఁడును నచ్చెరు వంది, యొక్క సహచరు నిశాచరు నుచితవచనరచన రసంబు జారనీక యాతెఱవం దేర్చికొని తెమ్మని పంపె.

అ న్నిశాచరు మంత్రి పోయి దేవితో మనుజరూపంబున వచ్చి నీవు మా రాజుం గూడుము. అతండు కామరూపుండు, నిను కామించినాఁడు. నీ దాసుఁడయ్యెడు. నీ భాగ్యంబింత యుత్తమంబగునే యని తెల్పిన నయ్యసురమర్దని నవ్వి, మీదొర నన్ను రమ్మని యర్థించుటకుఁ గొంత మెచ్చితిని. లేదేని ని న్నిచ్చటనె మట్టువెట్టి యుండుదాన. అది యటుండె. నీవు నామాటగా నయ్యసురాధముఁ బాతాళంబునకేగి మనుమనుము. దేవద్రోహి నా యెదుట నిలుచుట తెరవుగాదు. అథస్థలికేగు మనుము. తప్పుగాచితి ననుము. కాదేని కయ్యం

బున కాయితంబు గమ్మనుము. అద్దాన శక్రుభాగ్యంబు. పండుట నిక్కంబు. వాని చావున కేను స్త్రీమూర్తినై వచ్చితి. దేవతల కెక్కుడుమలపాలు సేసిన వాని ప్రాణంబున బోనీనని తెల్పుము. అన నమ్మంత్రి "ఏటి మాటలు? అబల నీవేడ? బాహుబలనిర్జితబలారి యతఁ డేడ? చాలుం జాలు. నీ సోయగం బడవిగాచిన వెన్నెల గానీయక యవ్వీర శిఖామణిఁ జేపట్టు"మని ప్రల్లదంబులు పల్కిన, వానింజూచి దేవి నీ కుచితంబులైన కూఁతలు కూసితివి. నీవు పరతంత్రుఁడ వట్ల పలుకవలయుఁ గాని నీరాజు నహంకృతి లెక్కసేయుదానఁ గాను. వానిసంహృతి కవతరించిన దాన దురమ్మున వాఁడు నన్నెదిరించెనేని దుర్మరణంబుపాలగుట నిక్కంబు. వరగర్వంబు ఫలం బనుభవించు లెమ్మ, పొమ్మని చెప్పిన, దానవుండు దానవరాజు కడ కేగి యద్దేవి నున్నదున్నట్లు వర్ణించి చెప్పి రాజా! యుద్ధంబా పలాయనంబా నిర్ణయింప నీవ ప్రమాణం బనియె.

## —♦ మహిషాసుర యుద్ధ సన్నాహము ♦—

మంత్రులతో మంత్రంబు నడపి రణతంత్రంబున నుత్సాహంబు వాటించి సేనలతోఁ గదలి మహిషాసురు నానతిఁ జనుచు దామ్రాసురుండు దుశ్శకునంబుల కలుకుచుఁ బోయి దేవియెదుట నిలిచి పొగరు దక్కి వినయంబున సామంబు దోఁప కొన్నివాక్యంబులు వలికి మహిషాసురుఁ జేపట్టుమని కోరిన, ఓరీ నిశాచరాధమా! కావరంబున ప్రేలెదు. నాభర్త సర్వకర్త; పరమేశ్వరుఁడు. అతని కేల్వట్టిన నా కన్యభావంబు

బోధించెదవు. చెడెదవు. మేదినిక్రింద నణఁగిమణఁగియుండుము. వినకున్న ఫలంబనుభవింతువు, అని తెల్పి భ్రుకుటీగాలిత మహార్భటి నెఱపి, ప్రళయ పర్జన్య గర్జనంబు నెఱపిన జగంబులు దద్దరిల్లె. అంత నా రక్కసుం డోలగంబు దీర్చి యెందుపోదు మేదిక్కు ? దాఁగియుండ నెల వెయ్యది యని మొత్తుకొనిన పలువురు పలురీతుల వాకొనిన విని తుదకు కదనంబు నిశ్చయించె. బాష్కల దుర్ముఖు లను మంత్రులఁ బుత్తెంచె. వా రంబవలన మడసిన, చిక్షుర తామ్రము లెదుర్కొనిరి. వారును గూలిరని విని యసిలోముండు దేవి కెదురు నడచె, నీతివాక్యంబులు పలికి కాకున్న సమరంబు సేసి యద్దేవివలన మడిసె. బిడాలుండు నట్లయ్యె. అంత మహిషాసురుం డాయితంబై మహిషరూపంబున వికృతరూపంబుగ నేల పోవలయునని మనుజాకృతిఁ బూని వరాభరణభూషితుఁడై చెలికాండ్రఁ గూడి విలాసంబుగ యుద్ధరంగంబున కరుదెంచె. వాని రాకం గని దేవి శంఖారావంబు సేసిన నక్కంబుభాంకారంబున దిక్కటాహంబు లదరె. దానం జడియక యప్పొలసుదిండి చండిక కెదురు నిలిచి, నన్నుఁ జేపట్టు మని సరసముగ ననునయించిన నద్దేవి కనలి ఓరీ! మూర్ఖా! ముదితలఁ గోరెదవు. అది నీకు యమపాశబంధనంబని యెఱుంగవు. నాకు భర్త యాత్మపురుషుండు కాక వేఱొకండు గలఁడే! ఈ తుచ్ఛబుద్ధిని మాని యింద్రరాజ్యం బొసఁగి యతలంబున నిలుము. దాన మనిపోయెదు. కాదేని చనిపోయెదు. అని పలికిన వాఁడు నిట్టూర్పు పుచ్చి ఇంతీ! కోమలాంగి వగు నీతో సమరంబునకు రాలేదు. అసమశరసమరంబున నన్నుఁ దేల్పుము. స్త్రీహత్య నావంటి శూరుల

కుచితంబుగాదు గదా! దివ్యసుందరుఁ డగు ననుకూలపతికి ననుకూలవతిగాక తపనిజేకొని పశ్చాత్తప్తయైన మండోదరి పోలికఁ సన్ను గాదని మీఁదటఁ దపింతువు. అయ్యుదంతము వినిపింతు నని యిట్లనియె.

## —♦ మండోదరి యను రాజకన్యక కథ ♦—

సింహళం బను దేశంబు కలదు. దానిరాజు చంద్రసేనుండు శత్రుభంజనుఁడు. సత్యవాది శాస్త్రవిధిజ్ఞుఁడు. అతనిభార్య కమలానన శోభనాంగి, పతివ్రత. వారికిఁ దొలుత నొక్క చక్కనిచుక్క మండోదరి యను కన్య యుదయించె. ఆమెకు నీడువచ్చినంత నుచితవరు నన్వేషించి యాంధ్రదేశంబున సుధన్వుఁ డనురాజుకొడుకు కంబుకంఠున కిత్తు మని యున్నంత, నబ్బాలికఁ కౌమారంబునఁ "గొండొకవ్రతంబు పూని నడపుదాన. పరతంత్ర గానోప. తప మూనెద. సంసారమునఁ బడనొల్ల. వివాహంబు వల"దనియె. తలిదండ్రులు సేయునదిలేక మిన్నకుండిరి. అబ్బాలిక కంత కంతకు వనలక్ష్మికి వసంతోదయం బట్లు యౌవన మంకురించి సంతతోల్లాసంబైనను సమృద్ధియు కామవృత్తి యించుకయు లేకయుండె. జ్ఞానగోష్ఠిచే విరక్త యయ్యె. ఒక్కనాఁడు కోసలపతి వీరసేనుండు రథమెక్కి పోవువాఁ డట వచ్చి సఖులఁ గూడియున్న సుందరి మండోదరి సోయగంబు నయనయుగంబున కబ్బురమై తోఁచిన నవ్వాలుఁగంటి వృత్తాంతము విని యామె పాణి గ్రహింపఁబోయె. చెలు లచ్చెలువకు హితంబుఁ దెలిపిరి. కాని ఫలంబు లేదయ్యె. కోసలేశుఁడు హతాశుఁడై చనియె. ఇత్తఱి వ మ్మగువ చెలియలు

చంద్రమతి యనురూపుఁడగు వల్లభుఁ జేపట్టి సుఖం బుండె. అవ్వల నమ్మండోదరి మద్రపతిపై భ్రాంతిగొని తండ్రి కెఱిఁగింప నాతనికిచ్చి యతఁడు వివాహంబు జరిపించె మండోదరి వానితో సుఖోపభోగంబులఁ దనియుచుండి, యొక్కనాఁడు వాఁడు శయనించుఁగావున దాసితో రమించిన నది గని మనసు విఱిగి యాతనిఁ దొంటి వైరాగ్యము బూనియుండె. ఇట్టి గతి నీకగుఁ గాన నన్నుఁ జేకొనుమని మహిషాసురుండు దేవితో నన 'మూర్ఖా! నిన్ను శిక్షింప నవతరించిన నాతో నెకసక్కెము లాడెదు? నిలు నిలు. నీయసువుల నిప్పుడ కొందు' నని సమర సంరంభ యయ్యె.

## —♦ మహిషాసుర వధ ♦—

ప్రచండమైన యయ్యుద్ధంబున నసుమ దుర్ధరుఁడు, త్రినేత్రుఁడు, అంధకుఁడు ననువార లడ్డంబు వని దేవియొక్క వజ్రనిశాతంబులైన బాణంబులఁ గూలిరి. అంత మహిషాసురుఁడు భీకరాకారుఁడై కదనమునకు వచ్చిన నయ్యిరువురకుఁ బోరు జరుగుటయు నందు తుద ప్రచండవిక్రమంబున నచ్చండిక నటించి ప్రళయకాల కరాళ నిజకాళరాత్రి రూపంబునఁ గండల మెక్కుచు, రుధిరంబులు ద్రావుచు, ప్రేవులఁ దాల్చుచు విహరించె. దేవగంధర్వులు వినుతింప జయజయనాదంబులు నింప రక్షస్సైన్యంబు దైన్యంబు నొంద నా చాముండ యమ్మహిషాసురుకంఠంబు చిదిమె. అయ్యంబ వాహనం బగు సింగంబు కడమ రక్కసుల నెగఁబడి మెసవె. దివ్యులు పుష్ప వర్షంబు గురిసిరి. సిద్ధసాధ్యులు పొగడిరి. కిన్నరు లాడిరి.

కింపురుషులు పాడిరి. దేవతలు శ్రీమాత యయ్యద్భుతమహిమాతిశయంబు వేరీతుల వినుతులసేసి యర్చించిరి అని తెల్పిన వ్యాసుని జూచి మనుజపతి మహిషాసురమర్దని దివ్యచరిత్ర వివరించి ధన్యుం జేసితివి. అవల దేవతలవార్త తెలియఁ గోరుదు నన నమ్మునిచంద్రుఁ డి ట్లనియె.

జనమేజయభూవల్లభ! ప్రసంగంబుల మున్న హరిహరబ్రహ్మలు వనితాకృతినొంది యంబకరుణ పురుషభావంబు వడసి సృష్ట్యాదికారుణు లైన స్థానఁబు కలదు. అది పరదేవికి క్రీడాస్థానంబు మణిద్వీపం బని తెలిపియుంటిగదా! అం దా పరాశక్తి క్రీడాలోలయై విహరించుచుండె. మహిషురాష్ట్రంబున కవ్వల నినవంశసంభవు శత్రుఘ్ను దేవతలు పట్టాభిషేకించిరి. ఆ భూపతి ధర్మంబున నయోధ్య నేలె. సకలవర్ణాశ్రమంబులఁ బోషించె. అపు డెల్లరకు సుఖంబాదవె నని శుంభనిశుంభుల వృత్తాంతంబు వినిపింపఁ దొడగె.

## —♦ శుంభనిశుంభ వధ ♦—

శుంభ నిశుంభు లను నన్నదమ్ములు మగవారిచేఁ జావు లేకుండు నని విధిచే వరంబు వడసి త్రిలోకకంటకులై దిగ్విజయము చేసిరి. సురలు సురపురి విడిచి పారి గురునితో మొఱలిడిరి. అతఁడు చండికారాధనము శరణ్య మన నమరులు శ్రీదేవి నాశ్రయించిన నా భక్తకామద జాహ్నవీస్నానార్థం బరుగునది సురలగోడు విని ప్రసన్నయై శుంభనిశుంభసంహార మొనర్ప రోసంబుఁగొని కాళి యనుపేర నొండురూపుఁగొని దండువెడలి యాదానవులపురంబుదరి వనంబున గొలువుసేసి

జగన్మోహనంబుగ శంకరమూర్తి యొక్కరాగంబుఁ బాడె. సేవకులు చండముండు లది విని శుంభున కెఱింగించిరి. వాఁడద్దేవిఁ దన్నుఁ జేపట్టు మని కోరుట కొకదూత నంప వాఁ డావాంఛ యామెకుఁ దెలిపిన నవ్వి నన్ను వాఁడు గెల్చెనేని నేను వాని కేలువట్టెద. కాన వాని ప్రథనంబునకు రమ్మన వాఁ డట్ల తెలిపె. అంత శుంభుండు పంప ధూమ్రలోచనుఁ డరిగి సామంబులాడిన వినక యద్దేవి యద్దానవుతోడ హూంకారాహూతిఁ బోరి వానిం గాలపురి కనిచె. అవ్వలఁ జండముండులును నాపె నెదిరించి బీరంబులువలికిన వినక యాటోపించి య య్యసురద్వయంబును గరద్వయంబునఁ బసులంబోలెఁ బట్టి ప్రేలాడంజేసి త్రిప్పుచు నేలంబెట్టి ఘట్టించిన రక్తంబుదొరగి డొక్కలు పెరిగి యారక్కసు లసువులం బాసిరి. అంత నసురబలంబులు పారి దొరలఁజేరి సర్వసంహారిణి, సర్వశక్తి, సర్వజ్ఞ, వేదమాత, గాయత్రి, సంధ్య, నిత్య, సగుణ, నిర్గుణ, సర్వేశ్వరి, తామసశక్తి యావర్భవించె కాన వైరంబువిడిచి శరణొందు మన వినక వా రుద్రిక్తులై పొగరుకొని పోగాలంబు దాపురించుట గనక రక్తబీజుం డను దానవుఁ బిలిచి యవ్వనితఁ బట్టి తెమ్మని పంపిన వాఁడు సామవచనంబులఁ గొన్ని తెలిపి హతాశుం డయ్యె.

## —♦ శుంభుండు దండు వెడలుట ♦—

అంత శుంభుఁడు సర్వంబు దైవాధీనంబు హరిహరాదులు దైవతత్పరులు. పుట్టువొందిన మరణంబు తప్పనిద. కుల ధర్మంబుత్తమం బని విందుఁ గాల మవశంబు. దైవంబు నమ్మి

యత్నంబుమానుట పందలపని. వీరు లది మెచ్చరు. రణోద్యోగము వాటించుట మేలు అని సబలాటోపంబుగ ననికి నడచె. అంత సమరము మహాదారుణం బయ్యె. దేవతలు దేవిశరణనిరి. ఆ భువనేశ్వరి త్రిమూర్తిరూపిణియై దేవతలసర్వశక్తులు స్వస్వపరివారవాహనాయుధంబుల మునరికొని నడువ నిర్జరులుప్పొంగిరి, యసురులు క్రుంగిరి.

అనలాక్షుఁ డంత చండికఁ గనుంగొని యుత్సాహవాక్యంబుల వినిపించె. మరియు నమ్మహాదేవుండు దేవియానతి శుంభునకు నీతిగఱపఁబోవ వాఁడును నింతవాని నౌచితి నెఱుగక దూతగాఁ బంచె. ఇ య్యాదుదాని రాజసముఁ జూచెదఁగాక ని యని కాయత్తమయ్యె. మున్ముందు రక్తబీజుండు దేవి నెదిరించె. మున్నిందుధరుఁడు వానియెడ మెచ్చి వానియొడలి రక్తబిందువుల నెన్ని రేణువుల పుడమిదరియు నంతమంది యోధులు వీనితోసము లుదయింతు రని యనుగ్రహించె. కావున వాఁడు దుర్ధర్షుం డయ్యె. వైష్ణవి గరుఁడు నెక్కి వాని నెదిర్చె. రక్తబీజునొడలిరక్తధారచే నసురవీరులు జనించి విశ్వంబు రక్తబీజమయం బయ్యె. శక్తిసేన లద్దాన చీకాకయ్యె. అంత బ్రహ్మాణి బ్రహ్మదండంబున, మహేశ్వరి త్రిశూలంబున, నారసింహి నఖాఘాతంబున, వారాహి కోదండంబున, కౌమారి శక్తి చేతను, మాతృకలు గదాముల చేతను, నంబికశరీరమున బొడమిన శక్తులు వేర్వేర నిశితబాణంబుల వానిం బొదివిన, వాఁడును రేగి శక్తిసేనలఁ గలంప వానిమేనిరక్తంబున నసురబలంబు నేల యీనినచందంబునఁబొడమి యావరింపఁదొడంగె. అంత నంబికాదేవి చాముండికఁ జూచి వీఁడు ఫాలాక్షువరంబున నింత

యయ్యె, వీనిరక్తంబు పుడమిఁ బడకుండ నీవు నాలుకఁజాపు, మద్గాన రక్తబీజులు జనింపరు. సురకార్యముకొఱకు నన నద్దేవి యట్లు సేసి వానిరక్తంబు బీల్చివైచె నట్లు వానినే పణంచి, వానింగూడ యంబిక కబళించె. దేవివాహనం బగు సింగం బెగఁబడి రణభూమిగల యరిబలంబుల భక్షించె. వాఁడు మడి యుటఁ గని నిశుంభుండు ప్రగల్భములాడుచు నన్న యనుమతి ననికిఁ బయనించె.

## శుంభనిశుంభులు దేవితోఁ బోరి చచ్చుట

అంత శుంభ నిశుంభు లవక్రాటోపంబున దేవి నెదిరింప నడచిరి. నిశుంభుఁడు దేవిపై గదను విసరి నొవ్వంజేసిన, కనలుచుఁ జండిక నిశాతఖడ్గధార నవ్వానికుత్తుకఁ ద్రెంచె. కుత్తుకఁబడిన వాని కబంధంబు గదాసమేతంబయి రేఁగసి వేల్పులఁ గూల్చిన దేవి నవ్వుచు దాని ఖండించె. తమ్ముచావు విని శుంభుండు దుఃఖించె. నిశాచరు లిద్దేవి వైష్ణవియ కాని వేరుగాదు, పలాయనంబు కర్తవ్యం బని తెల్పినవెనుక వాఁడు కాలంబు దాపురించె నని నమ్మి తమ్మునికై కన్నీరు గార్చుచు మరణం బొందె, జయం బొందె యని సమరసన్నాహంబున నరదంబుపై రణరంగంబున కరిగె. మరియు వాఁ డద్దేవి భువనమోహనా కారరేఖఁ గనుఁగొని వశము చెసి యామెమహిమ నెఱుఁగక కామవృత్తిఁగొని యయ్యంతివశం బగు టెట్లని చింతించి, సామా దులకు లొంగమి నెంచి, దండంబె యుపాయం బని యామె కెదురువడచె. ఇంతుల కౌద్ధత్యంబు సెల్లదు. కనుబొమలు విండ్లు, శరంబులు చూపులు, హావభావాదు లస్త్రంబులు, వురు

షుండు గుటిగా ననంగరంగంబె యుద్ధరంగంబు గాని, సిగ్గువిడిచి యీలీల నబల సంగ్రామవీథుల బీరమ్ముం జూపనేల ? నన్నుం గరుణింపు.నా కేలువట్టి వినోదింపు మని వాఁడు దుర్భాషలాడె. అంబిక కనలి పోరి నీపౌరుషంబు సూపిన గాక కామంబు ఫలిం చునే? రమ్ము,నీగర్వం బణంప నిక్కాళిక గలదన, వాఁడు కాళిక నెదిర్చె. అంత న మ్మహాకాళి శుంభునిపై గవిసి తల డొల్ల నేసి కులశైలంబులు ప్రతిరావంబు లీన నార్చె. హతశేషు లగు నసురబలంబులు నాయుధంబులఁ బారవైచి శరణని జగ జ్జనని పాదంబులు వట్టిన బాతాళంబున కేగి బ్రతుకుండు పొండనియె అని చెప్పి వ్యాసుండు జనమేజయునితో నీ యా ఖ్యానంబు విన్నవారికి దేవికృప నిక్కంబు. పుత్రపౌత్రాభి వృద్ధియు నగు. శౌర్యాదు లొదవు. ఇహమునఁ గీర్తియుఁ, బర మున నీశ్వరీసారూప్యైక్యంబు నిజం బని తెల్పె.అవ్వల నప్పుడమి దొర సాత్యవతేయుచరణంబులఁ దలమోపి యఖిలాండేశ్వరి చరిత్ర వింటి నింక తత్సమర్చనవిధి విశదీకరించి యప్పరాదేవి ప్రసాదంబు నొందిన నరునిచరిత్రంబు దెలుపఁగోరెద నన నతం డతని కిట్లనియె.

## — సురథుం డను సత్యవ్రతుని కథ —

స్వారోచిషమన్వంతరంబున సురథుం డను రాజు సకల సద్గుణనిలయుండు కలఁడు. అతనిపై మ్లేచ్ఛపతులు గుంపై దండెత్తిన వారి నెదిరింప నేఱక దుర్గంబుసేరఁ దలంచియు, మిత్రద్రోహులవలని భయంబున నది మాని కాంతారమున వసించుచు సమీపంబున నున్న సుమేధుఁ డనుముని యనుగ

హంబు వదలె. అటుపై వైరులవలని భయం బెందుఁ గలుగదు. మదీయాశ్రమంబున నిలుమనియె. రాజు హర్షించి యందు వసించుచుఁ గొండొకతఱి తన ప్రాక్తనరాజవైభవం బెంచి కుందుచున్న తఱి నొక్కవైశ్యుం డటకు వచ్చె. రా జతని వృత్తాంత మడిగిన నబ్బాటసారి యేను సమాధి యను వైశ్యుండ. ధనవాంఛచే నన్ను భార్యాపుత్రులు బంధించి వైచిన నిల్లురోసి యివ్వని కేతెంచితి నీవార్త తెలుపు మన నతండు దనయవస్థఁ దెల్పె. ఇట్లార్తు లగు నయ్యిరువురకు మైత్రి సుకరంబయ్యె. వైశ్యుండు బుత్రవ్యామోహంబు విడువకున్న తన నింతఁ జేసినను నది పోదేల? యని రా జనియె. అంత వారు మునికడ కేగి తమక్షోభ విన్నవించుకొనిన నతండు బ్రహ్మరుద్రాదులు వెతలందక తప్పినది కాదు. మీ రేల యింత తపించెదరు అని తెలిపి తొల్లి బ్రహ్మవిష్ణులకు జరిగిన సంవాదంబు వినిపింతు నని యిట్లు సెప్పం దొడంగె.

## —♦ బ్రహ్మ విష్ణు సంవాదము ♦—

తొల్లి నారాయణుండు బ్రహ్మవిద్యకై తపంబుసేసె. బ్రహ్మయు నట్లె మోహనివృత్తిఁ గోరి తపముసేసె. ఇట్లు వారు తపముఁ జేయుచు నొక్కయెడ కలిసికొని నీ వెవ్వఁడవీ వెవ్వఁడ వని యొండొరులు ప్రశ్నించుకొనిరి. నేను సృష్టికి మూలంబు సర్వజ్ఞుండ నని బ్రహ్మయు, సత్వగుణైకాశ్రయుండ. జగత్కారణుండ నే నని హరియు వాదింపమొదలిడి తుదకు పోరికిం దొడరినంత లోకాతీతంబైన యొకదివ్యలింగం బుద్భవించి యనలజ్వాలలఁ గ్రక్కుచు నూర్ధ్వజగంబులు దాటిపోవు

నంత బ్రహ్మ విష్ణు లచ్చిత్రంబు గనుచుండిరి. అంత నశరీర వాణి మీలో మీ రేల తగవుఁ గొందురు? ఈ లింగంబు పాదంబును, శిరంబును గుర్తింపుఁడు. అచ్యుతుం డడుగుఁ జూచుటకును, బ్రహ్మ తలఁ గనుటకును బోవుగాక! అట్లు కన్నవారికి సర్వశక్తి కలుగునని తెలిపె. అంతట వా రప్పనికిఁ బూనుకొనిరి. విష్ణు వేండ్లతరబడి చని లింగమూర్తి మొదలఱియలేక మఱలి యునికిఁ జేరె. బ్రహ్మ తల వెదకుచు బోయి శోషిలి యది యెఱుంగరాక ఖిన్నుండై యుండి యా లింగమును దేవత లర్చించునపుడు తూలి వ్రాలిన యొక మొగలి పూవు గని తన మనోరథ మీడేరె నని గర్వించి వచ్చి శిరంబు గంటి నని హరితోఁ జెప్పి యందుల కీ మొగలిపూవు సాక్షి యని యనునంతలో శంభుండు ప్రత్యక్షమయ్యె.

హరివిధాతలు హరునకు మ్రొక్కి నిలుచుండిరి. అతఁ డిట్లనియె. శ్రీహరీ! నిన్నుఁబోలు గుణవంతులు లేరు. నీవు సాత్వికమూర్తివి. లోకరక్షణము నీపని. ఈయజుండు నిన్ను గెలువగోరి నాశిరంబు గంటి ననియె. అది హీనతర మగు పనియే? నాశిరంబునుండి రాలిన కేతకిగని యసత్యమాడి నమ్మించె. ఈపూవు సుజననింద్యం బగు. నాపూజకుఁ దగదనియె. హరి గెలిచె,నజుండోడువడె. అది మొదలు కేతకి పూజానర్హంబయ్యె. మాయయందే జగంబు నడచు, నందె యడంగు. మాయ జగదంబ. పరమం బ మ్మాయ, సర్వం బ మ్మాయయ, యన రాజు మాయ యెట్లు పుట్టె? రూప మెట్టిది? బల మేమి? మన సిచ్చి సర్వంబుఁ దెలిపి నామోహంబుఁ ద్రుంపు మన మునిపతి భూమిపతి కిట్లనియె.

రాజా ! దేవికి బుట్టువు, నాశంబును లేవు. శక్తిహ్రాసంబు శవసమానంబు. సురకార్యసిద్ధి కామె యావిర్భవించుచుఁ దిరోధానించుచుండు. వినతులఁ బాలించు, విమతులఁ దూలించు. ఎల్లరు నా ప్రకృతి కధీనులు. ఆమె కాలవశగాదు. కాలం బామెకు వశంబు. ఆమె యగుణుండగు పురుషుండు, పురుషుని కంటె వేరైనదియు. సగుణంబెల్ల దేవిసంతతి. పురుషుని సంతసింపఁ జేయ నాపె భూర్భువరాదిలోకనాటకంబు గల్పించి యాడించి గ్రసించు. తుదం బతి గలయుట యామె వర్తనంబు. కారణరూపులగు ముమ్మూర్తుల సృజించి వారికి మువ్వురు శక్తులఁ దోడిచ్చి యాడించు నామె యెవ్వరికి నందదు. ఆమె కృప యుత్తములపైఁ బర్విన వారు సృష్టిస్థితిలయాదులకు హేతువు లయ్యెదరు. అణిమాది సర్వసిద్ధు లయ్యంబ యధీనంబులు. అయ్యీశ్వరిమాయ నెవ్వ రెఱుంగ నేర్తురు? అప్పరా దేవి వృత్తాంతంబుఁజదివిన విన్న సంపదలు, విద్య, నిత్యోత్సవ లాభము, స్థిరజయసామ్రాజ్యపూజ్యసిద్ధులు నగునని రాజు ప్రార్థనచే నంబిక యర్చావిధానంబు సాకల్యంబుగా వినిపించె నని తెల్పి సుమేధుండు రాజునకును, వైశ్యునకును వినిపించిన వారు నమ్మునివలనఁ గోరిక వడసి స్థిరమానసంబుల పర్ణజలాహారులై కొన్నినాళ్ళు, నిరాహారులై కొన్నినాళ్ళు తపంబు సల్పి దేవిం బూజించిన, రక్తాంబర ధారిణియు, రక్తభూషణ భూషితయు, చతుర్భుజయు, నష్టాదశభుజయు, అష్టభుజయుంగా స్వప్నసమాధులఁ దోఁచిన వారలు ప్రత్యక్ష దర్శనాపేక్ష దేహంబు విడువందలఁచి, యగ్నికుండంబున దేహమాంసంబు హోమంబు సేయుచు, రుధిరతర్పణం బొనర్చి యంగంబుల

బలిప్రదానంబు సేయ నాతల్లి ప్రసన్నయై దర్శనం బిచ్చె. వారల ప్రార్థన నాపద లుడిపి యిష్టార్థంబు లొసంగె. వైశ్యుండు స్వప్నసుఖంబగు సంసారంబు గోరక జ్ఞానం బర్ధించి ధన్యుం డయ్యె. రాజు రాజ్యంబు వడసి తుదకు జ్ఞానము గని ముక్తి గాంచె. ఇట్లు పలికిన బాదరాయణునికి మ్రొక్కి జనమేజయుండు మీఁదికథ వినవలతు ననియె.

---

# షష్ఠస్కంధము

త్వష్టకొమరుండైన వృత్రుని నింద్రుండు చంపెనని వింటిమి. దేవపక్షమువాఁడు త్వష్ట యని విందుము. వాని సుతుఁడు విప్రుండు, పావనుఁడు, బలవంతుఁడు, ప్రాజ్ఞుఁడు. దేవతలో సద్భావులు. ఇంద్రుఁ డిట్టి యకార్యం బేల చేసె. సాత్త్విక మూర్తి హరి యిందులకుఁ దోడయ్యె. ఇది విచిత్రంబుగాఁ దోఁచు. ఇంద్రుఁడు వృత్రుం జంపెనని యంటివి. ఇపు డంబికేశ్వరి చంపె నంటివి. ఇది భేదంబుగాఁ దోఁచెడి; నా సంశయంబు దొలఁగించి కరుణింపుమన, సూతుండు వ్యాసుండు జనమేజయునకుఁ దెల్పినరీతి నిట్లని చెప్పందొడంగె.

## —♦ వృత్రాసుర జననము ♦—

త్వష్ట మహాతపస్వి. సురధర్మనిర్వాహకుండునై యుండె. అతఁడు త్రిశీర్షుఁడను వాని విశ్వరూపుని పవిత్రచరిత్రుని దనయుంగాఁ బడసె. అతఁడొక ముఖంబున స్వాధ్యా

యంబుఁ బఠింపుచు, నొక్కట మధురపదార్థంబులు గొనుచు, కడమశిరంబున నేకకాలంబున నెల్లదిశలఁ గననోపు. అత్యంత తీవ్రతపోనిష్ఠుండై యుండ నింద్రుండు తన స్థానంబు హరించును అని వెఱచి వానిని మోసగింప నప్సరసలఁ బురిగొల్పె. వారును హావభావాదుల నమ్మునిని వంచింపం జూచియు చేతఁగాక, యింద్రుం జేరిరి. అంత సురపతి వాని నిష్కపటిలి యొండొక తెరువు గానక పామరవృత్తిమై సడికోర్చి వజ్రాయుధంబున నవ్విశ్వరూపుని శిరంబుల ఖండించె. వాసవుని యన్నీచాతినీచకార్యంబునకు నచటితాపసులు మున్నుగ నెల్ల భూతంబులు సంతాపించె. త్రిశీర్షుండును ప్రాణంబులు వాసియు జీవకళలచే వెలుగొందె. అది గని జనమెల్లరు గాంచుచుండ నింద్రుఁ డయ్యద్భుత ప్రభలు వెలుగుట కచ్చెరువడి చింతిలుచుచుండి దేవతల వర్ధంగిని బిలిచి వాని తలలు తిలఖండంబులుగఁ దుత్తునియలు సేసిరమ్మన నాశిల్పి "నాచేతి పరశువున నది తెగదు. దీని యంచు మొక్కవోవు నంతియకాక యింతమహా పాతకంబుఁ జేయఁజాల, నీనింద్య కృత్యంబున కెద యోర్వదు. కాక, చచ్చిన వానిం జంపుట యెందేనిం గలదే? వాఁడు మఱలజన్మించునే? భయంబు వాయు మన వజ్రి చచ్చియుం భీతి గొల్పుచున్నాఁడు. దాన నట్లంటి నన, నీమగతనము తొలంగెనే? ఏల వెఱపాందెద వన "గతజీవుండయ్యు జీవనోపేతుం డట్లున్నాఁడు. గడికండలుగఁ గొట్టకతీరదు" అనగా తక్షకి యీ బ్రహ్మహత్యనొనర్చియు జంకుఁ గొంకు లేకుండుట నీకేటి యుచితం బన బ్రహ్మహత్యా దోషంబు ప్రాయశ్చిత్తంబునఁ బాపికొందుఁగాక! శత్రుని నుపేక్షింప న్యాయంబు గాదని పెద్దలంద్రు. అనిన దేవశిల్పి ఆళావకుండవై

యీ యకార్యమున కియ్యకొంటివి కాని నేనేమి యాశించి యీ ఘోరం బొనర్తు ననియె. "యాగంబున పశుశిరంబున నీకుఁ బాలు పెట్టుదు. నా చేతి పరశువున వీని మేనుఁ దఱుఁగు" మని వాసవుం డనియె. విశ్వకర్మ యెట్టకేలకు ముదంపడి పదను గల గొడ్డట నమ్ముని తలఁ జెక్కె. అంత కపింజలంబు లెగసి శ్రుతులు చదువుచు సోమపానం బొనర్చు నెమ్మోమునఁ గవిసె తిత్తిరిపక్షులు దిశలన్నియు గనఁజాలు వాని మోమున గుంపు గూడె. సురదారివు మూఁడవ మొగంబున మందలై చటకంబులు ప్రాలె. వాసవుం డంత హర్షించి కృతార్థుండైనట్లు భావించి స్వపురి కేగె. కాని తన యకార్యంబున బ్రహ్మహత్యాపాతకంబు చుట్టుకొనుట కుద్వేగించి బక్కచిక్కి యుండె. త్రిశీర్షుని తండ్రి పురందరుని క్రౌర్యంబు విని పుత్రశోకవ్యాకులుఁడై వేదనం బొరలుచు దేవతల కిది దెల్పి యీ సురపతి నంత మొందించుకొడుకుఁ బుట్టింతునని యగ్నిం బ్రీణయునించి యజ్ఞం బొనర్చి ప్రేల్వ, వృత్రాసురుండు పుట్టె. రెండవ యగ్ని నానుదయించిన వృత్రుంగని "ఇంద్ర శత్రో వర్ధస్వ" యని దీవించిన వాఁడు కల్పాంతజ్వలనంబునుం బోలె వర్ధిలె. మఱియు దండ్రింగని నా కర్తవ్యం బుపదేశింపు మన నీయన్న నన్యాయముంబుగఁ దునిమిన యింద్రునిం దునుము వలయు నని త్వష్ట బాహుశక్తి నొసంగి ఖడ్గశూలాద్యాయుధంబు లందిచ్చిన దేవపరాభూతులగు యాతుధానులం గూడికొని వాఁ డింద్రునిపైకి పడచె. ఇంద్రుఁ డవ్వార్త దెలిసి యనుభవనిమిత్తంబులు పెక్కులు గోచరించి యమరపతి గురుని కడ కేగి కావు మనియె. అతండును "శక్రా! పురాకృతం బను

భవింపక తీరదు. హేయకర్మంబు సేసితి. త్వష్ట వీని సృజించి పంపె. వీఁడు దుర్జయుండు." యనుచున్నంతలోన నిర్జరులు హాహారవంబు సెలఁగ నేడ్చుచుఁ బలువం జొచ్చిరి. అంత నింద్రుఁడు స్వబలంబులఁ గూర్చుకొని పోరాడ మానుష ప్రమాణంబున నూఱేండ్లు సనియె. అంత వరుణ వాయు దండ ధర జ్వలన ప్రముఖులగు బర్హిర్ముఖులు పారిపోయిరి. ఇంద్రుం డును గాలికి బుద్ధిసెప్పె. వృత్రుండు నింద్రు నిట్లు కొట్టి వాని యైరావతంబు దెచ్చి తండ్రికిం జూపి యింద్రుఁడు నేకాదు; ఉపేం ద్రాదులగు ముమ్మూర్తుల హరింతు నను సుతు గని తండ్రీ హర్షించితి. నా మనోజ్వరంబు వాపితివి. ఇంక నీవు తపంబు సేయుము. ఇంద్రుం డంతరంబు వేచి ప్రహరించుం గావున వాని నుపేక్షింపవలదు. నీవు మరణంబులేమి సాధింపు మన వాఁడు గంధమాదనంబున నన్నపానాదులు వర్జించి నిశ్చలు నిశ్చలధ్యాననిష్ఠ నెల్ల విఘ్నంబులు దొలంగి శతవర్షతపం బొనర్చె. అంతఁ బద్మభవుం డెదుట దోఁచిన వృత్రుండు మృత్యువులేమి వర మిమ్మనియె. అతండు నన్ని శిలా లోహ కాష్ఠ చేతనాచేతనంబుల నీకుఁ జావు గల్గదని వరం బిచ్చె. బ్రహ్మవరంబున దర్పితుఁడై వచ్చి, యన్నకై తండ్రి కన్నులం దొరంగు బాష్పంబులఁ జూచి, బలభేదిని సంహరింతునని దాడి వెడలిన, శక్రుండును వాని నెదిరించె. అంత నా భండనంబు బ్రహ్మాండభాండవిభేదనం బయ్యె. అట్టిసమరంబున వృత్రుండు సెలరేగి కేలుం గేలుం గాలుం గాలుం గదియించి ఘండ్రమింగి నట్లు ప్రమింగె. అంత సురబలంబులు హాహారవంబులు మిన్ను ముట్ట నేమిచేయుద మేది దిక్కని గురునికడ విలపించి, బిడౌజు

విమోచనంబున కెన్నిగల వన్నియుపాయంబులు సల్పియు దారి గానక యఖిల జగజ్జనయిత్రి నాశ్రయించిరి. ఆమె కరుణో దధిగా నింద్రుఁ గావ భ్రామికాశక్తిం బ్రేరేప నామె వృత్రునా వహింప నయ్యసుర బెండువడి తద్వశుండై యొక్కమా రావులించిన వాని వదనంబునుండి వేల్పుల ఱేఁడు వెడలివచ్చె. శక్తి జృంభిక యను పేర భూతంబులఁ జేరె. జంభారి ముప్పది మూఁడుకోట్ల దేవతలతో వృత్రుపైఁ గవిసిన మఱల తీవ్రతర సంగరంబు జఱిగె. పాకశాసనుఁ డరి కోర్వలేక పాఱె. వృత్రుండు స్వర్గం బాక్రమించి సకలోపభోగంబు లనుభవించె.

త్రిదశులు వాని ధాటి కాక్రోశించి పశుపతిని శరణు సొచ్చిరి. దేవదేవుండును "మనకు వారిజాక్షుండ దిక్కు. అతం డీక్షోభంబు వారింప వలంతి" యని వారిం గూడఁగట్టుకొని వైకుంఠున కీ యార్తి వినిచిన "నమరులారా! వాని కాయుశ్శేషం బున్నయది. ఇంద్రుఁడు విశ్వాసఘాతవలని దురితంబునకు నొడంబడి నా సాహాయ్యంబున వానిఁగడతేర్ప గలండు. మీరు యోగమాయారూపంబగు నాదిశక్తిని భజింపుఁడు. సేమంబగు. సిద్ధిదయుఁ గామదయు నగు సాత్వికీశక్తిని భజించుచునే యున్నాముగదా! ఈపైన వాసవుం డయ్యంబఁ గొలిచిన మోహినినై మునిం భ్రమింపఁజేయు నన" నయ్యమరులు మేరునిలయ యగు నాదేవి నర్చించిరి. ఆమె సింహవాహనయై వచ్చి దర్శనం బిచ్చిన వేఱ్వేర నయ్యమరులా లోకేశిని వినుతించిరి. ఆమెయు వృత్రాసురు మోహవశుం జేయుదునని వర మిచ్చె. వా రంత వృత్రు నాశమంబు వంకనడ

చిరి. అటు పని వానిం జూచి భయపడి చెలిమి వాటించి మెల్లన నిట్లనిరి.

ఇంద్రుండు నీవును పంతమ్ములంగాని చింతల మునింగినారు. నీవారు నాతనివారు పొందు సల్పు టుచితంబు పండితులు దూరంబున కంగీకరింపరు. జయాపజయంబు లెందు సందిగ్ధంబులు. ఆహవంబునం జచ్చిన నీనుంగు నక్కల పాలగు. అగుటగాక ఫలంబును లేదు. పురుహూతుండు నీవును సఖ్యంబు వాటించిన నందనాదులు నప్సరోనికరంబు మీ యుభయుల పాలగు. ఎల్లరము సుఖింతుము, సత్యంబున నీకుం జెల్మియగు. దాన నపరంజి రత్నంబునం గూడినట్ల యగు. ఇట్లు విన్నవించినమాట లాలించుచు నాసురారి "యేటి మాటలు? వెన్నెల చీంకటిం గలియునే? వైరి, శఠుండు, స్తబ్ధుండు, కామి, నిర్దయుండు, నిర్లజ్జుండు, దురాచారుండు, బ్రహ్మఘ్నుండు, నగు మీరాజు విశ్వసింప నర్హుండే? అద్రోహులు మీ రాద్రోహి జాడల నెఱుంగ కిట్లంటిరి" అన నిలింపులు "శుభాశుభభోక్త చేతనుండు గదా! నీ చెప్పినవాని పాపంబు ఫలంబువాండె గుడుచువాండు. అది యట్టుల నుండనిమ్ము నీ కుచితంబైన ప్రతినం జేయుము. వాని నేమొడంబఱతుము" అన వాం డిట్లనియె.

ఎండిన, తడిసిన దానిచే నశ్మకాష్ఠంబులచే రేయుం బవళుల వధ్యుండగాకుండ నింద్రునితోం బ్రతినసేసిన వాని చెల్మి కంగీకరింతుననె వా రట్ల కానిమ్మని శక్రుం దెచ్చి యగ్ని సాక్షికంబుగ మైత్రిం జేయించిరి. అంత వారు యథోచితవిహారమునం గలసి మెలసి చరించిరి. కాని జంభారి కుటిలవర్తన నవ్వాని వధకు రంధ్రాన్వేషియై చరించుచుండె. వృత్రుతండ్రి

"యిది యేటివింత? పన్నగంబు ముద్దిమట చెల్లునే? హరి తోఁకలయిక సేసి తిది దారుణము" అన గొడుకాసన్నమృత్యువు గావున నా హితంబు సఱకుగొనఁడయ్యె.

ఉండి యుండి యింద్రుండు తఱి యఱయుచు నొక్క కడలియంచున గొండవలె బడియున్న నుఱుగురాశిం జూచి యిది శుష్కంబు నార్ద్రంబునుం గాదని గ్రహించి, జలక్రీడ నెపంబున దానిం గొని హరి యావేశించియున్న తన వజ్రంబు గొని నవ్వుచు వృత్రుపై విసరిన వాఁ డఖిల భూతజాలంబులు సంచలింప, చుక్కలురాల, గ్రక్కునఁదెగి యిలపైఁ గూలె. అంత దెసలు తెలివొందె. సుర లలరిరి. పూలసోనలు గురిసె. సురభువి నాటపాట లెసఁగె. ఇంద్రుఁడు బ్రహ్మహత్యకుఁ దలకుచుఁ బురిఁ కరిగె. మును "అతి మూర్ఖ వాసవుఁడు నమ్మినవానిఁ జంపె. ఇక్కానిపనిచే వాని తపమ్ము వమ్మయ్యె. కారకుం డింద్రుఁడు, ప్రేరకులము మనము; ఇది యుభయులకుం గుడువక తీఱునే? దాని పాచితమ్మునఁ బాపికొందు"మని యుండిరి. అటఁ ద్వష్ట కొడుకునకై యేడ్చుచు విధిం దూఱుచు పుత్రునకుఁ బరలోకక్రియలు సలిపి యింద్రుం గూర్చి "స్వర్గచ్యుతుండవై దుర్గంబులపాలై యిహమలం గుడుతు గాక" యని శపించె. పిమ్మటయు మేరువున నిల్చి తపంబు సేసె. ఇంద్రుఁడు బ్రహ్మఘాతకుండని లోకంబులు నిందించె. వాని యాజ్ఞ సెల్లదయ్యె. అంత నాతఁడు దురంతవేదనం బొంది యిల్లు వాకిలి నిల్లాలిని దలఁగి, వనికిఁ బాఱిపోయె. అంత స్వారాజ్య మరాజకమయ్యె. ఉపద్రవంబులు సెలరేఁగె. అది గని దేవతలు మాఱు జన్మంబు లొనర్చిన

నహుషుం దెచ్చి శతక్రతుపదవిని నిలిపి స్వర్గంబు నేలించిరి. అతండు నిలింపనాయకుఁ డై విశేషభోగంబుల రుచిమరిగి తన కాతని యిల్లాలిం గూడ నైవసము సేసికొందును. ఆమె నను సేవింపమియేల? యని నంత బృందారకు లాసుందరికడ కరిగి వానితలం పెఱింగించిరి. ఆమె యీ దౌష్ట్యంబు విని ఘూర్ణిల్లి గురునివసంబులు వచ్చె. బృహస్పతి యభయం బొసంగె. నహుషుం డవివిని సురాచార్యు వేధింపుఁడని యను చరుల కానతిచ్చె. సురలు హితోక్తు లెన్నియేని తెలిపిరి. కాని కామదగ్ధున కవి యెక్కునే? వాఁడు మదాంధుండై శచిని దెచ్చి యర్పింపుఁడని పంపిన వారు తమగురునికడ కేగి యెఱింగించిన నతఁడు త్రిలోకంబు లెత్తివచ్చిన మంత్రమున భస్మము సేసెదఁ గాని రాణి నియ్యఁజాలననియె. అట్లైన యుపాయం బానతిమ్మనిరి గీష్పతి "సురలారా! శచితో మన మయ్యధముసభ కేగుదము. ఇంద్రుండు భవనంబుల లేఁడేని నిన్ను వరించెద నని యామె చెప్పును. దానం గొంత కాలహరణంబగు. మనమీలోఁగా నింద్రుని వెదకి తెత్త"మనియె. అట్లసేసి వానిచే నొననిపించుకొనిరి. పిదప వారు హరి కడ కేగిన నతం "డధ్వరం బొకండు చేయుండు, దాన నింద్రుపీడ తొలంగిచనును. ఇంద్రాణియు భగవతి వర్చింప వలయు. దాన నహుషుండు నశించు" నని తెల్పిన వారు హయమేధంబు నొనర్చి వాని బ్రహ్మహత్యాపాపంబును, వృక్షంబుల, నదుల, పర్వతంబులఁ, బుడమిని, స్త్రీలయందుఁ, బంచి పురందరు సుఖి నొనర్చిరి. అతఁడు కాలముగూడు దాఁక తామరతూఁడునం దొదిఁగియుండె. వేల్పులు తమ పదవి

సేలిరి. ఇంతకును పౌలోమి తన పతిం గాంచమికి వగచి గురు నడిగిన నతఁడు దెల్పినవిధిని భువనేశ్వరి నర్చించి యామె సాక్షాత్కారంబు వడసె. అయ్యోగమాయ సూపఁ దన మగని పద్మనాళంబునం గనియె. ఇంద్రుఁడచ్చెరువడి నన్నెట్లు దెలిసితి వని సురరాజ్ఞి సకలంబు దెలిపి, దేవికృప వివరించిన మఘవుం డింతీ! యిది సమయంబు గాదు. అణంగియుండి కొంతమీఁదట వత్తు ననియె. శచి నహుషుని భయం బెఱింగించి దుఃఖించి నేనెట్లు వాని నిర్బంధము దొలంగుదు నన నింద్రుఁడు "భామినీ! వాఁడు నిన్ను బలాత్కరించునపుడు కా దనక ముచ్చట నలిపి రాగవృత్తి కనుకూలంబు నటించి మునులు మోయు శిబికపై నీవు నాయింటికి వత్తువేని నీ కోరిక నంగీకరింతు ననుము. దాన వాఁడు ఋషుల బాధించి వారిచే నాశనంబు గను" నన నామె చని నహుషునితో నట్ల నియమంబుఁ జేసిన వాఁడు కామాంధుండై మునులచేఁ బల్లకి మోయించె. అంతట వింధ్యమదాపహర్త యగస్త్యుండు క్రోధంబుగొని యరుణాక్షుఁడై రేగ. ఇంద్రుఁడు "సర్ప సర్ప" (నడు నడు) యని మునులఁ దాడించుచు విమానంబు మోయించుట గని యమ్మౌని "సర్పోభవ" (సర్పమగుము) యని శపించె. అంత నహుషుండు స్వర్గపదభ్రష్టుండై యిలఁ గూలి యొక్కయడవిలోఁ బామై జనించె. లోపాముద్ర మగనిదయ శచికిని యామె మగనికి సుఖ మావహిల్లె. ఎల్ల సురలు పొగడ సురపతి స్వర్గమ్మున పునఃప్రతిష్ఠం బడసె.

అని తెల్పిన వ్యాసుని గని జనమేజయుండు దనపూర్వులగు ధర్మరాజాదుల కష్టంబులఁగూర్చి నరనారాయణు లచ్యు

తాంశంబున భూభారంబు హరించి రనుటం గాన్పించియుఁ బ్రత్యక్షమే
యున్నిటికిఁ గతంబేమని యడిగిన సత్యవతీసూనుం డన్నిటికిఁ
గర్మంబు మూలంబని నిరూపించి, యది యనుభవింపక నెవ్వా
రికిం దీరదు. బ్రహ్మ విష్ణ్వాదులు కర్మబంధంబునన రాగ
ద్వేషాదు లొంది వర్తించి రని తెల్పి, యుగానుకూలంబుగ
జీవులు ధర్మాదిపరులౌట నిరూపించి, పరివర్తనంబు వాకొనె.
శ్రుతిస్మృతిపురాణములయం దొక్కొకచోఁ గానిదైనదిగ
నైనది కానిదిగ నిరూపించుట యర్థవాదంబు. అట్లనే బ్రహ్మా
దుల యుపాసనంబుల యెడల నొక్కని జేపట్టి యొక్కరిగావనుట
యన్యోన్యార్థవాదంబులు. కలిని వేదమార్గ ముపపన్నముగామి
పురాణములు శరణము లయ్యె. జగన్నాటకసూత్రధారిణియగు
మాయాశక్తి విచిత్రవర్తనము దుర్జ్ఞేయంబని తెల్పిన జనమే
జయుండు పుణ్యతీర్థమహిమంబు వినవలతు ననినఁ బరాశర
సూనుండు వానిని వేర్వేఱ వివరించె. దేహమలంబును బాపఁ
దీర్థంబులు సమర్థంబులుగాని చిత్తమలంబుఁ దిగుచు చేవ వానికి
లేదు. విశ్వామిత్రాదులు చెట్టులఁ బుట్టల నెంత దపించియు
రాగాదుల వశమై చెడరే? కావున మానసతీర్థంబు సేవ సర్వ
తీర్థసేవలకన్న మిన్న యనఁ "గౌశికుండు వసిష్ఠునితో నేల పోరె?
శాంతము వారికి లేదే? వారి చరిత్రము దెలుపు మన సాకల్యం
బుగా నది వివరించి ప్రసంగోచితంబుగా హరిశ్చంద్రుకథయు
నిట్లని తెల్పె.

## —♦ హరిశ్చంద్రుండు సంతానార్థి యగుట ♦—

నిత్యసత్యవ్రతుం డినకులుండు హరిశ్చంద్రచక్రవర్తి సంతానమునకై వరుణుం గూర్చి నరమేధం బొనర్పనెంచి నంత నయ్యాదఃపతి సాక్షాత్కరించి నీ సుతుని బశువుగా నొనర్చి జన్నంబు మత్ప్రీతికై యొనర్తువేని నీకోర్కె దీర్చెద నన రాజట్లయనె. అంతఁ గుమారుండునుం గలిగె. అవ్వేల విప్రవేషియై వచ్చి వరుణుండు రాజు నధ్వరంబు సేయుమని ప్రేరేచిన నీవచ్చు పౌర్ణమాసి నది యొనర్తునని సేయక యతఁ డా నాటికి మఱల వచ్చిన మూవానికి క్షత్రియోచితసంస్కారము నెఱపి యొనర్తు ననియె. అంత న ప్పాశి క్రోధియై యీ యనృతంబుచే జలోదరరోగంబు నొందుమని శపించె. తండ్రి యవస్థకు సుతుఁడు తపించి యడవి కేగి నివసించుచుండ నొక కలినుఁడు తండ్రిమంత్రి వచ్చి "తండ్రి యిడుమ పడుచుండఁ దోటలవేటల వినోదింతు వేటి న్యాయం బని నిందించిన, నతఁడు మగుడ బురికేగ నున్నంత, నింద్రుండు బ్రాహ్మణరూపియై వచ్చి నీతండ్రి నిన్ను యజ్ఞపశువుంగా జేయంజూచె, నీవేల పోదు"వన నతఁడు పోక నిలచె. ఇత్తరి హరిశ్చంద్రుఁడు దన దుర్దశ వాయు తెఱవు గురువు నడిగిన నా కుంభసంభవుండు సుతులు పదునాఱు తెఱంగుల వారు. శాన యొక్కని ధనంబిచ్చికొని జన్నంబున పశువుగ వేయుమన నారాజు మంత్రు లజీగర్తుని ముప్వురుకొడుకులలో నడిమి వాని శునశ్శేఫుని విలిచి తెచ్చిరి. గాధేయుఁడు వానిం బశువుగాఁ జేయవలదని వారించెం గాని రాజు వినఁడయ్యె. దాన

నమ్మునికిని యబ్బాలునికి సిద్ధమంత్రం బుపదేశించె. అయ్యర్భకుం డవ్వారుణమంత్రరాజంబు జపించి దీర్ఘతరప్లుతధ్వని నుచ్చరించుచు నిలచినంత వరుణుండు వచ్చి యబ్బాలుని విడిపించి రాజు ననుగ్రహించి చనియె. శునశ్శేఫుని వసిష్ఠముని విశ్వామిత్రు కొడుకుగా ధర్మరహస్యంబు లెఱింగి నిర్ణయించె.

కౌశికుండు రాజునెడ పగమానక యొకనాఁ డతండు తన యాశ్రమంబు దాపున వేటాడి కౌశికీతీరంబునఁ జనుచుండ వృద్ధవిప్రవేషంబున వేధించి యతని రాజ్యంబు హరించె. రాజుం దీనుం జేసినట్టెఱింగి యతనికులగురుండు వసిష్ఠుండు "మా యజమానుని వెతలపాలుసేసితి. నీవు బకధ్యానపరుండవుగాని మానివరుండవు కావని బక మగుమని శపించె. దానికిం గనలి యతండును వసిష్ఠుని ఆడీరూపధరుండవు. (ఒక రకపుబాతునకు ఆడి యని పేరు. శరారి యని సంస్కృతము) గమ్మని ప్రతిశాపం బిచ్చె. ఇట్లు శాపగ్రస్తులై వా రన్యోన్యంబు ముక్కులఁబొడచికొనుచుఁ బెక్కేండ్లు పోరాడిరి. మైత్రావరుణుండును కౌశికుండును బ్రహ్మయనుగ్రహంబునఁ బూర్వరూపంబులు గైకొని మైత్రిని వర్తిల్లిరి. అన "మైత్రావరుణి వసిష్ఠుండని తెల్పిరి. అదియెట్లో! వినవలతు నని యడిగిన నవాంతరకథగ వ్యాసుం డిట్లని వివరించె.

## వసిష్ఠు పూర్వవృత్తాంతము

బ్రహ్మకు సుతుండైన యమ్మునిని నిజశాపంబునఁ గుంగి వేరొక మానికిఁ గొమరుండయ్యె. అది యెట్లంటేని సూర్యవంశ్యుండు నిమి యను చక్రవర్తి గుణవంతుండు గలఁడు, అతఁడు

గౌతమాశ్రమసమీపంబున జయంతంబును రాజధానిగఁ జేసికొని యేలుచు యజ్ఞమును సంకల్పించి సంభారంబులు గూర్చుకొని వసిష్ఠు యాజకత్వంబు నూను మని యర్థించె. అతఁడు "ఇంద్రుండు నీమున్న న న్నర్థించె. వాని క్రతువై దేండ్లు జరుగునది. పిమ్మట నీపని నెఱవేర్తు"నన రాజు కులగురుండవు కాదననగునే? దీని కంతరాయంబు సేయకు మన నమ్మని వినక యింద్రయాగంబునకై యరిగె. రాజవ్వల గౌతమ నర్థించి కామగిరిపజ్జ యాగంబు నిర్వర్తించె. పిదప వసిష్ఠుఁ డింద్రయాగంబు ముగియగనే శిష్యు నధ్వరంబుఁ జూచువేడ్క జయంతంబునకు వచ్చిన రాజు నిద్రావశుండై తెలియఁడయ్యె. దాన ముని కవలి "యన్యుచేఁ గ్రతువు జరిపించుకొంటి. గురు నానతి మీరితివి గాన విదేహుండవు గ"మ్మని శపించె. రాజు విని "బ్రాహ్మణా! నాయెడ నపరాధంబు లేశంబు లేదు. నా గురుండవు. న న్నవమానించి దురాశచే నింద్రు జన్నంబునకు నేగుటయకాక పదంపడి విప్రధర్మంబగు శాంతి విడిచితివి. కావ నీవును విదేహుండ వయ్యెద వనియె. ఇట్లు గురుశిష్యులు శపించికొని వాయుమాత్రశరీరులై దుఃఖంబు నొందుచుండిరి. అవ్వల వసిష్ఠుఁడు బ్రహ్మ యనుగ్రహము వడసి మిత్రావరుణుల పుత్రుండ వగుదు వని యనిపించుకొనియె.

## —♦ మిత్రావరుణుల కగస్త్య వసిష్ఠు లుదయించుట ♦—

మిత్రావరుణులు తీవ్రతపోనిష్ఠఁ జెలుప నింద్రుం డూర్వశి నియోగింప. నది యటు చని విలాసంబులు సూపు, వారా

సుందరిం గని మనసులు చలించి పంచశరుబాణములం గ్రస్తమైన వారి వీర్యంబులు చలించె. ఆ మగువ వారియుభయుల వీర్యముల నొక కుంభంబునం బట్టి భరింప నందుండి యిద్దరు తేజోనిధు లుదయించిరి. అందు మొదటిదాన నగస్త్యుండును, రెండవ దాన నరుంధతీజానియగు వసిష్ఠుండును నైరి. అగస్త్యుండు చిన్ననాటంగోలె తపస్వియయ్యె. వసిష్ఠుం డిక్ష్వాకుపురోహి యయ్యె.

## —• నిమి కడమ చరిత్ర •—

నిమి యట్లాడలు తోలంగియున్నంత నతని యధ్వరంబు సుప్తమయ్యె. ఋత్విక్కులు చింతించి వివిధమంత్రక్రియ లుప చరించి వానిమీన నుచ్ఛ్వాసంబు పుట్టించి యయ్యాగము సాంగ మొనర్చిరి. వేల్పులు నం దాహూయమానులై యామోదించిరి. రాజును నీకేమి వలయునని యడిగిరి. అతం డగ్నిని భూతముల నిండి చూపుకొనలందు సర్వసాక్షినై యుండు తెలంగు కావలె నన్న, నట్ల యయ్యెడు మని వా రరిగిరి. అవ్వల నారాజు నాప్తులు మాకు రాజుకాందగిన వాని నొకని దయసేయుండన నమ్మానులు నిమిశరీరంబు మథించిరి. అం దనలసన్నిభుండు మిథి యనువాం డుదయించె. అతండు రాజయ్యె. నిమి విదేహుం డగుట నతని కులమువారు విదేహు లైరి. అనిన జనమేజయుం డిట్లనియె.

"తన యజమాని యని మానియుం దన పురోహితుం డని రాజును దలంపక శపించుకొనిరి. ఇది యేటి శాంతం బేటి! తపం" బన వ్యాసుం డడవినున్నను, బుడమినేలినను మనసు

పంపని వాని వర్తనం బిట్టిద. కపిలుడంతటివాఁడు నిష్కారణ ముగ సగరసుతులను సంహరింపఁడే? అన్నిటికి నధిష్ఠాన మహంకారము. వేదశాస్త్రతర్కప్రకారంబుల నగు జ్ఞానము బుద్ధినాశనకరంబు. అనుభవజ్ఞానము దుర్లభము. ముక్తి నిడు నదియ విద్య. బంధ మునుపునదియె కర్మము. పెర లాయాస కరంబులు. శుద్ధమాయామయంబునఁ బుట్టిన సర్వంబు సుక రంబు. అక్కడనసే నిమియు, నమ్మహాముని యు మమతాభి మానములు నీర్ష్యలు రేగి శాపాగ్నిం గ్రాగి క్రుగ్గి స్వాను భవధారావర్షంబున నెలర్చి శుభంబు లందిరి. భార్గవుఁడు శపింప యయాతి యోర్చుకొని ముదిమిభరించె. అట్లు నిమి యోర్వఁ డయ్యె. హైహయులును భార్గవులును ధరనిమిత్తము పోరి మడిసిరిగదే? యన నక్కథ దెలుపు మన నిట్లనియె.

—♦ హైహయుల చరిత్ర ♦—

అర్జునుఁడను రాజు వేయిచేతులు గలవాఁడు సప్తసము ద్రముద్రితం బగు ద్వీపసప్తకంబునకుఁ జక్రవర్తి. దత్తాత్రేయుల శిష్యుఁడు. నారాయణు నవతారము. భృగువు లధ్వర్యులుగాఁ బెక్కుయజ్ఞకోటుల నొనర్చె. అతని నిరంతరదానధర్మం బుల భృగువులు ధనికులైరి. కార్తవీర్యార్జునుఁడు భార్గవుచే మడిసి స్వర్గంబునకేగినతర్వాత హైహయులు దరిద్రులై భృగువుల జయించి ధనము తేఁగోరి దండెత్తిరి. భృగువులు తమ సొమ్ము పుడమిఁ బాతియు, భూసురతతి కిచ్చియు దుర్గంబు లకుఁబారిరి. వారిగృహంబులు గ్రొచ్చి దొరకినవారి నఱికిరి. పెద్దలు గాదన్న వినరైరి. విప్రులకు సంచయేచ్ఛ యుచితంబు;

గా నరిచె. వారు పుట్టిన యిరువురు కొనసి భృగుపత్నులు సుఖా నగిరికిం బారిపోయిరి. హైహయులు వారిదెస్సెంటి తెలిసిరి. అత్తటి నొక్క తరుణి గర్భిణి తనగర్భముఁ దొడతోఁ దాచి యేగిన వా రద్దాని కట్టుండు పట్టుం డని వెనుదఱిమిన భీతయై యాడులేడివోలెఁ జలించుచున్న యాతల్లిం జూచి దయఁగొని యుదయభానునిభుం డొక యర్భకుం డామె యూరుగర్భంబు వెడలి వచ్చె. వాని తేజంబునఁ జూపు చెడి పుట్టుగ్రుడ్డుల ట్ల య్యధములు దుఃఖితులై చేయునది లేక యయ్యమ్మ శరణం దిరి. ఆమెయు వారి దౌష్ట్యంబు గాంచి నిండుమూలాలి నిక్కట్టుపాలు సేసి రని తూలనాడె. "నాసుతుండు గర్భంబున వేదముల సాంగోపాంగముగ నేర్చినాఁడు. సర్వకళాపూర్ణుఁడు, ముల్లోకముల వెల్గించు తేజంబువాఁడు. మిమ్మందర మట్టు పెట్టఁగలవాఁడు. ఇతని తేజమున నంధులైతిరి కాన వానికి దాసులై వేఁడుకొండు. మి మ్మాదరించు" నన వా రట్లుసేసి యాశ్రితరక్షణుండగు నతనిచేఁ జూపు లంది యభీష్టం జనిరి. ఆ భార్గవుం డూరుజుం డగుట నౌర్వుండు నాఁ బరగె. అని చెప్పి హైహయు లని పేరు గల్గుటకుఁ గారణ మి ట్లనియె.

## —♦ హైహయు లని పేరు గల్గుట ♦—

జనమేజయభూపతీ! ము న్నొకరాజు హయము నెక్కి భగవద్దర్శనార్థియై యేగె. అతని సొంపు నింపు గని నివ్వెఱపడి నిలువ విష్ణుండు లక్ష్మిం గని "నీ వారాజువంకనె కనెదవా, సైంధవంబుఁ గంటివా? నీలో మారవికార మంకురించెఁ గాఁబోలు! కతం బేమి" యని యడిగిన లచ్చి ప్రత్యుత్తర

యయాతిసుతుఁడు తుర్వసుఁడు సుతార్థియై తపం బొనర్చుచు
యున్నాఁడు. అందులకై యతఁడు నిర్విణ్ణుఁడయ్యె. దేవ హర్ష
వర్మ యను పేరఁ బరగు నొక్కనిఁ బ్రేరేచి తపఃఫలమిషంబున
వీని నతని కిత్తు. అతఁడు దివ్యభోగంబుల వీని మనుచు. సంశయ
విషాదంబులు వీడు మనిన నచ్చేడియ యియ్యకొనియె. ఆ దంప
తులు వైకుంఠమున కరిగిరి.

అవ్వలఁ జంపకుం డను విద్యాధరుఁడు మదాలస యను నింతిం గూడి దేవయానంబున నటకు వచ్చి యా శిశువుఁ గని హరించి వాని కలరూపింద్రుదువలనఁ దెలిసి, వీని దుర్వసుండు వచ్చి కైకొనుదాక నీవు కనిపెట్టియుండుము. ఇయ్యర్భకుఁ డేకవీరుఁ డను బిరుదొందు. నిర్జితాఖిలశాత్రవుండై సకలసామ్రాజ్యధురంధరుఁ డగు నని సురపతి యన, నతఁ డబ్బాలుని తొలుతటిచోట నిలిపి ప్రోచె. శౌరి సిరితోఁ దుర్వసుకడ కేగి యిక్కుమారు నిచ్చితి నని వరమిచ్చె. అ య్యయాతి సుతుఁడు హరికరుణ లభించిన యమ్మహాప్రసాదంబునకు హర్షించి యబ్బాలుఁ గొని పెంచి జాతకర్మాదిసంస్కారములు యథావిధి నామోదంబున సలిపి యేకవీరుం డని నామకరణము సేసి సర్వవిద్యాపారంగతు నొనర్చి పట్టంబుఁ గట్టె. తాను విరక్తిఁగొని సతితో మైనాకశిఖరి కేగి తపంబుసేసి దివ్య విమానంబున నేగి నింద్రునాసనంబున నధివసించె.

## —♦ ఏకవీర చరిత్ర

ఏకవీరుఁడు వేట కేగి గంగలో [illegible] నొక్క కమలలోచనఁ జూచె. ఆమె శోకానతముఖియై కన్నుల నశ్రుసలు

మీకున్న నలిగె. ప్రాకృతపోలెఁ జాంచల్యంబు గంటివి కాన నెప్పటికిఁ జంచల వయ్యెదుగాక యని, మఱియు నీ తోఁబుట్టువైన హయంబుం జూచి మరులుగొంటివి కాన నీవును బడబవయ్యెదుగాక యని శపించె. కమల కలంగి కమలనయను వేడిన నా కెన యగు కుమారుఁడు నీ కొదవిన నాఁడు నీ వెప్పటట్ల నన్నుఁగూడి సుఖింతు ననియె.

ఈ విపరీతసంఘటనము గని యా హయమునుండి దుమికి రా జంజలిసేసి వచ్చి తండ్రికడ కేఁగె. ఆవల సరసిజాలయ శోకమునొంది యమునాసంగమున సువర్ణాక్షతీర్థంబున సర్వకామప్రదాశ్రమంబున నీలగళుంగూర్చి బడబాకృతిఁ గొని తపంబుసేయ హరుం డుమతోఁ గూడివచ్చిన న య్యిందిర నాకు నందనుం డెట్లు కలుగు నని యడిగె. మఱియుఁ దొల్లి ప్రియునివలన వినిన హరిహరాభేదభావంబు విశదీకరించె. దాన శంకరుఁడు హర్షించి బడబారూపిణి వగు నిన్ను హరి హయరూపంబున గవియును. అంతట సుతుఁ డుదయించు నని చెప్పి చిత్రరూపుఁ డను ప్రమథగణనాథుని శ్రీపతియొద్దకుఁ బంపె. అతఁడు పోయి హృషీకేశునకుఁ బ్రణతిసేసి నుతులొనర్చి దేవునానఁ జెప్పి కొనివచ్చిన, గోవిందుఁడు హయరూపంబునఁ గమలాలయం గందర్పకేళి ననునయించిన నవ్వల నా లోకమాతకు భానుతేజుఁడు సుతుఁ డుదయించె. లక్ష్మీనారాయణులు తురంగమరూపంబు విడిచి జగన్మోహనాకారులై వర్తిల్లిరి. పిమ్మట వారు వైకుంఠమ్మున కేఁగువారై విమానమెక్కఁబోయిరి. ఈ బాలు నిట విడువఁజాల నని యిందిరఁ వల్కిన గోవిందుఁ డట్లుగాదు. ఇతఁ డిచట మసలవలయు.

నించుచున్నఁ జూచి యెవ్వతె వని యడిగిన నామె యిట్లనియె.

నీరాజ్యంబు క్రేవఁ బుడమినేలు రభ్యుం డను రాజు గలఁడు. అతనిభార్య రుక్మరేఖ నాఁ బడు. సంతతిలేమి వారు హోమవిధుల నెఱపిరి. దాన నొక్క శుభాంగి బాలిక కలిగె. అది విష్ణుదత్త యని హోత చెప్పిన నుప్పొంగి రాజు దానిం జాయ కొసంగె. ఆ బాలిక యేకావళినాఁ దనరు. నే నామె నెచ్చెలిని. యశోవతి యను దాన. ఆ రాజుమంత్రికిఁ దనయను. ఒకప్పుడు నాచెలి యేకావళి గంగలో జలక్రీడ గావింపఁగోరిన మే మందరము సఖుఁగూడి యేగితిమి. రాజుపరివారముతో అప్సరస్సమేత యగు లోకమాతభాతి దనరు, మాచెలి నొక్క యసుర ఫాలకేతు వనువాఁ డెదిరి మదనవశుండై డాసిన నబ్బాల వెఱచి యనుచరుల చాటున కొదిగిన వాఁడు పరిఘుఁ గొని వెనుదవిలి పఱచివచ్చి యమ్ముద్దియఁ గౌగిటంబొదివి హరించె. నే నెంతచెప్పిన వినఁడయ్యె. రక్షకు లెదిరించి వ్యర్థులైరి. చేయునది లేక నే నామెతోఁ జనితి. వాఁ డామెను దన యంతఃపురంబున బంధించె. దుఃఖితయై నాచెలి యట నున్నయది. వాఁడు మా చెలి ననుకూలింపఁజేయ న న్నర్థించె. నేను వినకున్నఁ దానె నిర్బంధింప సాగె. ఆమెయు హైహయుపై మనసుఁ గొన్నదాన నని చెప్పి యిట్టి సంకటంపాటునఁ జిక్కినాము. దీనరక్షకుండవుగాఁ దోఁచెదు. కడమ నీవ యెఱుంగుదు వనియె. అంత న య్యేకవీరుఁ డింతీ! మీకథ వివరంబుగఁ దెల్పు మనిన;

## —♦ యశోవతి వృత్తాంతము ♦—

ఏను బాల్యంబున మంత్రసిద్ధుం డగు విప్రునిదయచే భగవతీమంత్రంబు న్యాసధ్యానంబులతోఁ బడసితి. భక్తానుకంపిని శ్రీదేవి న న్ననుగ్రహించె. హైహయుండు గంగాతీరంబున నీకుఁ గానిపించి మీ యిడుమ బాపఁగలవాఁ డని చెప్పె. మా చెలి కిది తెలిపి నే నిందు వేచియున్నదాన. నీ వెవ్వఁడవు? అన "నేను నీ దెల్పినవాఁడ. రాక్షసుపురంబు నీవు చూపినచో భగవతికృపఁ గడముకార్యంబుఁ దీర్చెద నని తెల్పె. యశోవతి యాతనికి మంత్ర మొక్కటి న్యాసపూర్వకముగా నిచ్చి గెలుతు గాక యనియె. అంత నవ్వీరుఁడు పయనమైపోయి యారక్కసుఁ గూల్చి యేకావళీదేవి వివాహంబాడె. అయ్యేకవీరుసుతుండు కృతవీర్యుఁడు. వానికొడుకు కార్తవీర్యుండు అని తెల్పిన వ్యాసుం గని స్తుతించి జనమేజయుండు హరి యశ్వరూపంబు నొందుట చిత్రంబుగదా! ఇందలి తత్త్వము దెలుపుమన్న వ్యాసుండు తనసుతుని చరిత్రంబు వినిపించి, పాండవులచరిత్ర సెప్పి, దైవయోగము దుర్లంఘ్య మగుట నిరూపించి యవల నారదువలన దా విన్న తెఱం గిట్లని వివరించె.

## —♦ పర్వత నారదుల చరిత్ర ♦—

నారదుఁ డిట్లనియె. నేనును, బర్వతుండును త్రిలోకంబెల్లఁ గ్రుమ్మరువారము. వేసవిని సృంజయాధిపు పురము సేరి చాతుర్మాస్య మప్పురి నంతఃపురిఁ గడపితిమి. ఆ రాజుపుత్రిక మదయంతి మమ్ము యథావిధి శుశ్రూషించె. భిక్షసేసిన పిదప నే

నమ్ముద్దియ యొద్దిక నున్నతఱి నా వీణియపై వేదంబు వల్కిం
చుచు, సామంబు గానంబుసేయుచు నున్న నా జవ్వనికి నాపై
వల పంకురించె. క్రమమ్మున నది నాయెడ నధికానురాగంబు
సూపుచుఁ బర్వతునెడ సామాన్యగౌరవము చూపుచున్న నా
నెచ్చెలి చింతించి యక్కజంపడి న న్నడిగిన నున్న దున్నట్లు
వచించితి. అద్దాన వాఁడు తన్ను వంచించినవానింగా గణించి
నన్నుఁ గోఁతిమొగంబువాఁడవు గ మ్మని శపించి, అల్పాప
రాధి నగు నన్ను శపించిన, నేనుం గనలి మ ర్త్యలోకంబునఁ
బడియుండు మని వాని శపించితి. పర్వతుం డెందేని జనియె,
నే నక్కన్నియపై వలపుచే నట నే నిలిచితి.

రాజాత్మజకుఁ బరిణయకాల మేతెంచె నని రాకొమ
రులఁ గలయఁబిలిచి స్వయంవరము సలుపఁగోరినఁ దండ్రితో
నమ్ముగ్ధ 'నా మనంబు నారదర్షిఁ బరిరంభించె'నని ధాత్రిచేఁ
జెప్పించె. జనపతి యవ్వానరముఖునకు నివ్వనజముఖి నిమ్మందు
విది యాగడము గాదే? విన్నవారు నవ్వరే? యనియె. రాజ
భార్యయు జాజితీవ కంటకశాఖ నలముట యగు. నీ యంద
మడవి గాచిన వెన్నెలగాదే! ఇది యేమి వింత యని
నిజాత్మజ కుచితం బెంతెల్పిన వినక యక్కుమారి గాంధర్వ
కళాపరిపూర్ణు నిమ్మునికళానిధి పాండిత్యంబునకు లోఁబడి
సౌందర్యం బాశింపను. సంగీతకళ యిద్దేవమునిసొమ్ము పొమ్మ
నిన నవ్విలాసవతి నొసంగి పెండిలిసేసిన నే నంద నిలిచితి.

నాచెలికాఁడు పర్వతుఁడు తీర్థయాత్రలు సలిపివచ్చిన
వాని నా మణితల్పంబున నునిచి పూజించితి. అతఁడు కరు
ణించి నాకు శాపమోక్షం బనుగ్రహించె. నే నిందుముఖుఁడ

నైతి. అయ్యిందువదన హర్షించె. ఇది మాయమహిమగాదే! నే నొకప్పు డొకభూజానికి జాయనై పుత్రులఁ గని పలు బాములఁ బడితి. అంతకు వింత గల్గునే! యన నదియెట్లని వ్యాసుం డన ముని యిట్లనియె.

—♦ నారదుఁ డాడుదియై సంసారము సెఱపుట ♦—

నే నొకప్పుడు సామంబును మహతిఁ బల్కించుచు లక్ష్మీపతి, వాసుదేవు, శ్వేతద్వీపంబునఁ గనుఁగొన్నంత భార్గవి యంతర్ధానయయ్యె. అంత నేను నివ్వెఱఁ గని ధూర్తుఁడగాను, తాపసిని, నన్నుఁ జూచి లోకజనని తొలఁగి చనఁ గారణ మేమని యరవిందనాభు నడిగిన నతండు "లోక మున సతీమణు లన్యపూరుషుఁ గనరు. అది సంసారంపు గౌర వంబు గాదే?" యని తెల్పి మాయామహిమ నేను గాదు, హిరణ్యగర్భుండు, శంకరుండు సెఱుంగఁజాలరు. జ్ఞాను లజ్ఞాను లనియెడు నిది మాయాకల్పితభ్రమ. వివేకివై తెలియు మని హరి యూరకుండె. నేనును సంశయము తొలఁగక దీనశరణ్య! రమాపతీ! అమ్మాయ యెమ్మాడ్కిది? ఎంత బలము గలది? రూ పెయ్యది? చూపు మనఁ గేశవుం డమ్మని గరుడు నెక్కించుకొని సంచారంబు సాగించె. అట్లు పోయి పోయి కన్యాకుబ్జపురంబు సేరి, యొక జలాశయంబుసొంపుఁ జూపి యిందు సుఖింతు మన నం దవగాహించితి.

—♦ నారదుఁడు స్త్రీరూపు గనుట ♦—

ఆ పై నేమి సెప్పుదు. సుందరూపము దొలంగి యతి మోహనాకార యగు నింతి నైతిని. పూర్వగుణంబుల మఱి

చితిని. కృష్ణాజినంబు చాయ దోఁపదయ్యె. మహతిగతి యే మయ్యెనో! కమండలు వెం దఱిగెనో! నా పరికరంబులు గొని హరి స్వపదంబున కరిగె. నే న ట్లవ్వని దరుణినై విహరించుచున్నంత వేట తమిచే సుందరాకారుఁడు తాళధ్వజుఁడు సనుదెంచి నన్ను మోహించి యాశించె. నాకత యడిగె. నేనును "తల్లి! నెఱుంగ. తండ్రి లేఁడు. సఖులు సున్న. నాకు నేనై యుంటి. నివాస మీ జలాశయము." అన నతఁడు నన్నుఁ జేకొని పురికిఁ దోడ్కొని చని, నానాభోగములఁ దనిపిన నేనును వాని నసమశరకేళిఁ దనియించుచుండి రతివివశనై యున్నతఱిఁ బూర్వవృత్తంబుఁ దెలిసియుఁ దెలియనట్లుండి రాణినైతి. వెనుకటి విజ్ఞానంబు పొలియుటకు వగవ నిట్లు పదిరెండేండ్లు గడచె.

మఱియు నేటేటఁగొడుకులఁగంటి. కోడండ్రును వచ్చిరి. కొడుకులుం గోడండ్రును గొండ్రాటఁబడుట బలమయ్యె. అంత న న్ననలేని చింత యావరించె. "సంకల్పంబున సంసార మొదవు. అది లేకున్న నిది లేదు." అని నా కొక తలఁపు పుట్టె. వెనువెంట క్షత్రియపత్నుల నేన మిన్న ననుకొంటి. ఇంతలో నరాతిభూవల్లభుఁ డొకఁడు నా వల్లభు నెదిరించి పుత్రమిత్రామాత్యవర్గంబుఁ బొలియించె. రాజుం బురంబుఁ జేరె. నే నపుత్రనై దుఃఖించుచుండ నార్తత్రాణచణుం డగు మధుసూదనుండు వృద్ధవిప్రవేషంబున వచ్చి న న్నూఱడించి పంపిన, నే నింటి కేగి విప్రపూజ సల్పినంత నెన్నిజన్మంబు లెత్తితి? ఎందఱిఁ గంటివి? ఏల తపింతు వనిన నాతనితోఁ జని పౌరుషం బను తీర్థంబున మునింగితి. అంత నాకుఁ బురుష

త్వంబు సిద్ధించె. పిమ్మట శౌరియు నెదుటఁ దోఁచిన నాకు నారదుండను జ్ఞానంబు జనించె. శౌరియు నెప్పటిరూపున వేవేగ రమ్మని పయనించె.

తాళధ్వజుఁడు నాకై పరితపింప హరి యొద్దకువచ్చి నన్నుఁ జూచి నవ్వె. నేనును వాసుదేవ! నీ మాయ దరియింప నలవికానిది. అద్దాని నెఱింగితి. జగత్త్రయనాటకం బీ మాయా మహేంద్రజాల కల్పితంబంటి. హరియు "నారదా! మాయ పరాశక్తి. దాని పుట్టు దెలియువాఁడె తెలియువాఁ డని నను వైకుంఠంబునకు రమ్మనియె. కాని నేను మాయం జిక్కినన్నిక తిరిగినాపూర్వవృత్తం బెఱింగించి యిమ్మాయఁ గడచు టెట్లంటి. ఆయన కుత్రా! యిది యసాధ్యము. నాబోంట్లిమ్మాయవాగుర జిక్కిన వారు గారే! తపమొనర్చి, మనసు గెలిచి నిత్యసుఖానుభూతి నందుమనియె. తండ్రియానతి నదిమొదలుగాఁ దీర్థవాసినై చరింతు. వ్యాసా! నీవు నట్లసేయుము. కృతం బవశ్యభోక్తవ్యంబు. వేదార్థతాత్పర్య మవశ్యకర్తవ్యంబు ససక్తి విడిచి శక్తి గొలిచి ముక్తిఁ బడయుమని కీలు దెలిపె. దాన మది గుదిరి కాలంబునేగించుచు నీ భాగవతంబుఁ బలికితి పరమపావన మగు నీకృతిఁ బలుకుట మాయజంజాటము మాయ మయ్యె. చింత లడఁగె. సందియము లుడిగె. కావునఁ దొలుత నీ వడిగితి వా విష్ణుండు హయరూపం బెట్లుగొనెనని యాప్రశ్నమునకిక తావు గలుగదుగదా! ఇంద్రజాలికుఁబోలె దేవాసురమానుషవర్గంబుం గూడి యింద్రియంబుల నెనయించి మనోబంధము లంకించియున్న బ్రహ్మాది స్తంభపర్యంతం బగు విశ్వంబును నిలిపి మహామాయ నటించుచున్నయది. గుణములు మాయిక

గర్భమున నారదుండు పునరుత్పత్తిఁగాంచె నని తెల్పిన, నారదుని పునర్భవంబునకు హేతువేమన్న బాదరాయణుం డిట్లనియె.

దక్షుండు బ్రహ్మపంపున నైదువేలమందిని కొడుకుల యాదుసృష్టించె. నారదుండు వారిని సృష్టివిముఖతకుఁ బ్రేరేప వారద్రులపాలైరి. దక్షుఁడు నారదు దుర్బోధం జనకాదు కులు దూరంబగుటకుఁ జింతిలుచు మఱికొందరఁ గనియె. వారును నన్నలదారి నారదునానఁ గాపురంబులు చెడి పోయిరి. అంత దక్షుండు నారదుపైఁ గినిసి నా కొడుకుల నెడఁ బాపితి కాన పునర్గర్భవాసం బనుభవింపు మని శపించె. అక్కాలంబున దేవముని మరల జన్మంబెత్తె. దక్షుఁ డవ్వల నఱువదిమందిం గూతులంగనియె. అందు పదుమువ్వురఁ గశ్యపునకును, ధర్మునకుఁ బదుండ్రను, నిరువదేడ్వురఁ జంద్రునకును, నిరువుర భృగునికిని, నలువుర నరిష్టనేమికి, నిర్వుర నంగిరసున కిచ్చెను. కాలాంతరంబున మరి యిద్దరి నటనే యిచ్చె. వారివలన సృష్టి ప్రబలె. అన భూపతి సూర్యవంశక్రమంబు వినవలతు నన వ్యాసుఁడు దాను నారదునివలన విన్నక్రమంబున నిట్లనియె.

## — ప్రతిసృష్టి —

బ్రహ్మ పదివేలేండ్ల తపంబున, దేవికృప, మరీచ్యా దులఁ గనియె. మరీచికి గశ్యపుఁ డుదయించె. వానికి దక్షసుతలు పదుమువ్వురయందు నమరులు, అసురులు, యక్షులు, పన్న గులు, పశువులు, పక్షులు కలిగిరి. అందు సూర్యునికి మనువు పుట్టి వానివలన మానవవంశ మ్మనంతమ్మై విస్తరించె. అందు

ములు. త్రిమూర్తులు కల్పకల్పంబులందుఁ బుట్టు నిడుమలు యోగ
నిద్రారూపిణీ యగు మాయాశక్తిచేఁ గల్పితంబులు. నీప్రశ్న
మున కిదియ యుత్తరముగా నెఱింగించితి. సకలకథాసారం
బును సర్వనిగమతుల్యంబును బ్రమాణసహంబు నగు నీభాగ
వతంబు భక్తికలితుండవై వినుచుంటివి. నీ కిహ పరంబులు
కరతలామలకంబు లని బాదరాయణుం డనిన మీఁదికథ విన
వలతు నని జనమేజయుం డనియె.

---

# సప్తమ స్కంధము

సూతుండు శౌనకాదుల కిట్లనియె. నట్లు జనమేజ
యుండు వ్యాసుని వక్త్రగళితంబగు శ్రీదేవీకథాసుధారసం
బునఁ దృప్తిసెక శ్రీమాతకు మ్రొక్కి, మునికి కంజలిసేసి
సూర్యవంశచరిత్రంబు వింటి నింక చంద్రవంశవిస్తరంబు విన
వలతు నని యర్థించిన ద్వైపాయనుండు –

## —♦ బ్రహ్మ మొదటి సృష్టి ♦—

సృష్టికర్త యంబయనుకంపచే మానసికసృష్టిసేయ నది
సకలజగదుత్పత్తికి నిదానంబయ్యె. మరీచి మొదలుగ పులస్త్యు
దనుక నేడుగురు నందనుల సృజించె. రోషంబున రుద్రుజనింపఁ
జేసి యుత్సంగంబున నారదు, బాదాంగుష్ఠమ్మున దక్షు
నిర్మించె. సనకాదులు మనంబునఁ బొడమిరి. వామపాదాంగు
ష్ఠమున సర్వాంగసుందరి వీరిణి యను దక్షుభార్య జనించె.

సంయాతి కానస్తుఁడును, సుకన్య యను కన్యయు నుదయిం
చిరి. ఆమె యంధుండగు చ్యవనునకుఁ బత్నియై పాతివ్రత్యమున
నతని సులోచనుఁజేసె నదెట్లంటేని.

### —♦ సుకన్య భర్తయగు చ్యవనునికి నేత్రంబు లొదవించుట ♦—

సంయాతికి నాల్గువేలమంది భార్యలు కలరు. అందొక వనితకు సుకన్య యుదయించె. ఆమెఁ జలవిహారంబు చేయుచు నొక్కకాసారంబుచెంత చ్యవనుండను ఋషిం గాంచె. అతనిపైఁ బుట్టలు వెలిగియుండె. అక్కన్నియ దరి చేరి యొక్కరంధ్రంబు నుండి తేజం బొక్కండు గని యొక్కముల్లున నాతని కన్నుదోయి నొత్తె. అంత నమ్ముని యప్పిన్నదానిం జూచి యేను మునిని, నాదరికి రాకు మనియె. కాని రాజపుత్రి రాజసంబున నప్పట్టుఁ బెకలింపించి యతని మునిగా నెఱింగి తలంగి చనియె. ఆ పాపమ్మున రాజునకు, నతని పరివారమ్మునకు, వాని సతీసుతలకు మూత్రబంధమయ్యె. రాజు నందనఁజేరి జరిగినది విని, శోకించి, వినయంబున నమ్ముని డాసి, అపరాధిని క్షమింపు మభయ మిమ్మని పలురీతుల వేడిన నతఁ డవధ్యుండ, తపమ్మెట్లు జరుగునన రాజు వేలమంది సేవకుల మీా పరిచర్యకు వినియోగింతునన. అమ్ముని యట్లయిన నీ కూతు నొక్కత నిమ్ము పలువురేల ? యనిన నతండు వృద్ధున కందును నంధున కిక్కొమ్మ నెట్లిత్తునని శంకించుచు నా బాలికచే హితంబుఁ దెలిసి యామె నాతని కిచ్చి పరిణయ మ్మొనర్చె. పిమ్మట నారాజకన్యక రాజోచితభోగభాగ్యంబులు గొనక

నారలుధరించి యరుంధతి యనసూయయు సీతురా నయ్యంధు నాత్మబంధువుగా నెంచి పరిచరించె. అతని యనుష్ఠానంబులఁ దోడై నడపె. ఇట్లుండ నశ్వినీదేవత లట కరుదెంచి క్రీడించువా రయ్యంగన యంగసౌష్ఠవంబుఁజూసి మోహించి చెంతఁజేరి యంధునితోడి కాపురంబు జగదేకసుందరివగు నీ కేటికి? దేవకుమారులము మమ్ముఁ జేకొనవే? యని పలుకీతుల సరస వచనరచన నర్థించిన "మీరు మహానుభావులరు. దివాకరు తనయులరు. మీ రిట్టి యనుచితప్రసంగంబుల సేయనగునే? నేనో శర్యాతితనయను. పతిభక్తిపరాయణను. మీర లొండాడక చనుఁ"డన వారు సతీమతల్లీ! దేవవైద్యులము మేము. నీ వర్తనంబున హర్షించితిమి. నీ పతికన్నులఁ జికిత్సించి జగదేకసుందరు నొనర్తుము. అవ్వల మా మువ్వురలో నవమోహనాంగు నొక్కనిఁ జేకొను మన నాపె పతి యనుమతి వడయంబోయె. అతండు వారిం దెమ్మనియె. వారు వచ్చిన నమ్మువ్వురు నచటి సరోవరంబునం దోఁగి యందరు నొక్క యందంబు చందంబు గలవారైరి. అంత నయ్యింతిం గని నీ మగని నీ మనసున కగువాని వరింపుమన సంశయస్వాంతయై జగదీశ్వరీచరణంబు శరణంబని నమ్మి నుతించిన, నా త్రిపురసుందరి సుందరిడెందంబున నిలిచి పతిజ్ఞానంబు కటాక్షించె. అంత నా శశిముఖి నిజనాథు కేలు కేలం గదియించె. అశ్వినులయ్యబల పాతివ్రత్యమునకు మెచ్చి చనునెడ చ్యవనుండు మీ రుపకృతి సేసినందులకు ప్రత్యుపకృతి సేయవలఁతు కోర్కె దెల్పుండన, వారును "సోమసంగ్రహంబున మున్ను మేరువున యజించు నింద్రుఁడు వైద్యులమని మమ్ము పంక్తిబాహ్యులనొనర్చి సోమ మీననియె.

ఇంద్రుఁ జాలినాఁడవుగాన మాలోపంబు దీర్పు"మనిరి. చ్యవ
నుండును శర్యాతి యజించునపుడు మీరు రావలయు. అపుడ
మీకు సోమం బిప్పింతునన వారేగిరి. ముని యసామాన్యసౌంద
ర్యంబు నొంది యయ్యంగన నలరించె. అవ్వల శర్యాతియు
నతని యిల్లాలుం గూఁతువర్తన మేమయ్యె? అంధునితో
గాపుర మెట్లుండె? అతండు సనిన నది వేఱొక్కని బరి
యించెం గాఁబోలు నని యఱయఁగోరి వనంబున కరుదెంచి
రయ్యింతిం గని యామె సన్నిధి నంధుం డల్లుఁడు కానరామి
ననుమానించి కూఁతుఁ జంపఁబోయిన నాబాలిక సత్యముఁ దెల్పి
భర్తను ద్రిలోకసుందరుఁ జూపి "ఇతండె నీయల్లుం" డన
నృపతి నమ్మఁడయ్యె. అంత నాపె యమ్మని నడిగి తెలి
యుమన రాజు నల్లె రయినర్చి నిజమెఱింగె. మఱియు తన
జన్మంబున నమరభిషక్కులకు సోమరసం బీవలయుటకు హర్షించె.

## చ్యవనుఁ డశ్వినులకు సోమం బిచ్చుట

శర్యాతి యధ్వరసన్నాహ మొనర్చె. భార్గవుం డధ్వర్యుఁ
డయ్యె. దేవతలు హవిర్భాగంబులఁ గొన వచ్చిరి. వారితో
నర్కకుమారు లాహూయమానులై యరుదెంచిరి. చికిత్స
కులు సోమార్హులుగారని పురందరుఁడు కనలి యజ్ఞంబు దేవా
ర్హంబుగాదని యాటోపించె. చ్యవనముని "వారి నే నాహ్వా
నించినాఁడ. అంధుని నన్నుద్ధరించిన విపద్బంధువుల కోర్కె
దీర్ప సమయంబొనర్చితి"నన అయ్యిరువురకు వాదం బుద్వేలం
బయ్యె. కులిశంబునఁ గూల్తునని యింద్రుఁ డనఁ ముని కోపా
రుణనయనంబుల భస్మీకరింతునని చుఱచుఱఁ జూచుచుఁ జఱ

చఱి నడచి సోమపాత్రంబుఁగొనిన నింద్రుండు భిదురంబెత్తె. ఋషి వెఱవక యశ్వినులకు హవిస్సొసంగె. మఘవుం డంత నిజాయుధంబు నంకించి విడువంబోవ భార్గవుండు మంత్రపటిమ నవ్వాని దోస్స్తంభంబు స్తంభింపఁజేసె. అనింద్రంబొనర్ప సంకల్పించి యథావిధి ననలంబుఁ బ్రేల్చిన నందు సర్వప్రాణిభయంకరుండు శతయోజనాయామదంష్ట్రుఁడు, దశయోజన దీర్ఘవదంతుండు నై వివిధాయుధభీకరంబగు నాకారంబునఁ బొడమిన దేవతలు పాఱిరి. దేవపతి గురుని శరణనియె అతండు "బ్రహ్మతేజంబు దుర్భరము. వీని వారింప నీ చేతఁగాదు. సామంబున నీతని శాంతుం జేయుము; శరణందుము. పుడమిసురులకుఁ గోపంబుపుట్టిన శరణన్న నడంగు. ఇతఁడు ప్రణతార్తిహరుఁడు. మహానుభావుండు పొమ్మన నాతఁడు తపసికాళ్లంబడి "దీను ననుఁగరుణింపుము; క్రోధ ముపసంహరింపుము. నీకోడితి. ముమ్మాటికినోడితి. అశ్వినులకు భాగంబిత్తు నన్న నీకీర్తి కిది నిదానంబగు" ననఁ జ్యవనుఁ డనుకంపాయత్తచిత్తుఁడై శక్రుఁ గాచి పుచ్చె. నాఁడు మొదలుగ దేవవైద్యులకు యాగభాగంబు లొదవె. చ్యవనుండ అవగాహించిన యచటి కొలఁకు యూపవిమండితమనంబఱగె.

## —♦ రేవతీ బలరామ వివాహము ♦—

శర్యాతికి నానర్తుండును, వానికి రేవతుండును బొడమిరి. అతండు విశ్వవిశ్వంభర నేలిన చక్రవర్తి. కుశస్థలంబు నిర్మించిన ప్రోడ; నూర్వురు సుతులఁ గన్నవాఁడు. అందరిలోఁ బెద్దకుమారుఁడు తనకూఁతున కుచితుండగు వరుండెవ్వఁడని

బ్రహ్మకడ కేఁగి యడిగె నన రాజు వానిం జూచి బ్రహ్మ లోకంబున కవనినాథుఁ డెట్లరిగె. వింతగాఁ దోఁచె నన వ్యాసుండు "మీతాత యర్జునుండు స్వర్గాదులకును సత్య లోకంబునకును వైకుంఠకైలాసాదులకును బోయివచ్చిన వాఁడు కాఁడే. కకుత్స్థాదు లరుగుట వినవే? దైత్యు లింద్ర సదనంబుఁ గొల్లగొనుట యొకమారు జరిగెనే? తొల్లి మహా భిషుండు సత్యలోకంబున సుఖాసనంబున నుండి యటకు వచ్చు గంగాదేవిఁ గాంచి, గాలివలన నామెతొడలనుండి వలువ దొలఁగిన మర్మస్థలంబు గాంచి నవ్విన నామె యక్కామార్తుఁ గని తానును నర్మగర్భంగా నవ్విన బ్రహ్మ యాకాముక వర్తన మెఱింగి శపించిన, వారిరువురు పుడమిం దంపతులై చరించిరి కదా? అది వినమే? పుణ్యమూర్తుల కెల్లలోకం బులు సుఖగమ్యంబులు" అని తెలిపి ప్రకృతంబున రేవతుఁడు సురజ్యేష్ఠుని సభ నిలిచి, బ్రహ్మకు నెఱిగి తన తనయకుఁ దగు వరు నడిగిన నజుండు నవ్వి "రాజా! నాటి సృష్టి నశించె. నీకూ తునకు ననువగు వరుండేఁడీ? చంద్రవంశ్యుఁ డుగ్రసేనుఁడు కలఁడు, వాని సుతుఁడు కంసుండు. తండ్రిం బందెవెట్టినాఁడు. సురద్రోహి. వానియాటకు గొందరు దుష్టనృపులు తాళము వేయుచున్నారు. ఈ క్రూరులవలని భారము వహింపఁజాలనని ధారుణి హరిని రక్షింపుమని కోరె. అతండు నౌ ననియె. కంస శ్వశురుఁడు, జరాసంధుఁడు మధురను నిరోధించిన ద్వారవతి నిర్మింపఁజేసె. అట్లుండు యదు వృష్ణి భోజాంధకులఁ గూడి కృష్ణుఁ డున్నాఁడు. అతని యన్న బలభద్రుండు. అతనికి నీకన్య నిచ్చి నీవు బదరికావనంబునఁ దపముసేయుము" అన నట్లుసేసి

రేవతుఁడు గంగయొడ్డున దేహంబుసాలించె నన జనమేజయుండు మానుషమానంబునఁ బెక్కుయుగంబులు సన నక్కన్నియ యౌవనంబు సడలకుండెనే? అది యబ్బురంబుగాదా! యన పారాశరి బ్రహ్మలోకంబున నిల్చిన వారల కాయువు దఱుగదు. జరాక్షుత్పిపాసలు మృత్యువు ననునవి కలుగవు. రేవతుఁ డటనున్నతఱి నతని సంతతివారు దానవుచేఁ గూలిరి. కొంద రచ్చోటు విడిచిరి. ఇక్ష్వాకువు పిమ్మటి రా జయ్యె. ఇతఁడు మనువుతుమ్మువలన జనించె. అతఁడు నారదు నుపదేశంబున శక్తిమనువును జపించి సుతశతంబు వడసె. వికుక్షి వారిలోఁ బెద్ద. ఇక్ష్వాకు వయోధ్య ముఖ్యనగరిగ నలుగురు కొమరుల నాల్గుదిక్కులకు నేతలగాఁ జేసి యిరువుర తనకుం బాసటగా నిలుపుకొని జగమేలె.

## —♦ ఇక్ష్వాకు చరిత్ర ♦—

ఇక్ష్వాకు విష్టికై మాంసంబు దెమ్మని కుమారు వికుక్షి యనువాని నంపిన నతం డడవిని వేఁటాడి మాంసము సేకరించి క్షుధచే నటనే కొంత తాను భుజించి భుక్తావశేషంబుఁ దెచ్చిన నతనిగురుం డిది భుక్తశేషంబని తెలిపినఁ దండ్రి కోపించి తనయు వెడలఁగొట్టె. అక్కొడుకు శశమ్ముదిన్నవాఁ డగుట శశాదుండను నా నడవి సంచరించె. తండ్రికిఁబిమ్మట రాజై సరయూ తీరమున నతఁడు పెక్కు జన్నములు సేసె. అతనికొడుకు కకుత్థ్సుండు. అతని కింద్రవాహనుఁ డనియుఁ బేరుకలదు. కకుత్థ్సుండు తండ్రిపిదప రాజయ్యె. సురలు దైత్యపీడితులై శ్రీహరి వేడుకొని యతనియానతి నేగి కకుత్థ్సుం బ్రార్థించిరి.

అతఁడు "నేను వత్తునుగాని యాఖండలుండు నాకు వాహనం బగుట కంగీకరింపవలయు" నన్న వా రేగి సురరాజునకు విన్న వించిరి. ఇంద్రుండు లజ్జించియు హరిచేఁ దెలియఁబడి కార్య ఘటనకు వృషభరూపుండై యతని మోసె. వృషకకుదంబున (ఎద్దుమూపున) నాసీనుం డగుట నారాజు కకుత్స్థుం డని పేరొందె. ఆతఁ డట్లు నడచి యసురులఁ జక్కడంచి యింద్రుని దిక్కయ్యె. దాన న య్యైశ్వ్యా పేర నయ్యన్వయంబు పేరొందె. అతనికి విశ్వరంధి గలిగె. అట్లు రానురాను శావంతుఁ డ య్యన్వయంబున జన్మించి శావంత మను నగరమును నిర్మించె. అతని మనుమండు కువలయాశ్వుండు ధుంధుం డను రక్కసుఁ బరిమార్చి ధుంధుమారుం డనఁ బఱగె. అట్లు పోను పోకను, మాంధాత యుదయించె మాంధాత జననియుదరంబున గాక జనకు నుదరంబు ఛేదించుకొని వెడలె. అది చిత్రంబు విను మని యిట్లనియె.

## మాంధాత జననము

యౌవనాశ్వుండు సంతతిలేమి నూఱ్వురు భార్య లతో మున్యాశ్రమంబుల సంచరించుతఱి మును లింద్ర దేవ తాకం బగు నిష్టి సేయువారై సలిలపూర్ణకలశంబు మంత్ర పూతం బగుదాని నధ్వరశాలలో దాచిన నారాజు దప్పిగొని యాజలంబు ద్రావె. అవ్విఘ్నంబునకు నమ్మునిసంఘంబు దపించె. మఱియు దైవయోగంబు దుర్లంఘ్య మని వా రెంచి యయ్యధ్వరంబు సాంగ మొనర్చిరి. అవ్వల నవ్వసుమ తీశునకే గర్భం బయ్యె. వాని యుదరమందలి పిండ మర్భకుఁడై

జనకు నుదరంబుఁ జెకల్చుకొని దివ్యకాంతులెగయ వెవలి వచ్చె. దైవకృపను భూపతి మరణింపను లేడు. పుట్టినబాలుఁడు మఘవు ననుగ్రహంబున మాంధాత నా నెసంగి చక్రవర్తి యయ్యె. అతనిశాసనమున వైరివీరులెల్ల గిరిగుహాలు వట్టిన త్రసదస్యుండునా బిరుదొందె. అతడు బిందుమతియం దిద్దఱు సుతులఁ బడసె. వారిరువురు కుత్సుండు, ముచికుందుం డను వారు. వారివారి వరుస సత్యవ్రతుఁ డుదయించె. అతఁ డొక విప్రాంగనఁ జెఱఁబట్టిన తండ్రి యరుణుండు గోపించి బ్రాహ్మణ భార్యనంటిన శ్వపచత్వంబు వచ్చుఁగావున చండాలసంసర్గ మున నెందేని నిలుము పొమ్మన, వాఁడు వ్యాధవృత్తిచే మాంసంబుఁ దినుచు చని తండ్రిపై పగగొని చరించె.

సత్యవ్రతుఁడు సంతతిలేమికి వగచి యడవిపా లయ్యె. పండ్రెండేండ్లు రాజ్య మరాజకమై క్షామాదిపీడ నొందె. అత్తఱి విశ్వామిత్రుఁడు సంసార మోర్వలేక దారపుత్రుల విడిచి కౌశికీతీరంబున గాలంబుపుచ్చె. అతనిభార్య భిక్షించి జీవించుచు నందులకును వీలుగాదు నొక్కకొడుకు నమ్మి కడమ వారిఁ బోషింతు నని మువ్వురుకొడుకులలో మధ్యముకంఠ మున రజ్జువుగట్టి వీధుల నమ్మఁజూప వ్యాధవృత్తి యగు సత్య వ్రతుఁడు చూచి వగచి నే నొక చెట్టుకొమ్మకు మాంసమ్ము గట్టుదు దాన 'మీరు బ్రతుకుం'' డనియె. అంత నమ్మఁగువ తనయు బంధం బూడ్చె. అతండె గాలవుండు. అ య్యబల యీ రీతిగ జీవనంబు నడపె. ఆ రా జయోధ్యఁ జేరుకొని వసిష్ఠు నానఁ గొండొకజన్నము సలిపి శ్వపచసంసర్గదోషము వాపు కొని రాజ్యమేల్మె. ఒక్కనాఁ డతఁడు వేటకై పోయి మునుపటి

వని కేగి యట మున్ను తనచే బ్రతుకుగన్న భిక్షువనితఁ గాంచి యామెకొఱకు వచ్చియున్న వసిష్ఠ ధేనువుఁజూచి క్షుధార్తుఁడై దాని జంపి తిని కొంత నంజుడు తరుశాఖ గట్టిన నా యింతి గోమాంస మ్మని యెఱుఁగక తానుం దిని కొడుకులకుం బెట్టినఁ దెలిసి వసిష్ఠుండు గనలి "యోరీ! గోవధ మెట్లొర్చితివి. నీకైజంబు మాఱలేదుగదా! గోవుఁజంపుట, విప్రునిల్లాలిఁ బట్టుట, దండ్రికోపమున కగ్గమగుట యను నీమూఁడును నీకు శంకువులు. కాన త్రిశంకుఁడ వనఁబఱగెదు పో" మ్మని శపించె.

## —♦ త్రిశంకు శాపవిమోచనము ♦—

గురుశాపహతుఁడై వాఁ డాశ్రమంబులఁ దిరుగుచు, మూలమంత్రము జపించుచు, వన్యవృత్తిచే బ్రతుకుచు, మంత్ర జపహోమంబు నడుప నచటి మునుల యాచింపఁగా వారు పిశాచంబు సలుపు హోమంబుల కేము దోడుపడఁజాల మన నతండు తపించి దేవిం దలంచి యగ్నింబడ నుంకించె. అంత నా దేవదేవి సింహవాహనయై వచ్చి నీతండ్రి రాజ్యము నీ కిచ్చి యాశ్రమవాసిగాఁ దరలె. నీవ యవనికి దొరయయ్యెదు. అమాత్యులిట కేవత్తురని వెడలె. అంత నారదు నుపదేశంబున నతని తండ్రి కొడుకునెడ జాలిగొని దేవీకృప నా కొడుకు పూతుం డయ్యె నని వింటి. వానిం బిలువుం డన మంత్రులు గొనివచ్చిరి. అతఁ డతనికిఁ బట్టంబు గట్టి ధర్మము నుపదేశించి యవ్వల వని కేగి వానప్రస్థధర్మంబు నడపె.

సర్వేశ్వరీమంత్రఫలం బింతంత కాదుగదా! త్రిశంకుఁ డధ్వరంబులఁ బెక్కుల నొనర్చి సుతు హరిశ్చంద్రు యువరాజుఁ

జేసి వసిష్ఠుకడ కఱిగి శరీరముతో స్వర్గము నచ్చు జన్నము సేయింపు మని కోరె. గురుఁ డది యసాధ్య మనియె. త్రిశంకుఁడు కోపించి గురుని ధిక్కరించి లేచిపోవుచు మరల శ్వపచరూపంబు నొందె. అందుల కేస్టియేష్టి కాయంబు విడుతు నని యెంచియు నాత్మహత్య పాపం బని వెఱచి గంగాతీరంబున నుండ నతనిసుతుఁడు హరిశ్చంద్రుఁడు గురుని బ్రసన్నుఁ జేయుదును. నీవు పురికి దయసేయు మని కోరిన రాకున్నఁ దానె రాజ్యపట్టభద్రుఁడై జగంబులఁ జక్కఁగఁ బాలించె.

అది యట్లుండె. విశ్వామిత్రుఁ డట్లు సతీసుతులఁ బాసియు మఱల మమతఁగొని వచ్చి యాలిం గని యిట్లనియె. నేను నిర్ధనుఁడనై క్షుధచే నొక చండాలునిల్లు దూఱి శునక మాంసంబు గొనఁజూడ వాఁడు కొట్టవచ్చిన నతిథిని నన్ను గొట్టకుమని వాపోవ, "ద్విజుండవు; నీవు చండాలునింట, నందును కుక్కమాంసం బెట్లు తాకెదు. అంటరానినాయింట మాంసంబు గుడుతు నంట ఘోరంబు పొ"మ్మనె. "నే నాకలిఁ గొంటి. దీనఁ గలుగు పాపంబు పర్జన్యునిది. ఈ క్షామంబునకు వాఁడెకా కారణ"మ్మని ముని యనియె ఇట్లు రోషంబున నను నంతలో మేఘుఁడు కుంభవృష్టి వర్షించి పుడమిఁ జల్లఁబఱచె. దానఁ గఱవు నశించె. బ్రతికితిని. ఇఁక నీ తెఱగు వినిపింపు మన నిట్లనియె. అవ్వాల నామె క్షోభ విని వసిష్ఠక్రోధమున కగ్గమైన త్రిశంకుకథయు విని నా కుపకారి యగు రాజును వసిష్ఠశాపము నుండి విడిపింతుఁగాక యని ప్రతినపట్టె. మఱియు రాజుకడకు వచ్చి నేను నిన్ను సశరీరస్వర్గంబునకు నడిపించెద రమ్మని యధ్వరదీక్షితు నొనర్చె.

అది గని వసిష్ఠుండు తాపసులం జూచి 'చండాలుండు కర్త. క్షత్రియుం డధ్వర్యుండు. మీరలో వేదవేదాంగసంవేదులు. విప్రులు. తపస్వులు. శ్వపచాన్న మెట్లు మెక్కెదరు? చాలుంజాలు' నన వారల నొక్కండును మునిజన్నంబునకు రాండయ్యె. అంత గాధిజుండు కనలి "రాకున్నం బోయె. పోనిమ్ము. నా తపఃఫలము ధారవోసి ని న్నింద్రుపురికిం బంపెద" నని నీరు చేతంబట్టుకొని మంత్రపూతంబుగా దాని నా విభు కేల వదలి "పొమ్ము! దివిమల్లోకసభ్యత నీకుం గల్గెం బొ"మ్మనియె. ఆ రాజాకాశవీథులం జనుచుండె. దేవతలు దేవపతి కీ చండాలురాకం దెలిపిరి. ఇంద్రుండు వానిం గెంటుం డని చారులం బంపి త్రోయించె. వాండు తలక్రిందై యవనిం బడుచుండె. గాధేయుండు తన తేజంబున వాని నంతరిక్షంబున నిలిపి కొండొక సృష్టి గావించి రెండవస్వర్గంబు సృజించె. వాసవుం డంత "అకార్యం బేల సేసెదు. నీయాన వర్తింతు తెలుపు" మనియె. అంత ముని వీనిం దివి నిలుపుటయే నా కభిమతం బనియె. ఇంద్రుండు వెరచి దేవలోకం బెల్లం జెడుటకు శంకించి వానిని దివ్యరూపుం జేసి దేవయానంబునం గొంపోయె. . హరిశ్చంద్రుం డది విని హర్షించె.

హరిశ్చంద్రచరిత్రము నిదివరకే కొంత వింటివిగదా! ఆతని సత్యవ్రతపాలన కథ సుప్రసిద్ధంబని యదియుం దెలిపిన జనమేజయభూవల్లభుం డవ్వలికథ వినిపింపు మన మునివల్లభుం డిట్లనియె.

# అష్టమస్కంధము

జనమేజయుఁడు సూర్యచంద్రాన్వయంబులచరిత్ర సాకల్యంబుగ వింటి. ఇపుడు జగదంబచరితంబు దురితహరంబు వినఁగోరెద. ఎచ్చోట నెచ్చోట నెయ్యెరూపుల జగన్మాత వర్తించు, నే మంత్రబీజంబు లెఱింగి దేవి నర్చింపవలయు ? ఫలమెట్టిది ? యని యానతశిరస్కుండై యడిగిన బాదరాయణుం డుప్పొంగి మున్ను నారదుప్రార్థనంబున కమలజుఁడు దెల్పినచందంబున వినిపింతు నని యిట్లనియె.

## —• ఆది వరాహావతారము •—

తొల్లి బ్రహ్మపుత్రుఁడు స్వాయంభువుండు ప్రజాసర్గము గోరి తపముసేయగా దేవి ప్రసన్నయైన నయ్యంబకుఁ బ్రణమిల్లి వేరీతుల సన్నుతించె. శ్రీమాత హర్షించి యీ స్తవంబు విన్నవారికి సిరు లొదవు నని తెల్పి సృజనశక్తి దయసేసె. అతఁడు బ్రహ్మకడ కరిగి సృష్టిసేయ నాకొకతావు దెల్పు మన నతఁ డచ్యుతుఁడ దిక్కని ధ్యానముసేయ నా బ్రహ్మముక్కున వరాహపోతం బంగుళమాపాటిది జనించె. సనకాదులు గనుచుండగనే యది మేరువంత యయ్యె. అట్లు జనించి యది దీర్ఘరవంబు సల్పిన సత్యలోకంబును బద్మజుఁడును నమ్మూర్తిని వేదస్తవంబుల సంతసింపఁ జేసిరి. అ య్యాదివరాహమూర్తి హర్షించి మున్నీట మునిఁగి సటాచ్ఛట జాడించిన నర్ణవుండు బెదరి పాహిపాహి యని యాక్రోశించె. వరాహమూర్తి యన్నీరధియడుగునుండి తన కోఱలచే నవనిమండల

మెత్తె. అంత నమరు లయ్యాదిమూర్తి నర్చించి వినుతించిరి. బ్రహ్మ స్వాయంభువుఁ బిలిచి యీమహిపై నిల్చి సర్గంబు గావింపుము. యజ్ఞపురుషు భజింపుము. ధర్మము వర్ణాశ్రమాచారనియతి సెల్లింపు మన స్వాయంభువు సృష్టి కుద్యమించె.

## —♦ ఆదిసృష్టి ♦—

అతని తొలిసృష్టి ప్రియవ్రతోత్తానపాదులు ఆకూతి, దేవహూతి, ప్రసూతి యను ముగ్గురు కన్యకలు నుదయించిరి. ప్రియవ్రతోత్తానపాదులే ద్వీపవర్ష సముద్రాదివ్యవస్థలకు మూలంబు. వారి చరిత్రం బెట్టి దనిన, ప్రియవ్రతుండు విశ్వకర్మతనూజ బర్హిష్మతిం బెండ్లియాడి పదిమంది సుతులంగనె. ఒక్క కూతుం గనియె. మఱొక్క పడంతియందు ముగ్గురు కొమరులు గల్గిరి. వా రుత్తమ తామస రైవతు లనం బరగిరి. వారె మనువులైరి. ప్రియవ్రతుండు పదునొకం డర్బుదములకాల మిల యేలె. ఒక్కనాఁ డతం డర్కుని జూచి నారాజ్యమున నొక భాగము వెలుతురు, నొక భాగము చీఁకటిగా నొనర్తువు. నాపాలనమునఁ దమం బలమనిత్తునే? యని సూర్యవర్ణం బగు రథ మెక్కి పుడమియెల్లం ద్రిమ్మరె. ఆ రథనేమి మొనసినమేరయంతయు నీరధి యయ్యె. అవియ సప్తసముద్రములు. వాని నడిమిభాగములు సప్తద్వీపములు. క్షీరోదధివేష్టితము జంబూద్వీపము. దానికి రా జాగ్నీధ్రుఁడు, కడమవాడు కడమవానికి నేతలైరి. ప్రియవ్రతుకూతు, రూర్జస్వతి శుక్రుభార్య యయ్యె. ఆమెకూతురు దేవయాని. ప్రియవ్రతుఁడు తుదకు యోగముఁ గొని విరక్తుఁడయ్యె. అని చెప్పి

వ్యాసుఁడు ధరాపరిణామంబును, భూమండలవిభాగంబును, నదీ నదంబులును, క్షేత్రమ్ములు, నందలి దేవతావిశేషంబులు, లోకములు, వాని యధీశులవర్ణనములు, పుణ్యాపాపగతులు వివరించి దేవీసమారాధననియమంబులు మాస పక్ష తిథి క్రమంబుగ సలుపదగు నర్చనలు దెలిపి జనమేజయు హర్షింపఁజేసి తానుం దృప్తి నందె.

# నవమస్కంధము

## ప్రకృతి స్వరూప నిరూపణము

నారాయణమునివలన నారదుఁడు తెలిసిన తెఱం గది యని వ్యాసుండు భూపతి కిట్లని చెప్పందొడంగె.

నారదుండు నారాయణమునిని గని ప్రకృతిగూర్చి ప్రశ్నించిన నారాయణుం డది దుర్విజ్ఞేయంబైనను నా యోపినంత పలికెద. ప్రకృతి యనంగ శక్తి. ఆ పేరున గల వర్ణత్రయంబు వరుసగ సత్వ రజ స్తమోగుణములై పఱఁగు. దేవి త్రిగుణరూపిణి. సృష్టిస్థితిలయకారిణి. ఆత్మ నెనసి ప్రకృతియుఁ బ్రకృతినెనసి యాత్మయు నగ్ని దాహకతా శక్తి యనునవి వోలె నలరు. ఆ భేదము గమనింప నేరికి నలవికాదు. మూలప్రకృతినా మొదటితత్వంబు జగంబులకుఁ గర్త్రి, భర్త్రి, సంహర్త్రి. ఆమె ప్రథమప్రకృతి. ద్వితీయప్రకృతి వైకుంఠంబున మహాలక్ష్మినాఁ జరించు. హరికి భార్య యామెయే. లక్ష్మీరూపము

లన్నియు నామెకళలు. మూఁడవప్రకృతి బ్రహ్మాణియు వేద
వేద్య విష్ణు జపించుచు పంకజోద్భవునిల్లాలై విద్యాజ్ఞానబోధం
బులకు నిలయమై యుండు. ఆమె సరససంగీతసాహిత్యములచే
బోధము వెలయించుచు వీణాపుస్తకపాణియై విశ్వజననీత్వంబు
వహించు. నాలవ ప్రకృతి సకల మంత్ర తంత్రములకు జన్మస్థా
నమై తపస్వినియై శుద్ధస్ఫటిక సంకాశయై నిర్వాణదాయినియై
సావిత్రీ గాయత్రీ నామంబుల వహించి జగమ్ములఁ బవిత్రింపఁ
జేయు. బ్రహ్మప్రియంకరియై యలరు. పంచమప్రకృతి ప్రాణాధి
దేవత గుణనవావరణయై పతివామార్ధదేహయై రాసవిహార
లోలయై సగుణ నిర్గుణరూపయై యలరారు. గోపీమండితయై
కృష్ణభక్తిదాస్యతత్పరయై తనరు. హరి భూరమణుఁడైనపుఁ
డాతని బొందఁగోరి వృషభానను పుత్రియై జనించె. ఆమెయే
పిదప బృందావనమున రాధయై హరిభజించె. ముల్లోకంబుల
తరుణు లెల్ల యాతల్లి యంశాంశంబులు. ఇందుఁ బ్రధానరూప
యగు నీశ్వరియంశంబున గంగ యవతరించి ముల్లోకముల
దురితము లడంచుచు నిర్వాణదయై యున్నది. గోలోకప్రస్థా
నమునకు సోపానము. భారతఖండంబున నఖండతపఃఫలప్రదా
నమునకు నిదానము. మఱియుఁ బ్రకృతిప్రధానాంశజయై కశ్యపు
కూతురై శంకరశిష్యయై జరత్కారుపుత్రి భారతమున బ్రహ్మ
తేజోరూపిణియై సర్వమంత్రాధిష్ఠాత్రియై ఆస్తీకునితల్లియై బ్రహ్మ
భావనయై చరించు. ఆమె శిశువృద్ధికారిణి. సూతికాగృహం
బులఁ బూజింప దోషంబులు హరించు. అవ్వల మంగళచండిక
సృష్టియెడ మంగళరూపయు, సంహారమునఁ జండికయుగా
వర్తించు. ఈమెయే శుంభనిశుంభసంహారిణి యగా కాళిక.

అవ్వేల వసుంధర చరాచరముల కాధారము. పిమ్మటఁ బ్రకృతి కళాంశంబులుగా దక్షిణ మొదలు దుర్గదనుక పెక్కులు గలవు. ఎనిమిదేండ్ల బాలిక నర్చించిన ప్రకృతిం గొల్చుటయగు. భువనేశి యుత్తమ మధ్య మాధమ గుణ సమష్టిరూపమై యుండుట సాత్వికాంశమునఁ బతివ్రతలుగ, రాజసంబున భోగ భాగ్య సుఖ సంభోగ కలితలుగ, తామసంబున ధూర్తలు, కలహప్రియలు, స్వతంత్రలుగా నమరపురి నచ్చరలై, ధరణీ వేశ్యలు నై వర్ధిల్లుదురు. ప్రకృతిమయంబుగాని వస్తువు లేదని తెల్పి, యయ్యై దేవతల ధ్యానావధాన కవచ విధానంబులతో మంత్ర సర్వస్వవిషయము లెఱింగించె. అవ్వాణి యనుగ్రహంబు వడసి యాజ్ఞవల్క్యుఁడు సూర్యశిష్యుఁడై విద్యానిధి యయ్యె. ఆదేవి మున్ను గంగశాపంబున నదియై లోకంబులఁ బునీతంబులఁజేసె నన నారాయణుం జూచి నారదుఁడు సరస్వతి నది యగుట తెల్పు మన నతఁ డిట్లనియె.

## —• సరస్వతి గంగాశాపంబున నది యగుట •—

ఆదికాలంబున హరికి గంగా సరస్వతీ కమల లను ముప్వురు భార్యలుకలరు. ముగ్గురు నవ్విష్ణుసన్నిధి నున్నతఱిగంగ కామవృత్తిమెయి హరింగాంచినవ్వె. సరస్వతియు నట్లయొనర్చె. దాన జాహ్నవి మొగంబు చంద్రనిభంబయ్యె. అదికాంచి భార్గవి యాదరించె గాని, భారతి యీర్ష్యగొని కమలేశు ననరాని మాటలాడిన నతండు దిగ్గన మాటాడక చనె. అంత వాణి గంగను గ్రుద్దెద నని లేచిన లక్ష్మి యడ్డము సని వారించిన, వాదేవి వృక్ష సరిద్రూపంబుల నిల బుట్టుఁ డని శపించిన గంగ

కనలి, నీవును నదివై యిల జరింపుము. పాపులసాంకర్యంబు నొందెద వని శపింప నదియు నదివి కమ్మని గంగను శపించె. హరి యంతట వచ్చి లక్ష్మిం జూచి రహస్యవిజ్ఞాన ముపదే శించి ధర్మధ్వజుపీట నయోనిజవై యతనికూతురవై వృక్ష రూపంబు నొందియుండుము. నాయంశమువాఁ డగు దైత్య నాథుఁడు శంఖచూడుఁ డను వాని సుదతివై నన్ను గాంతువు. అంతఁ దనుక తులసీవృక్షరూపవై యంశంబునఁ బద్మావతి యను నదివై పావనివై నిలు మనియె. భారతమున నదివై భగీరథుచే నానీతవగుట భాగీరథివై శంతనురాణి వయ్యె దని గంగ కనియె. సర్వతినా నదివై మీద బ్రహ్మలోకంబు నకు వత్తువని వాణి కనియె. వా రట్ల యైరి. కొండొకకాలంబున సరస్వతి స్వాంశంబున సత్యలోక మేగి యజున కిల్లాలయ్యె. గంగ యంశంబున హరున కింతి యయ్యె అని గంగయావిర్భావ విశేషంబు వినిపించి యట్లు వచ్చిన గంగను భగీరథుఁడు కణ్వోక్తవిధిఁ బూజించెనని యా విధానము సవిస్తరముగా వినిచి గంగామహిమ వర్ణించె. అంత దేవర్షి శివగానవివశులగు రాధాకృష్ణు లీ గంగావిర్భావకారణు లగుట యెట్లో తెల్పు మన నతఁ డిట్లనియె.

## గంగ రాధాకృష్ణులవలన నుదయించుట

కార్తికతిథియందు హరి రాధతో రాసమండలంబున వసించె. సురలు హరి నర్చించిరి. కృష్ణుఁడు పాడె. సరస్వతి వీణ వాయించె. హరి మెచ్చి యొక హార మిచ్చె. శివుఁ డొక సరమిచ్చె. మాధవుడు కౌస్తుభ మొసఁగె. రాధిక రత్నహారముం

గ్గై సేసె. కమల కనకకుంతలములు కాన్క లిడె. అట్లు తక్కుం గల దేవతలు పెక్కురీతుల సత్కరించిరి. రాధాకృష్ణశరీర స్వేదంబున నా రాసమండలము పెద్ద మడు వయ్యె. ఆ దంపతు లందుఁ జొచ్చిరి. సురాసురులెల్లరు బొమ్మలపగిది నిశ్చేష్టు లైరి. గోపికలు రాధాకృష్ణులు గనరామికి శోకించిరి. బ్రహ్మ గీతవైభవం బిట్టిది; రాధాకృష్ణులు రసమయులైరి. ఊఱ కుండుఁడని విష్ణుదేవుని నీమూర్తిం జూపుమని నుతించె. అంత నశరీరవాణిరూపమున నేనును రాధయు దేహము లూననేల? అద్వైతభావంబున నుందుము. మంత్రంబులసిద్ధిగన్న మానులు మమ్ముం గందురు. శివుఁడు నా యాన వర్తించు. నీవు దివ్య మంత్రముల సృజింపుము. నా మంత్ర యంత్ర కవచంబుల నుతించువారికి సాయుజ్య మిత్తు నన, నజ శివులు గంగం దోఁగి, త్రావి మంత్రముజపించి గంగమహిమంబు ఘనంబని బ్రహ్మ యన్నంత రాధాసహితుఁడై మాధవుఁ డెదుటఁ దోచె. గోలో కమున నిట్లు రాధాకృష్ణదేహసంభూతయైన యా నది త్రిలోక పావని యయ్యె. రా జది విని దేవతటిని హరిపాదమునఁ బుట్టె నని విందు; నిప్పు డన్యథా వినంబడియె. సంశయం బుడుపవే యన ద్వైపాయనుం డిట్లనియె.

## —• గంగ హరిపాదమునఁ బుట్టిన విధము •.

సృష్ట్యాది నట్లు గంగ రాధాకృష్ణాంగద్రవరూపయై జనించి నవయౌవన మెనసి జగన్మోహనాకృతిఁ గొని,సకామయై కృష్ణుపజ్జ లజ్జమెయి చీరచెరం గోరచేసికొని నిలిచె. రాధ యుప్పుడిట్లు గోపికలతోఁగూడి కోపమ్మున నెమ్మొ మరుణకమ

లంబువోలె జేవురింప సఖులతోఁ గృష్ణుసన్నిధి కరుదెంచె. కృష్ణుం డామెం గౌగిలించి గద్దియ నునిచి మధురంబుగ మాటాడుచునెడ గోపాలురు మ్రొక్కిరి. గంగ భీతయై పతియాన నొకయాసనంబున నొదిగి కూరుచుండి, రాధికవంక దెప్పవే యక కనుచున్నంత రాధాదేవి పూర్ణానురాగంబున నెమ్మోము సంపూర్ణకళానిధి ననుకరింప సరసాలోకనముల నిన్ను సన్మానించుచు నొడలు పులకరింప ప్రణయమున నిన్నె కాంచు నియ్యది యెవ్వతె. నేఁ బ్రాణంబులతో నుండ నింత యవస్థ వాటిల్లెనే! ఇట్టి నీ నేరము లెన్నియేని సైచితి, కాముకుని వర్తనం బిట్టిద. మున్ను కాళిందింగూడి డాఁగితివి. ఆమె తనువు దొరగి నదియయ్యె. దానికై విరాళి నందితివి. ఆమె నదీరూపము వదలి యోగినీరూపమున నిన్నుఁ గూడె. అవ్వల గర్భం బయ్యె. తుద నామె సప్తసముద్రంబులకుఁ బఱచె. చంపకవనమున నొక్క కాంతం గదియ సఖులు నాకుఁ దెల్పిన, నే వచ్చునంతలో నీ వెందో డాగితివి. దానికై నీవు విరహం బనుభవించుట నిజంబ. పరిచితంబైన యభ్యాసంబువదలదు. అని పతిని రాధ జంకింపుచున్న గంగ యోర్వలేక భయంబున నదీరూపంబు నొందె. అంత రాధిక త్రిభువనంబులగలుగు భువనంబులనెల్ల గండూషింతునన వెఱచిపఱచి భాగీరథి శ్రీకృష్ణ చరణతామరసంబులఁ బ్రవేశించె. రాధిక లోకములన్నియుం గాలించి, గంగం గానక బ్రహ్మాండంబంతయు జలశూన్యంబు గావింతునని యన్నియుం ద్రావిన బ్రహ్మరుద్రాది నిలింపులు నోరెండిగుంపులుగొని గోలోకమేగి గోపికాసేవ్యుఁ గృష్ణు, రాధికాకేళీలోలుం గాంచిరి. అతఁడు రాధాదత్తమయిన తాంబూ

లంబు గ్రహించి పరవశుఁడై యాసుందరిమోము గనుగొనుచు జిఱునవ్వు మొలకలెత్తఁ గొలువుదీరిన నప్పరమేశు దర్శించిన, వారి మనోవాంఛితము గ్రహించి మీరు రాధికంగొలిచి నుతించిన యామె యనుమతి గంగనిత్తునన నలువచేతులెత్తి ప్రార్థించె. రాధ యనుగ్రహించె. గంగ విష్ణుపాదంబు వెడలె. నల్వ గొంత తన కమండలువునఁ బట్టె. కొంత శశాంకమౌళి మౌళిం దాల్చె. విధి గంగకు రాధికామంత్రకవచంబుఁ దెలిపె. దాన నాపె వైకుంఠముం గనె. పద్మావతి, భారతి, తులసి, గంగ వీరు వైకుంఠస్త్రీలుగాన వారింగొల్చిన సంపద లగు. గంగావిర్భావకథ యిది మంగళకరంబు;వినిన గైవల్యం బొదవు. ఇట్లు గంగ పావనపదం బందుకొన పరమేష్ఠి లక్ష్మీపతిఁజూచి మ్రొక్కి 'దేవా ! గంగ నిన్ను వరింపఁగోరినది. గోలోకమున రాధకు వెఱచి నీచరణమున లీనయయ్యె. పిమ్మట రాధా మంత్రజపంబుం జేయు మని కృష్ణు ననుమతి నిచటికిఁ గొని వచ్చితి. నీవు వేల్పులలో రసికుఁడవు. కాంతలలో నీమెయు సారస్యసంధాయిని. కాన గాంధర్వవిధి నీమెం జేకొనుము. ప్రౌఢులకుఁ బ్రౌఢాంగనాభోగంబు గుణవంతము. ఈమె స్వయ మాగత. కాదన్న లక్ష్మీప్రసాదంబు సాదంబగు. కామినులు ప్రకృతికళలు. ప్రకృతి ధిక్కారణంబు పురుషులకుఁ దగదు. నీ యర్థాంగంబున ద్విభుజుండగు కృష్ణుండును, రెండవదానఁ జతుర్భుజుడుం గల్గిరి. వామాంగంబున లక్ష్మిఁ జేపట్టినట్లు దక్షిణంబున నీమెఁ జేపట్టుము' అని విన్నవింపఁ జతుర్భుజుండామెం గైకొనియె. అని చెప్పిన మీఁదఁ దులసికథఁ దెల్పుమన నారాయణుం డిట్లనియె.

## —♦ తులసీ చరిత్ర ♦—

వైష్ణవుండు, తపస్వి, విష్ణ్వంశసంభూతుఁడు, దక్షసావర్ణియను మనువు గలఁడు. వాని వంగడంబున వృషధ్వజుండు జనించె. ఇతఁడుమాత్రము శివభక్తుఁడు. ఇతనిపైఁ బుత్రవాత్సల్యంబు పాటించి శివుం డీతనికడ మూఁడుయుగంబులు వసించె. దాన, నితఁడు గర్వించి లక్ష్మీసరస్వత్యాది పూజలు మాని యజ్ఞంబు మాని సూర్యాదుల నిందించుచున్న భానుఁడు కోపించి రాజ్యభ్రష్టుండ వగు మని శపించె. దానఁ గోపించి శూలి శూలంబుగొని తరణిపై కెగసిన, నతఁడు విభ్రాంతుండై బ్రహ్మలోకంబున కేగ పశుపతి వెన్నంటె. తమ్మిచూలి శూలికి వెఱచి సూర్యుతోఁ గదలి నారాయణు శరణందిన నతఁడు చక్రహస్తుఁడనై మీ భీతి వారింతు. శంకరుఁడు భక్తహితంకరుఁడు. నాకును నెచ్చెలి. మాకు మించినది లేదు. అతఁడు సూర్యకోటుల సృష్టింపఁగలవాఁడు. నాకు ధ్యేయుఁడు. మా యిరువురకు భేదము లేదని దివ్యమంగళవిగ్రహుండగు హరి వారిజాసను నూఱడించునంతలోన త్రిశూలంబుఁగొని త్రినేత్రుఁడు రక్తనేత్రుఁడై వృషమెక్కి వచ్చి పీతాంబరునకు మ్రొక్కిన నాతని విధి మొదలుగ నెల్ల దేవతలు ప్రణామింప శ్రీనాథుఁ డతనిరాక దెలిసి యల్లన నవ్వి మీ రిటకు వచ్చునాటికి కలహబీజంబైన వృషభధ్వజుండె కాక వానికొడుకుల, మనుమల తరంబులుం గడచె. వారు రాజ్యభ్రష్టులైరి. వాని మనుమలు లక్ష్మీకటాక్షపాత్రంబు లయ్యెదరుగాక. సూర్యుఁ బ్రార్థింపుఁ డన శివుండు భక్తాభయదుండు కాన కరుణించె.

## —• కుశధ్వజు చరిత్ర •—

వృషధ్వజుమనుమలు ధర్మధ్వజ కుశధ్వజులు పద్మాలయంగూర్చి తపంబుసేసి రాజ్య మొందిరి. అట్టుండఁ గుశధ్వజునంగన యిందిరయంశంబగు నొక్క సుంకరిం గనియె. ఆమె వేదవతినాఁ బఱఁగె. పుట్టినదాది విరక్తగాఁ దనరె. నారాయణుం గూర్చి యుగ్రతపము సలిపె. దాన నింతి యింతయు వాడ దయ్యె. అవ్వల గగనవాణి యప్పికవాణిం గని నీవు జన్మాంతరంబున హరినట్ల దుర్జయుండగు పతిని బడయు దనియె. అంత నామె శౌరింగూర్చి తపంబుసేసె. దైవయోగమున రావణుఁ డటకు వచ్చి బలాత్కరింపఁజూచిన న బ్బాలిక వాని మంత్రశక్తిచే స్తంభింపఁజేసిన వాఁడు దీనంబుగ దేవీ! రక్షింపుమన నీవు సపుత్రామాత్యబాంధవముగ నశింతువని శపించి యోగవహ్నిం దేహముం ద్యజించె. ఆమె జానకియై శ్రీరాముం జెట్టవట్టె. అరణ్యవాసమున కేగుతఱి నమ్మహాదేవి నగ్ని దనయందు దాచె. మాయాసీతం గొని రాముఁ డడవికేగె. ఈ దేవరహస్యమును లక్ష్మణుఁ డెఱుఁగఁడు. రావణవధానంతర మగ్ని యథార్థసీత నర్పించె. మాయాసీత నాగతి యేమన నగ్నియు, రామవిభుండును నామెం బుష్కరక్షేత్రంబున తపంబు సలుపుమన మూఁడు లక్షలయేండ్లట్లొనర్చి కృతార్థయయ్యె. ఈమెయే కృతయుగమున వేదవతిగ, త్రేత సీతగా, ద్వాపరమున ద్రౌపదిగా వర్తించె. అవ్వల ద్రౌపది కేవురు భర్తలేల కల్గిరి తెల్పుమన నారదుఁ డిట్లనియె.

మాయాసీత యట్లు తపం బూనెగదా! ఆమెకు
హరుఁడు ప్రత్యక్షమై వర మడుగు మన కామవశయై "పతి
పతి" యని యైదుమారు లన్న శివుఁ డేలనవ్వుదనుక నట్లయగు
ననియె. ఆపె ద్రౌపదియై యైదుగురు పాండవులకుఁ బత్ని
యయ్యె. అది యట్లుండె. రాముండు భారతఖండము నేలి
వైకుంఠమున కేగె. కమలయంశంబగు వేదవతి శౌరింగూడె.
ఈ యాఖ్యానము విన్నఁ జనువ సిరు లొందవు. సర్వ శుభ
ములు సేకూరు.

## —♦ ధర్మధ్వజు చరిత్ర ♦—

కుశధ్వజుతమ్ముఁడు ధర్మధ్వజుఁడు. అతని భార్య
మాధవి. వారు గంధమాదనంబున నూఱు దైవవర్షంబులు
సుఖముగా నడపిరి. అతనురతికేళుల నతనికి విరతి యుద
యించెంగాని యబ్బోటి కయ్యాశ వోదయ్యె. అట్లుండ
నామెకు గామసంజీవని యను కన్య జనించె. ఆమె సిరియం
శంబు కాన యసామాన్యవిలాసఖనియై యెసంగె. ఆమెకుఁ
దులసి యని పేరిడిరి. భోగము లొల్లక య కన్నియ బదరీ
వని లక్షదైవవర్షంబులు హరి మగండు గావలెనని తప
మొనర్చె. బ్రహ్మ సాక్షాత్కరించె. శ్రీపతి నాపతి గావలెనని
యామె గోర, నతఁడు కృష్ణాంగసముద్భవుఁడు, రాధాశాపం
బున, దనువంశంబున శంఖచూడుండు నా జనించు. అతని కిపుఁ
డంగనవై పిదప నారాయణుఁ జేకొందు. వృక్షరూపవై
బృందావని వసింతు. పీవులేని దేవపూజలు సఫలంబులుగా వన,
సంతసించి షోడశాక్షరంబగు రాధామంత్రంబు నడసి యా

కతంబున నెవ్వరికి గోచరింపని శృంగారంబున హరితోడ రమింతు వనియె. ఆమె గృహంబున కేగి యతనికై విరాళి గొని యొకనాడు విరిసెజ్జ నిద్దురజెందిన దివ్యసుందరుండు, రత్న హారాలంకృత విశాలవక్షుండు, నవకుసుమమాలామనోహరుండు గలం దోచిన, వానికై తపించుతఱి బ్రహ్మాంశప్రసక్తి రూపంబు వాడె యగు శంఖచూడుం డచ్చోటికివచ్చిన నన్యోన్య సరస సల్లాపంబుల నెనసిన జన్మాంతరవాసనావిశేషంబునం బ్రబోధంబు నొంది యిద్దరువు రున్నతఱి కమలజుండు వచ్చి యాశీర్వదింప వారు గాంధర్వవిధి పరిణయంబైరి.

అట్లు, కల్యాణంబై యా సుందరీసుందరులు వరుణ పావక శశి ప్రముఖ నిఖిల నిలింపప్రవరు లనర్ఘస్వర్ణమణి మాల్యాంబరసుగంధద్రవ్యంబులు గానుకలు వెట్ట, నిచ్చ కొలంది పెచ్చుమీరి రత్నవిమానయానులై నిఖిల గిరి తపోవనోద్యాన కందర కాసార సింధుతీర పులినతలంబుల తృప్తి సనక యొక్క మన్వంతరము విహరించి దేవాసురుల శాసించుచుం దిరుగ, నిలింపులు పెంపుసెడి విషాదంబున నిక్కథ వాణీపతి కెఱింగించిన నతండు వైళమ వైకుంఠమ్ము పదియారు ద్వారమ్ములు దాటి హరిసన్నిధికి నేగి విన్నవించిన నతం డిట్లనియె.

### — హరి శంఖచూడు పూర్వవృత్త మెఱుకపఱచుట —

తొల్లి రాధను దర్శింప బోయితి. నాతో విరజయు వచ్చె. దాన రాధిక కోపించిన విరజ సఖులతో నింటి కేగె. నన్ను రాధ తర్జించుచుం బదరె. దాన నా సన్నిధి గల భక్తుండు గోపా

లుఁడు సర్వేశ్వరు నిట్లు తూలనాడెదే! యనఁ గినిసి దైత్యుఁ డవు గమ్మని వానిని రాధ శపించె. అతఁడు దేవి కెఱగి జెప్పు మనిన నొక్క మన్వంతర మిల నుండి గోలోకమున కేతెంతు వని దయసూపె. వాని హరుండు శూలంబున హరించు; మీరేగుం డన బ్రహ్మాదు లరిగిరి. అయ్యెడ పరమ శివుఁడు రుద్రుండు చంద్రభాగాతీరంబున నొక్కవటముక్రింద భూతగణపరివేష్టితుఁడై క్రోధదుర్నిరీక్ష్యుఁడై చిత్రరథుం డను గంధర్వుంబిలిచి శంఖచూడుపై నెత్తివచ్చితి నని కబురంపిన శంఖచూడుండు నుషఃకాలమున వత్తుఁ బొమ్మనియె.

ఉగ్రుండు యుద్ధసన్నాహసముదగ్రుం డయ్యెనని శంఖచూడుం డాలికిఁ దెల్పిన, నామె యులికిపడియె. అతఁడు కలికీ! కాలంబు గడువరాదు. సర్వేశ్వరుకనుచూపు మఱలినంత సర్వము తారుమారగు. నీ వెవ్వత వేనెవ్వఁడ? అజ్ఞాను లీ బుద్బుదప్రాయంబులగు భోగంబులకు విలపించుచు నవి వమ్మైన తఱి విలపింతురు. ఏగూటిపక్షి యాగూటికేగుట తీరుగాదే! యని యారేయి నా యింతికి సంతసముంగూర్చి కృష్ణస్మరణమున మేల్కని మంగళస్నానము సల్పి యలంకారములు దిద్ది, విప్రుల కనూనదానము లొసఁగి పుత్రుఁ బట్టాభిషేకించి పత్ని వాని కప్పగించి పరికరములఁగొని ససైన్యపరివారుఁడై పుష్పభద్రానదీతీరసిద్ధాశ్రమవని నధివసించిన గౌరీజాని కెదురునడచి విజ్ఞానవశమున నార్తిహరు, హరు, పరాత్పరుఁ గాంచి బత్తిమెయి సాగిలి మ్రొక్కి చేతులు మొగిచి శంఖచూడుండు నిలిచె. భద్రకాళి, గుహుండును స్వస్తియని బల్కిరి. అన్యులగు సభ్యు లతని రాక కలరిరి. వినయము సూచించిరి.

పిమ్మటఁ బరమేశ్వరుఁ డనుచరోక్తుల నా భక్తు నలరించి, సృష్టివికాసలయంబుల తెఱఁ గెఱింగించి, దైవ మవిలంఘ్య మగుట యుగ్గడించి సర్వంబు కాలాత్మ యగు, నీశ్వరు నధీనంబగుట యనుసంధించి, సుఖదుఃఖములకు తలంగ కుంట మేలని చంద్రచూడుండు పలికిన శంఖచూడుం డుప్పొంగి వినయమున హరుం గొనియాడి, యొకింత విన వలయు, విన్నవింతునని యిట్లనియె. అమరులు పాఁడిదప్పి బలిని భంజించిరి. హిరణ్యాక్షుఁ దమ్మునితోఁ జంపించి యమృ తంబునఁ బాలీక హింసించుట క్రొత్తలే? వీరి వైరంబు నిత్యంబు. కానిమ్ము. జయాపజయములు స్వామిద్రోహంబు లనువానికి నియతి యెక్కడ? ఒక్కట నామనంబు నెఱియుం జెడి. నీవు నావంటి యల్పునితోఁ బోరికిచ్చగొని లజ్జింపకుంట చిత్రము. ఇది మావ్యము. అనిన బ్రహ్మవంశ్యుఁడవగు నీతోఁ గయ్యంబు నాకు గౌరవప్రదంబ. సురరాజ్యమ్మిచ్చి తొలంగిన నొండె, రణమ్మిచ్చి చెలంగిన నొండె. ఏదే నొకటి గావలయు నన నయ్యిరువురు చలంబుఁగొని జగడంబునకుం దిగిరి. ఇరు వంకల యోధవరులు పెనంగిరి. నిఖిలశస్త్రాస్త్రంబుల ధూర్జటియు, దుర్జయుండగు శంఖచూడుండునుం బోరిరి. తుదకు మృడుండు బ్రహ్మాండంబులఁ గబళించు నుద్దండతర మైన రూపుంగొని దానవుపైఁ గవిసిన, వాఁడు కృష్ణభక్తుండు గాన శ్రీపతిపాదాంబురుహముల భజించి యోగాసన వర్తియై భక్తిమూర్తియై యింద్రియంబు లంతర్ముఖంబుగ మలఁచి, కలాప్రపూర్ణుఁడై బహిరంతర్భేదంబు మాని నిశ్చల సమాధి నివాతదీపకళికయుంబోలె నున్నతఱి నళికనేత్రుండు,

నీలగళుఁడు, శూలంబు వైచిన నతం డసువులఁ బాసి, గోపవేషం బుంగొని దివ్యరూపియై పిల్లనగ్రోవియు రత్నాలంకారంబులు ధరించి విమానమెక్కి రాధామనోహరుఁడాసి పదంబుల కెఱఁగి బృందావనంబుఁ బ్రవేశించె. శూలముశూలిం జేరె. దైత్యు నస్థులు శంఖము లయ్యె. శంఖతీర్థంబు దేవతలకును పావనంబు. శంఖపావనమున సర్వతీర్థఫలం బొదవు. శంఖమున లక్ష్మి నివసించు. శంఖధ్వని శూద్రులకు నభయంబుఁ గూర్చు. అది సంపదాయుర్వృద్ధికరము. శంకరునకుఁగాక కడమవారికి శంఖతీర్థంబున స్నాన మర్హంబ. పాద్యమందరికి నర్హంబ. అట్లు హరుఁడు నిశాచరు ఖేచరు నొనర్చి స్వపదముసేరె. అఖిలలోకంబు లానందించె నన నారదుఁడు నారాయణుఁజూచి శంఖచూడుసతి సతీత్వంబును హరి చెఱచెనని విందు నదెట్లనిన నారాయణుం డిట్లనియె.

—♦ హరి శంఖచూడుని భార్యావ్రతమ్ము సెరచుట ♦—

శంఖచూడుఁ డట్లు మడిసిన మీఁద దామోదరుఁడు వానికిరీటము, శరచాపములు, భూషణములు నాకర్షించి తా నా దైత్యవేషంబున నేగిన, సౌధగవాక్షంబునుండి కని యయ్యింతి ప్రియుగా భావించి విజయలక్ష్మిఁ గొని వచ్చెనని యుప్పొంగి కప్పురఁపునివాళి నిప్పించె. అతఁడు లోని కరుదేరఁ దాంబూల మిడి మదనవైరితోడి కదనంబున గెలుపొంది సదనంబు గంటి వది యెట్లని యడిగిన "కమలాక్షీ! నూఱేండ్లు పోరినంత దానవు లా దేవుధాటి కోర్వక పాఱిన బ్రహ్మ మాధ్యస్థ్యంబు వహించి యింద్రున కమరరాజధాని నిప్పించె. శివుఁడు రజ

త్యాద్రి కేగె. నీమీఁది తమి నిటకు వచ్చితి." నన నా తులసి నిజంబుగా నమ్మి యతని రతిసౌఖ్యమునఁ దనియించె. కొండొక తఱి నాతనితోడి కలయిక ననుభావము వింతభావమునఁదోఁచిన "నెవ్వఁడవీవు? నిజముఁదెల్పు? లేదా శపింతు. నా సతీత్వమ్ము వమ్ము సేసితి"నన రమాపతి నిజాకృతిఁజూపె. కోటికందర్ప లావణ్యమ్ము నగణ్యమహిమానుభావమ్ము నగు నమ్మహానుభావు దివ్యమంగళవిగ్రహంబు గని పారవశ్యంబుగని "దేవా! నీహృదయము పాషాణంబు ధర్మభంగంబుసేసితి. పాషాణంబవగుదు. నిన్ను బూజించువారలు భ్రాంతు లయ్యెద"రని శపించి వెతఁ దపించిన నచ్యుతుఁడు వినయోక్తుల నామె లాలించె. తులసి దేహంబు వాసి దివ్యదేహంబు వడసె. ఆమె పాసిన తనువు గండకీనది యయ్యె విష్ణు వందు సాలిగ్రామములుగా జనించె. అమ్మూర్తులు బహువిధంబు లని వాని స్వరూపమహిమంబులు వాకొని యం దేను, లక్ష్మియు, సరస్వతియు, సర్వతీర్థమ్ములును వసింతుము. సాలిగ్రామశిలావారిఁ దోఁగిన సర్వదాన ఫలము లొదవు. దాని నాలోకించిన మోక్షము నిక్కము. పితరు లుత్తమగతి నందెదరు." అని యచ్యుతుఁడు దులసికిఁ జెప్పి వైకుంఠంబునకు నరిగె. తులసియు మేను దొఱఁగి లక్ష్మియై పతిం గలసె.

ఇట్లామెకు లక్ష్మితో సామ్యం బొసంగిన నీసుగొని సరస్వతి వల్లభుసన్నిధి నామె వంచించి కలంప నామె తనమేనెవ్వరికిఁ గానరానిక వర్తించె. ఆమెకై హరి తపించి దశాక్షరమంత్రము జపించి దేవీ సపర్యల నొనర్చె. అంత నాదేవి తులసివృక్షంబునుండి వెడలివచ్చిన నతఁ

డామెం దలఁదాల్చె. ఇట్లెవ్వారు నిన్ను తల మోఁతు రవ్వారు సౌఖ్యముః లొంది తుదిపదం బందుదురని హరి యేఁగె. కృష్ణజీవనరూపయు గృష్ణప్రియతమయు నగుట నామెకుఁ గృష్ణజీవని యని పే రెసంగె. మఱియు, బృంద, బృందావని, విశ్వపూజిత, విశ్వపావని, పుష్పసార, తులసి, కృష్ణజీవని యను నెన్మిది నామంబుల నామెఁ బూజించువారికి నశ్వమేధఫలంబు లభించు. కార్తికపూర్ణిమఁ దులసిఁబూజసేసిన విష్ణులోక మొదవు. తద్దానమున గోసహస్రదాన ఫల మగు. తులసీపూజచే సావిత్రి సత్యవంతుప్రాణములు రక్షింపఁగల్గె నని యక్కథ, సావిత్రి పూజావిధానము నాదిగా సర్వదేవతార్చన, దానయాగాది ధర్మంబులతో వివరించె. శ్రీమహాలక్ష్మి పూజావైభవంబు దెలుపు నవసరంబున మున్ను దుర్వాసుశాపంబున మఘవుండు లక్ష్మిం గోల్పడి మఱల యామె సంపాదించుట యిట్లనియె.

### — ఇంద్రుఁడు లక్ష్మీకృపకుఁ బాత్రమగుట —

ఇంద్రుఁడు మున్నొకప్పుడు త్రావి రంభతో నడవిని విహరించునెడ దుర్వాసుఁ డా దారిఁ జనుచుండుట గని గిరిభిది వందనం బన దీవించి, యమ్మౌని హరిసంభావితమగు పారిజాత మాలిక నా హరి కిచ్చె. సురపతి కావరమున దాని నేనుఁగు తలఁ బడవైచె. అమ్మాల్యస్పర్శంబున నేనుఁగు హరికృపనంది శక్రుఁ బాసి చనియె. అట్లది యేగుతఱి గమనత్వర నమ్మాల్యము జారి క్రిందఁబడియె. అపుడు మదమత్తుఁడగుట దేవపతి యది గనఁడయ్యె. అంత నమ్మౌని హరిప్రసాదంబు నింతసేసితి

గాన పదభ్రష్టుండవు గమ్మని వాని శపించె. అంతఁ బాకశాస
నుఁడు భయపడి తాని పదంబులు వట్టిన సాకతంబుగాని బృహ
స్పతిదయ నీయిష్టంబు సేకురుఁ బొమ్మనె. ఇంద్రుండు నానాఁడు
నాకంబు సిరిఁదొఱఁగి గంగయొడ్డున ఁ దివినుపాసించు బృహ
స్పతిం గని యతనియానఁ బద్మజుంగూడి శ్రీహరిసన్నిధి కేగి శర
ణాన నతఁడు సురపతిం జూచి నీవు సముద్రంబున కేగు మట
లక్ష్మి నావరమున నుదయించు నన నటకేగి యబ్ధి మథించిన నందు
నబ్ధికన్య యుదయించె. ఇంద్రుఁ డామెకటాక్షంబున నిజశ్రీ
వడసె.

## —• స్వాహోపాఖ్యానము •—

నారాయణుఁ డిట్లనియె మున్ను సుర లాహారము
కొఱవడిన బ్రహ్మ నర్థించిరి. అతఁడు ప్రకృతి నుపాసించి
దేవి! నీవు పావకునియందు దాహశక్తిరూపమున నింతివై
నిలువుము. నీ నామపూర్వంబుగ నెవ్వరేని హవిస్సు నిచ్చిన
నది సుర లనుభవింతురు. అనిన నేను గృష్ణునిల్లాలఁ గావలె.
వేఱొకమనంబు లే దని తదేకనిష్ఠ నుండగాఁ గృష్ణుఁ
డామెకు దర్శనమొసఁగె. ఆమె వివశ యయ్యె. శౌరి యామె
తలం జెఱఁగి యింతీ! నాగజితి యనుపేర నాకు భార్య వయ్యె
దవు. చింతింపకుము. ఇపుడు దాహశక్తిరూపమున ననలు
భజింపు మన నట్లొనర్చె. అవ్వల నామె పంద్రెండేండ్లు
గర్భంబు మోచి దక్షిణాగ్ని, గార్హపత్య, మావహనీయ మను
నగ్నుల ముగ్వురు తనయులుగాఁ గాంచె. అవ్వారి ముఖము
లందు స్వాహాయుక్తముగ మంత్రంబుఁ జేకొని హోమంబు

చేసిన సిద్ధి లభించు, పితృతృప్తికరంబు, శ్రాద్ధఫలవర్ధనంబు స్వధోపాఖ్యాన మెట్లన.

## స్వధోపాఖ్యానము

ఆదికాలమున వనజగర్భుఁ డేడ్గురు పితరుల వేదమూర్తుల బలవంతులుగ సృజించి వారికి శ్రాద్ధరూపమున నాహారము నూర్చె. మొట్టమొదట పితరులు ముక్తిఁగొందిన వా రగుటచే జనులు వారికిఁ బిండ మిడసాగిరి. ఇడినను వారు గొనరైరి. అంతట ద్విజులు వెఱచి బ్రహ్మ కెఱిఁగించిన నతఁడు స్వధ యను దివ్యాంగన సృజించి పితృధిష్ఠాన దేవతవై చరింపుమని యిచ్చె. పితరు లామెఁ జేకొని స్వధాంత మంత్రబీజం బుచ్చరించి యిడినఁ బిండములం గొనుచుండిరి. దేవతలకు 'స్వాహా' యనియు, పితరులకు 'స్వధా' యనియు నెఱుంగుము. సామవేదంబున స్వధాధ్యానస్తోత్రములు గలవు. నిఖిల శక్తిరూపిణి యనియు, రాధ యనియు, సుశీల యనియుఁ బెక్కురూపులఁ బ్రకృతి వర్తించి దక్షిణయై పితరుల వర్ధింపఁ జేయు నని వివరించె.

## దక్షిణోపాఖ్యానము

గోలోకమున సుశీల యను గోపిక కలదు. ఆమె హరికిఁ బ్రేయసి. రాధకు నెచ్చెలి. ఆమెకు నిత్యపార్శ్వవర్తిని. జగన్మోహనాకార. కామశాస్త్రనిపుణ. ఈమె యింటనే యెల్లపుడు హరి యుంటఁ గని రాధ తీవ్రరోషంబున నతని నిందింప వచ్చుటగని భీతినొంది శ్రీపతి యంతర్ధాన మొందె.

గోపికాగోపులు వెఱచి రాధపాదములుపట్టిరి. రాధ కృష్ణుతోఁ బరువెత్తు సుశీలం జూచి నేఁడు మొదలు నీకు గోలోకవాసము లేకుండుఁ గాక. ఇట వచ్చిన భస్మమయ్యెదవని శపించె. అవ్వేళ విరహావివశయై నిశ్చేష్టయైన రాధయొకఁ బద్మనాభుఁడు జాలి గొనివచ్చి నాతని మన్నించె. సుశీల దక్షిణ యను పేర శాపం బనుభవించి తపస్సుసేసి రమాదేవి తనువునం గలసె. అట్లు దక్షిణ యంతర్ధానమొందిన, దేవతలధ్వరము లొనర్చియు ఫలము గానక విరించునకు విన్నవింప విరించాదులు హరికి విన్నవించిన సరసిజలోచనుఁడు దక్షిణను యజ్ఞపురుషున కర్పించె. ఆమెను యజ్ఞుం డింతిగాఁ బడసి దివ్యవర్ష శతంబు క్రీడించె. ఆమె పండ్రెండేండ్లు గర్భంబు మోచి ఫలనాముండగు సుతుని గనియె. అఖిలకర్మఫలంబు లొసఁగు నీసుం డతఁడు. పూర్ణదక్షిణలు గొని జన్నము సలుపువారికి ఫలంబు లభించు. కర్మాంతమున దక్షిణ ముహూర్తం బాలస్యంబైన ద్విగుణంబును, నేకరాత్రం బెడమైన శతగుణంబును, త్రిరాత్ర వ్యతీతమైన దానికి శతగుణంబును, మాసమేగిన లక్షగుణంబును, వత్సరంబు గడచిన త్రికోటిగుణంబు నీఁదగు. ఆపైన నెడమైన కర్మము నిష్ఫలంబు. తత్కర్త నిచ్యుండని కర్మఫల సర్వస్వ భోక్త యొక్క బలియే యని నిరూపించి కణ్వశాఖోక్తంబులగు దక్షిణాదేవీ ధ్యాన స్తోత్ర పూజలు వివరించె.

## — దేవసేన యను శక్తి చరిత్ర —

ముని యిట్లనియె. శిశువులకుఁ గలుగు గండంబులు వారింప శక్తిగల శక్తి దేవసేన. మున్ను ప్రియవ్రతుండు

పుత్రేష్టి సేసి స్వర్ణప్రభుండును, సుందరుండు నగు కొమరుం
గనె. అతఁడు పుట్టిన యుత్తరక్షణంబున మృతిఁజెందె. తల్లి
మూర్ఛఁజెందె. తండ్రి పితృవనమునఁబడి దుఃఖించె. అపుడు
దేవసేన యనుశక్తి యెదుటఁదోఁచి నన్నుఁ బూజింపు,నీ సుతు
నిత్తును. ఇతఁడు సువ్రతుం డను పేర సకలశుభలక్షణుం
డగునన్న, నతం డట్లుసేసి సుతు బ్రతికించుకొనియె. అవ్వల
మంగళ చండికమహిమంబు వాకొని ముని మానసకన్యా
ప్రభావబోధకంబుగ నిట్లనియె.

మున్ను పన్నగములభయ మధికమైన కశ్యపుఁడు మాన
సాధిష్ఠితమహిమ నొక్కదేవి సృజించె. ఆపె కౌమారమున
శంకరు నర్చించి జ్ఞానంబుగని కృష్ణానుభావకంబగు మంత్రమ్ము
వడసి జపించె. హరి సర్వపూజ్యవయ్యెద వని యామె ననుగ్ర
హించె. కశ్యపుఁడు జరత్కారున కామె నొసంగె. అతఁడు
తపస్సునఁగలిసి యామెతోడ నిదురించె. రవి యంతలో నస్త
మించె. లేపకున్న సంధ్యాలోపంబును, లేపిన నిద్రాభంగం
బగునని శంకించియు ధర్మలోపము బలీయంబని; దాని కంగీక
రింపక యామె లేపగా, భర్త సుఖభంగంబు సేసితివి; నీ జపో
పవాసాదులు నిష్ఫలములని కోపింప నామె యతనిపాదములు
వట్టుకొని యేడ్చిన రవి సంధ్యాదేవితోఁగూడ వచ్చి యామె
యెడ సైరణవహింపుమని కోరెను. మునియు సైరించె.
అయ్యింతి శోకమున శూలిని, బ్రహ్మను, ముకుందుని, కశ్యపుని
దలఁచిన వారు నరుదెంచి యీసునఁ బతివ్రతను వీడుట పాడి
కాదు. దీనియం దొక సుతుని వడయు మనిన నతం డవ్వేల
లఁది నాభి నంటినంత గర్భంబై యాస్తీకుఁ డనువాఁ డుద

యించె. జరత్కారుఁ డతఁడు విష్ణుభక్తుం డగుననని తెల్పి తపంబునకుఁ జనియె.

ఒకప్పుడు జనమేజయుఁడు సర్పయాగము చేయుతఱిఁ దక్షకుం డింద్రుఁ జేరి శరణన్నఁ గనలి జనమేజయుండు 'సహేంద్రతక్షకాయస్వాహా' యన్న సంక్షోభంబు ప్రబ్బె. అంత నయ్యాస్తీకుఁడు దేవాళి రక్షించె. విప్రు లాతని నుతించి మానసి నర్చించిన నామె తక్షకుం గాపాడె.

## —♦ కామధేను చరిత్ర ♦—

నారాయణుండు నారదున కిట్లనియె. ఒకతఱి హరి రాధికతోఁ బాలుద్రావునాస కామధేనువును సవత్సగాఁ దన వామాంగమునఁగాంచి జన్మమృత్యుజరాదులహరించు క్షీరంబు పిదికె. ఆ దుగ్ధము రాధావిహారంబున కనువైన కొల నయ్యె. ఆ గోవునకు సవత్సలైన పెక్కు గోవు లుదయించె. ఆధేనువుం గూర్చిన మంత్రంబులు వినిపింతునని తెల్పి నింద్రుఁ డీ సురభిఁ బూజించి వరంబులు వడసె. అతఁ డొనర్చిన స్తవంబు పఠించిన గోధనంబులు సమృద్ధంబులగు. యజ్ఞతీర్థఫలం బొదవు.

## —♦ రాధా చరిత్రము ♦—

తొల్లి కాలగళుండు ప్రమథులంగూడి కొలు వున్నతఱి గౌరి పాంచరాత్రవిధానంబును, రాధికాచరిత్రయు విననలతు ననుటయు, గౌరీపతి యది మిపుల రహస్యంబు, చక్రి గోప్యంబని సెప్పె, నా మనోహారిణివగుట నీ కెఱింగింతు విను మని యిట్లనియె.

మున్ను మాలతీవనమధ్యంబున గోలోకరాసమండల
మున రత్నగిరిపై మణిపీఠి నంబుజాక్షుండు నిలిచి సృష్టికాంక్షం
జేసి రెండు రూపు లొందె. దక్షిణంబున గృష్ణుండై, వామంబున
రాధయై రాసక్రీడాతత్పరత వర్తించె. అప్పు డయ్యిరువుర కమృ
తానంద మొదవె. అప్పటివారి యన్యోన్యవిలాస వీక్షణంబుల
దేవవనిత లుదయించిరి. 'రా'యనంగ దానంబును, 'ధ'యనంగ
ముక్తియుగ నామె 'రాధ' యనంబఱగె. రాధయన సిద్ధియని
వేఱొక నిష్పత్తియుం గలదు. రాధవామాంగమున మహా
లక్ష్మియు, కృష్ణదక్షిణాంగంబునం జతుర్భుజుండగు విష్ణుం
డుదయించి యయ్యిరువురు వైకుంఠము నలంకరించిరి త్రిభువన
లక్ష్ములు వారివారి యంశంబులు. విష్ణువక్షంబు నా దేవి
యలంకరించె. రాధయె మూలప్రకృతి. బ్రహ్మాదుల కద్దేవి
దర్శన మలభ్యము. ఆదేవి శ్రీకృష్ణునంశంబగు సుదాముండను
గోపునివలని కోపమున భూమికి వచ్చి వృషభునింట వసించె.
రాధకు శాపం బేమి? చిత్రంబని పార్వతి వలుక శర్వుం డిట్ల
నియె. హరి యొకప్పు డొండొక గోపికతోంగూడి యున్నతఱి
గోలోకమున నొక్కనిముసంబు జరిగె. అది పుడమి నెంతో
యయ్యె. అత్తఱి దూతిక హరిచెయిదంబు రాధికతోం
జెప్పిన నామె దనసన్నిధినున్న విరజ కృష్ణగమనంబు గుర్తింప
లేదని యామెం దండింపం బోయిన నామె ముందె యెఱింగి
నదీరూపమునం బుడమి కేగె. నదులు, నదములు,
సముద్రములు నపుడు జనించినవే. రాధ యిలుసేరి కృష్ణు
నాగ్రహంబున జంకించుట గని సుదాముండను గోపకుం
డోర్వక వాదించిన నామె కోపించి నీవు రాక్షసుండవు కమ్మని.

శపించె. అతండును బుడమి గోపికవు గమ్మని రాధను శపించె. అతండు వెండియు వెఱచి వేడుకొన్న వానిం దయం జూచి తాను వృషభనాముఁడగు గోపకుని పుత్రియయ్యె. వృషభు భార్యగర్భము గాలిచేనించి మాసములునిండఁ దా నంచు మాయచేఁ బుత్రికయై జనించె. పిమ్మటఁ గృష్ణుండు కంసు వధింప నేగి యామెను బెండ్లియాడె. సర్వేశ్వరుఁడయ్యు హరి రాధాదివ్యరూపంబు దెలియరా కరువదివేలేండ్లు దపంబు సలిపి బృందావనంబున నామె సత్యరూపముం గాంచె. పిదప వారు గోలోకంబున రమించిరి. అట్టి రాధ నుపాసించి కళావతీ యశోదలు వృషభనందులు గోపీగోపులు ముక్తులై గోలోకంబు నొందిరి. నందుఁడు బ్రహ్మాంశము. యశోద సరస్వతి. వసుదేవుఁడు కశ్యపుఁడు. అదితి దేవకి. వీరందరు రాధాకృష్ణోపాసనంబున ధన్యులైరి. వైకుంఠమునఁ జతుర్భుజుఁడుగను, గోలోకమున ద్విభుజుఁడుగను హరి నిలిచె. మహాలక్ష్మి గంగా సరస్వతు లను సమాఖ్యఁగొని పరాశక్తి వైకుంఠంబునను, రాధిక గోలోకంబునను వసించిరి. రాధానామ ముచ్చరించి కృష్ణు దలఁపకున్న బ్రహ్మహత్యాపాపంబు కలుగు. కార్తికపూర్ణిమఁ గృష్ణుఁడు రత్నఘుటిక యందు రాధ నుపాసించి కటకంబు ధరించె. రాధ సర్వదేవారాధ్య యని శివుండు వెండియు నిట్లనియె.

## —♦ సుయజ్ఞచరిత్ర ♦—

మున్ను మనువంశజుఁడు సుయజ్ఞుఁ డరువదివేలేండ్లు రాజ్యమేలె. అతఁ డొకనా డొక విప్రుఁడు మలినాంగుఁడై

సేవకులకు మ్రొక్కుచు కన్నీరు నించుచుఁ జెంతకు రాఁగా, రాజు రోషించి నిందించిన తపసి రాజ్యము గోల్పోదువని శపించె. రాజు భయపడి యవ్విప్రువెంటఁ బఱచిన నాతని సభలోని మునులును నట్లె యేగిరి. అమరు లా రాజును విడిచి పోయిరి. విప్రు డా రాజు నెడ జాలిగొని యతనిస్తుతులకు మెచ్చి నేను గాశ్యపుఁడ, నాకు సదాశివుఁడు విద్యాదాత, కృష్ణుఁ డిష్ట దైవము. నీవు రాజ్యంబు సుతుల కిచ్చి పత్ని నటన యుంచి యడవిం దపమునఁ గాలంబు గడపు మనియె. అతం డట్లసేసి ముక్తినందె. ఇట్లు ద్విజకుఁ జంద్రశేఖరుండు చెప్పినట్లు నారాయణుండు నారదున కెఱింగించెనని వ్యాసభట్టారకుండు జనమే జయునకుఁ దెల్పినట్లు సూతుండు శౌనకాదులకు వినిచిన వారవ్వాలి వృత్తాంతం బానతి మ్మనిరి.

---

# దశమస్కంధము

మున్ను స్వాయంభువమను వింతి శతరూపతోఁ దపంబు సేయ దేవి ప్రసన్నయై పెక్కువరము లిచ్చి వింధ్యనివాసినియై వర్తించెనని వింధ్యము భాను నవరోధించెనని విందు మక్కథఁ దెల్పుమనిన సూతుం డిట్లనియె.

—♦ అగస్త్యుండు వింధ్యగర్వం బణచుట ♦—

మున్ను దేవముని వింధ్యంబును జూడవచ్చిన "మేరువు పర్వతరాజని గర్వించినాఁడు. నా కది యీసు గల్గించెడు"నని

వింధ్యము దెల్పిన విని దేవముని యల్లన నవ్వి చనియె. వింధ్య మట్లు తపించుచు నెట్టకేల కేమైన నగుఁగాక భానుని తెరు వడ్డగింతునని యెగసిపడి యెగయ నారంభించె. మరునాఁటి యుదయంబున రవియరదంబు సాగకయ్యె. సారథి యరుణుండు భ్రాంతించె. జగంబులనడక లాగిపోయె. బ్రహ్మాదులు హరిం బ్రార్థించిరి. అతఁడు హరిసన్నిధి కేగవలయు నని చనియె. సిర శేఖరుం డిప్పుడు వారణాసి నున్న యగస్త్యుంను శరణంబన వా రేగి యతని బ్రార్థించిరి. అగస్త్యుఁడు లోపాముద్రాసహి తుఁడై తెలిలి పుణ్యరాశి కాశి విడుచుటకు గాసిఁజెందె దేవ కార్యం బనివార్యంబని యట కేగి వింధ్యమువంకఁ జూచి నంతన యప్పర్వతంబు గర్వం బుడిగి చుళుకితాంభోధి యగు నత్తపోనిధికి సాష్టాంగమ్మొనర్చిన నతఁడు కృపావధి గావునఁ గాచి "యడఁగియుండుము; లోకంబుల గతి తప్పుఁ గాన యెన్నఁడు నిట్టిపనికిఁ జొరకు" మని శాసించె. సూతుం డిట్లు దెలిపి వ్యాసోదిపాదులు శ్రీమాత సాకతంబున సృష్టి గావించుట దెలిపి వెండియు నిట్లనియె.

# ఏకాదశస్కంధము

నారాయణుండు దేవీవైభవంబు వివరించిన హర్షించి నారదుండు నే యే కర్మములచేత నే యే గోష్ఠులచే దేవి భక్తుల మనుచు, నదియెల్ల దెలిపి యజ్ఞాననివృత్తి సేయవే యని యడుగుటయు, ధర్మరూపము, ప్రాణాయామాదిస్వరూపము, శౌచనిర్ణయము, • గాయత్రీమంత్రవిశేషములు, రుద్రాక్షమాహాత్మ్యము, భూతశుద్ధి, పాపపురుషరూపము, శిరోవ్రతవిధి, భస్మమహిమంబు, తద్ధారణవిధి, సంధ్యోపాస్తి, బ్రహ యజ్ఞక్రమంబు, గాయత్రీపురశ్చర్యావిధానంబు, వైశ్వదేవపద్ధతి సవిస్తరంబుగ వివరించె నని సూతుం డమ్మునీంద్రు లిట్లనియె.

# ద్వాదశస్కంధము

అంబికానుగ్రహలబ్ధి కృపాయం జేమని యడిగిన నారదునకు నారాయణస్వామి గాయత్రీవర్ణ విభవము, గాయత్రీసహస్రనామస్తోత్రంబును, గాయత్రీదీక్షావిధానంబును, మంత్రసిద్ధివివరంబును, వృత్రాసురవధయుఁ దెలిపె. మఱియు గాయత్రీమంత్ర మహిమం బెందు వర్ణింపఁబడెనో, యదియె భాగవతం బగుట శ్రీభాగవతంబు పరమలక్ష్యంబుగఁ దెలిపి భగవతి భగవంతునకును, నతఁడు బ్రహ్మకును, నతఁడు దేవమునికిని, యమ్మౌని సనకాదులకును, వారు బ్రహ్మర్షులకుం దెల్పిన నపుడు నేను వింటి నని నారాయణుండు దెల్పిన నారదుండు విని కృతార్థుండై నా యాశ్రమంబునకు విచ్చేసి, నాపై నిర్హేతుకజాయమానకృపాకటాక్షంబుల నినిచి యంబికారూపం బగు దేవీభాగవతంబు నా కుపదేశించె. నని బాదరాయణుండు జనమేజయునకు బోధించె. ఇది గురుపరంపర. ఇట్టి పరాశక్తికిని, జనార్దనునకు, బ్రహ్మకు, సనకాదులకు, బ్రహ్మర్షులకు, బాదరాయణునకు నమస్కరించెదనని సూతుండు దెల్పిన శౌనకాదులవ్వారికి మ్రొక్కి బ్రహ్మానంద మందిరి. జనమేజయునకు బాదరాయణుండు బోధించుట నతఁడు కృతార్థుం డయ్యె. ఎవ్వరేని యీ శ్రీ భాగవతంబుఁ బఠింతురు, శ్రవణం బొనర్తురు, వ్రాయుదురవ్వార లిహంబునఁ బుత్ర పౌత్ర ధన ధాన్య గవాది సకల సమృద్ధులఁ దులతూగి భగవతీసాయుజ్యము నొందఁగలారు, సర్వార్థసిద్ధియగు, నిది పావనపావనంబు, ధర్మధర్మంబు,

మంగళ మంగళంబు నని యెఱుంగ విజయావహంబు విజ
వహంబు.

క॥ దేవీ భాగవతం బిది
పావన మగు; శ్లోకసంఖ్య పదునెనిమిదివే
లై విద్యాశ్రీ లాభం
బై వెలయున్ భక్తకల్ప కారామంబై.

మ॥ అల సారస్వత కల్పవృత్త మిది గా
యత్రీ మహార్థంబు రం
జిల వృత్రాసుర సంహృతి ప్రథితమై
శ్రీ మాతృ నానా రసో
జ్జ్వల లీలా లలితాకృతిన్ బరగు వ్యా
సప్రోక్త మంబాకృపా
కలనా కల్పిత ముక్తినామక వధూ
కల్యాణ కల్యాణమై.

ఇది శ్రీ భాగవతము

సంపూర్ణము.

—o—

శ్రీ

# వామన పురాణము

---

శ్రీహరిని వామనుని వటుసేవసేసి
వామన పురాణ గదిత కథామనోజ్ఞ
సార మలరింతు నఖిల సంసార తాప
మపనయింపఁగ వ్యాసుని కంజలించి.

## — వామన పురాణ స్వరూపము —

తే॥ గీ॥ వామనం బిది పదునాల్గవది తనర్చు
శైవమై కూర్మకల్పకథావిశేష
మయి పులస్త్యుఁడు సురముని కానతిచ్చి
నది పవిత్రంబు దశసహస్రాత్మకంబు.

శ్రీకరంబైన పులస్త్యమహర్షి యాశ్రమంబునకు నారద మహర్షి విచ్చేసి కృతానుష్ఠానుండై కూరుచుండిన పులస్త్యుం గాంచి యిట్లనియె. ఓ మునిచంద్రా! నీకుఁ ద్రికాలములు ప్రత్యక్షములు. భగవద్విషయము నీకుఁ గరతలామలకము. శ్రీ మహావిష్ణువు వామనావతారము ధరించుట, పరమభక్తాగ్రేసరుఁడయ్యు ప్రహ్లాదుఁడు దేవతలతో యుద్ధ మొనర్చుట మొదల

లగునవి చిత్రమయిన విషయములు. దక్షసుతయగు సతీదేవి శంకరు నర్ధాంగి యయ్యు శరీరము విడిచి హిమవంతుని కూతురై మరల శివున కేల పత్నియయ్యెను? బ్రహ్మజ్ఞ శిరోమణివగు నీవే యీ సంశయముల వారింప సమర్థుండవు. మఱియు, తీర్థ వ్రతాదుల విశేషముల మీావలన వినవలతును. ఆనతీయవే యన వాగ్విశారదుం డగు పులస్త్యుంఁడు వామన పురాణరూపము లయిన యీా కథల నిట్లు తెలుపఁదొడంగె.

## హర లలితము

ఒకప్పుడు మందరగిరిపై యీాశ్వరునితో సంచరించుచుఁ బార్వతి, గ్రీష్మకాల మేతెంచినఁ జూచి, దేవా! ఎండవేడిమి మిక్కుటముగానున్నది. తాళఁజాలకున్నదానను. మనకొకయిల్లు నిర్మింపు మనియె. హరుఁడు, హైమవతీ! నేను నిలువ నీడ లేని వాఁడను, అరణ్యములే నా కావాసములు. అన్న నద్దేవి యాతాపము సైచి యూరకుండెను. వర్షఋతువును, శరదృతు వును వచ్చినతఱి నద్దేవి మహాదేవు నట్లే గృహమొక్కటి సంపాదింపుమని ప్రార్థించుచునే యుండెను. అయ్యీాశ్వరుం డును నేను ధనహీనుఁడను, పులితోలు గట్టుకొని పాముల జందెములుగాఁ దాల్చి తిరుగుచున్నాను. పద్ముఁడు పింగళుఁడు నను సర్పములు నాకు కుండలములు. కంబలుఁడు ధనంజ యుఁడు నను సర్పరాజులు భుజకీర్తులు. అశ్వతరుఁ డను నాగుఁ డెడమచేతికిని దక్షకుఁడనుపాము కుడిచేతికిని గంకణములుగా నున్నారు. నల్లని కాటుకవలె నుండు నీలుఁడు నాకు మొల నూలు. సతీ! చూచితివా? నావైభవము నన నా భవాని

శంకితురాలై సిగ్గుచే దలవంచుకొని దుఃఖితురాలయ్యెను. మఱియు నామె "ప్రియా! నీ చెప్పినట్లుగనే మన మిఁక నెల్లకాలమీ చెట్టుక్రిందనే యుండవలెంగదే. వానకుఁ దడియుచు నుండవలసినదేనా" అనెను. అంతట శశాంకధరుఁడు, గౌరీ! మన మట్లేల చేయవలయును? ఈవర్షకాలమున మేఘమండలమున వసింతము రమ్ము. అట్లయిన నీ యీ సుకుమార దేహలతికపై నీటిధారలు పడవు అని తెలిపి యప్పుడే యొక ఘనమైన ఘనాఘన మండలము నిర్మించి, యందు దాక్షాయణితోఁ గూడి విహరించెను. నాటినుండియే యుమాపతికి జీమూతకేతుఁడను పేరు ప్రఖ్యాతమయ్యె. [జీమూతమునకు మీఁదఁ గేతువు వలె నున్నవాఁడు. మేఘమండలము మీఁద నున్నాఁడని యర్థము.]

దేవమునీంద్రా! అట్లుమామహేశ్వరు లమ్మేఘములందే పై వర్షకాలమును గడపిరి. అంతట విశ్వమోహనమైన శరదృతువు వచ్చెను. నదులు, నాకసమును నిర్మలములయ్యెను. తామరలు వికసించె. చంద్రునికాంతి యతిశయించె. తరులతాసంతతులు కుసుమభరితములయ్యె. అతిరమణీయమై, సుప్రసన్నమైన యీ శరత్కాలమున పార్వతీజాని జాయతో, మందరముపై నొక సుందరప్రదేశమున నధివసించి విహరించెను. శరత్సమయముతుదను శ్రీ మహావిష్ణువు మేల్కాంచెను. అత్తఱి దక్షప్రజాపతి యజ్ఞసంకల్పము సేసి, యింద్రాదిసర్వదేవతలను, కశ్యపాదిమహర్షులను, సపత్నీకముగా నాహ్వానించెను. యజ్ఞవాటమునకు ద్వారరక్షకునిగా, ధర్మదేవతను, నియమించెను. సమిధలు, యజ్ఞార్హములగు కాష్ఠ

ములు, సామగ్రులు సిద్ధముచేయుట కరిష్టనేమి నేర్పఱిచెను. చంద్రాదేవితోఁగూడిన యంగిరసుఁ డను ఋషిని వంటశాల కధికారి నొనర్చెను. మహానుభావుఁడైన భృగుమహర్షిని యజ్ఞోచితసంస్కారములు గావింప నియోగించెను. రోహిణీ సహితుఁడైన చంద్రుని, అగ్నిని, ధనాగారమునకుఁ బెత్తనము వహింప నిచ్చెను. పార్వతీపరమేశ్వరులం దప్ప తక్కిన, కూతుండ్ర నల్లుర నాహ్వానించెను. శంకరుఁడు, 'కపాలి' (పుఱ్ఱెను చేతఁ ధరించువాఁడు) యగుట చూచి, దక్షుఁ డట్లు శంకరు నవమానపఱుప నెంచెను. అన నారదుఁడు "పులస్త్య మునీంద్రా! దేవాదిదేవుండగు నీశ్వరుఁడు కపాలము చేతఁ బట్టుకొని బిచ్చ మేల యెత్తుకొనవలసివచ్చెను. అక్కథ వివరింపవే" యన నమ్ముని యిట్లనియె.

## —♦ శంకరుఁడు కపాలమును ధరించిన కథ ♦—

లోక మేకార్ణవమై నశించినతఱి, కాఱుచీఁకటు లలము కొని యుండెను. వేయివత్సరములు జరిగిన యా రాత్రి విష్ణువు శయనించెను. అతఁ డట్లు గడచి, నిద్రనుండిలేచి బ్రహ్మను సృజించెను. అతఁడు వేదవేదాంగము లెఱింగి, సృష్టికర్తయై, యైదుముఖములతో నుదయించెను. అతనికిఁ బిమ్మట మఱి యొక విచిత్రపురుషుఁ డుదయించె. అతఁడు త్రినేత్రుఁడు, త్రిశూలధారి, జటాధారి, తమోగుణమయుఁడునై, జపమాలం ధరించి పొడసూపెను. అతనివెంటనే విష్ణు వహంకారమును బుట్టించెను. బ్రహ్మయు, హరుఁడును నా యహంకారమునకు లొంగిపోయిరి. అంత శంకరుఁడును బ్రహ్మయు, నీ వెవ్వఁడ

వన నీ వెవ్వఁడవని వాదులాడుకొనిరి. అప్పుడే నారదా! నీవు వీణతోఁగూడ పుట్టి మధురముగా గానముచేయుచు. ఆకాశమునఁ జరించితివి. అట్లు వాదులాడెడునంతట శంకరుఁడు వచ్చి నిలువఁబడిపోయెను. బ్రహ్మ యప్పుడు "నీవు తమోగుణమూర్తివి. దిగంబరుఁడవు, విషమనేత్రుఁడవు, ఎద్దు నెక్కి-తిరుగు స్థాణువవు. లోకముల సంహరింతువు." అని యాత్రిని గూర్చి పలుకగా, రుద్రుఁడు కన్నులెఱ్ఱఁబడ, లోకములనెల్ల భస్మమొనర్తు నని యెంచి బ్రహ్మవంక గనుంగొనెను. అప్పుడా యీశ్వరుని యైదుముఖములు వరుసగా సితమును, (తెలుపు) ఎఱుపు, బంగారమురంగు, అవదాతము, నలుపు జేగురుగలిసిన రంగు, నను నైదురంగులుగలవిగా నయ్యెను. అవి యెవ్వరికిం జూడ వీలుగాకుండెను. అంత బ్రహ్మ ఓరీ! నీవు బుద్ధిహీనుఁడవు. బలహీనుఁడవు. నీకు పరాక్రమముగలదా? ఏదీ చూపుమన, నా రుద్రుఁడు, కోపిష్ఠుఁడై గోటికొనచే బ్రహ్మశిరస్సును జిదిమివైచెను.

అట్లు గిల్లఁబడిన యా తల శంకరునిచేతిలో నంటుకొని పోయెను. అవల బ్రహ్మ యొక విచిత్రపురుషుని సృష్టించెను. అతఁడు బాణములు, విల్లు, శక్తియుఁ దాల్చి నాల్గు బాహువులుగల్గి, అమ్ములపొదిం దగిలించుకొని, సూర్యతేజుఁడై వెలుంగుచు కానవచ్చి రుద్రునింగాంచి, "ఓరీ! నీవు బ్రహ్మహత్యాపాతకుండవు. ఇట్టి నిన్నెవ్వరు చంపుదురు? నేను నిన్ను దాఁకను" అని నొవ్వఁబలికెను. ఆ మాటలు విని రుద్రరూపి యగు శంకరుఁడు భార్యతో బదరికాశ్రమమున కేగి నారాయణుని భజించి నాకు భిక్ష పెట్టుమని ప్రార్థించెను. నారా

యఁబుఁడు ఓ కపర్ది! నీ త్రిశూలముచే నా యెడమచేతి మీఁద గొట్టు మనెను. అట్లు శివుఁడు సేయ నారాయణుని వామ హస్తంబునుండి మూఁడు రక్తధారలు స్రవించె. అం దొకటి నక్షత్రమండలమునం దున్నది. రెండవది భూమిపైఁ బ్రవహించెను. దానిని ఋషులు గ్రహించిరి. అందుండి అత్రి, శంకరుని యంశముచే దుర్వాసుండు నుదయించిరి. మూఁడవది రౌద్రరూపమై మహేశుని చేతిలోని కపాలములోఁ బడియె. అందుండి కవచముపూని యొకవీరుఁడు నవయౌవనమూర్తియై తెలుపు నలుపు రంగులతోఁ గూడిధనుర్బాణములతో, గర్జించుచుఁ బొడసూపె. మఱియు నాపుట్టుక యెందు లకో తెలుపుమని యడిగె. శంకరుఁడు, ఓయీ! నీవు బ్రహ్మ కుదయించిన సూర్యసమప్రభాయుతుండైన యా పురుషుని సంహరింపు మనియె. అతఁ డట్లు కావింప ధనుర్బాణములు గొని నడచిన, నా వీరపురుషు లిర్వురకు వేయి దివ్యసంవత్సర ములు పోరు జరిగె. తుదకు నారాయణబాహువునఁ బుట్టిన పురుషుండే యోడిపోయెను. బ్రహ్మ యంతట తనకు జనించిన యా పురుషుని సూర్య మండలమునఁ జేర్చెను. మహేశ్వరుఁడు తనవానిని నారాయణునందుఁ జేర్చెను.

## — హరిహర సంవాదము – కపాలమోచన తీర్థప్రశంస —

హరుఁడు తనచేత నంటుకొనిపోయిన కపాలముతోఁ గూడి పరితపించుచుండఁ గాటుకకొండవలెఁ దారుణమూర్తియై బ్రహ్మహత్య ప్రత్యక్షమయి యతనిమేనఁ బ్రవేశించె. దానికి గడుంగడు వగచుచు, త్రినేత్రుఁడు బదరికాశ్రమమున

నరనారాయణులయాశ్రమమున కేగి వారింగానక, యమునసర స్వతి మొదలగు పుణ్యనదుల కేగెను. ఇటులెంజూచియుని పాపమువదలి పోయెను. పిమ్మట పుష్కరారణ్యమగధారణ్యముల కేగెను. ఎన్నోతీర్థక్షేత్రముల దర్శించెను. కాని యా పాపము పోదయ్యె. అంతనతఁడు చింతాశోకపరవశుండై యుండగ చక్రధరులౌ నరనారాయణు లాకాశమునఁ గానవచ్చిరి. తోడనే శివుండు, దోసిలొగ్గి స్తోత్ర మొనరించె. [ఈ స్తోత్రము చాలగొప్పది.] అంతట నారాయణుండు "ప్రయాగ యను క్షేత్రమున యోగ నిద్ర నొక పురుషుఁ డున్నాఁడు. అతఁడు నా యంశము గలవాఁడు. అతని దక్షిణపాదమున, 'వరుణ' యను నదియు, నెడమపాదమున, 'అసి' యను నదియు జనించినవి. అవి పుణ్య ములు. ఆ నదులనడుమ 'వారణాసి' యున్నది. అది పరమ పవిత్రక్షేత్రము. దానిని సేవింపు" మనియె. శంభుం డట్లొనర్చి బ్రహ్మహత్యావిముక్తుండయ్యె. చేతిలోనికపాలము విమోచన మగుటకు నాతనిచేఁ జూపబడిన యొక దివ్యమైనమడువులో స్నానముచేసెను. దానిచే నదియందు జారిపడెను. అదే 'కపాలమోచనము' అనుపేర ప్రసిద్ధంబైన తీర్థంబయ్యె.

## — హరి వీరభద్రుల యుద్ధము —

జయాదేవివలన దక్షుని యజ్ఞవార్త విని, తన్ను బిలువ లేదని కోపించినశంకరుని మేనినుండి యొక దివ్యపురుషుఁడు మహాభయంకరమూర్తియై యావిర్భవించె. అతఁడే వీర భద్రుఁడు. అతనితో సేనాగణములు పెక్కులు పుట్టె. అతడు దక్షయజ్ఞమును నాశన మొనర్చెను. ఇంద్రాదిదేవత లంతట

దిక్కుగానక పారిపోయి శ్రీ మహావిష్ణువును శరణొందిరి. అతఁడు వీరభద్రు నెదిరించెను. దివ్యాస్త్రములచే వారిర్వురు పోరాడిరి. తుదకు హరి వీరభద్రునిపై కుటికి పట్టుకొని నేలంబెట్టి కొట్టెను. అంత వీరభద్రుని ముఖమునుండి రక్తధారలు గురిసి యందుండి యొక చక్రాయుధము జనించె. దానినే కొని హరి యతనిపై విసరిన వీరభద్రుం డోడి, శంకరుని శరణొందెను. అంత నీశ్వరుఁడు భద్రకాళీసహితుఁడై యట కవతరించి, యజ్ఞభూమింజొచ్చి సర్వమును దగ్ధమొనర్చి హరిపైఁ గవిసెను. హరి కుబ్జామ్రకానన మను నడవికిఁ బారిపోయెను. వసువులు పారిపోయి నీరయి 'సీతాసరి' త్తను పేర నుండిరి. సర్వదేవతలు పారిపోయిరి. కశ్యపాది మహర్షులు 'శతరుద్రీయమును' జపించుచు నమస్కరించుచుండిరి. దక్షునిభార్య లింద్రాదుల గట్టిగాఁ బిలుచుచు బానుకొని యేడ్వఁ జొచ్చిరి. ప్రహ్లాదాదులు హరునిపాదముల వ్రాలియుండిరి. హరుఁ డెదిరించినపూషునిపండ్లు రాలఁగొట్టెను. భగుని కన్నులు పీకెను. శంకరుని చూపుపడినంత యజ్ఞాగ్నులు భస్మప్రాయములయ్యె. యజ్ఞమంతట దివ్యదేహముతో మృగరూపముపూని దక్షిణాసమేతముగా నాకాశము వెంటఁ బారిపోయెను. కాలరూపియైన మృత్యుంజయుం డంతటఁ బాశుపతమును వింట దొడగి విడిచెను. దానిమేను రెండుగాఁ దెగెను. అం దొకటి యా తావున 'జటాధర' మనుపేర నున్నది. రెండవభాగము కాలరూపుఁడగు నీశ్వరునిపేర నాకాశమునఁ గానవచ్చుచున్నది.

## — శివుని కాల స్వరూపము —

అశ్విని, భరణీ, కృత్తికలోని యొకపాదము కలిసి మేష రాశి. ఇది కుజక్షేత్రము. కాలరూపుఁడగు శివుని కిది శిరస్సు. కృత్తిక మూఁడుపాదములు రోహిణి, మృగశిర రెండుపాదములు వృషభము. ఇది శుక్రునిల్లు. ఇది యాతని ముఖము. మృగశిర మిగత రెండుపాదములు, ఆర్ద్ర, పునర్వసులో మూఁడును మిథునము. ఇది బుధుని యిల్లు. ఇది శివుని రెండుబాహువులు. పునర్వసుపాదము, పుష్యమి, ఆశ్లేషయుఁ గర్కాటము. ఇది చంద్రునిగృహము. ఇది శివుని ప్రక్కలు. మఘ పుబ్బ ఉత్తర లోనిపాదము సింహము. ఇది సూర్యునిసదనము. ఇది మహేశుని హృదయము. ఉత్తరలో మూఁడుపాదములు, హస్త చిత్తలో రెండును, కన్య. ఇదియును బుధునిగృహమే. ఇది శివుని జఠర స్థానము. చిత్తలో రెండు, స్వాతి, విశాఖలో మూఁడుపాదములు తుల. ఇది శుక్రుని నివాసము. శివుని కిది నాభి. విశాఖలో పాదము, అనూరాధ, జ్యేష్ఠయుంగలిసి వృశ్చికము. ఇది కుజుని రెండవయిల్లు. ఇదిశంభునిమూత్రస్థానము. మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢలో పాదము ధనుస్సు. ఇది బృహస్పతి యావాసము. ఇది శంకరుని తొడలు. ఉత్తరాషాఢ మూఁడు శ్రవణము ధనిష్ఠలో సగము మకరాశి. ఇది శని యిల్లు. ఇది గిరీశుని జాను భాగము (మోకాళ్ళు) ధనిష్ఠలో రెండుపాదములు, శతభిషము పూర్వాభాద్రలో మూఁడు కుంభము. ఇదియును శని నివాసమే. ఇది దేవుని పిక్కలు. పూర్వాభాద్రలోనొకటి ఉత్తరాభాద్ర రేవతియు మీనము. ఇది బృహస్పతి రెండవయిల్లు. ఇది

కాల స్వరూపుఁడగు శివునియొక్క పాదములు. ఇట్లు కాలరూపుఁడైన హరుఁడు విసిరిన బాణములచే దక్ష యజ్ఞము భగ్నమయ్యెను. కాని యజ్ఞమూర్తి కించుకయు బాధకలుగక యుండెను. అతఁడు నక్షత్రములచే నావరింపఁబడి యాకాశమున నున్నాఁడు.

## —• మేషాది రాసుల స్వరూపము •—

నారదుఁ డడిగినఁ బులస్త్యుం డిట్లనియె, మేషము చర రాశి. ఇది మేకవలె నుండును. సముద్రమున, ధాన్యములందు, లేఁతపచ్చికగల చోట్లను పుష్పశోభితమయిన సరస్సునొడ్డునను నిది యుండును. ఎప్పుడు నిది మేకలవంటి జంతువులలో నుండును. రెండవరాశి వృషభము. ఆ స్వరూపముతో గోవుల గుంపుతో నుండును. పంటపొలములు దీని నివాసము. మిధున రాశి దంపతీరూపము గలది. శయ్య, పీఠము మొదలయినవి దీని సామగ్రి. వీణాగానమునందు, ఆటలయందు నృత్యగీతాదు లందు శిల్ప కళయందు నిది వర్తించును. ఇది రెండు భాగము లయిన రాశి. కర్కటకము పీతవలె నుండునది. దీని సంచా రము నీటిలో, ఇది వరిమళ్ళయందు, చెఱువులందు, జనసంచా రము లేనిచోట్ల నుండును. సింహరాశి సింహరూపమున నుండును. కొండలు, గుహలు, అడవులు, దుర్గములు మున్నగు వానియం దిది సంచరించును. కన్యారాశి పండు, దీపము చేతఁ బట్టుకొన్న సుందరియగుకన్యవలె నుండును. ఇదియు రెండుభాగములుగా నుండును. అడవా రాడుకొనుతావులు దీని నివాసములు. వడ్లలమును గడ్డియందుఁ దుల నివసించును.

క్రయవిక్రయములు దీని సంచారస్థానములు. ఇది త్రాసుధరించిన పురుషునిబోలి యుండును. ఇది ఇండ్లలో నగరములందు, రాజవీథులందుఁ జరించును. వృశ్చికరాశి తేలువలెనే యుండును. పెంటలయం దిది తిరుగును. పేడ పురుగులు మొదలగు వానిలో నిది చరించును. ధనుస్సు ధనుస్సుధరించిన మానవునిరూపున నుండును. ఇది యిరుభాగములు కలది. పైభాగము మనుష్యునివలె, క్రిందిభాగము గుఱ్ఱమువలెఁ గానిపించును. ఇది గుఱ్ఱములు, ఏనుగులు, ఆయుధములు అను వాని స్వరూప మెఱిఁగినది. ఇది యేనుఁగులలో రథములలోఁ దిరుగును. మకర మేనుఁగుకన్నులు వృషభముమూపు గలిగినది. నదులందు సముద్రమునందు దీని నివాసము. కల్లుపాకలును దీని యావాసములు. మీనరాశి రెండుచేపలవలె నుండి తీరములందు సాగరములందు నుండును. పుణ్యక్షేత్రముల బ్రాహ్మణదేవగృహములందు నిది వసించును. ఈ రాశి స్వరూపము చాల రహస్యము. మున్నెవరికిని యిది నేను జెప్పలేదు. చాల ప్రాచీనమైన యిది విన్నఁ బాపములు వాయును.

## —♦ నరనారాయణుల చరిత్రము ♦—

బహుబుద్ధుఁడను విప్రుఁ డొకఁడు దివ్యపురుషుఁ డుండెను. అతఁడు ధర్ముని యవతారమే. అతనిభార్య యహింస. అతఁ డామెయందు హరి, కృష్ణుఁడు, నరుఁడు, నారాయణుఁడు నను నల్వురు పుత్రులం గాంచెను. హరికృష్ణులు యోగులయిరి. నరనారాయణులు తీవ్రతప మొనర్చిరి. వారి తపమునకు లోకము లాకులము లయినంత నింద్రుఁడు రంభను బంపి

ను. ఆమెకు మన్మథుని వసంతుని తోడిచ్చెను. వారు బదరికా వనమున కేగునంత నవ్వనము జగన్మోహనం బయ్యె. నారాయణుఁ డా వినూతనశోభ కాశ్చర్యపడి నలుదెసలు చూడ నొకచోఁ గందర్పుఁడు కానవచ్చె. చూచి, ధైర్యశాలియగు నమ్ముని పరిహాసముగా అనంగా! దయచేసినావా? యని పలుకరించె. అంతట వసంతాదు లా ధీరత చూచి భయపడి పోయిరి. తోడనే నారాయణుండు తన తొడలనుండి దివ్య సుందరి నొక్కతెను సృష్టించెను. ఆమె యూరువులందు జనించిన దగుటచే యూర్వశి యను పేరొందె. ఆమె యందముగాంచి రంభ తెల్లఁబోయెను. నారాయణుఁ డామెం జూపి దీనిని మీ యింద్రునకుఁ గానుకగా నిత్తును. కొంపొండని వారలతో ననియె. వారును నింతటితో బ్రదికితి మని దానిం దోడ్కొని స్వర్గమునకుఁ బోయిరి. అవల భక్తవరుఁడైన ప్రహ్లాదుండు బలగర్వమున వారితోఁ బోరి యోడి శరణొంది రాజ్యాదులు వీడి భగవద్ధ్యానపరుండై ముక్తివడసినకథ సవిస్తరముగా వర్ణితమై యున్నది. [దేవీభాగవతము చూడు.]

## —♦ అంధకాసురవధ ♦—

ప్రహ్లాదుఁడు విరక్తుఁడై హిరణ్యాక్షునికుమారుఁడగు నంధకుని రాజ్యమున నిలిపి తపశ్చర్య కేగెఁగదా! వాఁడు తొలుత గ్రుడ్డివాఁడయ్యుఁ గొంతకాలమునకుఁగన్నులు వడసె. అందుచేతనే వాఁడు రాజ్యార్హుండయ్యె. వాఁడు శివునింగూర్చి తపమ్మొనర్చి వరములం బడసె. వానిం జయింపఁ గలవారు లేరైరి. శుక్రుఁడే యాతని గురువయ్యె. వానింగెలిచినఁగాని

శాంతి లేదని యింద్రుడు దేవసైన్యముతో వానిపై కదలెను. అని పులస్త్యుండు తెల్పె నారదముని ప్రశ్నమునకు ప్రత్యుత్తరముగా నా యీ దేవతల వాహనముల నిట్లు వివరించె.

## —♦ దేవతల వాహనములు ♦—

ఇంద్రునివాహనము ఐరావత మను నేనుగు. తెల్లనిది, అమిత బలముకలది. యమునివాహనము పౌండ్రిక మను దున్నపోతు. నల్లనిది, మనోవేగముకలది. వరుణునిది 'జలకి' యను పేరుగలది. శ్యామవర్ణముగలది. రుద్రునికర్ణమలము నుండి యది పుట్టెను. కుబేరునివాహనము 'నర'మను పేరు గలది. అంబికపాదములం దది పుట్టినది. దానికన్నులు బండి చక్రమువలె నుండును. వీర్యవంతులయిన గంధర్వులు, భయంకరులైన సర్పములు, కామధేనువు బిడ్డలయిన వృషభములు, నేకాదశరుద్రులవాహనములు. చంద్రునివాహన మయిదు వందలహంసలచే మోయబడు 'రథము' అను పేరుగలది. ఆదిత్యులకు గుఱ్ఱములు, రథములు, ఒంటెలు ననునవి వాహనములు. వసువులు గజవాహనులు. యక్షులు నరవాహనులు. కిన్నరులు సర్పవాహనులు. అశ్వినీకుమారులు గుఱ్ఱము లెక్కువారు. మరుత్తులు లేడిపై నేగువారు. అనలు లను వారికి చిలుకలు వాహనములు. గంధర్వులు పాదములచారులు.

## —♦ రాక్షసుల వాహనములు ♦—

అంధకాసురుడు దివ్యరథ మెక్కెను. అది సహస్రారములు గలది (అరము = బండియాకు), నల్లనిది. మంచిజాతియైన గుఱ్ఱములు కట్ట బడినది. అది త్రినల్వపరిమాణము కలది.

(నాలుగువందల కిష్కులు = ఒక నల్వము) ప్రహ్లాదుని రథము చంద్రునివలెఁ దెల్లనిది. ఎనిమిది గుఱ్ఱములు కలది. ఆ రథ మొకభాగము తెలుపు నొక భాగము బంగారురంగును గలది. విరోచనుని వాహన మేనుఁగు. కుంభునిది గుఱ్ఱము. జంభాసురునిది బంగారుగుఱ్ఱములు కల దివ్యరథము. శంకుకర్ణునిది గుఱ్ఱమే. హయగ్రీవుఁడు గజారూఢుఁడు. మయాసురునివాహనము ప్రఖ్యాతిగన్న రథము. దుందుభి వాహనము పెద్ద సర్పము. శంబరుఁడు విమానయాయి. అయశ్శంఖుడు సింహగామి. పెక్కురు పాదచారులుం గలరు.

## —♦ అంధకాసుర యుద్ధము ♦—

ఇట్టి వాహనములపై దేవాసురులు వెడలి ఘోరసమరము సేసిరి. తుదకు దేవతలోడిపోయిరి. అంధకుఁడు భూలోకమును గెల్చి, పాతాళమునకు నేలికయై యం దశ్మకము సాఖ్యనగరముగాఁ ద్రిలోకము నేలుచుండెను. దేవతలతో సమకట్టి యేగి శివుఁడు సర్వదేవతలబలములను దనలోఁ బ్రవేశింపఁజేసికొని వాని నెదిరించెను. ఇరువురకు నతి దారుణ యుద్ధము జరిగె. తుదకు శివుఁ డలసిపోయె. అతనిమేనఁ జెమటలూరె. ఆ చెమటలో నొకకన్యక రక్తముగారు మేనితో నుదయించె. ఆమెం గని మహేశుఁడు రక్తముచేఁ బూయఁబడుటచేఁ 'జర్చిక' యను పేరువెట్టె. అంధకుఁడు హరునిచేతి శూలము లాగికొని యాతనినడినెత్తిం గొట్టిన నందుండి రక్తము స్రవించె. అందు భైరవుఁడు జనించె. అతనిపేరు 'విద్యారాజు.' అతఁ డగ్నిసమతేజుఁడై, పద్మమాలాధరుఁడై చూపట్టె. మరియొక రక్తధారనుండి రుద్రుఁడను మరొక్క భైరవుఁ

దుదయించె. అతఁడు శూలాస్త్రధారి. మఱియొకధారయందు నల్గురుభైరవులు గల్గిరి. వారే చండుఁడు, కపాలుఁడు నను నిట్టి పేరులఁ బ్రసిద్ధిగాంచిరి. భూమిపైఁబడిన రక్తమున లలిత రాజు అను భైరవుఁడు పుట్టె. అతఁడును శూలధారి. వీఁడు గాక 'విఘ్నరాజు' అనుపేర నెనిమిదవ భైరవుఁ డుదయించె. అతని యొక్క చెమటబిందువు భూమిపైఁబడిన నం దొక బాలుఁడు కలిగె. ఆతఁ డంధకునిరక్తము ద్రావఁజొచ్చెను. శివుఁ డతనిం గాంచి నీవు గ్రహమూర్తివై శుభాశుభములం గూర్తువు. ఏ గ్రహమును నీకుఁ గీడుచేయఁజాల వనియె. ఆబాలుఁడే 'కుజుఁడు' అనుపేర గ్రహములం దొక్కరుం డయ్యె. అవల హరుఁడు వేయి దివ్యసంవత్సరములు తన నేత్రాగ్నిచేతను, సూర్యునిపలనను నంధకుని నిస్సారుం జేసి వైచె. శివతేజమునఁ బాపములు కాలిపోయి వాఁడు దేవ మూర్తియై హరుని శరణొంది పెక్కురూపముల నుతించెను. అంబికను గూడ పెక్కురీతుల స్తవము లొనర్చెను. శంకరుఁడు వానియెడ బ్రసన్నుఁడై తన మేనినుండి దేవతలనెల్ల వెలికి రప్పించి యందు భృంగి యను తన సేవకుంజూపి వీఁడే యీ యంధకుఁడు! అని వారికిఁదెల్పిన వారు నాశ్చర్యపరవశులై హర్షించిరి. పిమ్మట వానింగొని పార్వతీపతి, శ్వేతార్కకుసుమమునఁ (తెల్లజిల్లేడు) దన రాకఁగోరి దాగియున్న భవానిం బిలిచిన నామె యందుండి వచ్చె. ఆమెకు ఇదుగో! నీ కుమారుఁ డంధకుఁ డన నామె వాని నాదరించె. వాఁడు పెక్కు విధముల నుతించె. ఆమె వానికి శివభక్తి యనుగ్రహించె.

వాఁడు దేవదేవుని దయచే భృంగిరూపమును బడసి యాతని ప్రమథగణములందు ముఖ్యుండై వర్తించె.

## —♦ సుకేశి చరిత్రము ♦—

నారదుఁడు మున్ను సూర్యుఁడు సుకేశిశిరము నాకాశము నుండి క్రిందికిఁ బడఁద్రోసెనని చెప్ప విని యాకథ వివరముగాఁ జెప్పుమని యడిగిన పులస్త్యుం డిట్లనియె.

మున్ను విద్యుత్కేశుం డను రాక్షసరాజుండెను. వాని పుత్రుఁడు సుకేశి. అతనియెడ శివుఁడు ప్రసన్నుఁడై యాకాశగమనము చేయఁగల యొకపట్టణము నిచ్చెను. సుకేశి ధర్మవర్తనుఁడై యా పట్టణముచే రాక్షసులతోఁ గూడ నాకాశయానము సేయుచుండెను. అతఁ డొకమారు మగధదేశమునఁ దిరుగుచుఁ బెక్కు ఋష్యాశ్రమములం జూచి దిగి, ఋషుల సన్నిధి కేగి వారివలన ధర్మస్వరూపము, జంబూద్వీపాదులచరిత్రము, కర్మవిపాకము, భువనకోశస్వరూపము, వర్ణాశ్రమాచారములు, సుశకునములు, దుశ్శకునములు, తిథివర్జ్యములు, భోజ్యాభోజ్యములు మొదలగు పెక్కువిషయములను వినెను.

అప్పుడు మునులు సుకేశి కిట్లనిరి: యజ్ఞాదికము, స్వాధ్యాయరహస్య మెఱుఁగుట, విష్ణుపూజ యివి దేవతలధర్మములు. పరాక్రమము, మాత్సర్యము, యుద్ధసత్కారము, నీతిశాస్త్రవందనము, శివభక్తి యివి దైత్యుల ధర్మములు. యోగసిద్ధి, స్వాధ్యాయము, బ్రహ్మజ్ఞానము, హరిహరభక్తి ఉపాసన, నృత్యవాద్యములయందు జ్ఞానము సిద్ధుల ధర్మములు, సరస్వతి యం దమిత భక్తి గంధర్వధర్మములు. విజ్ఞానము,

పౌరుషముమీఁద నమ్మిక, విద్యాసమర్థతయు, విద్యాధరుల ధర్మములు. వీరికిఁ బార్వతియందు భక్తి మిక్కుటము. సంగీతవిద్య, శిల్పము, సూర్యోపాసనము కింపురుషుల ధర్మములు. బ్రహ్మచర్యము, యోగాభ్యాసము, అహంభావము లేకుండుట, కామగమనము పితరుల ధర్మములు. బ్రహ్మచర్యము, సత్యము, జ్ఞానము, నియమము, ధర్మజ్ఞానము ఋషుల ధర్మములు. స్వాధ్యాయము, బ్రహ్మచర్యము, యజ్ఞతపోదానములు, అకార్పణ్యము, అనాయాసము, దయ, అహింస, ఓర్పు, ఇంద్రియజయము, శుచిత్వము, మాంగల్యము, ఉమాశంకరులందుభక్తి, సూర్యోపాసనయు, మానవుల ధర్మములు. ధనసంపద, భోగములు, స్వాధ్యాయము, శివపూజ, అహంకారరాహిత్యమును గుహ్యకుల ధర్మములు. పరదారధనాపేక్ష, స్వాధ్యాయము, శివభక్తి యివి రాక్షసులధర్మములు. అవివేకము, అజ్ఞానము, అశుచిత్వము, అసత్యము, మాంసాభిలాషయు పిశాచధర్మములు. ఇవిబండ్రెండు జాతులు. పుణ్యము నుత్తమగతియు గల వివే యని బ్రహ్మ పలికెను.

అతఁ డట్లు విని వారికడ సెలవుఁ గైకొని తనపురి కేగి రాక్షసులందరకు నాధర్మము లుపదేశించి రాజ్యమును ధర్మయుక్త మొనర్చెను. అంత నాతనిజనములందరు పుణ్యమూర్తులై దివ్యతేజస్సుతో వెలుఁగఁజొచ్చిరి. వారి కాంతిముందు సూర్యచంద్రనక్షత్రములు దివిటీముందుదీపములయ్యె. వాని పట్టణము పగలు సూర్యునట్లు రాత్రి చంద్రునియట్లు వెలింగెను. ఒక్కొక్కప్పు డందులకు భిన్నముగాఁగూడ వెలుంగుచుండెను, అందుచే సూర్యగతి తెలియక కాలచక్రమే యాగిన

స్థఁబెను. సూర్యుఁడే లేనిచో రాత్రి పవలు ననుభేదము తెలియక కంగారుపడె, యుదయించుట అస్తమించుట మాని వేసెను. అప్పుడు కాముకులు సూర్యుఁడని తోఁచి రాత్రులందు [illegible]. తలక్రిందైనప్పు డది రాత్రియని భావించి తనగూండ్లనుండి వెలికి వచ్చెను. కాకులు వానిం బరి మార్చుచుండెను. మునులు పగలని తలంచి రాత్రివేళనే స్నాన సంధ్యాజపహోమము లొనర్చుచుండిరి. చక్రవాకదంపతులు పవ లని యనుకొని యెలుఁగెత్తి పిలిచికొనెను. కొందరు పగ లని రాత్రియుండే యజ్ఞ మారంభించిరి. కాముకులు చంద్రోద యమున కుప్పొంగఁజొచ్చిరి. ఒకవంక కలువలు వేఱొకటఁ దామరలు వికసించెను. చంద్రునిప్రియురా లగు రోహిణి చేసిన యక్షయాష్టమీవ్రతపుణ్యముచేతఁ గావలయు చం ద్రుఁడు క్షీణింపక యిట్లున్నాఁ డని కొందరు, శ్రావణము మొదలుగ నాల్గునెలలు మన మాచరించిన యశూన్యశయన వ్రత ఫలముచే మన కీ నిరంతరశయనసుఖముగూర్చు రాత్రి యయ్యె నని కొందరు, చంద్రుఁడొనర్చిన యఖండవ్రత రూప విష్ణుసేవ యతని కీ వైభవ మిచ్చెనని కొందరు పలుకఁజొచ్చిరి.

ఇకంతయుం గని, సూర్యభగవానుఁడు, ధ్యానముపూని నంత నాతని కీ సుకేశిపురము పరమపుణ్యమై యీరీతి వెలుఁ గుచున్నదని యెఱింగి కోపించి, యారాక్షసపురమును సమూల ముగా నాకసమునుండి క్రిందికిఁ బడఁద్రోసెను. అంత నప్స రలు హాహాకారము లొనర్చిరి. శివభక్తు లగు రక్కసుల గతి చూచి చారణులు గగ్గోలుసేసిరి. శివుఁడు విని తన భక్తుల నట్లుసేసిన సూర్యుని క్రిందికిఁ ద్రోసెను. అతఁడు పొడుగ

పూర్వమువోలె రాలి పడుచుండగా సర్వమునులును దేవా! శ్రీహరి క్షేత్రమునఁ బడు మనిరి. ఆ దేవరయో తెల్పుఁడని యతఁడు వారి నడిగె. వారు వారణాశియే యని చూపిరి. అతఁ డందు డిగెను. హరనేత్రాగ్నిచేఁ దగ్ధుఁడైన యా దినకరుఁ డసి నదిలో స్నాన మాచరించెను. వరుణయందును మునిఁగెను. కాని సుఖము లేకుండెను. అప్పుడు సూర్యరథమందున్న ఋషులు యక్షరాక్షసాదులు బ్రహ్మకు విన్నవించిరి. బ్రహ్మ మందరాద్రి కేగి శంకరుని వేడిన నాతఁడు ప్రసన్నుఁడయ్యె. ఇర్వురును కాశీపురికి వచ్చిరి. శంకరుడు భానుని బట్టుకొని లోలార్కుఁడని పేరువెట్టి (అటు నిటునూగుచు పడుటచే నీపేరు వచ్చినది) తన కావాసమగు నా నగరమున నుండ నియమించెను. సుకేశిని మున్నువోలె నిలిపెను.

## —♦ హరిహరారాధన వ్రతములు – దేవతలు నిద్రించుట ♦—

పులస్త్యుఁ డిట్లు వివరించె. ఆషాఢమున సూర్యుఁ డుత్తరాభిముఖుఁడై నతఁడే, శ్రీహరి శేషతల్పమున శయనించును. అతఁడు నిద్రింపఁగనే దేవ గంధర్వులు, గుహ్యకులు, దేవ మాతలు నిద్రింతురు. ఆవరుస యెట్టులన; సూర్యుఁడు మిథున రాశి కభిముఖుఁడు కాఁగా, శుక్లపక్షైకాదశియందు హరి శేష శయ్య కల్పించుకొని ద్వాదశియందు నిద్రించును. త్రయోదశి యందు మన్మథుఁడు కదంబకుసుమములచే (కడిమిపూవులు) శయ్య గూర్చుకొని శయనించును. చతుర్దశినాడు యక్షులు తామరపూలపాన్పున నిద్రింతురు. పూర్ణిమయందు శివుఁడు పులితోలుఁ బరచికొని జటలు ముడిచికొని నిద్రపోవును. ఆవల దినకరుఁడు కర్కాటకరాశి కేగును. అదే దక్షిణాయన ప్రారం

భము. దేవతలకది రాత్రి. బ్రహ్మ నల్లగలువలఁ బఱచుకొని లోకముల కుత్తమమార్గముం జూపుచు శయనించును. విదియ నాఁడు విశ్వకర్మ, తదియఁ బార్వతి, చవితి వినాయకుఁడు, పంచమి యందు యముఁడు, షష్ఠియందుఁ గుమారస్వామి, సప్తమి యందు రవి, అష్టమియందుఁ గాత్యాయని, నవమి మహాలక్ష్మి, దశమిని వాయుభక్షులగు నాగులు, ఏకాదశియందు సాధ్యులు నిద్రింతురు. అపుడు ప్రావృట్కాలము వచ్చును. కొంగలు, బెగ్గురు పక్షులతోఁ బర్వతముల నెక్కును. కాకులు గూండ్లు కట్టుకొనును. ఆడకాకులు గర్భములతో గూండ్లయందు నిద్రించును. విశ్వకర్మ నిద్రించెడు విదియనాఁడు శ్రీవత్సాంకి తవక్షుఁడవై యెల్లపుడు నెట్లు నీ వీ సుఖశయన మలంకరించితివో అట్లే మా శయనములును శూన్యములు కాకుండున ట్లను గ్రహింపు మని ప్రార్థించి నాల్గుమాసము లీ వ్రతము నాచరింప వలెను. సూర్యుఁడు వృశ్చికరాశికి రాఁగానే దేవతలు వరుసగా మేల్కాంతురు. తులయందు ముందు హరి, తరువాత కాముఁడు మేల్కాంతురు. ఆ విదియనాఁడు హరిప్రతిమాదానము చేయవలెను. ఈ వ్రత మాచరించినవారికి వియోగదుఃఖము కలుగదు.

శ్రావణమునఁ గృష్ణపక్షాష్టమి మృగశీర్షానక్షత్రయుక్త మైనచోఁ గాలాష్టమి యనఁబడును. ఆనాడు శంకరుఁ డెల్ల లింగములందు నిద్రించును. నాఁడు లింగార్చనము సర్వఫలప్రదము. దుత్తూరపుష్పములచే నాఁడు హరుని బూజింపవలెను. ఆశ్వయుజమున నవమియందుఁ దామరలచే నర్చింపనగును. ఇట్లు సంవత్సరవ్రతము పూనవలెను.

### —♦ ఆయా దేవతల కిష్టములైన పుష్పాదులు ♦—

ఆశ్వయుజమున బ్రహ్మనాభినుండి కమల ముదయించె. అపుడే దేవోద్యానములన్నియుఁ బుట్టినవి. మన్మథునిచేతిలోఁ గదంబము కలుగుటచే నది యాతని కిష్టము. యక్షరాజగు మణిభద్రునిచేతిలో వటము (మఱ్ఱి) జనించె. అందుచే యక్షుల కద్దానియందుఁబ్రీతి. శివునిహృదయమున దుత్తూరము (ఉమ్మెత్త) బ్రహ్మమేనఁ బచ్చవలె మెఱయు ముదుగుదామరయు, విశ్వకర్మమేనఁ గంటకీతరువును, పార్వతిచేతిలో కుందము (మొల్ల), గణాధిపతి కుంభస్థలమున నుండి సిందువారము (వావిలి), యముని కుడిపార్శ్వమునుండి పలాశము (మోదుగ), యెడమ ప్రక్క కృష్ణోదుంబరము (నల్లమేడి), కుమారస్వామిమేన బంధుజీవము (మంకెన), రవి కశ్వత్థము (రావి), కాత్యాయనికి జమ్మి, మహాలక్ష్మిచేతిలో బిల్వము (మారేడు) జనించి వారివారి కవి ప్రీతిదాయకము లయినవి. సర్పములమోమున రెల్లు, వాసుకి వెన్నునుండి, తోకనుండి సితాసితము (తెలుపు నలుపుగల) దూర్వలు (గరిక), సాధ్యులహృదయమున హరిచందనము జనించి వారికిఁ బ్రియములయ్యె. అని పులస్త్యుండు తెలుప నారదుఁ డంతట యశూన్యశయనాదివ్రతముల విధాన మడిగెను. అవల దేవీమాహాత్మ్యము, మహిషాసురసంహారము, మొదలగు ప్రసిద్ధగాథలు వర్ణింపఁబడినవి.

### —♦ కురుక్షేత్ర మేర్పడిన కథ ♦—

పులస్త్యుఁడు దేవర్షి కిట్లనియె:—

సత్యయుగము మొదట ఋక్షుఁ డను చంద్రవంశనృపతి యుండెను. అతనికుమారుఁడు సంవరణుఁడు. తండ్రిచే నితఁడు

బాల్యమందే పట్టాభిషిక్తుఁడయ్యెను. విష్ణుభక్తుఁడై ధర్మముచే నిలను పాలించెను. వశిష్ఠుఁ డాతనికిఁ బురోహితుండయ్యె. ఒక యనధ్యాయదినమున నతఁడు 'వైభ్రాజము' అను వనమునకు వేటకేగి యొక జగన్మోహినియగు సుందరిం గాంచె. ఆ యంగన తపతి యను నది. అట్లు చూచి మోహపరవశుఁడై యింటికిఁ జని, యామెకై పరితపింపఁదొడగి కృశించె. రాజకార్యములు మఱచిపోయెను. వశిష్ఠుఁ డక్కుమారప్రభుని వార్త యెఱిఁగి, తపతి సూర్యకుమారి యగుట యెఱింగి, సూర్యు నర్చించి, యామెం గొనివచ్చి రాజునకుఁ బాణిగ్రహణము సేయించె. తపతీసంవరణులకుఁ గురుఁడను కుమారుండు గలిగె. అతఁడు సర్వశుభలక్షణలక్షితుఁడై పదియేండ్ల ప్రాయమునకే విద్వాంసుండయ్యె. తండ్రి యక్కుమారునికి సుదాముఁడను రాజుకూతురగు, సౌదామినిం దెచ్చి వివాహ మొనర్చె. పిమ్మట నతనిని సార్వభౌముని గావించె.

కురునృపాలుఁడు, లోకములందు శాశ్వతకీర్తినిలుచు సత్కార్యము చేయనెంచి భూమండలమెల్ల సంచరించె. ద్వైతవనముదర్శించి, యుత్తరబ్రహ్మవేదికరుదెంచె. దీనికే "శమంతపంచక" మనిపేరు. బ్రహ్మకైదు వేదు లున్నవి. ప్రయాగదామమందు మధ్యమవేది. గయాశిరము పూర్వవేది. విరజాక్షేత్రము దక్షిణవేది. పుష్కరము పశ్చిమవేది. ఇందే మూఁడు కుండము లున్నవి. వీని మాట విని కురురాజు వీనిని నేను దున్ని, కోరినవస్తువెల్ల నిందుఁ బుట్టింతునని బంగారునాగలిచే దున్నెను. దానికి యమవాహనమైన మహిషమును, రుద్రుని వాహనమైన ఋషభమును గట్టెను. అత్తఱి నింద్రుఁడు వచ్చి,

రాజా ! నీవేమిచేయుచున్నావనెను. అతఁడు "తపము, సత్యము, దయ, క్షమ, శౌచము, దానము, యోగము, బ్రహ్మచర్యము" లను నెన్మిది విషయములను బండించుటకు వ్యవసాయము సాగించితి ననెను. ఇంద్రుఁడు వీనికి విత్తనములెట్లు తెత్తువని పరిహసించి వెళ్ళిపోయెను. రాజట్లే యేడేస్క్రోశములవంతున నాల్గువైపుల దున్నెను. అంత హరి యేగి, యింద్రుఁడడిగినట్లే యడిగిన, నాతఁడట్లే జవాబు నిచ్చెను. మఱియు విత్తనములు నా దేహమందే కలవని యా కురురాజు పలికెను. శ్రీహరి నేను విత్తనముల నాటెదను. నీవు దున్ను మనియె. రాజంతట తన కుడిచేయి సాచెను. హరి చక్రముచే దానిని వేయి తునుక లొనర్చె. రెండవచేతినిగూడ రాజితరుల రక్షించుటకే యర్పించెను. దానినిగూడ హరి ఖండించెను. తరువాత తొడ లిచ్చెను. వానిని నఱకెను. తుదకు తల యిచ్చెను. శ్రీవిష్ణు వంత నాతనియెడ దయగొని వరము లొసంగె. ఆ వరములచే నా దున్నినభూమి ధర్మక్షేత్రమయ్యె. అటఁ జచ్చువారు ముక్తిగాంతురు. ఇట స్నానదానాదు లనంతఫలదములు. హరిహరాదు లందు వసింతురు. కురురాజును గీర్తిగడించి, దివ్యశరీరియై రాజిల్లెను. అవల హరిచంద్రుఁడను యక్షుని, వాసుకిని, విద్యాధరుఁడగు శంకుకర్ణుని, రాక్షసరాజైన సుకేశుని, దేవదేవుఁడైన మహాదేవుని, అగ్నిని, కురుక్షేత్ర పాలకులుగా నియమించె. వారి కనుచరులైన యెనిమిదివేలమంది యీ భూమిని గాపాడి పవిత్రముగా నుంతురు. ఇందు నడుమఁ బృథూదకమను తీర్థ మున్నది. అది యతిప్రాచీనము; సర్వతీర్థ నిలయమును.

## —♦ మురాసుర సంహారము ♦—

కశ్యపునికుమారుఁడు మురుఁ డను రక్కసుఁడు గలఁడు. వాఁడు బ్రహ్మంగూర్చి తపమొనర్చి యందరిని సంహరింపఁగల బలము వరముగాఁ బడసెను. తొలుత స్వర్గము నాక్రమించెను. పిమ్మట యమునిపై దండెత్తెను. యముఁడు, "ఓయీ! నీవు సృష్టిసంహారము చేయువాఁడ వయ్యెదేని నీ చెప్పినట్లు నడచెద" నఁ, వాఁడు "యమధర్మరాజా! నాకంటెను, నీకంటెను గొప్ప వాఁడెవ్వఁడో తెల్పరాదా?" అనియె. యముఁడు "శంఖచక్రాది ధరుఁడైన హరియే యతఁ"డనియె. అతఁడు జీవోదమను సము ద్రమునొద్ద నున్నాఁడనికూడ తెల్పెను. వాఁడటకుఁ బోయెను. విష్ణు వేల వచ్చితివని యడిగిన యుద్ధముఁగోరివచ్చినాఁడ ననియె. హరి, "ఓరీ! నీవు పోరఁదలచితివేని, నీహృదయ మంతగా వణంకిపోవుచున్నదేల ?" యని ప్రశ్నించెను. వాఁడు చూచు కొని తన చేతితో దాని గట్టిగానదిమిపట్టి, లేదే, అదరుట లేదే, అనుచునే పడిపోయెను. హరి యప్పుడు వాని హృదయము మీఁద తన చక్ర ముంచెను. దానిచే వానిమేను ముక్కముక్క లయ్యెను. దేవత లంత సుఖులైరి. నాఁడుమొదలుగ హరికి మురారి యను నామము ప్రసిద్ధమయ్యె.

## —♦ హిమవంతునికి ఉమాదేవి జనించుట ♦—

బృహస్పతి వర్షాధిపతియై గమనముచేసి మృగశీర్షా నక్షత్రము నాషాఢమునఁ బొందెను. అతఁడు చంద్రక్షయతిథి యందే యట్లు ప్రవేశించెను (అమావాస్యనాఁ డని తలంతును). ఆ నాఁ డింద్రుఁడు పితృదేవతల నర్చించెను. తిలపిండదానము

సేసెను. వారు మెచ్చి తమకూతు రగు మేనకను దెచ్చి దేవతల కిచ్చిరి. వా రామెను హిమవంతుని కిచ్చిరి. ఆమెయం దాతఁడు సునాభుఁ డను కుమారుని, రాగిణి కుటిల కాళి యను కూతు లం బడసె. ఆ సుందరులు వరుసగా ర క్తవర్ణయు, శ్వేతవర్ణయు నీలవర్ణయుంగా నుండిరి. వా రయిదవయేటనే తప మారంభిం చిరి. అందుఁ గుటిల యనుదానిని దేవతలు బ్రహ్మలోకమునకుం గొంపోయి, యీమె యీశ్వరవీర్యము ధరించి మహిషాసురుని జంపఁగల కుమారుని బడయఁగలదా? యన నాతఁ డీమె యందులకుఁ జాలదనియె. ఆమె కోపించి చాలుదు నని బనులు చెప్పె. బ్రహ్మ కోపించి నీవు నీరయి యంతటఁ బ్రవహింపు మని శపించె. ఆమె జలరూపయయ్యె. బ్రహ్మ యామెను ఋగ్యజు స్సామము లను బంధములచేఁ గట్టిపెట్టెను. ఆమె బ్రహ్మ లోకమునందే ప్రవహించుచున్నది. రాగిణికూడ యట్లే శివ వీర్యము వహింపజాలదనె. ఆమెయుఁ గోపించి తపోగర్వమున నెదురాడ, బ్రహ్మ "దేవతల కెదురాడితివిగాన నీవు సంధ్యా కాలమందలి యెఱుపుగా నుండు" మని శపించె. అంతరాగిణి సంధ్య యయ్యె. బ్రహ్మ కృత్తికాభాగముచే దృఢపఱచిన కాళిని మేనక దపస్సుచేయకుమని 'ఉ-మా, ఉ-మా' అనుచు నాపఁజూచెను. ఆమె యాఁగదయ్యె. ఆమెకు 'ఉమా' యను పే రందుచేతనే కలిగినది. ఆమెను శివునితోఁ గూర్చి దేవతలు కృతార్థులైరి. గౌరీకల్యాణ మంతట జరిగె.

## — ♦ వినాయక జననము ♦ —

శంకరుఁడు గౌరినిజేపట్టి మందరాద్రిపై విశ్వకర్మచే నొక్కగృహ మతిరమ్యముగా నిర్మింపఁజేసి యందు వసించెను

అట్లుండ మహేశుఁడు దేవిని కాళీ! యని పిలచిన, నామె కోపించి, యతని యనుమతి వడసి తపమ్మునకేగెను. ఒక పెద్దపులియు నామె ముఖమువంకనే చూపు నిలిపి నిలిచెను. ఆమె తపమునకు మెచ్చి బ్రహ్మ యరుదెంచె. పార్వతి తొలుత నా పులికి వరము లిమ్మనియె. బ్రహ్మ యా వ్యాఘ్రమును గణములకుఁ బతిం గావించె. పిమ్మటఁ బార్వతికి బంగారురంగుగల మేను నొసంగెను. ఆమె నల్లని దేహమును విడిచి, స్వర్ణశరీరము పొందెను. ఆమె విడిచిన దేహమందుఁ గాత్యాయని పుట్టి యింద్రు డామెను దక్షిణాదేవిగా గ్రహించె. పార్వతి యొక్క వెనుకటిశరీర మను కోశమునుండి పుట్టుటచే నామె కౌశికి యని పేరొందె. ఆమె యింద్రునికిఁ జెల్లె లయ్యె. అతఁడును కౌశికుం డను పేరు వడసె. అతఁడామెను వింధ్య గిరియందుఁ బ్రతిష్ఠసేసి సింహము వాహనముగా నిచ్చెను.

త్రిలోచనుఁడు మహుం బరిణయమై, యామెతో వేయివత్సరములు క్రీడింప లోకములం దుత్పాతంబులు కాన వచ్చె. ఇంద్రాదులు బ్రహ్మ కా సంగతి నివేదించిరి. దేవత లందరును శివతేజమున దేవియందుఁ గలుగువాఁ డింద్రపదవి హరించునని యింద్రుని బెదరించిరి. ఆబెదరుచే నాతని దివ్యజ్ఞానము నశించెను. అతఁ డగ్ని మొదలయిన దేవతలతో మందరగిరి కేగెను. అగ్ని హంసరూపు గొని లోనికిఁ బోయి శివునినెత్తిపైఁ గూర్చుండెను. మఱియు నప్పుడు దేవతలు దేవదర్శనము కోరి యున్నా రనెను. శంకరుఁ డంతఁ బార్వతిని వీడి, యగ్నితో ద్వారముచెంత కేగెను. అమరు లాతనిం జూచి హర్షించినుతించిరి. శివుఁడు మీ ప్రార్థన మేమనియె. వారు లోక

క్షోభకరమైన నీ యీ మిథునధర్మము మాను మనిరి. అతఁడు దేవతలారా! ఉద్రిక్తమయిన యీ నా తేజమును మీలో నెవ్వరేని భరింపవలయు ననియె. ఇంద్రాదు లందరు శక్తులు కారైరి. అగ్ని తనయం దుంపుమని యా శివవీర్యమును ద్రాగి వేసెను. దేవతలు తమతావున కేగిరి. అవ్వల దేవదేవుఁ డా జరిగినదానిని బార్వతికిఁ దెలిపెను. ఆమె కోపించి, యింతటి నుండి దేవతలకుఁ బుత్రసంతానము లేకుండుఁగాక యని శపించెను.

అట్లు శపించి, యామె స్నానముచేయ లోని కేగెను. మాలిని యను చెలికత్తె యామెకు సుగంధవస్తువులన్నియు సమకూర్చి నలుగు పెట్టెను. ఆ నలుఁగుబిండితో నుమాదేవి పెద్ద బొజ్జయు, నాల్గు భుజములును, నేనుఁగుముఖమును గల యొక బొమ్మను జేసి యట నుంచెను. మాలిని దానిం జూచి నవ్వుకొను చుండెను. గౌరి, ఓసీ! చెలి! ఏలనే యూరక నవ్వుచున్నావు? అన నది, దేవీ! శంభుఁడు నందీశ్వరునితోఁ దన కొక కొడుకు పుట్టు నని చెప్పుచుండగా వింటిని. అప్పటినుంచి నవ్వు వచ్చుచున్నది యనియె. అది విని హిమగిరితనయ శంకరుఁ డరుదెంచిన నాతనికిని స్నానము చేయించెను. అట నిదివరలో నుంచిన బొమ్మ యటనే యుండెను. ఉమామహేశ్వరుల చెమటయు, స్నాన జలమును గలిసి యా బొమ్మనుండి గజాననుఁ డావిర్భవించె. భవాని యాతనిం గౌఁగిలించుకొని ముద్దుపెట్టుకొనెను. శంకరుఁ డాతనిం జూచి యితఁడు తన్ను గొల్చువారి విఘ్నముల వారించుచు వినాయకుం డని పేరొందునని ఘటోదరుఁ డనువాని నాతనికిఁ దోడిచ్చెను. దేవి యమితప్రీతినందె. ఇక్కథ పవిత్ర

తరము. పాపహరము, స్వర్గదము. అవల చండ ముండ శుంభ నిశుంభవధ, కుమారస్వామి జననము చెప్పఁబడెను. (దేవీ భాగవతము చూడు.)

### —♦ దేవతలు విష్ణు హృదయమున శివుని దర్శించుట ♦—

దేవతలు విష్ణుని దర్శించి, లోకము లింతక్షోభించుట కేమి కారణము ? అనిరి. అతఁడది యెఱుంగ వారితో శివుని కడ కేగెను. అట్లేగినపు డింద్రాదు లతనింగాని, పరివారముం గాని మందరగిరిపైఁ జూడలేక పోయిరి. విష్ణువు వారితో ఓ నిలింపులారా ! మీరు స్వార్థపరులు. ఇంద్రుని పదవిపోవు నని శంకరుఁడును దేవియుం గూడియుండగా నోర్వక యామె గర్భంబుం బాడుచేసిరి. అట్టి మాకు జగన్మంగళ మూర్తియగు నాతఁడును సర్వమంగళయుఁ గానిపింతురే? గొప్ప నేరముచేసిరి. తాన నెదుటనున్న యాతనిం జూచుటకు మీకుఁ గన్నులు రాకున్నవి. అందులకు మీరు తప్తకృచ్ఛ్రవ్రతము గావింపుఁడు. అని యవ్విధాన మెఱింగించె. వారది యొనర్చిరి.

అవల వారు శివలింగమును హరిహృదయమందు దర్శించిరి. స్నానాది విధులచే నర్చించిరి. హరియే విశ్వరూప ముదాల్చి తనలోఁ ద్రినేత్రుని దర్శింపఁజేసెను. హరిహర స్వరూపమైన యమ్మూర్తిని వా రర్చించిరి. హరివెంట నేగి కురుక్షేత్రమున, నీటిలోనున్న స్థాణురూపము దర్శించిరి. అత నిచే నభయముం బడసిరి.

శంకరుఁ డుశనుఁడు తనకై చేయు తపమ్మునకు లోకములు క్షోభించుట గని వానికి సంజీవనీవిద్య ననుగ్రహించె.

మంకణుం డనుమహర్షి నాట్యము చేయుచుండగాఁ గని, యేల యిట్లు నటింతువు? నీ నాట్యముచే లోకములు వణంకు చున్న వని శివుఁ డన నతఁడు దేవా! నేను బెక్కేండ్లు తప మొనర్చితిని. నా చేతిపై నరుకుపడి 'ఆకుకూర రసము' వచ్చు చున్నది. దీనిచే నా తపమ్ము ఫలించి నా కాయము శుద్ధియైనది కదాయని హర్షించుచు నాట్యముచేయుచున్నా ననియె. శంభుఁ డంత తన చేతిపై నరుకుచేసి యందు భస్మ ముదయించుట చూపి, దీనికి నేను నీవలె నెగిరియాడనుగదా! అన నంతట వాఁడు నాట్యము మానెను. అతనికి దేవుఁడు బ్రహ్మలోక మనుగ్రహించె. ఈ కురుభూమియందలి యీ తీర్థము సారస్వత మనంబడు ననియె. ఇట్లు లోకక్షోభ ముడిపి యుమాజాని మందరాద్రి నధివసించె.

## — దండోపాఖ్యానము —

అంధకుఁడు బలగర్వితుఁడై, పాతాళమున కేగి, యటనున్న రాక్షసులతో ఓరీ! గిరికుమారిపై నామనంబు లగ్నమయినది. ఆమెఁదెచ్చి యిండని మదనాతురుఁడై పలికె. ప్రహ్లాదుఁ డంత, అంధకా! నీకు గిరిజ తల్లి. గిరిజాపతి శంకరుఁడు నీకుఁ దండ్రి. ము న్నొకరాక్షసుఁడు, అరజ యను కన్యం గని వలచి, నాశ మొందెను: అదెట్లన వినుము; దండుఁడను రాజుండెను. అతఁడు భార్గవుని బురోహితునిగాఁ బడసెను. భార్గవునికొడుకు శుక్రుఁడు. అతని 'కరజ' యను కూతు రుండెను. శుక్రుం డింట లేనితఱి, దండుఁ డామెం గాంచి మోహించెను. తన కోర్కె తీర్పుమని యామెంగోరెను. ఆమె, మాతండ్రి యిచ్చినం గాని

నిన్ను పరిగ్రహింపను. అతఁ డిప్పుడప్పుడే రాఁగలఁడు. అడుగు మనియె. వాఁడు సైపఁజాలక యిట్లనియె.

—♦ చిత్రాంగదోపాఖ్యానము ♦—

బాలామణీ! మున్ను విశ్వకర్మకూఁతురు 'చిత్రాంగద' యనునది, త్రిలోకసుందరి యుండెను, ఆమె సఖులతో జలక్రీడ లాడుచుండఁగా, సురథుఁడనువాఁడు చూచెను. ఆ సుందరునిం గనియది, గాంధర్వవిధిచేఁ బెండ్లాడఁజూచెను. దాని చెలికత్తెలు, బాలా! నీవు పిన్నదానవు, తండ్రి యాజ్ఞ చేఁగాని యట్లు చేయరా దనిరి. ఆమె వినక యాతని జేపట్టెఁ గదా! అన, నరజ ఓయీ! స్త్రీ చాపల్యముచే నది యట్లొనర్చి పడినపాట్లు చెప్పవేమి? నేను చెప్పెద వినుము. చిత్రాంగద తన్ను దా నిచ్చుకొన్నది విని, దానితండ్రి, ఓసీ! నీ కిది పెండ్లిగాదు. నీకు సంతతి గలుగదు. భర్తతో నెడఁబాటు పొందఁగలవు. సుఖముండదని శపించె. ఆ శాపముచే నది పెక్కుయోజనముల దూరమున బడెను. చెలికత్తె లామెను స్నానమాడించిరి. దానిచే నావెస్సబ్బురాలయి నంత వారు, మృతిచెందెననియెంచి, సంస్కరింప యత్నించిరి. ఆమె కన్నులు దెరచి చూచినంత వారు గానరారైరి. ఆమె సరస్వతీనదిఁ గొట్టికొనిపోయెను. అందుండి గోమతీనదిలోనికిఁ బోయెను. గోమతి యామె గర్భమునకుం జేర్చెను. ఇట్లినొన్ని యిడుమలపాలయిన చిత్రాంగద నాకేటి యుదాహరణము? అని యరజ యన దండుఁడు నవ్వి సరియే నీవు చెప్పినకథకు మీఁదివార్త వినుమని యిట్లనియె.

అట్లు చిత్రాంగద యరణ్యముఁజేరి యొక గుహ్యకుని చేతిలోఁ జిక్కెను. వాఁడు సురథునికడకుఁ గొంపోదునని చెప్పి కాళిందీతీరమున నున్న శ్రీకృష్ణుని మందిరము చేరునట్లొనర్చెను. అట నామె స్నానమాడి శ్రీకంఠుని కెదురుగా నిలిచియుండెను. అదే వేళ ఋతధ్వజుఁ డను శివదీక్షాపరుఁడు, సామవేది, తపస్వి, శ్రీకంఠుని కభిషేకము చేయువాఁడై వచ్చి, కంట నీ రొత్తుకొనుచున్న యా యంగనం గాంచెను. చిత్రాంగద యతని పాదముల వ్రాలెను. అతఁ డామె కథయెల్ల విని, దానితండ్రి యగు విశ్వకర్మ క్రూరుఁ డని యెంచి, వానిని గోతివై పుట్టుమని శపించె. పిమ్మట శివారాధన ముగించి యతఁడు "చిత్రాంగదా! నీవు సప్తగోదావరికిఁ జనుము. అట హాటకేశ్వరుం గొలిచి యుండుము. అటకు గంధమాలి యను రక్కసుని కూతురు 'దేవవతి' యనునది వచ్చును. అంజనుఁడను గుహ్యకునికూతురు దమయంతియు నటకే వచ్చును. పర్జన్యునికూఁతురు వేదవతియు నటకు వచ్చును. ఆ మువ్వురు సప్తసాగరములందుఁ జేరుదురు. నీ వప్పుడు హాటకేశ్వరునిలో లీనమయ్యెదవు" అనియె. ఆమె యట కేగ నొక ఋషి దయచే నొకశ్లోకము రచించియిచ్చె. దేవాసుర యక్ష రక్షోమనుష్యులం దొక్కరును నీమెను గాపాడువారు లేరా! యని యా శ్లోకార్థము. అవల నతఁడు పుష్కరస్వామిదర్శనార్థము పయోష్ణీనది కేగెను. అప్పుడు చిత్రాంగదనే యతఁడు తలంచుకొనుచుండెను. చిత్రాంగద సురథుని దలంచుచు నట నుండెను. ఆమె తండ్రి విశ్వకర్మ కోతియై నేల మీఁదఁ బడెను. అతఁడు శాలుకినీనదీతీరమున నొక కొండ

లోయలో వసించెను. అయ్యెడ రాక్షసుఁడైన కందరుఁడు కూతురుతో నటకు వచ్చెను. ఆ పిల్లయే స్వర్గమున వేదవతి యని పేరొందె. వానరుఁడైన విశ్వకర్మ యా పిల్లను జూచి మోహితుఁడై చేయిపట్టుకొని లాగెను. కందరుఁ డంతఁ దరిమిన వాఁ డాపిల్లంగొని హిమగిరికిఁ బాఱెను. అట యమునా తీరమున శ్రీకంఠుదర్శనముచేసి, యొక మున్యాశ్రమముం జొచ్చెను. అట నా పిల్లను డించి వాఁడు కాళిందిలో దూకెను. వానితోఁ గందరుఁడు నందుఁబడెను. వేదవతి గతించెనని వాఁడు స్వలోకమగుపాతాళమున కేగెను. కాళింది యా కోతిని శివనామకమగు నొక దేశమునకుఁ గొట్టివైచెను. కోతి గట్టుఁజేరిఁ మున్ను వేదవతిం దాచినచోటున కేగెను. అట్లేగుచు నంజనుఁ డను గుహ్యకుఁడు తన కూతురైన దమయంతిని గొని వెళ్ళుచుండగా, నామెయే కందరుని కూతురగు వేదవతి యని యెంచి యామె వంకకుఁ బరువెత్తెను. ఆమె హిరణ్వతీనదిలోఁబడెను. వాని తండ్రి దుఃఖితుఁడై తపమునకుం బోయెను. దమయంతి కోసలదేశమేగి యొక మఱ్ఱిచెట్టుంగాంచెను.అట నామె విశ్రమింపఁగా "ఇట నెవ్వరును లేరు.తపశ్శాలియగు ఋతుధ్వజునితో,నీ కొడుకీ మఱ్ఱిచెట్టుకడఁ గట్టువడినాడని తెల్పువా రెవరు" అని వినవచ్చెను. దమయంతి విని, నలుదెసలుం జూచి, చెట్టుమీఁద నొకబాలుని గాంచె. ఆ బాలుఁ డెఱ్ఱని జడలతో నచ్చటఁ గట్టబడియుండెను. దమయంతి వానింగాంచి తపించి, ఎవ రిట్లు నిన్ను గట్టిరన, వాఁడు, ఒకకోతి యిట్లు చేసెనని బదులుపలికె. మఱియు, నాకు తపమేబలము. నాతండ్రి ఋతధ్వజుఁడు మనుపురమందు

న్నాఁడు. నేను జాబాలి యనువాఁడను. నాతండ్రి, తొలుత నైదు వేలేండ్లు బంధమందునుపు.పిమ్మటపదివేలయేఁడ్లవయస్సుదాక, శరీరబాధ పొందుదువు. అదియే కౌమారదశ. అవల రెండువేలేండ్లు యౌవనానంద మందుదువు.అవల నాల్గువేలవత్సరములు వార్ధకము పొంది, నానాకష్టములఁ బడుదు వనియె. నేనైదేండ్లవాఁడనై హిరణ్వతీనదిలో స్నానముచేయఁబోవుచుండగా, నొక కోతి వేదవతి నెక్కడ దాఁచితివని నన్నడిగె. నాప్రాణము నిలువునఁ బోయినది.వాఁడు నన్నిటఁగట్టి పోయినాఁడు. అన విని యామె తన వృత్తాంతము వానికిఁ దెల్పె. నేను ప్రమ్లోచ యను దాని కంజనుఁడను గుహ్యకునివలనఁ బుట్టినదానను. నా పుట్టినతఱి, ముద్గలమహర్షి నేను రాణి నగుదునని చెప్పెను. అప్పుడు దేవదుందుభులు మ్రోసె. ఆ మునియే నాకు బాల్యమున నిక్కట్లు గల్గుననియె. నేను నీచెప్పిన కోతికే భయపడి నదిలో దుమికితిని. ఆ వేగముచే నిచ్చోటు చేరితిని. అది విని, యా బాలుఁ డామెను యమునాతీరమున, శ్రీ కంఠార్చనకు మధ్యాహ్న వేళకు వచ్చు తన తండ్రియగు ఋతధ్వజునికడ కేగుమనియె. ఆమె యట కేగెను. అటనున్న శ్లోకము పఠించి తాను నొక శ్లోకము వ్రాసెను. ఏమన; "ముద్గలఋషి నేను రాణి నౌదు ననియె. ఇప్పుడు నా పడుపాట్లు తప్పించువారు మాత్రము లేరు" అని. అట్లు వ్రాసి యొక మన్యాశ్రమము లోనికేగి 'దేవవతి'ని గాంచెను. వారిరొండోరులఁ గౌగలించుకొని ముచ్చటలాడుచుండిరి. ఋతధ్వజుఁ డప్పుడేవచ్చి, యా శ్లోకముం జూచి ధ్యానసమాధియందు సర్వము గ్రహించెను.

ఆవల శివపూజ గావించి, యతఁడిక్ష్వాకువు కడకేగి రాజా! ఒక గంధర్వకాంత నా కుమారవానిని బంధించినది. నా కొడుకు పండితుఁడు, సుగుణి. అన నా రాజుకొడుకగు శకునిం బంపెను. ఎవ్వరికిం దెగని యా పాశముల నతఁడు బాణముచేఁ గొట్టెను. ఋతధ్వజునికుమారుని సమీపించెను. జాబాలియు తండ్రికి మ్రొక్కెను. ఎట్లయిన నా పాశములు దెగవయ్యెను. అతఁడు చెట్టుకొమ్మను మొదలికి నరకెను. జాబాలి బాణపరంపర నూతచేసికొని యా కొమ్మతోనే దిగెను. ఇక్ష్వాకుసుతుఁ డాతనితో యమునానదీతీరమున కేగి, ఋతధ్వజుని దర్శింపఁ జిత్రాంగదయు, దమయంతియు వచ్చిరి. వారటకు వచ్చి ఋతధ్వజుఁడు వెళ్ళిపోవుటచే, శివలింగముపై నిడిన పూలు వాడి, దేవుని మోము వెలవెల పోవుటగాంచి, వారే యీ దేవు నారాధన జరిపిరి. అయ్యెడ గాలవుఁ డను ముని వారింజూచె.

అతఁడు శ్రీకంఠు నర్చించుతఱి, వారు మధురగాన మొనర్చిరి. అతఁడు వారి వృత్తాంతము విని, పుష్కరారణ్యమునకుఁ బయనమయ్యె. వారును గార్తికపూర్ణిమ కట కేగిరి. అచ్చటికీశ్వరభక్తులెల్లరువచ్చిరి. కాని ఋతధ్వజుఁడు రాడయ్యె. గాలవుఁడా కన్యలతోఁ బుష్కరమునందు దిగి, యొక చేపను జూచెను. ఆ మత్స్యరాజును బెక్కుమత్స్యములు సేవించుచుండెను. వారింజూచి యాచేప, ఓ కన్యలారా! మీరు విచ్చలవిడిగాఁ దిరుగుచున్నారు. మిమ్ముంబట్టి నాకు నపకీర్తి వచ్చును. నే నది యోర్వఁజాల ననుచుండె. ఆ యాడుచేపలు, చూడుము; మునియైన యీ గాలవుఁ డిద్దరుపడుచులతో నెట్లు

తిరుగుచున్నాఁడో! అతనికి లోకాపవాదము లేదా! నీకే వచ్చెనా? అనియె. అంతట నా చేప సందియమేమి? వీనికి లోకభీతి లేదు. మోహపరవశుఁడు గాలవుఁ డనియె. అది విని గాలవముని సిగ్గుగొని యానీటనే యుండెను. ఆ కన్యలాతని రాక గోరుచుండిరి. తక్కిన యాత్రికులెల్లరు నేగిరి. ఆకన్య లట్లేయుండిరి. గాలవుఁడు రాలేదు.

అంతట పర్జన్యుఁడను గంధర్వునిసుతయగు వేదవతి వచ్చెను. ఆమెతల్లి ఘృతాచి. అది యాకన్యలంగాంచి, వారి వృత్తాంత మెఱింగె. మఱియు పుష్కరఫలమంతయు గడచిన మీఁదట వచ్చితివేమన, వారి కామె యిట్లనియె. నేనువనవిహారము చేయుచుండగా నొకకోతి, ఓ దేవవతీ! నీవు భూతలమునుండి యీ మేరుగిరి కెట్లువచ్చితివనియడిగె. నేనంతట, దేవవతీకన్యను గాను; అది మేరువందే యున్నదంటిని. అది వినక నాపై కురికెను. నే నొక మంకెనచెట్టు నెక్కితిని. ఆ చెట్టుతో న న్నాకోతి సముద్రమున బారవైచెను. బ్రహ్మ నన్ను జూచి, "ఇది యింద్రద్యుమ్నుని భార్యకాఁగలది. మనువున కింద్రద్యుమ్నుఁడు పుట్టి పెక్కు యజ్ఞములు సేయు" ననియె. పిమ్మట నెవ్వరో యా చెట్టును నరికిరి. నేను గాలికిఁ గొట్టుకొనివచ్చి యిటఁ బడితినని పలుక, వా రంతట పుష్కరమున కేగి యాయిద్దరు కన్యలం గాంచిరి. వారు నలువురు సప్తగోదావరి కేగి, హాటకేశ్వరు నర్చించిరి. ఇక్ష్వాకుకుమారుఁడు జాబాలి, ఋతధ్వజుఁడును వారిని జాలయేండ్లు వెదకిరి. కొన్నాళ్ళకు జాబాలి మనుపుత్రుఁడగు నింద్రద్యుమ్నుఁడున్న శాకల రాజ్యమున కేగెను. అతఁడు వీరిని మువ్వురను బూజించెను.

ఋతధ్వజుఁడు తన బిడ్డను వెనుక నింద్రద్యుమ్నుని దోడుగాఁ గోరెను. అతఁడును; ఆర్యా! నే నిందులకే వూనితి ననియె. వా రట్లు బయలుదేరి, బదరికాశ్రమమున నొక మునిం గాంచిరి. అతనివార్త తెలియగా, నింద్రద్యుమ్నుఁ డాతని గౌఁగిలించుకొని కొంపోయెను. వారు సప్త గోదావరీతీరమున నక్కన్యామణులం గనుగొనిరి. అదే సమయమున ఘృతాచి వచ్చి కోతినిజూచి, నాబిడ్డను జూచితివా? అని ప్రశ్నించెను. ఆకపి, తా నా కన్యం గాళిందీతీరమున నుంచుట దెలిపెను. ఘృతాచి దాసితో కౌశికీనదివంక కేగుచుండెను. దారిలో నా ముగ్గురు రాజర్షులు, ఋతధ్వజుఁడును, కొడుకులును కౌశికీ తీరమునకు వచ్చిరి. జాబాలి యాకోతిని జూచి తన్ను గట్టివైచిన కోతి యిదేయని వారికిఁ జూపెను. ఇక్ష్వాకుకుమారుఁ డంతట దానిం గొట్టెను. ఋతధ్వజుఁడు వారించి, యా కపితో, ఓరీ! నీమూలమున నా బిడ్డ బంధమొందెను. యని నెత్తిమీఁది యీ కొమ్మను నీవుతొలగింపుమనియె. వాఁడుమెల్లగనేగియట్లొనర్చె. నీ కేమి కావలెనని ఋతధ్వజుఁడు కోతినడిగె. కోతియైన విశ్వకర్మ నా శాపము వాపుమనియె. ఋతధ్వజుఁడు, ఓయీ! నీవు ఘృతాచి కడుపున, బలిష్ఠుండయిన కొడుకుఁ గన్ననాఁ డీ శాపము పోవునని తెలిపె. అంతటఁ గపి స్నానముచేసి, స్నానమాడిన ఘృతాచి వెంట జనియె. ఆమె వీని నిజరూపమెఱింగి, కోలాహల పర్వతమున వానిం గదిసెను.

వారు కౌశికియందు స్నానములుసేసి, యొక రథముపై వచ్చు సురథుం గాంచిరి. చిత్రాంగద వానిం దన చెలులకుఁ జూపి యాతఁడే నా మనోహరుఁ డనియె. అవల ఋత

ధ్వజుని కొమరునిఁజూచి దమయంతి మోద మొందె. సురథుండు నటఁ జిత్రాంగదం గాంచి మోద మందె. ఋతధ్వజుఁడు యోగమహిమచే సర్వమెఱింగి యానందించె. అవల నందరును హాటకేశు నర్చించిరి. ఆ కోతియు ఘృతాచితో హాటకేశు సేవింప నప్పుడే వచ్చెను. చిత్రాంగద తల్లిం జూచి యానందించె. అట్లు వా రన్యోన్య సమాగమముంబొంది, యమితానంద మందిరి. కోతిరూపును వానికి కుమారోదయము కాగానే పోయెను. అంత నింద్రద్యుమ్నుఁడు వేదవతిని, జాబాలి కందరమాలి సుతను, దమయంతి నిక్ష్వాకుసుతుండును పరిణయమ్మాడిరి.

## —♦ దండదహనము ♦—

అని యిట్లు చిత్రాంగదాదులచరిత్ర వినిపించి, దండుఁడు అరజ నొడంబఱుప బూనెను. ఎంతకు నామె వినదయ్యె. వాఁడంత బలాత్కారమునకుం జొచ్చె,అంతలో భయకంపితుడై యింటికిఁ బోయె. శుక్రుఁ డరుదెంచి కూతురునిజూచి ప్రశ్నించిన నామె భయభ్రాంతయై సిగ్గుతో, తండ్రీ! నీ శిష్యుండు దండుఁ డిట్టి యకార్య మొనరించెననియె. శుక్రుఁ డంతట కోపోద్దీపితుఁడై యాచమన మొనర్చి యేడురోజులలో వాఁడు సమూలము నశించునని శపించె. అంత వాఁడు భస్మమయ్యె. అరజ తప మొనర్చి పవిత్రురాలయ్యె.

అని ప్రహ్లాదుఁడు గిరిజపై వలపు వలదని యంధకునికి హితోపదేశము వాఁడుసేసె. కాని వినక హరునిచే భగ్నమయ్యెను. ఆవల బలిచక్రవర్తిని వామనమూర్తియైన విష్ణువు శిక్షించినకథ వర్ణింపబడినది.

## —♦ దుంధుదైత్య పరాజయము ♦—

పులస్త్యుండు నారదున కిట్లనియె. కశ్యపుని కుమారుఁడు దనువు. వానికి దుందుఁడుపుట్టె. వాఁడు బ్రహ్మవలనఁ బెక్కు వరములు వడసె. కలియుగారంభమున నింద్రపదవి నాక్రమించెను. ఆకాలమందే హిరణ్యకశిపు డుండినదియు వారికోర్వక దేవతలు బ్రహ్మలోకమునకు లేచిపోయిరి. దుందుఁ డటకుఁ బోవుదారి యేమని తోడివారి నడిగెను. వా రెఱుంగమనిరి. శుక్రునిదగ్గర కేగిన నతఁడు, ఇంద్రుఁడు నూరుయజ్ఞము లొనర్చి యాలోకమున కేగెను అనెను. అన శుక్రుని యాచార్యుంగాఁగొని వాఁ డశ్వమేధము సేసెను. అత్తఱి యెఱిఁగి దేవతలు విష్ణుని బ్రార్థించి, యా యజ్ఞము ధ్వంసము చేయుమనిరి. విష్ణుమూర్తి వామనమూర్తియై దేహమును దేవికానదిలో విడిచెను. అది మునుక లిడుచుండగా జూచి యజ్ఞకార్యమున నిమగ్నులయిన యందరు నా దేహమును లేవనెత్తిరి. మఱియు నాతఁ డట్లు మునుఁగుటకుఁ గారణ మడిగిరి. అంత నవ్వామనుఁ డిట్లనియె.

ప్రభాసుఁడను బ్రాహ్మణుఁడు వరుణగోత్రమువాఁడు కలఁడు. అతఁడు మంచి పండితుఁడు. అతని కుమారు లిర్వురు. నేత్రబాసుఁ డందుఁ బెద్ద. నేను గతిబాసుఁడను, జిన్నవాఁడను. నాతండ్రి నివాసము స్వర్గతుల్యము. బహుసుందరము. మా తండ్రి గతింపగానే మే మా యిల్లు పంచుకొన నెంచితిమి. మా యన్న, ఓరీ! పొట్టివానికిఁ, గుంటికి, గ్రుడ్డికి, నపుంసకునకు, గుష్ఠరోగికి, పిచ్చివానికి దాయభాగము రాదు. జీవితమునకుఁ

గావలసిన తిండి, గుడ్డ, ఉండుటకుఁ జోటుమాత్రమే వచ్చు ననియె. నేను గాదని బెనఁగులాడితిని. వాఁడు నన్ను నీటిలోఁ బారవేసెను. ఒక్క సంవత్సరమునుండి యీ నీటిలోనే మునుఁగుచుఁ దేలుచున్నాను. మీ రిపుడు నన్ను గాపాడితిరి. మీ రెవ్వరో తెల్పుండన వారు దుంధుని యజ్ఞముమాట చెప్పిరి. మరియు నా బ్రాహ్మణు లాతనికి దుంధునిచే, నిల్లు, రత్నములు, ధనములు నిప్పించిరి. అతఁడొల్లక మూడడుగుల నేల యడిగి బలిచక్రవర్తి నట్లే వాని నణఁగద్రొక్కి దేవతలఁ బాలించెను. వాని నణఁగద్రొక్కిన మేర పెద్ద బిల మయ్యెను. దానిని హరి కాళిందీనదిలోని యిసుకచే గప్పివైచెను.

జలోద్భవుండను రక్కసుఁడు లోకములం బాధింప, హరిహరు లేకమై వానిఁ బట్టుకొననేగిరి. వాఁడు విశాలానదిలోఁ జొచ్చి, యందుండి హిమగిరికి లేచిపోయెను. వా రాతని చక్ర శూలములచే సంహరించిరి.

## —♦ శ్రీదాముని చరిత్ర. ♦—

వీతమన్యుఁడను ఒక సద్బ్రాహ్మణు డుండెను. ఆతనిభార్య యాత్రేయి. అతఁ డామెయం దుపమన్యుఁడను కుమారుని గాంచెను. దరిద్రబాధచే పాలులేక వానిని, బియ్యపుపిండి పలుచగాఁజేసి తినిపించి యాత్రేయి పెంచుచుండెను. ఆకుఱ్ఱ వాఁడొకప్పు డిఱుగు పొఱుగువారింట క్షీరాన్నముం దినుట గలిగెను. ఉపమన్యుఁ డది రుచిమఱిగి, బియ్యపుజావ తినకుండెను. వానితల్లి, కుమారా! శివుని గొలువక

క్షీరాన్న భోజనము లభింపదు అనియె. ఆ శివుఁ డెవరు? ఎట్లాతని గొలువవలెనో తెల్పుమన నామె యిట్లనియె.

శ్రీదాముఁడను రాక్షసరాజు లోకకంటకుఁడై, హరి యొక్క శ్రీవత్సచిహ్నమును గైకొనవలెనని యెంచెను. హరి గ్రహించి వానిం జంపు నుపాయమునకై శివునికడ కేగెను. అతనిని వేయేం డ్లర్చించెను. హరుఁడు ప్రీతుఁడై కాల రూపమైన చక్రాయుధము నాతని కిచ్చెను. సుదర్శనము, పండ్రెండాకులు గలది. ఆఱు నాభులు కలది. దేవత లెల్లరు, రాసులు, మాసములు, దీనికి దగ్గరలో నున్నవి. ఆఱు ఋతు వులు నుత్తములఁ బోషించుటకిందుండును. దీని పండ్రెం డాకులయందు అగ్ని, సోముఁడు, మిత్రుఁడు, వరుణుఁడు, ఇంద్రుఁడు, విశ్వేదేవగణము, ప్రజాపతిగణము, వాయువు, ధన్వం తరి, తపస్య, తపము. అను దేవతలు పండ్రెండుగు రుండిరి. ఇందుఁ జైత్రాది మాసములు ప్రతిష్ఠింపబడి యున్నవి. అని శివు డొసంగిన విష్ణువు గ్రహించి, యిది పనిచేయునో చేయదో, దీనికిఁ దిరుగున్నదో లేదో, నీయందే ప్రయోగింతుననియె. అతఁడు కానిమ్మనియె. అతఁడు సుదర్శనముం బ్రయోగించె. వెంటనే పశుపతి మూఁడు వ్రక్కలయ్యె. అంతట హరి సిగ్గు వడి సాష్టాంగపడెను. శంభుఁడు ప్రసన్నుడై లెమ్ము! నేను బ్రహ్మమయుఁడను. తెగను, కాలను, చక్రముచేఁ దెగిన యీ ముక్కలు పవిత్రములు, ఇందుండి వరుసగా, హిరణ్యా క్షుఁడు, సువర్ణాక్షుడు, విశ్వరూపాక్షుఁడు ననువారు పుట్టి మానవులకుఁ బుణ్యమార్గము గల్పింతురు. దీనింగొని శ్రీదాముని ఖండింపు మనియె.

అట్లు హరి చక్రాయుధముం గొని వచ్చి శ్రీదాముని సంహరించెను. శ్రీవిష్ణు వంత ప్రీతుండై శంకరు నర్చించెను. క్షీరభోజనముచేయ మనసు కలదేని నీవు నా మహాదేవుని గొలువు మనియె, అతఁడు నట్లొనర్చి కృతార్థుం డయ్యెను.

అవల ప్రహ్లాదుఁడు సేవించిన తీర్థవిశేషములు, ప్రసిద్ధములగు గజేంద్రమోక్షము, వామనావతార కథ, వామనుని వివిధ సంస్థానములు, బలిబంధనము వర్ణింపబడినవి. సారస్వత స్తోత్రము, పాపప్రశమన స్తవము, పాపనాశన స్తవము, విష్ణుపంజరము మొదలగు స్తుతులు హరిహర దేవతాకములు బహు పుణ్యదము లిందుఁ బారాయణార్హములై యున్నవి.

## —◆ ఫలశ్రుతి ◆—

అని యిట్లు పులస్త్యుండు పలికి, వెండియు, నారదా! ఈ వామన పురాణము పుణ్యదము. పాపనాశకము. ఇది చదివినను, విన్నను, విషబాధ, ఆభిచారికములు మొదలగు నుపద్రవములు తొలంగును. ఇది పాపులకుఁ దెల్పరాదు. ఇప్పురాణముఁ జెప్పు వారికి గోభూహిరణ్యాదిదానములు చేయవలయును. ఇది సర్వసంపత్ప్రదము. వామనరూపియు, త్రివిక్రమస్వరూపుఁడునగు పురుషోత్తమునకు, మంగళాకారుని కిదే నమస్కారము.

సమాప్తము.

శుభమస్తు శ్రీ శ్రీ శ్రీ

# విద్వాన్ కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులుగారి గ్రంథములు

1. బ్రహ్మ - విష్ణు - శివ మహాపురాణములు తేట తెలుగు వచనములో-పురాణములను గూర్చిన విపులమైన పీఠికతో [Vol. I] } 5—0—0

2. కవి కల్పలత - కవిత్వము నేర్చుకొనువారికి కవిత్వమునందలి యందచందములను, రహస్యములను దెల్లముచేయునది. [సంస్కృతమునకుఁ దెలుగు] } 2—8—0

3. భాగవత మాహాత్మ్యము-మృదుమధురమైన పద్య కావ్యము. } 0—8—0

4. జన్మపత్రిక : ఒక జాతకమున కొక పుస్తకము [జాతకము వ్రాసికొనవలసిన పద్ధతితో సహా] } 0—6—0

18 మహాపురాణములు తేట తెలుగు వచనములో వ్రాయబడినవి. అచ్చులో నున్నవి.


వెంకట్రామా అండ్ కో

బెజవాడ — మద్రాసు.

శ్రీమాత్రే నమః.

# మార్కండేయ పురాణము

అఖిల వేదజ్ఞు బాదరాయణుని మ్రొక్కి
భూర్భువస్సుఖ లోకముల్ మూఁడు నిండి
నట్టి మూర్తికి త్రైవిక్రమాంఘ్రి కెఱగి
యల్లెదను వ్యాసు భాష నాతల్లి బాస.

తే. గీ. మ్రొక్కి నారాయణుని నరముఖ్యు నరుని
వాణి నర్చించి, వేదండ వదను నెంచి
వ్యాసు భజియించి, గురుపాద పద్మములను
వ్రాలి, భాషింతుఁ బుణ్యపురాణకథలు.

క. మార్కండేయ పురాణం
బార్కం బాతారకముగ నవని నిలువఁగాఁ
దర్కించి భక్తిరస సం
పర్కముగా వినుతుఁ దెలుఁగు వార లరంగా.

## —: పురాణస్వరూపము :—

జైమిని మృకండు తనయుని సరస వినియె
సప్తమం బిది నవ సహస్రంబు యోగ
సాంఖ్యవిజ్ఞాన నిలయంబు సరస శుభక
థావిచిత్రంబు శివదేవతాక మలరు.

క. దేవీ దివ్య చరిత్రము
పావన మభయదము సతము పారాయణముం
గావింపఁ దగిన దిటఁ బ్ర
స్తావితమై కలదు 'సప్తశతి' యను పేరన్.

## కథారంభము

తపస్స్వాధ్యాయనిరతుండగు మార్కండేయ మునివర్యుం గాంచి వ్యాస శిష్యుండగు జైమిని యిట్లనియె

— ♦ భారత ప్రశంస ♦ —

వ్యాస భగవానుఁడు భారతాఖ్యానంబు పలికె. అది సర్వశాస్త్రముల సముచ్చయమై, జాతి శుద్ధిగలదై, సుశబ్దోప బృంహితమై యున్నది. దేవతలకు విష్ణువు, ద్విపాత్తులకు బ్రాహ్మణుఁడు, భూషణములకుఁ జూడామణి, ఆయుధములకు వజ్రాయుధము, ఇంద్రియములకు మనస్సు నెట్లు శ్రేష్ఠములయి యున్నవో అట్లే మహాభారతము సర్వశాస్త్రములకు శ్రేష్ఠమయి యున్నది. ఇందు ధర్మ - అర్థ - కామ - మోక్షములను నాలుగు పురుషార్థములు బోధింపఁబడినవి. అవి యొకదానితో నొకటి యనుబంధము కలవియై, వేనికవే ప్రత్యేక ప్రాముఖ్యము కలవియునై యిందున్నవి. ఇది ధర్మశాస్త్రము. ఇది యర్థ శాస్త్రము. ఇది కామశాస్త్రము. ఇదే మోక్ష శాస్త్రము. చతురాశ్రమ ధర్మములు, ఆచారములు, నిందు మహాముని చేఁ జెప్పఁబడినవి. ఎట్టి విరోధములచేఁ గూడ గంపింపఁబడకుండునట్టి శాస్త్రము వ్యాపింపఁ జేయఁబడినది. కుతర్కములను తరు

జాలములను బెల్లగించు వ్యాస వాక్యప్రవాహములతోఁ గూడి, వేదగిరులనుండి యవతరించి, భూతలమెల్ల నీరజస్క మొనర్చి, కలధ్వనులను హంసలతోఁగూడి, గొప్ప యాఖ్యాన ములనెడి పద్మములు, కథా విస్తీర్ణ మనెడి నీరు, కలిగి, కృష్ణ ద్వైపాయన కృతవేద మనఁబరగిన గొప్ప సరస్సు భారతము. ఇది పెక్కు లర్థములు కలిగి, వేదమువలె విస్తారమై యున్నది. దీనిం దెలియ మీ సన్నిధి కేతెంచితి నిర్గుణుండు నిర్వికారుండు నయ్యు జనార్దనుఁడు మనుష్యుండై యేల జన్మించెను? అతఁడుఁ జగదుత్పత్తిస్థితిలయములకుఁ గారణమెట్లు? పాండవులైదుగురకు ద్రౌపది యొక్కతె భార్య యేలయయ్యె? బలరామునికి బ్రహ్మ హత్యాకలుగుట. అందులకాతఁడు తీర్థయాత్రలు చరించుటయేమి? ద్రౌపది కుమారులు పెండ్లియాడు వచ్చినతటి నేల చంపఁ బడిరి? భారతమున నాకుఁ బొడమిన యీ సంశయములను వారింపమీరె సమర్థులు' అనవిని మార్కండేయ మునిచం ద్రుడు జైమినితోఁ బదునెనిమిది విధములగు వాగ్దోషములఁ బరిహరించి యిట్లని మధురమధురముగాఁ బలుక నుపక్ర మించెను. జైమిని మునీంద్రా! ఇది మా కనుష్ఠాన సమ యము. విస్తరించి పలుకుటకుఁ దీరిక సాలదు. నీ సంశయములు వాయుటకు నేనొక్కింతగా పలికెదను గాని, యీ యంశముల సమగ్రముగా నీవు ద్రోణపుత్రులగు పక్షులవలన నెఱిఁగి కొనుము. వారు పింగాక్షుఁడు, విబోధుఁడు, సుపుత్రుఁడు, సుముఖుఁడు ననువారు వేదవేదాంగజ్ఞులు, విజ్ఞానులు, బుద్ధి మంతులు వింధ్యపర్వత గుహాలలోనున్నారు. అమ్మహాను భావుల దర్శించి యీ యర్థం బెఱింగిరమ్మని అన విని, జైమిని

తపోధనా! పత్నులేమి? జ్ఞానవిజ్ఞానము లెఱిఁగి మనుజులవలె మాటలాడుటేమి? చిత్రముగా నున్నదే వారికథ తెలుపు మన మార్కండేయ మహర్షి యిట్లనియె.

### —♦ దూర్వాసుండు వపువను నప్సరసను శపించుట ♦—

మునీంద్రుఁడు నందనవనమునం దప్సరసలతో విహరించుచుండగా నారదుండట కేతెంచిన నాతని నాదేవపతి సపరివారుఁడై పూజించె. వారిర్వురకుఁ బెక్కువిధములఁ బ్రసంగములు నడచెను. అవల నింద్రుఁడు మునీంద్రా! మీ సన్నిధిని నాట్యముసేయుటకీ విలాసినుల కనుజ్ఞ దయసేయుఁడు. రంభ, కర్కశ, ఊర్వశి, తిలోత్తమ, ఘృతాచి, మేనక యను వీరిలోఁ దామెవ్వరి నటనము చూడగోరెదరో యానతీయ వలయుననియె. అంతట నారదమహర్షి వారితో, ఓ నిలింపాంగనలారా! మీలో నెవ్వతె రూపౌదార్యాది గుణములచే నేనే యెక్కువదాననని తలఁచునో యది నటించినఁ జూడవలయునని యున్నది,, యని అనియె. వారామాట విని యన్యోన్యము నే నెక్కువదాన నే నెక్కువదానననని కలహింప నారంభించిరి. తుదకు వారు దేవేంద్రు నాజ్ఞచే నా సంగతి కలహాశనునే నిర్ణయింపుమని కోరిరి. అప్పుడమ్ముని ఓసీ మీలో నెవ్వతె తీవ్రతపోనిష్ఠ నున్న దుర్వాసుని మోహపెట్టఁ జాలునో యది యెక్కువది యనియె. అది విని యయ్యంగన లన్యోన్యముఖావలోకనమొనర్చి డగ్గుత్తికవోడమ నిది మావలన నయ్యెడు పని గాదు పొమ్మని మిన్నకుండిరి. కాని 'వపువు' అను నొక్క యచ్చరమాత్రము సగర్వముగా నిట్లనియె. ఇంద్రియములను

గుఱ్ఱములం బూన్చి విషయములను కళ్ళెముల బిగించి, దేహమను రథము నిచ్చవచ్చినట్లు నడపుచుఁ బ్రమాద పడక నిపుణుఁడై యున్న యా సారథిని డాసి, మన్మథ బాణములచే వాని కళ్లెములఁ ద్రెంచి వాని సారథ్యము పస యెట్టిదో యిప్పుడే తెల్పెదను. బ్రహ్మ విష్ణువు, శివుఁడు మొదలుగ నెవ్వరైనఁ గాని యొక్క నిమిషములో నా వశమొనర్తును. అని పలికి యది హిమాద్రిం దపమాచరించు దుర్వాసుని దరి కరిగెను. కోకిలాలాపలలితంబగు, నయ్యద్రి కందరంబున గాఢతపోనిష్ఠనున్న యమ్మునిఁ గొంత దూరమున నమరాంగనలతో నాడుచుఁ బాడుచు నది గావింప నాతఁడు చూచె. చూచి వెంటనే యటకేగి యవ్వపుఁగని విమర్శించి ఇది చిత్తక్షోభమునకే తెచ్చిన దని యెఱింగి, ఓసీ! పెక్కుదినములు సైచి, గడించికొన్న యీ తపమ్ము వినశింపఁజేసితివి [illegible] గరుడుని వంశమునఁ బక్షివై జనించెదవు గాక! నీకు నలుగురు సుతులు జనింతురు. వారితోఁగూడి యానందపడక మున్న శస్త్రఘాత ముచేఁ దేహపవిత్రురాలవై తిరిగి, స్వర్గమున కేగెదవు. అని శపించి, యాబుషిశేఖరుఁ డాకాశగంగకుఁ జనియె.

—♦ ద్రోణపుత్రులగు పక్షులు [illegible] జనించుట ♦

అరిష్టనేమికొడుకు గరుడుఁడు. వానికొడుకు సంపాతి. అతనిమనుమఁడు సులోలుపుఁడు. వానికి కంకుఁడు, కంధరుఁడు నను సుతులిర్వురుండిరి. ఒకనాఁడు కంకుఁడు కైలాస శిఖరమునకేగెను. అటనంతకుమున భార్యాసహాయుఁడై, విలాసరతుఁడై

క్రీడించు విద్యుద్రూపుఁడను రాక్షసుని జూచిన, వాఁడు కోపించి, యేకాంతమున్న స్త్రీసన్నిధానమున నేనుండగా నిటకేలవచ్చితివి? పొమ్మన, కంకుఁడోరీ! ఇది నీసొత్తుగాదు. ఇటకెల్లరురావచ్చును. అనినవాడు రేగి, కంకుని సంహరించెను. కంధరుఁడు సోదరుని పాటుచూచి, విద్యుద్రూపు నెదిరించి, మదనికయను భార్యతో వాఁడు విహరించుచుండగా, వానినిం సంహరించెను. ఆ మదనిక సహాయములేక కంధరుని శరణొందెను.

మేనకకూతురగు నది కామరూపగావున సౌపర్ణరూపమునొంది వానితో విహరించెను. ఆమె యందు వానికి తార్క్షి యను కూతురు పుట్టెను. ఇదియే యింతమున్న దుర్వాసుని శాపమునకు గురైన వపువను నప్సరస. మందపాలుని సుతులు జరితారి మొదలుగాగల నలుగురిలోఁ దుదివాఁడగు ద్రోణుఁడను పక్షి యామెను వివాహమాడెను. అవల నది గర్భవతియై, యేడుపక్షములు గడిచిన తరువాత, కురుక్షేత్రమున జరుగుచున్న కురుపాండవ యుద్ధముంజూడఁ బోయెను. అందు భగదత్తునకి నర్జునునకుంజరుగు కయ్యముం గనుచుండ, నర్జునుని బాణముదూసి, దాని గర్భముంజీల్చిన, నందుండి నాల్గండములు వెలువడియె. ఆ దేవసమయమున నా బాణము క్రిందనే తగిలి, సుప్రతీకమను నేనుఁగు మెడగంట తెగిపడి యా గుడ్లనావరించి యుండెను. యుద్ధము ముగిసి, ధర్మరాజాదులు భీష్మునియొద్ద ధర్మములు వినుచుండ, నవి వినుకోరికచే శమీకుఁడను ముని యటకేగుదెంచె. అతడచ్చోటఁ బక్షుల కిలకిలారావములు విని, అచ్చెరువు నొంది గంటను బెల్లగించి, దిక్కులేని

పక్షి పిల్లలం గాంచి. "ఆహా! విధి విలాసము! గ్రుడ్లు పడుట, గంటయావరణముగుట యీ యుద్ధభూమిలోనిర క్త మాంసాదులలోనివి జాగరూకములయి యుండుట చిత్రము. ధాతయిచ్చిన యాయువు గలంతవరకు మృత్యువురాదు. ఆయువు చెల్లిననింట సుఖముగాఁదిని, పరుండినవాఁడే చనిపోవును. విలాసవశుఁడైన వానికే తలవనితలంపుగాఁ జావుగల్గును. యోగసిద్ధులకేని చావు తప్పదు. మున్నింద్రుఁడు శంబరునిపై వైచిన వజ్రము మోఘమై వాఁడు బ్రదకెఁగదా!" అని మునిబాలురచే వాని నొక్క తరుకోటరమున నుంపించెను. అవియును క్రమమ్మునఁ బొదివిపక్షులయ్యె. మాసమాత్రమున నవి వారి పోషణముచే నెదిగి, సూర్యరథమార్గము నడుమంతగా నెగురుచు, రథచక్రము నలెనున్న భూమండలము నెల్లగని క్రిందికి వచ్చునపై యమ్మునులకు హర్షము కూర్చుచు జెడివి శిష్యాను గ్రహార్థముగా ధర్మ సంశయముల వారి చుచున్న యాఋషి కవి ప్రదక్షిణముసేయుచు నీదయవలన మేము జీవించితిమి మాపూర్వజన్మవృత్తాంతము వినుమని యిట్లనియె.

## —• పక్షులు తమ పూర్వజన్మము తెలుపుట •—

మున్ను విపుల స్వంతుడను ముని యొక్కఁడుండె. వానికి సుకృషుఁడు, తుంబురుఁడు నను సుతులుండిరి. మేము సుకృషుని కుమారులము మాతండ్రిని మేము సేవించుచుండగా నింద్రుఁడు పక్షిరూపమున వచ్చి "ఆకలివేయుచున్నది, వింధ్య పర్వతమున నేను దిరుగాడుచు, నొకపక్షి ఱెక్కలచేఁ జెదరి యిటఁబడి యేడురోజులకుఁ దెప్పిరిలితిని. నరమాంసముపెట్టి నా

యాకలి దీర్పుము” అనియె. మాతండ్రి ఓయీ! ముదుసలివై యుండియు, నిట్టి క్రూరవాంఛ గలిగియుంటివి. కానిమ్ము. అతిథి నర్చించుట విధియని మమ్ము నల్వురను బిలిచి యాపక్షి కాహారము కండన, నాత్మ రక్షణము జీవులకెల్ల యుచితము కాన మేమిప్పని క. గీకరింపఁ జాలమంటిమి. మాతండ్రి కోపించి మీరు పక్షి యోనిం జనింపుఁడని శాపమిచ్చె. మఱియు నన్నె భక్షింపుమని యాపక్షి నాముని కోరెను. పక్షిరూపుఁడగు నింద్రుడు “నీవు జీవించియుండగా భక్షింపనొల్లను. యోగముం బూని మేను దొరంగుము” మన నాతఁడు సరేయని యందుల కుద్యుక్తుఁడై నంత, నాతని ధర్మదీక్షకు మెచ్చి, యింద్రుఁడు స్వరూపము చూపి క్షమింప వేడి నిర్మలమైన దివ్యమైన జ్ఞానము లభించునని యనుగ్రహించి వెడలె. మేము శాపభయముచే మాతండ్రిని శరణొందితిమి. తుచ్ఛమైన యీ శరీరముపై వలపు త్రెంపనేరక యీ యకృత్యము చేసితిమి. క్షమింపు మంటిమి. అతఁడు మాయెడ జాలింగొని నాశాప మప్రతిహతమే. కాని మీరు సామాన్య పక్షులుగా నుండకు, విజ్ఞాన సంపన్నులై యుండెదరుగాక! పొమ్మన మేము వింధ్యపర్వతమునఁ బక్షులమై మనోనిగ్రహము గలిగి యున్నాము” అని పక్షులు తెల్పెనని విని జైమినిముని, సంతసించి, సుస్వరమున జదువుచున్న యాపక్షులఁగాంచి, అహా! పక్షియోనిం జనించినను వీరిని సరస్వతి విడిచిపెట్టలేదే! బంధుమిత్రాదులు విడిచినను మానవుని విద్యాదేవి విడిచిపోదుగదా! అని యచ్చెరువు వడి, వానితో నిట్లనియె. ఓ తపస్విశేఖరులారా! భృగుకులోద్భవుఁడగు మార్కండేయు నానతిచే మీసన్నిధికి వచ్చినాఁ

డను. భారతములోని సంశయముల మీవలనఁ దెలియ నెంచితిని, దయచూపుఁడని ప్రార్థించి, మున్ను తాను మార్కండేయు నడిగిన ప్రశ్నములనే యడిగెను. అంత నాపక్షులు, సురేశ్వరుం డగు విష్ణునకు మ్రొక్కి, ఓ మునికుమారా! ఇప్పుడుగదా మా జన్మములు ధన్యములు. మా బతుకు సార్థకము. దేవవంద్యుండ వగు నీపాదారవిందముల దర్శించు భాగ్యము కలిగినది. మా తండ్రి కోపాగ్ని మాదేహములఁ గాల్చుచున్నది. ఇప్పుడు మీ దర్శనోదకముచే నది శాంతించినది. మునీంద్రా! మీ యాశ్రమమున మృగీ మృగపక్షి సంతానములకు సేమ మేకదా! వృక్షలతాగుల్మత్వక్సార తృణజాతులెల్ల నభివృద్ధములయి యుండునే? ఋషీ! యిల్లేల యడుగవలయును. మీతో నిత్యసహచరములైన భూతసంతతికి సేమము కాకుండునే. అని వినుతించి, యాశుగంబు లిట్లని చెప్పఁదొడఁగె.

## —♦ విష్ణుమూర్తి నాలుగుమూర్తులు ♦—

సృష్టిస్థితి లయకారణమగు హరి దుష్ట సంహారమునకు, శిష్ట రక్షణమునకు నవని నవతరించుచుండును.

నారాయణుండగు విష్ణువు నిర్గుణుండు నయ్యుఁ నాలుగు స్వరూపములచే నలరు. అందొకమూర్తి వాచామగోచరము, అనిర్దేశ్యము. పరమ యోగులు దృఢనిష్ఠచేసి గుణాతీతమైన యారూపమును జ్వాలామాలికావృతముగా లక్ష్యము పెట్టుకొని సమాధిం గాంతురు. అది దేవబృందమునకేని యందరాదు. నిత్యతేజోమయమై వాసుదేవనామమున నది సత్తామాత్రమై వెలుంగు. రెండవమూర్తి భూభారమును దలఁదాల్చి

అహల్యాసంగమము చేతను వీని తేజము క్షయింపంగా, నశ్వినీ దేవతలు వీనిని వదలివేసి పోయిరి. ధర్మతేజము పోవునే వానితో డీకొనవలయునని రాక్షసులు చెలరేగిరి. కొంతకాలము నకు భూమి బరువెక్కి మేరుశిఖరమునం గూడియున్న దేవ సభలో నిలిచి, ఓ దేవతలారా! మీచేతం జంపిన రాక్షసు లవనిపై రాజులుగా జనించిరి. వారి సేనలు పెక్కు లక్షౌ హిణులుగాం బెరిగిపోయినవి. ఈ భారము మోయంజాలకున్నా ను. అనినవిని దేవతలు, పెక్కు రూపములతో భూమిపై నవ తరించిరి. వారే ధర్మజ భీమార్జున నకుల సహదేవులు. అగ్ని కుండమున జనించిన ద్రౌపది వారి కైదుగురకు భార్యయయ్యె.

కృష్ణుని కర్జునునిపై నగ్గలమగు ప్రేమకలదని యెఱింగి, బలరాముండు కృష్ణుండులేకున్న నేను దుర్యోధనుని యొద్దకుం బోను. పాండవుల కడనైన నుండను. ఈ యుద్ధ ఘట్టమున నా కేవక్షమునం గాని యుండరాదని తీర్థయాత్రలకేగి కురు పాండవుల తగవులు తేలుదాక రానని, కృష్ణునితోం దెలిపి, ద్వారక కరిగెను. మరునాడే తీర్థయాత్రలకేగ నుండి. తొలి నాడు మద్యపానమొనర్చి, రేవతీదేవితో రైవతోద్యాన విహా రమొనర్చెను. అందు నానా తరులతా లతాంత ఫల కలితం బులగు పెక్కు తావులం జరించి యొక పొదరింట వేద వేదాంగ పారగులగు, వివిధ కథలం జెప్పికొను కౌశికులును భార్గవులును భారద్వాజులును గౌతములును నను మునులంగాంచెను. వారె ల్లరు నా రాముని బూజించిరి. అందరిలో సూతుండు మాత్రి మాతని సత్కరింపండయ్యె. హలాయుధుండందులకుం గోపించి సూతుని సంహరించెను. అంత నందున్న బ్రాహ్మణులు పారి

శేషుఁడను పేర తమోప్రధానమయి యలరు. మూడవమూర్తి సత్వప్రధానమయి ప్రజాపాలనము నొనర్చి ధర్మరక్షణము చేయునది. నాలవమూర్తి సముద్రమున భోగి తల్పమునఁ బవ్వళించి యుండును. వైకుంఠ, నరసింహ, వరాహ, కపిల నామములచే చతుర్వ్యూహుఁడైన హరి, రజోగుణమూర్తియై సృష్టిసేయుచుండు. వీనిలో మూడవమూర్తి, ధర్మరక్షణ మొనర్చి, సాధురక్షణము, దుష్టశిక్షణము చేయును. ధర్మమ్ము చెడి యధర్మము పెరిగినపుడు భూమిపై హరి యీ మూర్తిచే నవతారములు ధరించును. విష్ణుండు మున్ను శంఖుఁడు వేదముల హరింప మత్స్యమూర్తియై వానిందునిమి వేదములఁగొనివచ్చె. ఇట్లే కూర్మాద్యవతారముల నాతఁడెత్తెను. ఆ దేవుని సత్వప్రధానమగు నీ మూర్తి దేవ, పశు, పక్ష్యాది వివిధావతారముల ధరించి ప్రద్యుమ్ననామ విఖ్యాతమై లోకములఁ గాచును.

## —♦ పాండవుల వృత్తాంతము ♦—

మున్ను వృత్రాసురుని జంపిన యింద్రుని బ్రహ్మహత్యాపాపము వెంబడించెను. దానఁ దేజోహీనుఁడై యుండెను. త్వష్ట తన సుతుఁడగు వృత్రుని గతి విని, కోపించి యొక జడ పెరికి, యగ్నియందు వేల్చిన నందుండి మరల వృత్రాసురుఁడు పొడసూపెను. ఇంద్రుఁడది కని, వానితోఁ బోరాడిన లాభము లేదని, సంధి చేయుఁడని సప్తర్షులను ద్వష్టకడకుఁ బంపెను. వారును గొన్ని నియమములేర్పఱచి మైత్రిగలిగించిరి ఇంద్రుఁడా నియమముల నతిక్రమించి వృత్రవధ చేసెను. అంతట నింద్రుని బలము, బలాధిదేవతయగు వాయువునఁ బ్రవేశించెను. మున్ను

పోయిరి. బలరామునకంతట, బ్రాహ్మ్య తేజస్సంపన్నుండగు నీ సూతుని గూల్చితిని, అల్లదే బ్రహ్మహత్య నన్ను జుట్టుకొన్నది. నామేన దుర్వాసన పొడమినది. మును లెల్లరు నాకు దూరులయిరి. బ్రహ్మఘాతినగు నా యీ పాపము వాయ తెఱవి నేమో కదా! యని క్షోభించి తీర్థయాత్రలొనర్తునని నిశ్చయించి ప్రతిలోమయగు సరస్వతీనదిని సేవింప నేగెను.

ఇది బలరామ విషయము. ఇంక నుపపాండవుల చరిత్రము వినుమని పక్షులు జైమినికిట్లనియె.

## —♦ విశ్వేదేవులు పాండవులై పుట్టుట ♦—

త్రేతాయుగమున హరిశ్చంద్రుఁడు ధర్మమార్గమున రాజ్యమేలుచు, నొకనాడు విశ్వామిత్రు తపమొనర్చు వనమున కేగి వేటలాడుచుండెను. అత్తరి, రక్షింపు, రక్షింపుమని యొక యాడుదాని కంఠస్వరము వినవచ్చెను. రాజదివిని, వేట చాలించెను. అదేసమయమున విఘ్నేశ్వరుఁడు విశ్వామిత్ర తపమునకు విఘ్నము చేయనెంచి, దేవతలచేఁ బ్రార్థింపఁబడి హరిశ్చంద్రునం దావేశించియుండెను. ఆ యావేశ బలముచే, ధర్మాత్ముఁడైన హరిశ్చంద్రచక్రవర్తి, విశ్వామిత్రుని దరిసి, ఎవఁడురా వీఁడు? రాజనై యుండగా నాదరింపకున్నాఁడు. ఇప్పుడు నిన్ను సంహరింతుఁగాక యని పలుకునంత కమ్ముని కనులు దెఱచి, కోపించెను. తపశ్శాలికిఁ గోపము రాఁగూడదనుటచే, వాని నంతకుమున్ను వరించిన, అపూర్వములగు విద్యలన్నియు విడిచి పోయినవి. ఆవల నారాజా మునిం గాంచి, వణఁకుచుఁ బ్రాంజలియై "కరుణింపుము. ఇచ్చట, రక్షిం

చుట, యను నష్టెరెండు రాజ్యైశ్వర్యములు సంపద జాలి
గాని క్షమింపుము" అనియె. విశ్వామిత్రుఁడంతలోఁ బ్రస
న్నుఁడై "యిత్తువేని నాకువలసిన రాజసూయ యజ్ఞమునకు
దక్షిణ యిమ్మా", అన! రాజు మునీంద్రా! ఇంకను దమకుఁ
గావలసిన దేదైన నిత్తుననియె. మాని, నా భార్య, పుత్రుఁడు,
నీవు దక్క, నీకుఁగల సర్వస్వము నాకు సమర్పింపుమనియె
రాజంగీకరించె. ఆ క్షణముననే తపస్వి సర్వము స్వాధీనపఱచి
కొని, యీరాజ్యము నాయది కాని నీది కాదు, కావున
నిప్పుడే యిటనుండి లేచి పొమ్మనియె ఆ చక్రవర్తి యెుల
తాఁ దుగూడ వదలి, శైబ్యయను భార్యయు, సుతుండును
వెంటరా వెడలుచుండ, ముని నిత్తునన్న యాగ దక్షిణ యీ
యక పోవుదువే? నిలుపుము ముని నిర్బంధించిన, నొక
మాసమున నది చెల్లింతునని రాజనియె. అట్లని నగరమును
విడిచిపోవు రాజును పౌరులు వెంటాడిరి. వారియెడ జాలిఁగొని
యాతేఁడు, నగమేగి యాగిన, నా మునివచ్చి నా రాజ్యమున
నుండుట తగునా? అని కుపితుఁడై యాతని భార్యను గఱ్ఱచేఁ
గొట్టెను. అది చూచుచునే పరమశాంతుండగు హరిశ్చంద్రుఁడు
వెళ్ళెదనని పోవుచుండగా, విశ్వేదేవు లైదుగురు నడ్డము వచ్చి,
"యీ ప్రభువు సెలవు. యాగము లొనర్చి నామున్నఁ దృప్తి
పఱచెను. ఇట్టి ధర్మమూర్తిని బాధించు నిమ్మునిని పరమపాపి"
అనిరి. అది విని ముని కోపంబున మీరైదుగురు మనుష్యులై
పుట్టుఁడని శపించె. వారంతట భయపడి ప్రసన్నుఁడవు గమ్మని
కోరుకొనిరి విశ్వామిత్రుఁ డప్పుడు మీరు మనుజులయ్యు
సంతతి కలుగక యున్న, వివాహములేక యున్న పుడమి

విడిచి స్వస్థానముల కేగెదరు. అని యనుగ్రహించె. ఆ విశ్వే దేవులైదుగురును ద్రౌపది కుమారులై జనించి, వివాహము కాకమున్న యశ్వత్థామచే సంహరింపఁబడి స్వర్గమునకుఁ జనిరి. ఇట్లు పక్షులు జైమిని ప్రశ్నము లన్నింటికి నుత్తరము లొసంగి మఱియు నెయ్యది వినఁగోరెద వనుగుమన నమ్ముని హరిశ్చంద్రుని యవ్వలి వృత్తాంతము తెలుపుమనిరి. వారిట్లనిరి.

## ♦ హరిశ్చంద్ర కథ ♦

హరిశ్చంద్రుఁడట్లు వారణాసి కరిగి భార్యను దనను నమ్ముడుపోయి ముని ఋణముతీర్చెను. మఱియు నాతఁడు స్మశానమునఁ గావలికాచుచు నొక్కరాత్రి నిద్రావశుండై కలలో, తన్నొక మాలపిల్లవానింగాఁ జూచి, కాటిని గాచు చున్నతఱి, నొక బ్రాహ్మణబాలుని శవము కొనిరాగ మూల్య మీయలేదని వానిదహనము చేయనీనఁగా వారు శపించి నంతట, యమదూతలచే గ్రహింపఁబడినట్లును, రంపముల చేతను, కత్తులచేతను నఱుకఁబడినట్లును, అంధతమంబునఁ జొచ్చినట్లును, పెక్కు నరకబాధలు పడినట్లును, గాడిద, యేనుఁగు కోతి, మేక, పిల్లి, రాబందు, [illegible] పక్షి, క్రిమి, చేప, తాఁబేలు, పంది, కోడి మొదలుగఁ బెక్కు జన్మము లొందినట్లును అంతలో మఱల రాజై భార్యకొఱకేడ్చుచున్న ట్లును, కొడుకు చనిపోయినట్లును, సర్పపాశములచే యముని దరికిఁ గొంపోఁబడినట్లును, ఇట్లు పెక్కుదశ లందినట్లు కలగని తుదకు యముఁడు, "నీ కుమారుఁడు చనిపోవును. వేగముగా

నీవు భూమికిఁ బొమ్ము! నీకావల మేలగును" అన్నట్లయి పంద్రెండేండ్లవ్వలదాను యమలోకమునుండి నేలపైఁ బడి నట్లైను గల గని, మేల్కని పెక్కు దేవతల స్మరించి స్వస్థచిత్తుం డయ్యెను. పిమ్మట కుమారుఁడు పాముచేఁ గఱవఁబడి, తన భార్య దహనార్థంబుగాఁ గొనివచ్చుటయు, నొండొరుల నెఱింగి వానికై యేడ్చుటయు, దుదకు దేవతలు దగ్గఱ మొనంగి, యింద్రుఁడా బాలుని బ్రదికించుటయు బుష్పవర్షము గురియుటయు, నీ సత్యవతిమునకు మెచ్చితిని నీకోరిన యుత్తమ లోకమున నీ భార్యతో వసింపుమనుటయు, కోసలదేశ మంతలి ప్రజలెల్లరు నా కాప్తులు వారితోఁ గలసియుండుటయే నాకు స్వర్గము, వారు లేనిది నాకది కానేరదన దేవతలెల్లరు నాతని పౌరులకుఁగూడ యట్టి పుణ్యగతు లనుగ్రహించుటయు జరిగెను కుమారుఁడగు లోహితాస్యునికి రాజ్యమునఁ బట్టముగట్టి హరిశ్చంద్రుఁడు భార్యా సమేతుఁడై, పుణ్యలోకముల నధిష్ఠించెను.

వశిష్ఠమహర్షి హరిశ్చంద్రుని పురోహితుఁడు పంద్రెండేండ్లయిన తరువాత గంగనీటినుండి లేచి విశ్వామిత్రుం దుర్వృత్తిని నిందించి, నా కుమారులు నూర్గురు గతించినను దుఃఖింపని నే నీధర్మమూర్తియగు రాజుపడిన బాధలకెంతయు దుఃఖించితిని. ఇట్టి క్రౌర్యము చూపిన విశ్వామిత్రుండు కొంగయై పుట్టుఁగాక యని శపించెను. ఆ మాట విశ్వామిత్రుండు విని నీవు 'అడి' జన్మమెత్తెదవనియె. ఇట్లొండొరులు శాపనిహతులై నీచ జన్మముల నెత్తిరి. వశిష్ఠుఁడు రెండువేల యోజనముల పరిమాణముగల ఆడియై పుట్టె మఱి తొంబదియారు యోజనము

లెక్కవ పరిమాణముగల కొంగయై విశ్వామిత్రుఁడు జనిం చెను. అట్లుపుట్టియు నిరువురు పొడిచికొని పోరాడుచుండిరి. దానిచే లోకములు వ్యాకులమయ్యె. బ్రహ్మవచ్చి వారి దుర్గతివాపి, యొండొరులకుఁ దెలియఁజెప్పిన, వారది మొదలుగ తమోగుణము వాసి మైత్రిం బొసఁగిరి. ఇయ్యాడిబకోపాఖ్యానము హరిశ్చంద్రోపాఖ్యానము విన్నవారికి వినిపించిన వారికి, విఘ్నభయముండదు. పాప ములుండవు” అని తెల్పిన విని జైమిని వారియు నిట్లనియె.

—♦ సుమతియను ముని తండ్రికి సృష్టిప్రకారము తెలుపుట ♦—

ఓ పక్షిరాజులారా! భూతములు పుట్టుట, పెరుగుట, మరణించుట, పాప పుణ్యానుభవము వినవలతు స్త్రీ గర్భాశయమునఁ దిన్న యెట్టి ఘనపదార్థములుంగూడ జీర్ణములగుచుండ, శిశువేల జీర్ణము కాక యున్నది? ఈ విశేషములు తెలుపుఁడన పక్షులమ్మునికిట్లనియె.

ఓ జైమిని మునీంద్రా! నీయడిగిన ప్రశ్నము చాలక్లిష్టమైనది. భార్గవవంశ్యుఁడగు నొక విప్రుఁడు మున్ను సుమతి యను తన కుమారుని కుపనయన మొనర్చి, జడునివలె నున్న యాపిల్లవానితో, బాలకా! నీవు బ్రహ్మచర్యాది ధర్మముల యథావిధి నడపి, బ్రహ్మజ్ఞానము వడయుము. అప్పుడు నీవు శోకముం దరింతువు అని పెక్కుమారులు తెలిపిన నాతఁడు తెలియ నట్లుండి తుదకు విసివి విసివి, తండ్రీ! పెక్కు శాస్త్రములను, శిల్పాదికళలను నేర్చితిని. ఇవన్నియు మున్ను నేను విన్నవియే నాకు కొన్నివేల జన్మములు గడచినవి. అవన్నియు

జ్ఞాపకమున్నవి. జ్ఞానినగు నాకు వేదములతోఁ బనియేమి? ఎందరు తల్లులనో, యెందరు తండ్రులనో చూచితిని. ఎన్నో దుఃఖము లనుభవించితిని. శత్రుమిత్రకళత్రాదు లెందరో కలిసిరి విడిపోయిరి. ఎందఱో చుట్టములైరి. బ్రాహ్మణాదిజన్మములం దెన్నింటనో యెన్నిమారులో జనించితిని. పెక్కుమందిఁ గొల్చితిని. పెక్కుమందికడఁ జేయి చాచితిని. ఎట్టకేలకు నేడు మోక్షకారణమైన జ్ఞానముం బడసినాఁడను. ఏది తెలిసిన మీఁదట ఋగ్యజస్సామ ప్రతిపాదితమగు క్రియాకలాపమంతయు గుణరహితమై తోఁచునో, అద్దానిం దెలిసితిని. కాన వీనితో నాకుఁ బ్రసక్తి లేదు. గురువిజ్ఞానముచేఁ దృప్తిఁ జెందియున్న నేను హార్దక్రోధభయాదులచే నాకులమగు నీ సంసారముఁ బాసిపోయెదను. అనఁ దండ్రి వాని పలుకులు విని, యుప్పొంగుచు నిట్లనియె. కుమారా! నీకీ జ్ఞానమెక్కడిది? ఇంతమున్ను జడుఁడవే. ఇంతలో నీకీ జ్ఞానోదయమగుట కేదేని కారణముండవలయు, ఏదైన శాపముండి యది యిప్పుడు తొలఁగెనా? ఈ తెలివి యింతమున్నెక్కడ కప్పువడినది? అని తండ్రి యాశ్చర్యపడి తన్ను బదింబదిగ నడుగ, నా విప్రబాలకుఁడు, తండ్రీ! ఇంతకుముందటి జన్మమున నేనొక బ్రాహ్మణుఁడను. బ్రహ్మయందు మనసుంచి పరమనిష్ఠనుంటిని. యోగయుక్తుఁడనై యభ్యాసమందున్నవాఁడను. విచారకారణశోధన వలనను, సత్సంగము వలనను స్వభావము వలనను, నా కాబ్రహ్మమం దమందప్రీతి యుదయించెను. శిష్యులకు బోధించి బోధించి, కొంతకాలమున కేకాంతమును బొందితిని. ఒకానొక ప్రమాదముచే దేహము

విడిచితిని. కాని ప్రాణములు పోయినను, పూర్వజన్మస్మృతి, జ్ఞానము మాత్రము పోలేదు. ఏడాదివయసు వచ్చువరకు నాకుఁ బూర్వస్మృతి నిలిచియుండెను. మునుపటి యలవాటుచే, నేనప్డే యింద్రియముల నదిమి, బ్రహ్మనిష్ఠయందప్డే నిలువ నెంచితినిగాని, నాకది సాధ్యము గాదయ్యెను. పలువురు శిష్యులకు జ్ఞానదానము సేసిన పుణ్యముచే నాకీ జాతిస్మరణము సిద్ధించినది. నీ యాజ్ఞచే నిఁక నీ కోరిన యంశము తెలిపెగించెద. వినుము.

## — జీవుల పాపపుణ్యములంబట్టి కలుగు ఫలములు —

జీర్ణమనుటలేని సంసారచక్రమును దెలియుము. మను జుని జంపువాఁ డొకరుఁడు లేఁడు. ప్రాణములు పోవునపు డూష్మము (ఉష్ణగుణము) ప్రకోపించి, కట్టెలులేని నిప్పువలె దేహమందలి యగ్ని వాతములచే రగుల్కొల్పఁబడి జీవుని మర్మస్థానముల భేదించును. ఉదానవాయువుచే నాముపవనము కూడ పైకి ప్రసరించును. అది మనుజుఁడు తిన్నతిండిని, త్రాగిన నీటిని గ్రిందికి పోనీయదు. అన్నపానములను దానము సేసిన వాని కప్పుడు సుఖముగానే యుండును. ఆహారములేకున్నను నపుడన్నదాత తృప్తినేపొందును. సత్యవాది, ఆస్తికుఁడు, ప్రీతికరుఁడు, దేవబ్రాహ్మణభక్తుఁడు, అసూయలేనివాఁడు, వీరు సుఖమరణము పొందుదురు. ధనమిచ్చినవారు చలిని, గంధమిచ్చినవారు తాపమును, పొందరు. ఇతరులను నొప్పింపనివారు మరణాయాసము ననుభవింపరు. అధము లీ యాతన నొందుదురు. కూటసాక్షి, అనృత వచనుఁడు, వేదనిందకుఁడు, పెద్ద

దారిని నడపించువాఁడు, కష్టమరణ మొందుదురు. ఆయుధ ధారులై, చెడుకంపు కలిగి యమభటులార్పులు బొబ్బలు వెట్టుచు, క్రూరులై వత్తురు. వారురాగానే చూచి రోగి యొడలు వణంకును. ఆర్పులువెట్టును. మాట స్పష్టముగారాదు. ఒకే యక్షరముగా వినవచ్చును. చూపుచలించును. శ్వాసము లాగును. ముఖ మారిపోవును. ఊర్ధ్వశ్వాసపుట్టును. అమిత వేదనపడి శరీరము విడుచును. ఆ జీవుని ప్రాణము వాయు రూపమునఁ బోయి మున్ను వదలిన దేహముతో సమానమగు వయస్సు, అవస్థ, ప్రమాణము గలిగి, తలిదండ్రులు లేని వేరొక శరీరమునఁ బ్రవేశించును. యమదూత లంతటఁ బాశముల బిగించి దక్షిణ దిశకు లాగికొని పోవుదురు. దర్భలు, ముళ్ళు, పుట్టలు, రాతిబండలు మొదలగువానిచే కర్కశమై, పెద్దకన్న ములు మంటలు, కాలిన యిసుక గలిగి నక్కలుకూయు దారిం బడి బరబర యీడ్వఁబడుచు జీవుఁడు యముని సన్నిధికిఁ గొంపోఁబడును. గొడుగు, పాదుకలు, బట్టలు, అన్నము నిచ్చిన వారాదారిని సుఖముగా నేగుదురు. భూదాతలు ప్రకాశ మానము లయిన విమానములపై నేగెదరు. ఇటు పండ్రెండు రోజులకు యమరాజపురముం జేరును, అటు చేరులోపల వాని శరీరము కాల్చఁబడగానే మిక్కిలిదాహముపొందును. పుడమిపై బంధువులుచేయు స్నానదానాదులచే నా జీవుని దాహము దారిలో శాంతించుచుండును. నూనె పూసికొనుట, దానములు చేయుట, నేలమీఁదఁ బరుండుట మొదలగు పనుల నిచ్చట బంధువులు చేయుగా నచ్చట జీవునికి సుఖము కలుగుచుండును. పిండదానాదులచేఁ దృప్తిపడుచు, పండ్రెండవ రోజునకు

యముని పురిం జేరి యచట నల్లని యినుమువంటి శరీరము, ఎఱ్ఱని కన్నులు, కాటుక కొండవంటి కాంతియుం గలిగి, దండమును బాశమును భుజములం దాల్చి, బహు భయంకరుండై, కోరలు కలిగి, ముడివడిన కనుబొమ్మలతో, ననేక వ్యాధులు భయంకర రూపములం దాలిచి తన్ను గొలువం గొలువుండు యమునిం గాంచును. వాని యాజ్ఞచే నీ జీవుండు పుణ్యాపాప గతులను బొందును.

## — నరకములు - వానిం బొందువారు —

కూటసాక్షి, అసత్యవాది రౌరవంబను నరకముం బొందును. అది రెండువేల యోజనములు వైశాల్యము కలది, మోకాలి లోతున నిప్పులతో నిండి ఎఱ్ఱగా కాలిన రాగివలెనా నేల యుండును. అందుంబాపి పరువులెత్తును. పాదములు కాలి మరల పుట్టుచుండును. ఇట్లు యమయాతనంబడి, మరల క్రిమికీటకాది యోనులం బుట్టును. ఆరోహిణీయోనియై పచో శూద్ర వైశ్య క్షత్రియ బ్రాహ్మణ దేవాది రూపము లొందును. అవరోహిణీ దశ నొంది క్రిందిపుట్టువులంబడును. మహారౌరవము నాల్గువేల యోజములవై శాల్యము కలది. నిప్పుల నిండినది. కాకులు, తోడేళ్ళు, కొంగలు, తేళ్ళు, గ్రుడ్లగూబలు, గ్రద్దలు, దోమలు మొదలగువ్వానిచే నిందు బాపి బాధింపంబడును. తమోనరకము మూండవది. మహారౌరవము పెద్దది. అంధకారబంధురము, చలివణంకించును. ఆకలిదప్పు లట నెక్కువ, అచట చలిగాలి మొముకలం గొరకును. పాపులటం దమరక్తము తామే త్రావెదరు. ఒకరినొకరు గలిసికొనవలెనని

యా చీకటిలో జీవులు పర్వెత్తుచుందురు. నికృంతనమనుమఱి యొక నరకముగలదు. అందుఁ గుమ్మరి సారెఁబోలిన చక్రములు గిరగిరఁ దిరుగుచుండఁ యమభటులా చక్రములపై బాపుల. దగిలించి, కాలసూత్రములచే, గోయుదురు. ఆ పాదమస్తకముగా తునుకతునుక లైన మేను మఱల యతికికొనుచుండును. అప్రతిష్ఠము అను నరకమింకొకటి. అచట ఘటీయంత్రములపై కెక్కించి జీవులఁ ద్రిప్పగా, మానవులు క్రిందికి మీఁదికి దిరుగుచు మిడిగ్రుడ్లుపడ, రక్తము గ్రక్కుకొందురు. అసిపత్రవనము అనఁబడు నరక మింకొకటి, అదివేయి యోజనములది. ప్రళయాగ్నివలెనది మండును, సూర్యకిరణములచే నది కాలియుండును. దానినడుమ చల్లని వనముగలదు. దాని యాకులు కత్తియంచులవలెఁ జాల పదునుగ నుండును. దానిమీఁద పెక్కురకముల పక్షులు కూయును. కుక్కలరచును. జీవులది చల్లనివనమని, తాతా! తండ్రీ! అని యార్చుచు కాళ్ళుగాలి యేడ్తురు. వారిపైఁ బెనుగాలి విసరి యా కత్తులవంటి యాకు లొక్కమాఱుపడి తెగి, యేడ్తురు. కుక్కలు వాని మాంసములదినును. తప్తకుంభము అను మఱియొక నరకము గలదు. నూనె, లోహ చూర్ణము. కాగి నీరయియున్న పెద్దపెద్ద కాగులలో జీవులను బారవేయుదురు. అందుడికి జీవులు గొల్లుమని యార్తురు. ఇట్లు నరకములు పెక్కులు గడచి పునర్జన్మమును జీవుఁడు గాంచును.

ఇట్లు నరకములఁ దెలిపి సుమతి తండ్రి కిట్లనియె. పుణ్యాలగువారు యమునిచేఁ జూపఁబడిన దారిని బుణ్యలోకముల కేగెదరు. గంధర్వాదులు, నప్సరసలు నాడుచుఁ బాడుచు

నుండ విమానము నెక్కి, పూసి, తోడి, యానందముతో వారుత్తమ స్థానము లలంకరింతురు. పుణ్యానుభవము కాఁగానే యటనుండి యుత్తమ వంశములఁ బుట్టి సుఖము లనుభవింతురు. స్వర్గమునుండి జారి, జీవుఁడాహార పదార్థంబుల నిమిడి, పురుషుని రేతస్సై స్త్రీపురుషయోగముచే స్త్రీయొక్క రజస్సు నంగలిసి, గర్భంబునఁ బడి, కలలమై, బుడగయై, పేశి యగును. విత్తనమునుండి మొలక పుట్టినట్లామాంసపు పేశి నుండి, యవయవస్ఫూర్తినొంది, వేళ్ళు, కన్నులు, ముక్కు, ముఖము నను భాగముల రూపొందును. క్రమముగా గోళ్ళు రోమములు, కేశములును జనించును. ఆ జంతువుతోఁ బాటుగ తల్లి జననకోశము కొబ్బరికాయవలెఁ బెద్దదిగా నగుచుండును. గర్భగోళమందలి యగ్నిచే గట్టిపడును. తల్లి తిన్న త్రాగిన యాహారముచేఁ దృప్తిపడి జీవించును. 'ఆప్యాయని' యను నాడి యొకటి నాభియందుండును, అది స్త్రీల యాంత్రద్వారమునఁ గట్టబడి యుండు. అచట. జీవికి సంసార హేతువులగు నెన్నో యూహాలు పొడముచుండును. వానిని స్మరణకుఁ దెచ్చికొనుచు, నేను బుట్టఁగానే పాపములను జేయను. అని యేడ్చును. గడచి పోయిన యెన్నో జన్మములను దలఁచుకొని యిట్లు దుఃఖించి దుఃఖించి, యంత మున్నూర్ధ్వముఖముగానున్న జీవుఁడధోముఖుఁడై తొమ్మిదవ లేక పదియవ నెలలో జనించును. ఆ పుట్టునపుడు, ప్రాజాపత్య వాయువుచేఁ బీడింపఁబడుచు, నేడ్చుచు, యోని యంత్రమున జిక్కి నలిగి, మూర్ఛలో మునిగి, నేలపైఁ బడును. వెంటనే వెలుపలనున్న వాయువు

తగిలి, మూర్ఛ దేఱును. ఆవల వైష్ణవమాయ వానిని గప్పి వేయును. దానిచే వెనుకటి తెలివియంతయును బోవును. అది పోఁగానే యౌవన, బాల్య, కౌమార, వార్ధక్యాద్యవస్థలకు లోనై రాగద్వేషాది వికారములొంది, తిరిగివచ్చి పుట్టుచుండును. ఘటీయంత్రమట్లు కర్మఫలములచే నిట్లు పునఃపునః పరిభ్రమణము నొందుచుండును. ఈ సంసార చక్రముయొక్క పరివర్తనమునకంతు లేదు. ఇట్టి దుఃఖనిలయమున సౌఖ్యమున్నదే ?

ఇప్పటి కేడు జన్మంబులకు మున్ను నేను గోవులను నీరు ద్రావనీయని పాపముచే నూఱేండ్లు ఘోరనరక మనుభవించితిని అంతలో గాలి చల్లగావీచి నాకేకాక యందున్న వారందఱకు నమితసుఖము కూర్చెను. ఈ మార్పేమని చూచుచున్నంతలో మా కొక పుణ్యపురుషుఁడు గానిపించె. అతని నొక యమభటుఁ డిటు రమ్మిటురమ్మని నడిపించుచుండెను. మాకుఁ గలిగిన సుఖమీ పుణ్యాత్ముని రాకచేత నని తెలిసికొని మే మాతని నిచటఁ గొంత తడవుండుమని వేడికొంటిమి. అతఁడును దానీనరకమును జూడలేనివాఁడయ్యు మామీఁది జాలిచే నించుక నిలువఁ నెంచెను. మఱియు నా దయాశాలి యమ కింకరునితో ఓయీ ! నేను జనకకులమున జనించితిని. విపశ్చిత్తుఁడను రాజనై పెక్కుయాగము లొనర్చి ధర్మపాలనము సేసినాడను నాకేల యీ నరకముఁ గానిపించితివి! అనఁ గింకరు డిట్లనియె. ఓయీ! నీభార్య పీవరియనువిదర్భరాజ కన్యక ఋతుస్నాతయైన నామెను గలియక నీవాసమయము పాడుసేసితివి. అంతియకాదు. కైకేయి యను పేరొక్కతె తో రమించితివి.

ఋతువ్యతిక్రమము చాలపాపము. దానిచే నీవీ నరకముం జూడ వలసివచ్చెను. హోమకాలమునం దగ్ని హావిస్సును గోరునట్లు, ఋతు సమయమునఁ బ్రజాపతి వీర్య సేకమును గోరును. ఆ సమయము నుపేక్షించినవాఁడు పితౄణమునుండి విడివడక నరకము పొందును. నీవు పుణ్యశాలివి. కొద్దిదోషమున నీవిది చూడవలసెను. నీరాకచే నిచ్చటి పాపులకు సుఖము కల్గినది. ఇట్లు యమ భటుఁడు తెల్పగా మేము వింటిమి మఱియు నారాజునకు వాఁడే యే పాపములకే నరకబాధలు గలుగునో వివరించె నదియించుక వినుము. పరదారలను ధనమును గోరు వారిని తప్పుదారి నుపదేశించినవారిని వేద గురు బ్రాహ్మణనిందకులను, ఒక శ్రాద్ధముననిమంత్రితుఁడై వేరొకచోటికి బ్రాహ్మణార్థము పోయిన వారిని వజ్రకఠినములైనముక్కులచే గాకులు కన్నులఁ బొడుచును. భార్యాభర్తలకు,గురుశిష్యులకు, నన్నదమ్ములకు భేదంబు పుట్టించిన వారు ఱంపములచేఁ గోయఁ బడుదురు. దేవతలను, పితృదేవతలను, అగ్నిని, నతిథులను, విప్రులను, సేవకులను దృప్తిసేయక తామె మెక్కి కూర్చున్న వారు తమ మూత్రపురీషముల భక్షింతురు. పంక్తిభేదము సేసిన వానికి నిదే గతిపట్టును. తోడిబాటసారి కిడక తిన్న వాఁడు తన శ్లేష్మమును దా దినును. గోబ్రాహ్మణాగ్నుల నెంగిలితోఁ దాకిన వాని చేతు లగ్నిలోఁ గాల్పఁబడును. పూజ్య వస్తువులఁ దన్నినవారి కాళ్ళ కినుప గుదియలు కాల్చి బంధింపఁబడును. పాయసము మొదలుగాఁగల భక్ష్యములను దానొక్కడే తిన్న వానిని యమభటులు బడద్రోసి, పట్టుకారులచేఁ గ్రేవులు లాగివైతురు. క్రోధముచేఁగాని కామముచేఁ

గాని, దేవాలయములను, బ్రాహ్మణ సదనములను, చలిపందిరులను నాశనము చేయువారి శరీరము తోలు నీ భటులొలుతురు. ఒకనికిచ్చిన కన్యను వేఱొకనికిచ్చిన వాని మే నింతింతలుగఁ జెక్కఁబడుచున్నదిచూడుము. శరణుఁజొచ్చినవానిని లంచముగొని విడుచువాఁడు నరకయంత్రముల బాధింపఁబడును. తానార్జించిన పుణ్య మమ్ముకొనువానిని గింకరులు బండపచ్చడి చేయుదురు. భార్యాపుత్రాదులు మలమల మాడుచుండ, దానొక్కఁడే కుడిచిన వానిమేను తఱిగి వానిచేఁ దినిపింతురు. అన్యస్త్రీసంగము చేసినవానిని ముండ్లమీఁద నీడ్తురు. గురువును గ్రిందఁ గూర్చుండఁ బెట్టి వేదాదివిద్యలు నేర్చిన వానిని మండు నేలమీఁద నడిపింతురు. నీటిలో మలమూత్రముల విడుచువారు మూత్రపురీషములచే నిండిన నరకములం దేలుదురు. వేదములను, నగ్నులను మానినవానిని గొండలెక్కించి పడఁద్రోతురు. కులము చెడినవాని యొద్ద దానముపట్టుట, యనర్హునిచే యాగము చేయించుట, యను పాపముచేసినవాఁడు, రాతిలోనిపురుగై యుండును. బ్రహ్మఘ్నుఁడు, కల్లు ద్రావినవాఁడు, బంగారము దొంగిలించినవాఁడు, గురుభార్యను బొందినవాఁడు, వీరికిఁ దోడ్పడ్డ వాఁడు పంచమహాపాతకులు. వీ రగిడిమంటలలో వేయి వత్సరము లుడికిపోయెదరు. వారు పునర్జన్మమునఁ గుష్ఠము, క్షయ, పొంది మరల మరల పుట్టుచు గిట్టుచు నొక్క కల్పముదాక నరక మనుభవింతురు. గోహత్య చేసినవానికి నిదే యవస్థ.

## — పాపములం బట్టివచ్చు జన్మములు —

రాజా ! వినుమని యమభటుఁడు వెండియు నిట్లనియె, కులముచెడిన వానికడ దానము పట్టినవాఁడు గాడిద యగును. కానివానిచే యజ్ఞముచేయించి క్రిమియగును. గురుద్రోహి కుక్క యగును. గురు భార్యారతుఁడు గాడిదయగు. తలిదండ్రు లనేడ్పించి గోరువంకపిట్టయగును. సోదరభార్య నవమానించి పావురమగు. దానిం బాధించి తాఁబేలగును. రాజద్రోహి క్రోఁతియై పుట్టును. దాచనిచ్చిన సొమ్ము దొంగిలి గాడిద యగు. గుణములను దోషములుగా నెన్ని కాటుక పిట్టయగును. విశ్వాసఘాతి కుక్కయు, ధాన్యాదుల దొంగిలిన వాఁడు, పందికొక్కును, అన్యస్త్రీని గూడి కుక్క, నక్క, గ్రద్ద, పాము, రాబందు, జన్మముల వరుసగా నెత్తును. సోదర భార్యంగదిసి ముగకోకిల యగును. గురు రాజ మిత్రుల సతుల గదిసి పందియగును. కన్యకు పునర్వివాహము చేసిన వాఁడు క్రిమి జన్మమెత్తు. జ్యేష్ఠుని దిరస్కరించి, క్రౌంచ పక్షి యగు. ద్విజభార్యను బొందిన శూద్రుఁడు పురుగగును. మఱి పెక్కు నీచయోనులం బొందును. అన్నము దొంగిలి యీఁగ యగును. నేయిమొదలుగా నాయావస్తువుల దొంగిలి యా యా జన్మవిశేషములందునని యిందు వివరముగాఁగలదు. ఆయా లోహముల హరించిన వానికిఁ బ్రత్యేక జన్మములు చెప్పఁ బడినవి. రంగులు దొంగిలించి నెమలియగును, సుగంధవస్తువులఁగాఁజేసి చుంచుగాఁ బుట్టును, వస్త్రముల హరించి కుందేలగు, పండ్లు హరించి నపుంసకుఁడగు. కత్తులు

హరించి కల్లలు దోలఁచు పురుగై పుట్టును. పుష్పాలు హరించి దరిద్రుఁడగు. మానము హరించి కుంటి, కూరగొని చిలుక, నీరుగొని చాతకము, నగును. భూమి లాగికొన్నవాఁడు మహా రౌరవము ననుభవించి, గడ్డి, లత, పట్ట, చెట్టు, మొదలగురూపములు వడసి మరల పశుపక్ష్యాదులం జనించి చండాలుఁడై, కుంటి గ్రుడ్డియై కుష్ఠి క్షయరోగి. ముఖ, నేత్రగుదములందు రోగముకలవాఁడునై మూర్ఛనొంది, శూద్రుఁడై జనించు. గోవులను, బంగారమును దొంగిలించిన వారి గతియు నిట్టిదే. భార్య నింకొకని కర్పించినవాఁడు నపుంసకుఁడగు. జ్వాల లేని యగ్నిలో హోమము చేసి యజీర్ణరోగియగు. ఇట్లువలక్షణముగా నాయా పాపములవలనఁ గల్గు నాయాఁగతులు తెల్పబడినవి. భూతదయ, సద్వాదము, పరలోకమునుబడయుటకుఁదగు కర్మము లొనర్చుట, సత్యము, వేదప్రామాణ్యము, దేవర్షి గురు బ్రాహ్మణాతిథి పూజ, సాధుసంగము, మైత్రి యను నివి స్వర్గమునుండి వచ్చిన పుణ్యాత్ముల లక్షణంబులు.

ఇట్లు యమభటుఁడు వివరించి, మఱియుంగలనరకంబులఁ జూపెదుగాక రమ్మన, నారాజు పాపులగు జీవులు తానచట నుండుటచే నించుక సుఖము పొందుట గని జాలిచేఁ గొంతసేపటనే నిలిచియుండె. నావలన వీరికి సుఖమెప్పుడు నుండునేని నే నిచట నే నిలిచెదనని విదేహావతి పలికిన, యమదూత, అదిగో! యింద్రుఁడుఁ యముఁడును నీవంకకే వచ్చుచున్నారు. నిన్ను గొంపోవ నున్నారు. చూడుమనియె. అంత యముఁడువచ్చి భూపతీ! నీకుఁ బుణ్యలోకము లొసంగెద. ఇదే విమానము, ఎక్కుమన రాజు త్రాహి త్రాహి యని వేడు

కొను నీదీనులను రక్షింపక నేనెట్లుసుఖింతు నన నింద్రుఁడతని కిట్లు లనియె. రాజా! నరకవాసుల యెడలఁ జూపిన జాలివలన నీ పుణ్యమనంతముగాఁ బెరిగిపోవుచున్నది. అల్లదె చూడుము. నీ పుణ్యఫలముచే నీ పాపులెల్లరు నారకబాధలు వాసి విమానములపై పుణ్యలోకముల కేగుచున్నారు. ఒక్కఁడు నిందు లేఁడు. అని యిట్లింద్రుఁడను చున్నంతలో పూలవాన గురిసె. ఆ రాజును దేవేంద్రుఁడు. విమానమునంగొని స్వర్గమున కేగెను.

తండ్రీ! ఈ యాతన లెల్ల నే ననుభవించి, తుదకు జ్ఞానము వడసి యీ రహస్యము నీకుఁ దెల్పితిని. ఇంక నేమి వినఁగోరెదవన నా బ్రాహ్మణుఁడు కుమారా! ఈ సంసారము వదలి నా చిత్తమునకు శాంతిగలుగు నుపాయ ముపదేశింపు మనియె. ఆ బాలుఁడు జనకా! గృహస్థధర్మము విడిచి, యాత్మానుసంధానము సేయుము. మున్ను దత్తాత్రేయుం డలర్కున కనుగ్రహించిన దుఃఖసంయోగ వియోగమయిన యోగశాస్త్రము నెఱింగించె నక్కథ వినుమని యిట్లు చెప్పం గడంగె.

## — దత్తాత్రేయ చరిత్ర —

ప్రతిష్ఠానపురమునఁ గౌశికుఁడను బ్రాహ్మణుఁడు కుష్ఠరోగియై యుండ నాతని భార్య భర్తను దేవత వోలెనమ్మి యారాధించుచుండెను. అతి తీవ్రకోపనుఁడగు నా ద్విజుఁడిల్లాలిని బెక్కు నిడుమలు గుడిపించుచున్న నామె తన పాతివ్రత్యమున కెక్కుడవ కవచ్చునోయని, జాగరూకయై యాతని శుశ్రూషించు

చుండె. వాఁడొకనాఁడొక వేశ్యను జూచెను. తాఁ జూచిన వేశ్య యింటికిఁ గొంపొమ్మని యా సాధ్విని గోరెను. ఆమె యించుకయు శంకింపక, యా వెలయాలికిచ్చుటకై కొంత వెల పైట కొంగున ముడిచికొని, భర్తను మూఁపుమీఁది కెక్కించుకొని, యంధకారబంధురమయిన వీధి నర్ధరాత్రి మెల్లనఁ గొంపోవుచుండెను. ఆ త్రోవలో నిరపరాధియగు మాండవ్యుఁడు శూలమునఁ గ్రుచ్చఁబడి, దుఃఖార్తుఁడై యుండగా, నీ మహాసాధ్వి మూఁపున నున్న కౌశికుని కాలు దగిలిన నా ముని మిక్కిలి బాధనొంది కోపించి సూర్యోదయమగు నంతకు వీఁడు చచ్చుఁగాక యని శపించె. అయ్యింతి యా శాపము విని, తన మగనికిఁ గలుగనున్న విపత్తునకుఁ గలఁగి, సూర్యుఁడుదయింపనే యుదయింపఁ డగుంగాక యనియె. పరమసాధ్వియగు నామె నోటవచ్చిన యా మాటచే నారాత్రి కవసానమే లేదయ్యె. జగమంధకారమున నిండె. లోకవ్యాపార మంతయు నాగిపోయెను. దేవ పితృకార్యము లాగిపోయెను అనుష్ఠానములు సాగవయ్యె. వ్యతిక్రమము పుట్టెనని దేవతలు కంపించిరి. మనుజులు హవిర్వర్షముల గురియించి మనలను దృప్తిపఱచి, యూర్ధ్వవర్షులనంబరగిరి. మనము వారికి జలముల గురియించి యధోవర్షులనంబడుదుము ఇట్లన్యోన్యాపాశ్రయనంబుచే జగములు ప్రవర్తించుచుండ నిదియెల్లనేఁడు తారుమారయినది. జగచ్చక్షువు మఱుఁగువడిన నికఁ జేయఁగలది కలదే? అని వాపోవు దేవతలంగని బ్రహ్మ “అమరులారా! వినుఁడు. తేజము తేజముచేతను, తపస్సు తపస్సుచేతను శాంతింబొందుగావునఁ బతివ్రతామహిమచేఁ గలిగిన యా

యవస పతివ్రతామహిమచేతనే తొలగింప నలవియగును. కావున పతివ్రతాభార్యయగు ననసూయను శరణొందుఁ”డన వార ల్లొనర్చిరి. పతివ్రత మహిమ మిట్టిది. ఇది తుయించునది కాదు. ఆమెనే బ్రతిమాలవలయునని తెల్పి యనసూయ తాను నా సాధ్వీమణి సన్నిధి కటిగి. కుశల మడిగిన నామె యిట్లనియె, సతీమణీ! ప్రాజాపత్యాదివ్రతములు పెక్కులుసేసి, నవసి పురుషు లార్జించుకొన్న పుణ్యరాశిలో సగ మేశ్రమయు పడక భార్య పంచికొనునఁట. ఇంతకంటె సులభోపాయము కలదే? భర్తృసేవకంటె మించిన బల మబలకు మఱియేమి కలదు? అట్టి దానికి క్షేమమున లోపమేమి?” అన విని యనసూయ, “అమ్మా! నీమహిమ మనుపమానము దేవతలు నన్ను బంప వచ్చితిని. సూర్యోదయ మను గ్రహింపుము. నీభర్త క్షేమ మున నుండఁగలఁడు” అన నామె యపుడు భాస్కరు నాహ్వా నించె. రవియంతట నుదయించి లోకమునకు బాంధవంబు ప్రకటించె. ఆక్షణమే యామె భర్తయగు కౌశికునిప్రా ణములు పోయెను. అనసూయ, “త్రికరణములచే నే నన్య పురుషు నెఱుఁగనేని, యీవిప్రుఁడు జీవించుఁగాక! ఈప్రతి వ్రత సౌభాగ్యవతియయ్యెడుఁగాక యనియె. అంత నా విప్రుఁడు నిద్రనుండి మేల్కన్నట్లు ప్రాణములుగొనిలేచుట యేగాక, యువకుఁడై సుందరుఁడై తోఁచెను. దేవతలప్పుడే పుష్పవృష్టి గురిసిరి. వరము కోరుమని యనసూయ నడిగిరి. ఆమెయు “దేవతలు నాయెడఁ బ్రసన్నులగుదు రేని బ్రహ్మ విష్ణు మహేశ్వరులు నాకడుపునఁ బుట్టవలయు. నిది నాకోరిక యన వారట్లే యగునని యనుగ్రహము చూపి యేగిరి,

అవలఁ గొన్నినాళ్ళకు బ్రహ్మకు రెండవ కుమారుఁడగు నత్రి ఋతుస్నాతయగు ననసూయను మనసుచే బొందెను. అయ్యెడ ముని శరీరమున శుక్లము, వాయువుచే జనించి నలుదెసలకును వ్యాపించి పైకెగసెను. బ్రహ్మరూపమై, తెల్లని కాంతిగలిగి, రజోగుణమయమై, సోమాకృతినున్న యా తేజము పదిదిశలు వెలిగించెను. అనసూయయందది నిలిచిమానసపుత్రుఁడై జనించె. ఆ తేజస్సు సకలభూతములకు నాయువు నాధారమునై యున్నది. అవల విష్ణుఁడు తన శరీరమున సత్వగుణ ప్రధానుండైన దత్తాత్రేయుఁడను మునీంద్రు నావిర్భవింపఁజేసి యత్రి మహర్షి కొనంగె. ఆబాలుఁడనసూయాదేవి స్తన్యమును ద్రావెను. విష్ణువేయిట్లాత్రికి రెండవ కుమారుఁడయ్యె. అత్రిపై పగగొన్న హైహయుండను. వాని నప్పుడే దహింపనెంచి, తల్లి గర్భమున నేడుదివసంబులకన్న నెక్కువ యిమిడి యుండక రుద్రాంశమున దుర్వాసుండు, దేవత లనసూయకిచ్చిన వరమును బాలించుచు నామె గర్భమున జనించె. అది తమోగుణ ప్రధానమైనమూర్తి. దేవతల వర ప్రభావమున నిట్లు ముమ్మూర్తులు నుదయించిరి. అందు సోముఁడు తన కిరణప్రసారముచే నోషధులను బెంచి మానవులను బోషించుచున్నాఁడు. దత్తాత్రేయుఁడు దైత్యుల వలని యుపద్రవము వారించి, శిష్టులును యోగనిరతులును నగు మహానుభావుల కండుబాటులో నున్నాఁడు. రుద్రాంశమగు దుర్వాసుండుత్తములఁ బరాభవించువారిం దహించుచున్నాఁడు. చూపు, మనస్సు, మాట యను త్రికరణముల చేతను నాతఁడు రౌద్రవృత్తి ప్రకటించును. ఇతఁడు తలి

దంష్ట్రులఁ విడిచి, పిచ్చివానివలె నున్మత్తమను మహావ్రతము పూని యిందు నందుఁ దిరుగుచుండును.

## — దత్తాత్రేయ చరిత్ర —

దత్తాత్రేయుఁడు నిస్సంగుఁడై మునికుమారులంగూడి యాడుచు సరోవరమున మునిఁగి యున్నంత, నాతని సౌందర్యము నూరక చూచుచు నానందింపవలెనని మిత్రులగు మునిబాలురు విడువక యా కొలని గట్టుననే నిలిచి యుండిరి. ఇట్లు నూరు దివ్యవర్షములు గడచెను. వారట్లే కదలకుండిరి. అంత నయోగ్యాగి, సౌందర్యరాశి యగు నొక్క తరుణి నెత్తికొని యానీరు వెడలి వచ్చిన నప్పుడు వారు తొలంగి పోరైరి. అంత నామెతోఁ గల్లు ద్రావుచుఁ గానవచ్చె. అంతట మునిబాలురు, వీఁడు మద్యపానరతుఁడు, గీతవాద్య నిరతుఁడు, భోగపరుఁడు, భామినీలంపటుఁడని యెంచి, వాని విడిచి చనిరి. అతఁడును దన్ను నక్రమ వర్తనునిగా వారు భావించి దూరం బగుటకే పెక్కుమారులు వారు చూచుచుండఁ గల్లుద్రావుచుఁ బాడసాగె. అంతయొందుచున్న యింటినంటిపెట్టుకొని యగ్ని యున్నటు లయ్యంగన నెత్తికొని, కల్లు ద్రావుచునే, యయోగ్యాగి వర్యుండు దతగురుండు తీవ్రతపమొనర్చుచుండె. విప్రులను, చండాలురను, మఱి యెల్లరను లోన వెలుపల నంటు వాయువునకు, వారి వారి కలుషము లంటనట్లు, కల్లు ద్రావినను, మఱి యేమొనర్చినను నాకలుషములు యోగసిద్ధుని కంటవు. ముక్తిగోరు మునులకు ధ్యానింపఁదగిన యమ్మునియట్లే కలుద్రావుచు నవ్వనితను వదలకుండె.

కొంతకాలమునకు, కార్తవీర్యుఁడు, నరకకారణమైన రాజ్యమేల ? వన్నులం గొను రాజు ప్రజల రంజింపకున్న పాతకము వడయు. ఆఱవభాగమువన్ను ప్రజారక్షణమున కేర్పడిన శుల్కము. వర్తకులు తమరాబడిలోఁ బండ్రెండవ భాగము రాజున కిత్తురు. పెరుగునేయి మొదలగువాని యాదాయములో నాఱవవంతు గొల్లలిత్తురు. అగ్నిహోత్రము తపస్సు, సత్యము, వేదసాధనము, ఆతిథ్యము, వైశ్వదేవము ననువానికి 'ఇష్టము'లని పేరు. వాసీకూప తటాకములు, దేవాలయములు, అన్నదానము ననునవిచేయుట పూర్తమనఁబడును. ఈ యిష్టాపూర్తములను నడుపని రాజు దొంగ. ఇవ్వనులు సేయలేని యసమర్థుఁడనగు నాకు రాజ్యమేల ? అనిన విని, మంత్రి వర్గమందు వృద్ధుండగు గర్గముని యిట్లనియె. రాజోత్తమా! నీ వన్నది సత్యమే. సహ్యాద్రోణియం దాశ్రమం బొనర్చికొని యున్న దత్తాత్రేయు నారాధింపు మతండు భువనత్రయ రక్షా దక్షుండు, విష్ణుని యవతారము. ఇంద్రుఁడాతనిం గొలిచి కాదె దేవేంద్రపద మేలుచున్నాఁడు. అదెట్లంటేని వినుము. దేవతలు విప్రచిత్తి మొదలగు రక్కసులుపెట్టు బాధలకు దిగులొంది బృహస్పతి తెలియఁజెప్పిన దత్తగురుని శరణొందిరి. అతఁడు మద్యము త్రావి, యుచ్ఛిష్టుఁడనై యున్నాను. జితేంద్రియుఁడను గానే; నేను మీ శత్రువుల నెట్లోడింతును ? అన వారువినక యతిభక్తితో మద్యము సమర్పించి, నిలిచినచో నిలిచి, యడవి దిరుగఁ దిరిగి, కూర్చుండినఁ గూరుచుండి, యనేకవిధములఁ గొలిచిన, నాతఁడేల యిట్లు నన్ను వెంటాడెదరు ? నేనేమి చేయఁగలనన దేవతలు; ప్రభూ! నీవు జగత్పతివి. విద్యాసంప

దచే మనసును గడిగికొని, యందుఁ జిక్కించుకొన్న జ్ఞానప్రభ గల నీవేడ ? పాపములు నిన్నంటు టేడ ? అని దేవతలనిరి. దత్తాత్రేయుండును, వేల్పులతో, "నాకడ విద్యయున్నమాట నిజమే. కాని యింతి సంగమముచే నే నంటువడితిని. నిరంతర స్త్రీ సంగతి పాపహేతువు." అన, సురలు "ఈమె జగన్మాత. గురూ ! నీ హృదయమున నెలకొన్న విద్యయే యామె. సూర్యుని కిరణమాల బ్రాహ్మణుని, కడజాతివానిని సమముగా దాఁకి యెట్లు మైలబడదో, యట్లె యీదేవత దూషింపఁ బడదు" అనిరి. దత్తాత్రేయ యోగి చంద్రుండంతట సురలయెడ దయగొని, "ఓ విబుధులార ! మీ శత్రువులు నా కనుచూపు మేర నిలుచు నట్లనువు సేయుఁడు. నా చూపులవారు గాలి పోయెదరు" అనియె. దేవతలంతట దైత్యులమీఁది కెత్తిపోయి, పోరి, పారివచ్చి దత్తాత్రేయు శరణొందిన, దనుజులు, వారి వెన్నంటి తరిమికొనివచ్చి యాత్రేయుని ప్రక్కనున్న జగన్మోహిని యగు నంగనం గాంచి, మోహముచెంది దేవతలను విడిచి, యొక పల్లకియం దామెనునిచి, నెత్తి నెత్తికొని కొంపోయి స్వస్థానములకేగిరి. దత్తగురుండది నూచి, నవ్వి, దేవతలతో నిట్లనియె. గీర్వాణులార ! మీ కభివృద్ధి సమయమయ్యె. ఈ లక్ష్మిదైత్యుల నడినెత్తి కెక్కినది. కాన వీరు నశింతురు. స్థానము లేడింటిని దాటి లక్ష్మి తలమీఁద కెపుడెక్కునో, యప్పుడు వినాశము తప్పదు. చీలమండలమీఁద నిల్చిన వస్త్ర మణి ధనలాభము. గుహ్యావయవమందున్నచో స్త్రీలాభము. భుజములమధ్యమునఁ (క్రోడమున) నున్న సంతానము. హృదయమందున్న మనోరథసిద్ధి, కంఠమున నున్న

కంఠభూషణలబ్ధియు, ప్రవాసగతులైన యిష్టబంధువులు, భార్య మొదలగువారి యాలింగన సౌఖ్యము, మృష్టాన్నము, మధుర భాషణములు, నిరంకుశమగు నాజ్ఞ, కవిత్వము మొదలగు లాభములను ముఖమున నున్నచో నొసంగును. తలకెక్కెనో నిమిషమేని నిలువక యామె వేఱొకనిం జేరును. ఇప్పుడే రాక్షసుల నీమె వదలిపో నున్నది. స్త్రీ వ్యామోహములకు శ్రీ దక్కునే? మీరిదె యదనని వీరి మడియింపఁజేసిన దేవతలు వారిం బొడిచి, స్వారాజ్యము నార్జించిరి. రాజా! నీవు నట్లే ప్రాపించిన యీరాజ్యలక్ష్మి నాదరింపుమనియె.

కార్తవీర్యుఁడు గర్గుని యుపదేశము విని, దత్తాత్రేయుని మద్య మాంసాదులచేఁ దృప్తు నొనర్చి, పెక్కు తెఱంగుల నర్చించిన, దత్తస్వామి ప్రసన్నుడై పరిపాలనశక్తిని, పాలనము వలనఁ బాపముకలుగకుండుటను, నితరుల మనసులోని మర్మములఁ జెప్పకయ తెలియు తెలివిని, నిత్యజయమును, వేయి బాహువులను, నవి యన్ని యున్నను బరువులే కుండుటను, శైలాకాశపాతాళాదులందు యథేచ్ఛా సంచారమును, గొప్పవాని వలని మరణము, నుత్తమ మార్గోపదేష్టలు, శ్లాఘ్యులు నగు నతిథులను నక్షయములగు ధనములను, రాజ్యమందే వస్తువులైన స్మరణమాత్రముచే నశింపకుండుట, గురుని యందనన్య భక్తియు వరమ్ములుగా ననుగ్రహించి యతని నభిషేకించె. అంత నారాజు సర్వశోభనముగా రాజ్య మేలందొడంగె అతడు ధర్మపాలనంబునఁ బెక్కు యజ్ఞములుచేసి, భూదేవ పితృదేవులఁ దృప్తిపఱచె. అతనిరాజ్యము నెచటఁ జూచిన దత్తాత్రేయారాధనమే: జనులెల్లరు యోగనిరతులై యుండిరి

ఇట్టి పరమపవిత్రంబగు దత్తగురు చరిత్రంబు విని, భావంబు విమర్శించు పుణ్యులు భవాబ్ధిం దాటి సుఖింతురు.

—♦ ఋతధ్వజుఁడను పేరుగల కువలయాశ్వునిచరిత్రము♦—

శత్రుజిత్తను వాని కుమారుఁడు ఋతధ్వజుఁడు సర్వ శుభలక్షణ సంపన్నుఁడై రాజ్య మేలుచుండెను. పెక్కుమంది రాజకుమారు లాతని సావాసగాండ్రై కావ్యనృత్య గీతాది కళలచేతను, అక్షక్రీడాదులచేతను నిరంతర మాతనితో వినో దించు చుండిరి. ఒకప్పుడు నాగలోకమునుండి నాగరాజకు మారులిద్ద రాతనితో జతసేసి, హాస్యసల్లాపములఁ బ్రొద్దు పుచ్చుచుండ, వారి తండ్రి, మీకు నరలోకము నెడ యింత ప్రీతియేల? అనిన వారు తమ వృత్తాంతము తెలిపిరి. తమ జత గాఁడగు ఋతధ్వజుని గొనియాడిరి. వారితండ్రి, చాటున నేని యెవ్వఁడు గుణవంతులచేఁ బ్రశంసింపఁ బడునో యాతఁడు ధన్యతముఁడు. శాస్త్రము తెలిసియుఁ గుణములేని వారున్నారు. మూఢులయి గుణవంతు లయిన వారున్నారు. శాస్త్రశీలములు రెండును సమానముగా నెవ్వనియందుండునో, యెవ్వని గుణ ములను మిత్రులును, పరాక్రమమును శత్రువులును, స్తుతింతురో యతఁడు ధన్యమూర్తి. అట్టి కొడుకుగల తండ్రి పుత్రవం తుఁడు. అతనిగొనిరండు. అట్టి రాజకుమారుని కేది చాల యిష్టమోయది మనము సమకూర్తము, అనినఁ గుమా రులు వానికిఁ గోరఁదగినది లేదు. అతఁడు సర్వసంపన్నుఁడు వినుము,

"మున్ను శత్రుజిత్తునొద్దకు గాలవుఁడను మునియొక గుఱ్ఱముం గొనివచ్చియిట్లనియె? ఒక రక్కసుఁడు సింహగజాది నానారూపములు దాల్చి ఋష్యాశ్రమములందు మౌనవ్రతనిష్ఠుల నుండగా భయపెట్టి వారి తపమునకు భంగము చేయుచు న్నాఁడు, వానియెడఁ కోపముచూపిన మా తపస్సు క్షయము గును. ఇట్లని విసివివేసారి దిక్కుతోఁపక, యాకసమువంకఁ జూచుచుండగా, నాకాశవాణి" ఇదిగో! యీ గుఱ్ఱము నీకిత్తును ఇది లోకములెల్ల తిరుగఁగలది. సూర్యునితో నడువఁజాలినది. భూమండలమెల్ల నిరాఘాటముగాఁ జరింప గలది కాన దీనికిఁ గువలయము అను పేరుగలదు. శత్రుజిత్తుండీ గుఱ్ఱమునెక్కి రక్కసు నుక్కడంపఁగలఁడు. అని పలికెను. 'నీ కుమారుని ఋతధ్వజుని మాతో నంపుము' అని గాలవుం డన, శత్రుజిత్తుండు కుమారుని రావించి, దీవించి, యాగుఱ్ఱ ముపై నెక్కించి, శుభోదర్కంబుగా నంపెను. ఎవ్వటి యట్లముని సమాధినుండగా, రాక్షసుఁడు పందియైవచ్చి బెద రించెను. మునివరుని శిష్యులార్పువెట్టిరి. ఋతధ్వజుఁడు బాణ మునఁగొట్టెను. వాఁడు సపర్వతనదీనదారణ్యంబగు నేలయెల్ల పఱువులువెట్టిన శరశరాసనములఁజేతఁబట్టుకొని గుఱ్ఱముమీఁద వాని వెన్నంటి తరిమిన, వాఁడు పోయిపోయి యొక భూవివర మునఁ గారుచీఁకటిలో డాగెను.

## — కువలయాశ్వుండుమదాలసనుజూచి మోహించుట —

రాజపుత్రుడందుఁ జొరఁబడి చూచునంత, బంగారు మేడలతో మెఱయు నింద్రపురమువంటి పురము గానంబడయె.

ఆ మేడలో నొక్క మానవుఁడేనిఁ గానఁబడఁడయ్యె. అంతలో నొక సుందరి కానవచ్చిన ఋతధ్వజుం డంగనా! ఎవ్వతెవీవు? ఒంటిగ నున్నావేమి? యన నామె మాటాడకయే మేడ యెక్కి చనుచుండెను. రాజసుతుఁడు గుఱ్ఱమునొకచోఁ గట్టి వైచి, తాను నామెవెంట మేడయెక్కెను. అటహంసతూలికా తల్పమున నున్న యాజగదేకసుందరిగాంచి మోహవివశుఁ డయ్యె. ఆకాంతయు నీ ధరాకాంతునింగని వలపుగొనియె. దాని చెలికత్తె యిది కనిపెట్టి యా రాకుమారుని కడకరిగి యిట్లనియె. ఓ మోహనాకార! ఈమె విశ్వావసుఁడను గంధర్వరాజు కూతురు. 'మదాలస' యని దీనినామము. ఒకనాడు వజ్రకేతుఁడను రాక్షసునికొడుకు పాతాళకేతువనువాఁడు పాతాళమునసుండువాఁడీమెంగాంచి మన్మథవశుండై బలిమిమైఁ గొనివచ్చి యిట బంధించినాఁడు. రాఁబోవు త్రయోదశినాడీమెను వివాహమాడ నున్నాఁడు. శూద్రునకు శ్రుతివలె, వాని కీమెగ్రహింపఁదగినది కాదు. దిక్కుగానక, యీామె ప్రాణముల విడుతునని యుండఁగా, సురభివచ్చి, "బాలా! ఈ యసుర నెవ్వఁడు పుడమికేగినతఱి బాణములఁ జీల్చునో, యాతఁడు నీకు మగఁడగును." అని యానతిచ్చె. నే నీమె చెలికత్తెను. 'కుండల' యని నన్నందురు. వింధ్యవంతుని కూతురను. పుష్కరమాలి యనువాని భార్యను. నా భర్తను శుంభుఁడను దానవుఁడు సంహరింప, నేను దివ సంచారముచేఁ దీర్థాటనము చేయుచు, పరలోకమునకేగ వేచి యున్నాను. పాతాళకేతువు నీబాణమునఁ గొట్టుబడి పారిపోయినాఁడు. ఇక్కన్నియ నీపై మఱులుగొనియున్నది. ఈమె నాదరింపుము,

అన విని రాకొమారుఁడు తన వృత్తాంతము తెల్పి, నే నస్వతంత్రుఁడను. మాతండ్రికిం దెలుపక నేనీమెం బరిగ్రహించుట యెట్లు?" అనియె.

## మదాలసా వివాహము

అంత నాకుండల మీా సంబంధము దైవసంఘటితము. ఇది ధర్మభిన్నముఁగాదని యొప్పించి గంధర్వకులగురుండగు తుంబురుని స్మరించినంతన, నాతఁడు సమిత్కుశాదులగొని ప్రత్యక్షమయ్యె. కుండల ప్రోత్సాహముచే, నగ్నిసాక్షికముగా ఋతధ్వజుఁడు మదాలసను వివాహమాడెను. వివాహ విధి ముగియగానే తుంబురుఁడు తపమున కేగెను. కుండలయు ధన్యురాల నయితినని యా బాలిక నా రాజబాలకుని కప్పగించి లాలించి, తాను దపమునకుఁ జనెను. ఋతధ్వజుండంత సకాంతను దురంగము నెక్కించికొని రాఁజూచినంత, దానవకోటి యెదిరించెను. వారినెల్ల సంహరించి సుఖర్మై యయ్యిందుముఖితో గృహమ్మున కేతెంచి, తండ్రిచేఁ బ్రశంసితుఁడై యామెంగూడి యిష్టోపభోగము లనుభవించుచుండె.

ఋతధ్వజుని తండ్రి కుమారునింబిలిచి, కుమారా! నీవు దినదిన ముదయమున నీ యశ్వము నెక్కి భూమండలమెల్ల తిరిగి బ్రాహ్మణుల కెట్టి యాపదయు రాకుండఁ గాపాడుచుండుము. దుష్టుల ఖండింపుము" అన నాతఁడు తండ్రియాజ్ఞ పాలించు చుండెను.

## —♦ మదాలసావియోగము ♦—

ఒకనాఁడు యమునాతీరమున నునికిచేసికొనియున్న పాతాళకేతుని భ్రాత [illegible] తాలకేతువుంగాంచె. వాఁడును ముని వేషముఁబూని నృపసుతుంగాంచి పూర్వవైరము తలంచివచ్చి "యజ్ఞదక్షిణగా నీ కంఠభూషణమిమ్ము. వారుణములగు వైదికమంత్రములచే నేనీ నీటమునింగి, జపమొనర్చి వచ్చునందాక యిఁట గాపుండుము" అనియె. నృపసుతుఁ డమ్మని మ్రొక్కి, తన కంఠమణినిచ్చి, యట ధనుష్పాణియై రక్షయొనర్చుచుండె. తాలకేతువు నీటిలో మునింగి వేరొకతెఱవున మదాలసకడకేగి, "భామినీ! నీమగఁడు కువలయాశ్వుఁడు నా యాశ్రమముదాపున నొక్క రక్కసునిచేఁ జచ్చె. ఇదిగో! అతని కంఠభూషణము నాకిచ్చెను. అతఁడు సంస్కరింపఁబడెఁగూడ. అతని గుఱ్ఱము నా యసుర హరించెను. ఈ భూషణము నీయది. నీకిచ్చివేసెదను". అని నంత నట విన్నవారందరు శోకార్తులైరి. తండ్రియు నాతని భార్యలు మూర్ఛనొందిరి. 'మదాలస' కాంతునిందలఁచికొని యప్పుడే ప్రాణములను విడిచెను. తాలకేతువు కృతార్థుఁడనై తినని పొంగి, తిరిగివచ్చి, నీఁటనుండిలేచి, "రాజపుత్రా! నా యజ్ఞము ముగిసినది. నీవిఁకఁ బోవచ్చును" అన నాతఁడా మాయామునికి మ్రొక్కి యింటికివచ్చినఁ బౌరు లాశ్చర్యపడిరి. అతఁడు నగరుసొచ్చి 'మదాలస' మరణించినట్లువిని, కడుంగడు దుఃఖించి యిది మొదలంగనఁ దాకను, భోగములనుభవింపను" అని మిత్రవర్గముతోడనే వినోదించుచుఁ గాలము వెళ్ళించుచుండెను.

### —♦ నాగరాజు మదాలసను కుమార్తెగాఁ బడయుట ♦—

ఇట్లు కుమారులు మదాలసావియోగ వృత్తాంతము వినిపించినఁ దెలిసి, నాగరాజు, బిడ్డలతో, ఓయీ! నేనా రాజపుత్రుని దుఃఖము వాపెదను. దేవతానుగ్రహముచే బడయరానిదేద్ది? అని హిమవన్నగంబునకుఁ బోయి, తీవ్రనిష్ఠఁబూని సరస్వతి నారాధించె. ఆమె ప్రత్యక్షమయివరమిత్తు ననన నా సోదరుని కంబలునకును నాకును సంగీత జ్ఞానము ననుగ్రహింపు మన నామె యది యొసంగి చనియె. అవల నాసోదరు లిద్దరును కైలాస వాసియగు నుమాధవునర్చించిరి. అతనివలన, 'మదాలస' మునున్న వయసులోని దేరూపముతోఁ దనకుఁ గుమార్తె యగునట్లుగా నాగపతి వరముఁ గోరెను. ఈశ్వరుఁడును 'నాగపతీ! శ్రాద్ధముతుదిని. పిండములలో నడిమిపిండముం దినుము. అవ్వల నీ నడిమి పడగనుండి మధాలస యవతరించు ననియె. అతఁడట్లొనర్చినంత, దివ్యసుందరియగుమదాలస మునుపటి యట్ల యావిర్భవించెను. ఆవార్త నాతఁడితరులకుఁ దెలుపక, యాపిల్లను బెంచుచుండి, కుమారులంగాంచి, మున్ను నేనంటిని గదా! మీ జతగాడగు ఋతధ్వజుని కేవిధముగా నుపకృతి సేయవలయునని కదా యున్నది. మీరిప్పుడే యాతనిం గొని రండన, వారుపోయి, గౌతమీనదీ మధ్యమునందుండి, యాతనిఁ బాతాళమునకుం గొనివచ్చిరి.

### —♦ మదాలసా పునస్సమాగము

ఆ రాజకుమారుఁ డట్లువచ్చి నాగుల దివ్యభవనములం గాంచి యాశ్చర్యపడె. నాగవిభుఁ డా రాజకుమారు నుచితోప

చారముల నర్పించి రత్నసువర్ణాది సర్వసామగ్రిలో నీ కోరిన దిత్తునన, నతఁడు "సర్వము నాకు లబ్ధమే. నీ యనుగ్రహముచే నా కెందును లోపములేదు. నీ దర్శనము లభించుట యిదియే విశేషము. ఇఁకఁ జాలును" అన" నట్లుగాదు. నీ వాంఛిత మెద్దియేనొకటి యొసంగవలతును" అన, నాకుమారుఁ డిట్లనియె, నాగేంద్రా! పుణ్యకర్మ సంస్కార మించుకయు నా హృదయనుండి తొలంగకుండునట్లను గ్రహింపుము. తక్కిన భాగ్యము లెల్లపుణ్యతరువుయొక్క ఫలములే. కావున "నా చిట్టు యొక్క మూలమును బోషించుటకంటె వేరేమి కావలయును? అన నట్లే యగుంగాక యని వరమిచ్చి వెండియు నా యింటి కతిథివైతివి. కాన లోకమం దేది దుర్లభమో యట్టి వస్తు వొకటి కోరికొమ్ము. నే నిచ్చెద"నన రాజసుతుఁడు, తన చెలి కాండ్రగునాగకుమారులవంకఁ గనుంగొన వారు నెచ్చెలి కభిప్రేతమగు విషయమొక్క 'మదాలస'యే యని విన్న వించిరి. అంత నాగరాజు "గతించిన భూతములతో సమాగమ మొక్క స్వప్నమందో, శంబర మాయచేతనో కావలెఁగాని వేఱొక విధమున సాధ్యమా ?" యన నృపసూనుఁడు సిగ్గుపడి, "మాయామయి యేనఁగుగాక. మదాలస నా కొకమారు కంటఁబడినఁ జాలు. నీవు వామెం జూపఁగలవేని పుణ్యముం గట్టుకొమ్ము నా పాలికది మహానుగ్రహము" అనియె. అంత నాగవిభుఁ డమితహర్షము పొంది "వత్సా! రమ్ము. ఆ మాయ నే నెఱుంగఁ దలఁతేని చూడుము. అతిథికిఁ దృప్తిసేయుటయే నా యభిమతము" అని సౌధంబున దాచియుంచిన మదాల సను గొనివచ్చి చూపెను. చూపుటే తడవుగా, నతఁడు

హా ! ప్రియా ! యని నిర్లజ్జుఁడై యామెను గ్రహింపఁబోగా, నాగుఁడు వారించి, "ఓయీ ! ఇది మాయ, తాకిన నంతర్ధాన మగుంగదా !" అన నాతఁడు నేలపైఁబడి మూర్ఛనొందెను. భుజంగపుంగవుఁడు నిజమెఱింగించి, యయ్యింతి నొసంగిన నా ఋతధ్వజుండు మదాలసా సమేతంబుగ నమందానందమొంది యశ్వము నధిష్ఠించి, నిజపురమ్మున కేతెంచి, తలిదండ్రుల కెఱింగించి, మ్రొక్కి, మ్రొక్కించి యామెతో సర్వభోగము లనుభవించుచుండె.

—♦ మదాలస తన సంతానమునకు విజ్ఞానోపదేశము చేయుట ♦—

శత్రుజితు ననంతరము ఋతధ్వజుఁడు రాజయ్యె. అతఁడు మదాలసయందుఁ దొలుత విక్రాంతుఁడను కొడుకుం గాంచె. విక్రాంతుఁడుదయించి, శైశవమ్మునఁ బోరుపెట్టి యేడ్చుచుండగా మదాలస వానిం దొట్టిలో నిడి యూచుచు, బిడ్డా ! నీవు శుద్ధుఁడవు. నీకుఁ బేరులేదు. ఈపేరు నీకుఁ గల్పితము. నీ యొడలు పంచభూతాత్మకము నీకేమేను లేదు. నీవు దీనివాఁడవుగావు. ఏల యేడ్చెదవు ? లేదు లేదు. నీవేడ్చువాఁడవు కావు. భూతములు భూతములం గదిసి యీపుడమికివచ్చి, వివిధములయిన గుణవికారములచే వికల్పమునొంది, హాని వృద్ధుల గాంచుచున్నవే కాని నీకొక హానియు, వృద్ధియు స్వభావముచే లేదు. నీవు శిథిల ప్రాయమైన యీదేహమను చొక్కాపై మోహముంగొని, మూఢుఁడవై చెడకుము. తండ్రి, కొడుకు, తల్లి, భార్య, యనియు నిది నాది యిది నాది కాదు; అని భూతసంఘమునే పెక్కురీతుల పిలుచుచుందువు. దుఃఖకారణములయిన వానిని సుఖకారణములని యెంచి చెడ

దవు. 'నవ్వు' అననేమి? దంతరూపములయిన యెముకల ప్రోవును వెలువరించుటయేకదా! మెఱుగారు కన్నులు వసా వికారములు. చన్నులు మాంసపిండములు. ఆచోటున నానంద మేమి? స్త్రీ యన నరకముకాదా? నేలమీఁద రథము, రథ ముమీఁద శరీరము నున్నవి. ఆశరీరమున వేరుగాఁ బురుషుఁ డున్నాడు. నేల యెట్లు తానుగాదో, దేహమును దానుగాదు. పురుషుఁడే తాను దేహమే తా ననుకొనుటయే మూర్ఖత్వము. ధర్మాధర్మములు, సత్యాసత్యములు వీడుము. వీనినే సాధనముచే విడిచిపెట్టితివో యా సాధనమునుగూడ తుదకు విడిచివేయుము. ఇట్లు దినదిన మామె శిశువు నుపలాలించు చుండగా నాతడు బలమును బుద్ధిని క్రమముగా పడసినట్లే తల్లి మాటలచే విజ్ఞానము పడసి సంసార విముఖుండయ్యె. రెండవ కుమారుఁడు సుబాహుఁ డుదయించిన నాతనింగూడ యిట్లె పాడుచుఁ బెంచిన నుగ్గుపాలతో నేర్చిన సుజ్ఞానముచే నాతండును విరక్తుండయ్యె. మూఁడవవాఁడు శత్రుమర్దనుండు నట్లెయయ్యె నాల్గవవాఁ డుదయించిన నాతనికి నామకరణము చేయఁబోఁగా మదాలస మగనింగాంచి నవ్విన నాతఁడు "ప్రియా! నీవే యీ బాలునికిఁ బేరుపెట్టుము" అన నామె యాతని కలర్కుండని పేరిడియె. భర్త నవ్వి భామినీ! నన్ను జూచి యింతమున్న నవ్వితివే. నేను బెట్టిన పేరులకంటె నీ వేమంత చక్కనిపేరు పెట్టితివి? నాయుంచిన పేరులే సార్థకములుగాఁ గానవచ్చు చున్నవి. అన నామె యట్లైన వినుము. క్రాంతి యనఁగా నొకచోటినుండి యొకచోటికిఁ బోవుటయేకదా? విక్రాంతుఁడని నీవు పేరుపెట్టినది దేహమునకుఁగాదు పురుషుని కేకదా! పురుషుఁడు

సర్వవ్యాపి, అతఁడే యాత్మ. దేహేశ్వరుఁడు. వాఁడొకచోట నుండి మఱియొకచో లేకుండువాఁడు గాఁడు. అట్టివాఁడెట నుండి యెట కేగును. కాన నీపెట్టిన విక్రాంతుఁడను పేరు వట్టిది. ఇఁక సుబాహుఁడనునది. రూపరహితమైన యాత్మవస్తువునకు బాహువు లెక్కడివి. అదియు వ్యర్థమే. మూఁడవది యగు శత్రుమర్దనుఁడను నది వట్టి యబద్ధము. ఒక్కపురుషుఁడే యెల్ల శరీరములందు నున్నాఁడు వానికొకఁడు. శత్రువని, యొకఁడుఁ మిత్రుఁడని లేఁడు. భూతములచే భూతములు మర్దింపఁబడు చున్న వేకాని మూర్తి రహితమగు నాత్మ యెట్లు మర్దింపఁబడును? క్రోధాది గుణవికారము లాత్మవికారానవ్వు శత్రు మర్దనుఁడని యీ యాత్మ కిఁబేరు పెట్టు టేమంత బాగున్నది? కాదు వ్యవహారము కొఱకే యీపేరు కల్పించుకొన్నా మందువా? అట్లైన నేను నాల్గవ కుఱ్ఱవానికిఁ బెట్టిన 'అలర్కుఁడు' అను పేరు నీకేల యబద్ధముగాఁ దోఁచినది? అని మదాలస తెలియ జెప్పి యలర్కునిం గూడ లాలించి తత్త్వబోధ సేయుచున్నంత కువలయాశ్వుఁడు ఓసీ! మూఢురాల! నావంశ వృద్ధికి భంగము గావించుచున్నావు. వీరెల్లరు విరక్తులయి యిల్లువిడిచి పోవు చున్నారు. నాకుఁ బ్రియమొనర్ప నెంతువేని నామాట గ్రాహ్య మగునేని యీ నాల్గవ వాని నేని ప్రవృత్తి ముఖుని (సంసారిని) గావింపుము. వీనివలన పితరుల ఋణము దీర్చికొందును. ఆకలి దప్పులచేఁ దపించు పితరులను, నరులను, కర్మఠుఁడైన మానవుఁడు తృప్తిపఱచును. దేవాదులు, పశువులు, కృమి కీటములును గృహస్థు నాశ్రయించి జీవించును. కావున నా మాట విని యో భామిని! క్షత్రియుఁ డగువాఁడు గృహస్థుగా

నుండి యైహికాముష్మిక ఫలసాధనముగ నేమిచేయవలయునో దాని బోధింపుమన నామె యలర్కునింగాంచి యిట్లని చెప్పం దొడంగె.

## —♦ మదాలస యలర్కునికి ధర్మోపదేశముచేయుట ♦—

పుత్రా! నీవు ధన్యుఁడవు. నిష్కంటకముగా రాజ్యమును జిరకాలమేలుము. దానివలన దేవేంద్ర సమానభోగమును, ధర్మఫలముగాఁ బడసెదవు. పర్వములయందు బ్రాహ్మణులఁ దృప్తిసేయుము. బంధువుల నాదరింపుము. ఒరుల హితమే కోరుము. పరస్త్రీ పరధన విముఖుఁడవు గమ్ము. శ్రీహరిని ధ్యానింపుము. అద్దాన నంతశ్శత్రువుల నాఱింటిని గెలువుము. జ్ఞానముచే మాయను వారింపుము. జగమనిత్యమని గమనింపుము. ధనము రాబడికి రాజుల జయింపుము. కీర్తికై ధనము వినియోగింపుము. అపవాదకు వెఱవుము. విపత్సముద్రమునుండి జనుల నుద్ధరింపుము. యజ్ఞములచే సురలను, అన్నముచే భూసురులను, ఆశ్రితులను; కామములచేఁ గామినులను, యుద్ధములచే శత్రులను సంతోషపెట్టుము. బాలుఁడవై బాంధవులను, కుమారుఁడవై యాజ్ఞల శిరసావహించి పెద్దలను, యువకుఁడవై యుత్తమవంశమందుఁ బుట్టి వరించిన యువతులను వృద్ధుఁడవై వనమున మునులను నానందింపుము. రాజ్యమేలుచు మిత్రుల నలరింపుము. సాధుల రక్షింపుము. అసాధుల శిక్షింపుము. యాగము లొనర్పుము. బ్రాహ్మణుల సంరక్షించుటకు యుద్ధములఁ బ్రాణములకైన తెగింపుము. అని యిట్లు పెక్కు తెఱంగులఁ దల్లి బోధింప వినుచు, నామె లాలనమ్మున నలర్కుఁడు దినదినాభివృద్ధి గాంచె. [ఈ కుమారబోధము

మూలము 23 వ అధ్యాయమున నున్నది. చక్కని యనుప్రాసములతో నాశ్లోకములు బహురమ్యముగా నున్నవి]

ఇట్లు కువలయాశ్వసూనుండగు నలర్కుండు కౌమారంబునొంది, యుపనయనము గావింపఁబడఁగాఁ దల్లికి మ్రొక్కి యైహికాముష్మికములగు ఫలములం బడయుటకు వలయుపనుల నిర్దేశింపుమన 'మదాలస' రాజ్యధర్మములను, వర్ణాశ్రమాచార వ్యవహారములను, నిత్య నైమిత్తిక కర్మకలాపమును, శ్రాద్ధవిశేషములను, కామ్యశ్రాద్ధఫలమును సదాచార వ్యవస్థను, వర్జ్యావర్జ్యములను బోధించె. ఇట్లు తల్లిచే సుశిక్షితుఁడై యౌవనము రాగా నాతఁడు వివాహమాడి, సంతతిఁగని యాగములొనర్చి, తండ్రి యానతి మీఱకుండె. కొంతకాలమునకుఁ బట్టాభిషిక్తుండయ్యె. అత్తఱి మదాలస తనయుంగాంచి, కుమారా! నీకెప్పుడు కామసక్తి, దుఃఖము, శత్రుపీడ, విత్తనాశము, సంసార మమకారము స్ఫురించునో యపుడీ యుంగరమునందు సూక్ష్మాక్షరములచే లిఖింపఁబడియున్న యీ నా శాసనము ప్రచురింపుము. దానశుభంబగుని యొక సువర్ణాంగుళీయమిచ్చెను. దానిం దాల్చి యాతఁ డుచితగతి పెక్కేండ్లు రాజ్యమేలె; విషయోపభోగములం దగిలిన కొలఁదియు నాతనికి వానియెడ వైరాగ్య ముదయింపదయ్యె. ఆ యంశము నాతని సోదరుఁడు సుబాహుఁడు గ్రహించి, వానిం జక్కఁజేయ నెంచి కాశిరాజును, ప్రేరణ సేయ నతఁడలర్కుని కడకేగి ఓయీ! మీ యన్న సుబాహుండు రాజ్యాభిలాష గల్గి యున్నాఁడు" అని వార్త సెప్పెను. ఆ మాటలిని యలర్కుండు, నా యన్నయే నన్ను రాజ్యముం గోరవచ్చుం

గదా ? అట్లయిన నానందమున నిచ్చెడివాఁడను'' అనియె. సుబాహుఁడంత, "అట్లడిగి రాజ్యముంగొనుట క్షత్రియధర్మము గాదు" అని తెలిపి, కాశిరాజ సైన్యములతో దండెత్తిపోయి, యల్పావకాశేషముగా నలర్కునోడించెను. అట్లోటువడి, తల్లి మాట దలంచి, యామెయిచ్చిన యుంగరముగాంచెను. అందు.

— ♦ అలర్కుండు తల్లియిచ్చిన యుంగరము జూచుట ♦ —

"సంగ స్సర్వాత్మనా త్యాజ్య స్సచే త్త్యక్తుం నశక్యతే.
స సద్భి స్సహకర్తవ్య స్సతాం సంగోహి భేషజమ్
కామ స్సర్వాత్మనా హేయో హాతుంచేచ్ఛక్యతేనసః
ముముక్షాం ప్రతి తత్కారం సైవ తస్యాపి భేషజమ్".

మార్కండేయ. 33. అ. ౨౩. ౨౪ శ్లో॥

"అన్నివిధముల సంగము (పొత్తు) విడువవలెను. విడువలేనిచో సత్సంగమేని చేయవలెను. సాధు సంగతియే మంచి మందు. కామము (కోరిక) సర్వవిధముల విడువవలెను. విడువలేనిచో మోక్షముపైఁ గామము పొందవలెను. అదియే కామరోగమునకు మంచిమందు" అనియుండుటగని, యలర్కుండు మోక్షాభిలాషియై సాధు సంగతికోరి దుఃఖనాశనము చేయుఁడని దత్తాత్రేయు శరణొందెను.

— ♦ దత్తాత్రేయు లలర్కునకు జ్ఞాన ముపదేశించుట ♦ —

అమ్మునియు, ఓయీ! నీకు దుఃఖము కలుగుటకు నిజమైన కారణము తెల్పుము. తెల్పిన వెంటనే నే నది పోఁగొట్టెదను. నీ వెవఁడవు ? ఎవరి వాఁడవు ? ఎవనికి దుఃఖము ? అంగియేది? అంగము లెవ్వి? ఈ ప్రశ్నములడుగు చున్నాను. వీని కుత్తర

ములు విచారింపుము అనిన నారాజు తనలోఁదాను విమర్శించు కొని, తన్నుఁ దానెఱింగి, చిరునవ్వు దోఁప నిట్లనికొనియె. నేను బంచభూతము లందు నెద్దియుంగాను. కాని శరీరముం బొంది సుఖము నాసించుచున్నాను. సుఖదుఃఖములు మానసికములయి స్ఫురించుచున్నవి. కాని యాత్మనగు నా కవి లేనేలేవు. అవి మనసునకో దేహమునకో యుండుఁ గాక వానితో నాకేమివని? భూతపంచక వికారమైన యీ దేహము గుణవృత్తిచే రాజ్య వాంఛగొన్నది. నేను శరీరముకంటె భిన్నుఁడను. నాకీ గజాశ్వర థాదులతో నించుకయు సంబంధము లేదు. కావున నాకు మిత్రుఁడు శత్రుఁడు ననువారు లేరు. దుఃఖము నాదికాదు. సుఖము నాదికాదు. ఘటీకుంభమున నున్న యాకాశ మెట్లు పెక్కుతీరుల గానంబడుచున్నదో యట్లే సుబాహుఁడని, కాశి రాజు నని భేదముగొన్న యాత్మ నేనే. శరీరభేదముచే భిన్ను లమై తోఁచుచున్నాము. అని వివేకించి, దత్తాత్రేయు సన్నిధి కిం జని మునిప్రభూ! సమ్యగ్దర్శనముఁ బడసితిని. జీవుఁ డెందెందు మమకారము నొందునో, యందందు దుఃఖముచే కుడుచును. పెంచుకొన్న కోడిని పిల్లి తిన్నప్పుడా యింటివానికిఁ గలిగిన శోక మెలుకను దిన్నపుడు లేదు. నాదియని, నా కుపకారియని యభిమానించెడి మనస్సే దీనికంతకుఁ గారణము కదా! అన నమ్ముని "ప్రశ్నమాత్రముచేతనే నీ కిట్టి వివేకము కలిగినది. బూరుగ దూదివలె నీ చిత్తము నావరించిన మకిలియెల్ల యెగిరిపోయినది.

నేను నేనను విత్తనమునుండి పుట్టి నాదినాదియను మొద లుగట్టి ఇల్లు, వాకిలి, భూమియను పెద్ద కొమ్మలు గొని, దారా

పుత్రాదులచేఁ జిగిరించి, ధన ధాన్యాదులను నాకులు గలిగి, యనాదిగా, బెరిగి పుణ్యాపుణ్యములను పువ్వులు తొడిగి, సుఖ దుఃఖములను పండ్లు పండి, మోక్ష మార్గమున కడ్డుగాఁ బెరిగి మూర్ఖులతోడి స్నేహమనెడి తడుపుగలిగి, క్రియావాంఛలను తుమ్మెదలఁ గూడిన యజ్ఞానమను మహావృక్షమొకటియున్నది. సంసార మార్గాయాసము సెంది దీని నీడ నాశ్రయించుచు, భ్రాంతి జ్ఞానసుఖమునకు లొంగిపోయిన వారికి సుఖమెక్కడిది? సత్సంగమను రాతిపై నూరి పదును పెట్టఁబడిన విద్య(జ్ఞానము) అనెడి గొడ్డలిచే నీ మమకారమను చెట్టు నెవ్వరు మొదలంట నరుకుదురో వారా మోక్షమార్గమున నేగఁగలరు, చల్లనిది, నీరజస్కము (రజోగుణములేనిది) అకంటకము (ముండ్లులేనిది, శత్రువులులేనిది) నగు బ్రహ్మ వనమునుబొంది (బ్రహ్మజ్ఞానము నని యర్థము) సంకల్ప శూన్యులైన ప్రాజ్ఞులు పరమానంద భరితు లయ్యెదరు. నీవును నేనును భూతేంద్రియ మయమగు నీ స్థూల శరీరముగాము. తన్మాత్రామయంబగు సూక్ష్మశరీరము నుగాము. అంతః కరణాత్మకమగు కారణ శరీరమునుంగాము. ప్రధానమునుగాము గుణాత్మకంబై నసంఘాతముకంటెబరుండయి క్షేత్రజ్ఞుండు (ఆత్మ) గలఁడు. మేడిపండును పురుగునకు, ఇషీకము ముంజమునకు, నీటికిఁ జేపకు నైకత్వమున్నను వేరై యున్నదో, క్షేత్ర క్షేత్రజ్ఞులు (దేహాత్మలు) నొక్కటయ్యు వేరుగాఁ గానంబడుచున్నవి. ఇది తెలిసికొనుము. అనిన విని యలర్కుండు 'మునీంద్రా! తమ యనుగ్రహముచే నాకుత్తమ జ్ఞానముదయించినది. ప్రధానమును జిచ్ఛక్తికిని వివేకించు నీ తెలివి యిప్పుడు లభించినది. కాని విషయాక్రాంతమయిన

యీ సంసారములోఁబడి నా చిత్తము నిలువలేకున్నది. ఈ మాయాబంధమునుండి విడివడుట యెట్లో తెలియఁ జాలకున్నాను. మఱల మఱల పుట్టకుండుటెట్లు ? నిర్గుణుఁడ నెట్లగుదును ? బ్రహ్మైక్యమెట్లు కాంతును ? ప్రభూ ! నీ పదంబుల వ్రాలి యాచించుచున్నాను. నాకా యోగంబుపదేశింపుము. సాధు సాంగత్యముకంటె వేరు భాగ్యము కలదే! శరణొందిన దత్తాత్రేయులలర్కున కిట్లనిరి.

-♦దత్తాత్రేయులవారు అలర్కునకు యోగము నుపదేశించుట♦-

జ్ఞానసాధికముచే నజ్ఞానమునుండి వియోగము (ఎడబాటు) పొందుటయే ముక్తి. బ్రహ్మతో నైక్యము ప్రాకృతములగు గుణములతో ననైక్యము ననునదియే ముక్తికి లక్షణము. విద్వాంసులు యోగశక్తి సంపన్నులు. ముక్తి యోగము వలనను, యోగము తత్వజ్ఞానము వలనను గలుగును. మోక్షేచ్ఛ గలవాఁడు సంగము (అంటు) వదలవలయును. సంగమే దుఃఖములకుఁ గారణము. సంగము వీడుటచేతనే మమకారఖ్యాతి (ఇది నాది యను తలంపు) నశించును. నిర్మమత్వమే సుఖకారణము. వైరాగ్యముచే నెల్ల వికారములను దోషములుగాఁ జూచు నలవాటు కల్గును ఆ వైరాగ్యము జ్ఞానముచేత కలుగును. జ్ఞానము వైరాగ్యము చేతఁగలుగును. యోగికెచట నుండిన నదే యిల్లు. ఏది తినిన ప్రాణము నిల్చునో యదే భోజనము. ఏది ముక్తి కూర్చునో యదే జ్ఞానము. తక్కిన దజ్ఞానము. పుణ్యాపుణ్యము లనుభవించుటచేతను, కోరికలేక యిది విధి యని నిత్యకర్మములు చేయుటచేతను, అపూర్వమును (యజ్ఞాది కర్మముల యొక్క ఫలమును గలిగించు

సాధనమునకు 'అపూర్వము' అని పేరు) కూడబెట్టక పోవుట చేతను, (కొ)త్తదానిని సంపాదింపక పోవుటచేత) ఇదివరకు కూడఁబెట్టినది క్షయించుటవలనను, కర్మబంధమునుండి విడివడును. అనఁగా మోక్షము పొందును. కర్మము చేతనే మరల మరల శరీరము, బంధము కలుగుచున్నది. అదే కర్మవిపరీతమగునేని మోక్షము గలుగుచున్నది. అదే కర్మ విపరీతమగునేని మోక్షము గలుచున్నది. ఇది జ్ఞానమార్గము. యోగి దేనిని బడసి బ్రహ్మకంటె భిన్నుఁడుగాఁడో యట్టి యోగమునుగూడ నీకెఱింగించెద. వినుమని దత్తాత్రేయు లిట్లనిరి.

## —• యోగరహస్యములు •—

ప్రాణాయామముచే శరీరదోషములఁ గాల్చవలయును. ధారణలచేఁ బాపములను దహింపవలెను. ప్రత్యాహారములచే విషయములను మసిచేయనగు. ధ్యానముచే ననమర్థములయిన గుణములను మట్టుపెట్టవలె. బంగారము. మొదలగుధాతువుల లోని మకిలి, కొలిమిలోఁబెట్టి యూదుటచే నెట్లు నశించునో యట్లింద్రియ మలనులు ప్రాణాయామాదులచే నశించును. ప్రాణము, అపానము ననువాయువుల నాపుటయే ప్రాణాయామము. అది లఘు, మధ్యమ, ఉత్తమ భేదములచే మూడు విధములు. వాని ప్రమాణ మెట్లనిన; కనుమూసి తెఱచునంత కాలమునకు మాత్ర యనిపేరు. హ్రస్వాక్షర ముచ్చరించినంత కాల మన్నమాట. అట్టి పంద్రెండు మాత్ర కాల మొకలఘు ప్రాణాయామము. దానికి రెట్టింపుకాలము మధ్యమ ప్రాణాయామము. మూడఁయినచో నుత్తమము. లఘుప్రాణా

యాముచే జెమటను, రెండవదానిచే వణఁకును, మూఁడవ దానిచే విషాదమును జయింపవచ్చును. సింహశార్దూల గజాదులు మచ్చికచే సాధువులై లొంగిన ట్లలవాటుచే యోగికిఁ బ్రాణము స్వాధీనమగును. మావటీఁడు స్వేచ్ఛగా మదపుటేనుఁగును లోఁబఱచుకొన్నట్లు, యోగి యవలీలగాఁ బ్రాణమును లొంగించుకొనును. మచ్చికవడిన సింహము మానవుల జోలికిఁ బోక మదపుటేనుఁగునే చంపునట్లరికట్టఁబడిన ప్రాణము శరీరమును గాక పాపమునే నశింపజేయును. కాన యోగి యెల్లప్పుడును బ్రాణాయామపరుఁడు కావలయును.

మోక్షసాధనము ప్రాణాయామము. దానికి ధ్వస్తి ప్రాప్తి, సంవిత్తు, ప్రసాదము నని నాల్గవస్థలు కలవు. ఇష్టానిష్టములగు కర్మఫలములపై నంటు తొలగించి, మనస్సు నవకషాయమునుగాఁ (సుఖదుఃఖాదిపంక రహితముగాఁ) జేయునది ధ్వస్తి. లోభమోహాన్వయాపములయిన యైహికాముష్మిక వాంఛల నరికట్టి యోగినిలుచు నయ్యవస్థ ప్రాప్తి నాఁబడు. గడచిన, గడువనట్టి, దూరముననున్న కనఁబడని విషయములను, చంద్ర సూర్య, నక్షత్ర గ్రహాదులతో సమానమైన ప్రభావమునొంది, దేనిచే తెలియనేర్చునో, యది సంవిదవస్థ. మనస్సు, ఇంద్రియములు, ఇంద్రియార్థములు (విషయములు) పంచవాయువులు. నెద్దానఁ బ్రసన్నములగునో యది 'ప్రసాదము' నాఁజను.

పద్మము, అర్ధపద్మము, స్వస్తికము నాసనములందుండి హృదయముఁ బ్రణవమును నిలిపి, సమశరీరియై, సమముగాఁ గూరుచుండి, కాళ్ళుముడిచి లింగముష్కములను మడమలు

దాకనీక, యించుక యెత్తిన తలగలిగి, దంతములుదంతములు దగులనీక, ముక్కు కొనయందుఁ జూపునిలిపి, యేమూలకుం జూడక, రజోగుణముచే తమోవృత్తిని, సత్వముచే రజోగుణ వృత్తిని, గప్పి నిర్మలమైన సత్వగుణమందే నిలుకడపొంది, విషయమునుండి యింద్రియములనుదెమల్చి, ప్రాణములను మనస్సును నిగ్రహించి, సమవాయముగ (మొత్తముగ) ప్రత్యాహారము చేయవలెను, తాఁబేలు సర్వాంగములను బోలె, నెల్లకామములను (కోరికల) ప్రత్యాహరించి యోగి, ఆత్మరతియై యేకస్థుఁడై యాత్మయందాత్మను, గాంచును. అతఁడు బాహ్యాభ్యంతరములయిన శౌచము లొనర్చి, కంఠముమొదలు నాభివరకుఁ గలశరీరమును బ్రాణవాయువుచేఁ బూరించి, ప్రత్యాహార మొనర్పవలెను. పండెండు ప్రాణాయామము లొక ధారణ, రెండు ధారణ లొక యోగము. ఇట్లు నియతాత్ముఁడైన యోగి, దోషముల నెల్లవాసి స్వస్థుఁడగును అతఁడు పరమాత్మను, ప్రాకృతములగు గుణములను వేరుగాఁ జూచును. అట్లే యాకాశాది పంచభూతముల పరమాణువులను, కల్మషరహితమైన యాత్మను, వేఱుగా నెఱుంగును. ఇట్లు యోగి యాహారనియమము గల్గి, ప్రాణాయామపరుఁడై క్రమక్రమముగా నలవడిన యోగభూములను మేడనెక్కినట్లు యెక్కుచుండవలెను. ఎక్కనలవడని భూములను బలాత్కారముగ నాక్రమింపగూడదు, అట్లు తొందరఁబడి యాక్రమించినచో వశముగాని యాభూమిక, రోగములు, మోహము మూర్ఛ మొదలుగాఁ గల దోషములను వృద్ధి సేయును. కాన యోగి యెన్నఁడు నట్టి పనికిఁ బూరవసేయరాదు. ప్రాణవాయుని రోధమే ప్రాణా

యామము. మనస్సును ధారణ చేయుట ధారణ. శబ్దాదివిషయముల పైకి బరువెత్తు యింద్రియములను మరలించుట ప్రత్యాహారము. రోగములు మొదలగు దోషములు రాకుండుట కిందుఁ గొన్ని యుపాయములను గూడ మహర్షులు సెలవిచ్చియున్నారు. నీరు త్రావఁగోరువారు యంత్రనాళముల ద్వారమున నీరు త్రావునట్లు, యోగి శ్రమము విడిచి, వాయువును త్రావవలయును. మొదట, నాభి, పిమ్మట హృదయము, వక్షము, కంఠము, నోరు, ముక్కుకొన, కన్ను, కనుబొమ్మల నడుమ, నడినెత్తి, గురువు తెల్పిన మఱి యేస్థానమందయినను, ధారణ చేయు టుత్తమము. ఈ పదిరకములయిన ధారణలను సాధించిన యోగి యక్షర సామ్య మొందును బ్రహ్మతాదాత్మ్యమందు నన్నమాట. ఆకలిగొని, అలసి, వ్యాకులుఁడయి, కడుపుబ్బరము గలిగిన యెడల, సిద్ధియెడల నాతురపడి యోగి యోగమూనరాదు. ఎక్కువ చలి, ఎక్కువ వేడి, యీరుగాలి కలచోటను, ద్వంద్వముగు కాలమందును, ధ్యానపరాయణుఁడైన యోగి యోగమూనరాదు. అగ్ని, నీరు దాపుగా నున్నచోట, రొదగా నున్నయెడఁ బాడువడిన గోశాలలో, నాల్గు దారులు గలిగినచోట, ఎండుటాకులు రాలినచోట, నదిలో, పాములు తిరుగు స్మశానమున, బయము వేయు బావియొద్దున దేవాలయమున, పుట్టలెక్కువగా నున్నచోట, యోగ మభ్యసింపఁగూడదు. సత్వగుణస్థితి వచ్చిన తరువాత యీ నియమము లెక్కువగాఁ బాటింపవయును. అది సాధనాంతవరకు దేశకాలములంతగాఁ జూడనక్కరలేదు. (సత్వస్థితిలో యోగికి శరీరముస్ఫురణముండదు. గాన యప్పుడే నియమము హెచ్చుగా జూడవలెను.)

యోగము చేయునప్పు డసాధువులను జూడరాదు. ఈ దోష ములను లెక్కసేయక చేయువానికి విఘ్నములు నిశ్చయము.

—♦ యోగవిఘ్నములు - చికిత్సలు ♦—

అవెట్టివన; చెవుడు, జడత్వము, మందమఅవు, మూగ తనము, గ్రుడ్డితనము, జ్వరము మొదలగునవి. ప్రమాదముచే నీ దోషములు గలిగెనేని వానికిఁ జికిత్సయుం జేయవలయు నదెట్లనిన; వాతగుల్మరోగము కలిగెనేని, చమురుగలదియు మిక్కిలి వేడియైనదియు నగు గంజిని ద్రావింపవలయును. ధార ణతప్పరాదు. కడుపుబ్బెనేని; (ఉదర ముదావర్త మగునేని యని మూలము) గంజిని ద్రావింపవలయును. దానిచే వాయు గ్రంథి విడిపోవును. వణలకు పుట్టినపుడు కదలని పర్వతమును మనసులో నిలుప (ధారణ) వలయును. మూగతనము వచ్చి నపుడు వాక్కును చెవుడువచ్చినచో శ్రవణేంద్రియమును, దప్పికయున్నచో మామిడిపండును ధ్యానింపవలయును. నోటి తడియారినచో రసనేంద్రియమును ధ్యానింపవలెను. దేహమం దేయే యవయవమున రోగము పుట్టినదో, యాయా యవ యవమునందు దానిదాని నుపకారులుగ ధ్యానింపనగు. చలి పోవుట నుష్ణవస్తువును, ఉష్ణము పోవుటకుఁ జలిని భావింపనగును స్మృతిపోయిన యోగికి నెత్తిమీఁద కీలనుంచి యొక కఱ్ఱతో మఱియొక కర్రను గొట్టవలయును, వెంటనే స్మృతివచ్చును, భూమ్యాకాశములు వాయ్వగ్నులు వ్యాపకములయి యున్నను వానిని యోగి ధారణచేయవలయును. అమానుష మయిన సత్త్వము వలనఁగూడ యోగి కొకప్పుడు బాధ గలుగ

వచ్చును. అమానుష మయిన సత్త్వమేదేని యోగియందుఁ బ్రవేశించెనేని, వాయువును, అగ్నిని ధారణ చేసి వానిం దహింపవలయును. ధర్మార్థకామ మోక్షములకు శరీరమె సాధనము. కాన యిట్లన్ని విధములను యోగవేత్త కాపుదలచేసి కొనవలయును. యోగి తన నడవడి, దానిలక్షణములు నలుగురికిని బట్టబయలు చేయుటవలన, నా లక్షణములమొదలఁ దానాశ్చర్యపడుటవలన విజ్ఞాన మంతయు నశించును. గాన, యోగి తన ప్రవృత్తులను బహుగోప్యము చేయవలయును. ఎందును వాంఛలేకుండుట, ఆరోగ్యము, నిష్ఠురత్వము లేకుండుట, చక్కని పరిమళము, కొద్దిమూత్రపురీషములు, కాంతి, ప్రసాదము, ఇంపైన స్వరము అనునవి యోగిప్రవృత్తికి మొదటి లక్షణములు.

జను లనురాగమునొందుట, చాటునగుణములు కీర్తింపబడుట, ఏజంతువులు భయపడకుండుట, ఉత్తమ సిద్ధికి లక్షణము. ఎవనికి శీతోష్ణాదులచే నించుకయు బాధలేదో, ఒరుని వలన భీతియన్నది లేదో, వానికి సిద్ధివచ్చినట్లు. ఇఁక నాత్మ దర్శనముచేసిన యోగికిఁ గొన్ని యొకుదుడుకులు కలుగును. అవి తెలిపెదవినుము; కామ్యములగు కర్మములను, మానుషములగు, కోరికలను గోరును, స్త్రీలను, దానమువలని ఫలమును, విద్యను, మాయాశక్తిని, ధనమును, స్వర్గమును, దేవత్వమును, దేవేంద్రత్వమును, రసాయన లాభమును, యౌవనమును, గాలిలో నెగిరిపోవుట, యజ్ఞఫలము, నిప్పు నీరు మొదలగు వానిలో దుముకుట, శ్రాద్ధ దానాదుల ఫలములను, నియమములను, ఇష్టాపూర్తాదుల ఫలములను, ఉపవాసఫలమును,

దేవతార్చనా ఫలమును యోగి చిత్తము వాంఛించును. ఈ రీతిగ వర్తించు చిత్తమును, మఱలించుటకు యోగి యేమఱ రాదు. మనస్సును బ్రహ్మమందు లగించినచో నీ యిబ్బందులు బాధింపవు. యోగులకు, సాత్వములు, రాజసములు, తామస ములునైన ప్రాతిభాదిఫలములు లభించును. అవి యైదు విధ ములు. యోగభంగమును కలిగించునవి. అందు మొదటిది ప్రాతిభము. వేదార్థములు, కావ్యశాస్త్రార్థ విద్యాశిల్పములెల్ల ప్రతిభాసించును. అదే ప్రాతిభమనుసిద్ధి. రెండవది శ్రావణము. ఇందెల్ల శబ్దములయు నర్థములయు జ్ఞానము గలుగును. వేల కొలది యోజనములందుండియు శబ్దము వినిపించును. ఎనిమిది విధములగు (యక్షగంధర్వాది భేదముచే) దేవయోనులను సమ గ్రముగా చూడగలుగును. అది దైవమనుసిద్ధి. నిరాలంబమైన మార్గమున పిచ్చివానివలె సంచరింపగలుగ నా సిద్ధి భ్రమ మనఁబడును. అదియోగికి మనోదోషము చేకూర్చి, సమస్తా చార భ్రష్టునొనర్చెడి దగుటచేతను భ్రమమని పిలువఁబడును. నీటిని సుడివలె, జ్ఞానమును స్రుక్ళృతిప్పి యాకులపఱచి నశింప జేయుంగాన, ఆ వర్తమనున దైదవది. ఈ యుపద్రవములచే యోగము భ్రష్టమై దేవయోనులనువా రిట్టట్టు సుడివడుచుం దురు. కాన యోగి, మనోమయమైన, శుక్లకంబళముం గప్పు కొని శరీరమండలమునందే గురుతరమైన జ్ఞానమునుగాంచి, జ్ఞానపూర్వమై యోగమువూని పరబ్రహ్మాధీనముగా మన మొనర్చి బ్రహ్మమును ధ్యానించుచు, లఘ్వాశియైయింద్రియముల గెల్చి, భూరాది సప్తసూక్ష్మ ధారణలను ధరింపవలయును. యోగి భూమిని ధరించిన, భూమియొక్క సూక్ష్మాంశము నొందును.

తనను భూమినిగా తలంచి తద్గంధగుణము విడిచి పెట్టును. అట్లే ఉదకములయందు సూక్ష్మమైన రసమును, తేజస్సుయందు రూపమును, వాయువుయందు స్పర్శమును, ఆకాశమున సూక్ష్మ ప్రవృత్తియైనశబ్దమును యోగివదలిపెట్టును. ఇట్లే మనసుచే నెల్ల భూతముల మనసునం దావేశించును. అందు మనస్సు సూక్ష్మ మగును. అట్లే యతడు సర్వసత్వముల బుద్ధిని బ్రవేశించి బుద్ధి సౌక్ష్మమునుగాంచును. ఇట్లు సప్తసూక్ష్మాంశములను జక్కగా నెఱిగి త్యజించినవానికి పునరావృత్తి కలుగదు. వీనిని సూక్ష్మత్వ మున జూచి చూచి, వానివలని సిద్ధులను త్యజించి పరమును బొందవలయును. ఏయే భూతసిద్ధియందు రాగమును పొందునో, ఆయా దానియందంటుకొని యతడు యోగ పదభ్రష్టుడగును. కాన, లెస్సగా సూక్ష్మము లన్యోన్యసక్తములయిన వానిని తెలిసి వదలి, పరమపదమును యోగి యందుకొనును. ఈయేడు భూతసూక్ష్మములనే, సంధానముచేసికొని వినాశముచేసికొన్న వానికిటనే ముక్తి సమకూరుచున్నది. గంధాది గుణములయం దాసక్తినొంది నశించును. పునరావృత్తినొంది మానుషావస గాంచును. ఈ యేడు ధారణల నతిక్రమించి యోగి యేదేది కోరునో, యాయా సూక్ష్మభూతమునందు లయమొందగలడు. దేవతలు, అసురులు, గంధర్వులు, నాగులు, రక్షస్సులు మొదల గు వారి దేహములయందు లయమొందియు, నెచ్చోటునను గూడ సంగమును పొందడు. అణిమ, లఘిమ, మహిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశిత్వము, వశిత్వము, అను మోక్ష సూచకములయిన యీ సిద్ధులనెల్ల యథాకామముగా నంది కొనును. సూక్ష్మముకంటె సూక్ష్మమగుట అణిమయగు. శీఘ్ర

త్వము లఘిమాగుణము. అశేష పూజ్యుఁడగుట మహిమ. సర్వప్రాప్తి ప్రాప్తిగుణము. సర్వవ్యాపిత్వము ప్రాకామ్యము. ఈశ్వరుఁడేయగుట యీశిత్వము. సర్వవశిత్వమువశిమాసిద్ధి. వీనినొందిన యోగి పుట్టఁడు. చావఁడు; పెఱుగడు, చిక్కడు, పరిణామ మొందడు. ఛేదము, క్లేదము, దాహము, శోషము, మొదలగునవి భూరాది భూతవర్గమునుండి, పొందడు. శబ్దాది భూతగుణములకు లోబడడు. వీనికి శబ్దాదులులేవు. వానికి భోక్తయయ్యు వానితోఁ గలియఁడు. మలినముతో గూడిన బంగారపు కణిక, అగ్నిఁచేగాలి. దోషమును వీడి, వేరొక బంగారుకణికతో నెట్లుతుకుకొనునో, అట్లే యోగాగ్నిచే తగులఁబడిన దోషములుగలవాఁడై, యోగి బ్రహ్మముతో నైక్యము నొందును. అగ్ని యగ్నిలోను నీరు నీటిలో నెట్లొకటియగునో, అట్లే, బ్రహ్మయందెనసి. బ్రహ్మ పదవాచ్యుఁడై, బ్రహ్మమయుండై, యోగి వేరుగా విశేషముగా గ్రహింపఁబడడు. అట్లు యోగి యొక్క ఆత్మ, పరమాత్మయందు సామ్యమునందును.

ఇట్లు తెలిపిన దత్తాత్రేయుల వచనములువిని, యలర్కుండు మునిప్రభో! ఆత్మజ్ఞానియగు నియోగి, చర్య యెట్లుండునో వినవలతు నానతీయవే యన, నమ్మునివల్లభుండిట్లనియె:—

మానావమానములు రెండును మానవుల కానందము విచారమునుగలిగించును. ఆరెండే వ్యత్యాసములై యోగికి సిద్ధి కారణములగుచున్నవి. మానావమానములు రెండును, విషామృతము లనబడును, యోగికి మానము విషము; అవమాన మమృతము. పాదమును చక్షుః పూతముగా నుంచవలయును, నీటిని వస్త్రపూతముగాఁ ద్రావవలెను. వాక్కును సత్యపూత

ముగాఁ బలుకవలయును. ఆలోచనము బుద్ధిపూతముగా చేయ వలయును. ఆతిథ్య, దేవయాత్రలకును, శ్రాద్ధయజ్ఞాదులకును, మహాజనుల సన్నిధికిని సిద్ధికై యోగవేత్త వెళ్ళరాదు. పొగ, నిప్పుకనబడక, నెల్లరు భోజనమొనర్చినచోట, యోగిభిక్షాటనము చేయవలెను. ఎల్లప్పుడు నొకే చోట నుండఁగూడదు. జనులు తన్నెట్లు మానింతురో, అట్లు, సాధువులమార్గమును దూషింపక చరింపవలెను. గృహస్థుల యిండ్లయందు పరగృహములందు భిక్షాటనము చేయనగును. శ్రద్ధ, దాంతిగల శ్రోత్రియులగు గృహాస్థులనడుమనే చరింపవలెను. వేరొక చోట భిక్షచేయుటఉత్తమము గాదు భిక్షాన్నము, గంజి, మజ్జిగ, పాలు, యావకము, ఫల మూలములు, కొఱ్ఱలు, కణము, పిండి, పేలపిండి, ఇవి యోగు లకు సిద్ధికరములయిన యాహారములు. తొలుత నీరుత్రాగి, మౌనముకొని, 'ప్రాణాయస్వాహా' అని యిట్లు ప్రాణాయామ ములచే ప్రాశనమొనర్చి, భోజన మొనర్చి, నీరుత్రావి, ఆచ మించి, హృదయము తాకవలెను. అస్తేయము, బ్రహ్మ చర్యము, త్యాగము, లోభము, అహింస అనునవి భిక్షువులకు పరమ వ్రతములు. అక్రోధము, గురుశుశ్రూష, శౌచము, లఘ్వాహారము, నిత్యస్వాధ్యాయము, ఇవి నియమములు, కార్యసాధకమును, సారభూతమునైన జ్ఞానముపాసింపవ లెను. జ్ఞానముల బాహుళ్యము యోగవిఘ్నము చేయును. ఇది తెలిసికొనవలెను; అది తెలిసికొనవలయునని, యెవడు తృష్ణతో జరించునో వాఁడు వేయి కల్పములకేని తెలియదగినది తెలియఁ జాలఁడు. సంగమువాసి, కోపము జయించి. లఘ్వాశియై, ఇంద్రియములగెల్చి. బుద్ధిచే, నింద్రియద్వారములను మూసి,

మనస్సును ధ్యానమునందు నిల్పవలయును, శూన్యస్థానములందు గుహలలో, వనములలో, నిత్యయుక్తుఁడై ధ్యానము నుపక్రమింపవలెను. వాగ్దండము, కర్మదండము, మనోదండము నను నియతములైన దండములు మూడు గలవాఁడు త్రిదండినా నొప్పు. సద సద్రూపమును, గుణాగుణమయమునగు నీ జగమ్మవని కాత్మ మయమో వానికి ప్రియుడెవ్వఁడు? అప్రియుఁడెవ్వఁడు? విశుద్ధమైన బుద్ధిగల్గి, రాయి మంటిముద్ద బంగారము నొకేరీతిగా జూచి, సర్వభూతములందును సమవృత్తియై, పరమును, శాశ్వతమును. అవ్యయమునగు పదమును జేరి యతి తిరిగి జన్మింపఁడు వేదములు, వానికంటె యజ్ఞక్రియలు, వానికంటె జపము, దానికంటె జ్ఞానము, దానికంటె సంగరాగములులేని ధ్యానము నుత్తమములు. అది లభింపగానే శాశ్వత స్థానము లభించును. బ్రహ్మపరుఁడై సమాధిగతుడై యెడుదుడుకులు లేక శుచియై, ఏకాంతరతియై, ఇంద్రియవశ్యుఁడై యీ యోగమునుబొందును. దానివలన ముక్తియు పొందును. పాదశిరోగ్రీవుడును, విశ్వేశుడును విశ్వభావనుడును, విశ్వరూపియగు పరమాత్మను దర్శించి, తత్ప్రాప్తికై, 'ఓం' కారమును జపింపవలెను. స్వరూపమును విను నా జపమే వాని కధ్యయనము, అకారము, ఉకారము, మకారము, ననునక్షరములుమూడును సాత్వరాజస తామసములగు మాత్రలని చెప్పబడినవి. మఱియొకటి యీఁదిది అర్థమాత్ర యోగిగమ్యమైనది. దానికే గాంధారియనిపేరు. అది గాంధారస్వరముకలది. అది పిపీలికాగతిస్పర్శ కలదై మూర్థమున లక్షింపబడును. ఇట్లు ప్రయుక్తమైన ఓంకారము మూర్థమునందు వెలు

వడును. అట్లోంకారమయుఁడగు యోగి యక్షరుఁడగును. ప్రాణముధనుస్సు. బాణమాత్మ అనుత్తమమైన బ్రహ్మము వేద్యము (గుఱి) జాగరూకుఁడై వేధించిన, బాణమట్లు తాను తన్మయుఁడగును. ఓమ్మనునిదియే వేదములు మూఁడును, ముల్లోకములును, మూఁడగ్నులు, విష్ణు బ్రహ్మ హరులు, సార్థములైన మాత్రలునని తెలియవలయును. అందు యోగముగాంచిన యోగి, యందులయము పొందును. అకారముభూర్లోకము, ఉకారము భువర్లోకము, వ్యంజనమగు మకారము స్వర్లోకము, మొదటి మాత్రవ్యక్త. ద్వితీయము అవ్యక్త మూఁడవది చిచ్ఛక్తి. అర్థమాత్ర పరమపదము. ఈ క్రమముగా నీయోగభూము తెలియఁగదగినవి. 'ఓం' అని యుచ్చరింపగానే సదసద్రూపమగు సదంతయు గ్రహింపబడును. మొదటి మాత్ర హ్రస్వము. ద్వితీయము దీర్ఘము కలది. మూఁడవది ప్లుతము. అది వాక్కునకు గోచరముకాదు. ఇట్లొప్పు నీ యక్షరమును పరబ్రహ్మమునుగా నెవ్వడెఱింగి, ధ్యానించునో, వాఁడు సంసార చక్రమును బాసి, త్రివిధములగు (సత్త్వాది గుణ రూపములగు) బంధనముల వీడి, బ్రహ్మమందు లయము గాంచును. కర్మబంధము లెల్ల క్షయించి, అరిష్టములను బట్టి మృత్యువు నెఱింగి, ప్రాణావసానమున నిది స్మరించి, తిరిగి యోగిత్వమును బొందును. సిద్ధించిన లేక సిద్ధింపని యోగముచే, నరిష్టయోగము తెలియంగు నాతఁడు శాంతివేళ దుఃఖము పొందఁడు.

## — ♦ అరిష్ట లక్షణములు ♦ —

ఆ అరిష్టము లేవంటేని వినుము. దేవమార్గమును, ధ్రువుని, శుక్రుని, చంద్రునికాంతిని, అరుంధతిని, ఎవ్వడు చూడడో వాడొక యేడాది మీఁద బ్రతుకడు. సూర్యునికాంతి హీనుంగాను, అగ్నికిరణ మాలిగాను జూచినవాఁడు పదకొండు మాసములు జీవించును. వాంతియందు, మూత్రపురీషములందు బంగారమున్నట్లు కలవచ్చిన పది మాసములు జీవించును. ప్రేత పిశాచములను, గంధర్వ నగరములను, సువర్ణవర్ణము లయిన చెట్లను చూచిన తొమ్మిది మాసములు జీవించును. బలిసినవాడు చిక్కినట్లు, చిక్కినవాడు బలిసినట్లు, ఎవడకస్మాత్తుగా నగునో వా డెనిమిదిమాసములు బ్రదుకును. దుమ్ములో గాని, బురదలోగాని యెవ్వనిపాదము మడమయందుగాని, పాదము కొనగాని, తెంపు గానిపించునో, వాడేడుమాసములు బ్రతుకును. గ్రద్ద, పావురము, కాకి, కాకోలము (బొంతకాకి) నల్లని పక్షి ఎవరి నెత్తిమీఁద నాడునో, వాడాఱుమాసములు జీవితము గాంచును. కాకి గుంపుచేఁగాని, దుమ్ము వర్షముచే గాని బెదరినవాఁడు, తన నీడ నన్యరూపముఁగా జూచినవాఁడు, నైదునెలలు బ్రతుకును. మేఘము లేకుండగనే, దక్షిణ దిక్కుగా మెఱుపు, రాత్రి యింద్రధనుస్సు కాన్పించిన మూఁడు నెలలు జీవించును. నేతిలో, నూనెలో, అద్దములో, నీటిలో తన శరీరము నెవ్వఁడు, చూడలేడో, లేక తలలేని దానిగా జూచునో, వాడు మాసముమీఁద మనఁడు ఎవనిమేని గంధము, మేకతో, శవములో సమమో వాడర్ధమాసముజీవించును. ఎవడు

స్నానము చేసిన వెంటనే హృదయము పాదములు నారిపోవునో నీరు త్రావుచున్నను గొంతెండునో, వాడు పదిరోజులు బ్రతుకును. వాయువుతలమర్మావయవములు పగిలి,పోటుగొనునో, నీట దడిసినను సుఖము గలుగుగదో వాని మృత్యువాసన్నమైనదన్న మాట. ఋక్షములు, వానరములు గట్టిన బండిమీద పాట పాడుచు దక్షిణ దిశగా కలలో నెవ్వడేగునో వానికి మృత్యువత్యాసన్నము. ఎఱ్ఱని నల్లని వస్త్రములు దాల్చి, నవ్వుచు, పాడుచు, స్త్రీ కలలో దక్షిణ దిశగా తీసికొని పోయినవాడు బ్రతుకడు. బట్టకట్టుకొనక, నవ్వుచునుండు బౌద్ధసన్యాసి కలం గానిపించిన బ్రతుకు గలుగదు. నడినెత్తిదాక, బురదలో దిగబడిపోయినట్లు కల గన్న వాడప్పుడే మృతిగాంచును. కేశములు, బొగ్గులు, బూడిద పాములు, నీరులేని నది, కలలో గానిపించిన పదునొకండవ దినమునం జావు నిక్కము. వికటులు, భయంకరులు, నల్లనివాండ్రునగు పురుషులచే కలలో రాళ్ళచే గొట్టబడిన వాండుప్పుడే మరణించును. సూర్యోదయ వేళ నక్కయార్చుచు నెదురైనచో వాడప్పుడే చచ్చును. తిండి తినగానే యేనికాకలి బాధించునో, దంతములొండొంటితో ఘర్షణ చెందునో వానియాయువు గతించినట్లే. దీపమారినవాసన తెలియక రాత్రిం పగలు భయము నొందుచున్న వాడు బ్రదుకడు. ఎదుటివానికంటిపాపలో తనకుదాను కనబడకున్న వాడు బ్రతుకడు. అర్ధరాత్రి యింద్రధనువును, పగలుగ్రహగణములు గన్న వాడు జీవింపడు. ముక్కు వంకరగును కర్ణములు వాలును. ఎడమ కన్ను నీరు కారును. ఇవి బ్రతుకని వాని చిహ్నములు. ముఖము కందును. నాలుక నల్లనగును. అది

మృత్యు చిహ్నము. ఒంటెలు, గాడిదలు, కట్టిన బండిపై దక్షిణ దెసగా నేగినట్లయిన, చెవులు మూసికొన్నప్పుడు హోరువిన కున్న, కంటిపాపలో తళుకు నశించిన కలలో గుంటలోపడి తలుపు మూతఃపడినట్లయి యందుండి లేవలేకున్న వాఁడు బ్రతుకడు చూపుమీఁదికి పోయిన, ఎఱ్ఱబడిన, చలించిపోవు చున్న, ముఖ ముక్కుగా, నాభిచల్లగా నున్నవాఁడు జీవింపడు, కలలో నగ్ని జొచ్చిన, నీటిలోఁ జొచ్చిన, వాఁడు బ్రతుకడు. దుష్ట భూతములచే రాత్రిగాని పగలుగాని కొట్టబడిన వాఁడు వారము కంటె నుండఁడు. తన తెల్లని వస్త్రమును ఎఱ్ఱగానున్నట్లుగాని, నల్లగా నున్నట్లుగాని చూచినవాఁడు జీవింపడు. స్వభావవిపరీతత్వమే మృత్యుసాన్నిధ్యలక్షణము. వినయవంతులను, పూజ్యులను, ఎవడు నిందించునో, అవమానించునో, దేవతల నర్చింపడో, గురులను, విప్రులను నిందించునో, తలిదండ్రుల, యోగులను, మహానుభావులను, అల్లుండ్ర మన్నింపడో వాఁడా సన్నమృత్యువని తెలియవలయును. యోగి యీ గతి తెలిసి, యభయమగు స్థానమును జేరి, మరణభీతి వాసి, కాలవిపాకము స్వభావమని కని, యోగసమాధిపూనవలెను. ఏసమయములో దానరిష్టము చూచెనో, మరణదినము దాక, న దేవేళలో పగలుగాని రాత్రిగాని యోగముపూని, భయమెల్లవాసి, కాలమును జయించి, యెట తనకుస్థైర్యము చిక్కునో యాచోటనే యుండి త్రిగుణములగెంటి, పరమాత్మ యందు యోగముకూర్చి, తన్మయుడై చిద్వృత్తినిగూడ వదలివేయవలెను. అతీంద్రియము, అగోచరమునై బుద్ధికందక, వాక్కులకలవిగాక వెలుంగు పరమనిర్వాణమునుబొందును.

అలర్కా! నీకిదియెల్ల నెఱింగించితిని ఇఁక నీవా బ్రహ్మమును బొందెడు దారి వినుము.

— ♦ బ్రహ్మప్రాప్తి కుపాయము ♦ —

చంద్రునితోఁ గలయిక లేకున్నప్పటికిని జంద్రకాంతికిఁ జంద్రకాంత శిల చెమర్చును. సూర్యకాంతి సోకినంత మాత్రమున యోగము లేకున్నను, సూర్యకాంతము నిప్పులు గ్రక్కును. ఇదే పోలికగా, యోగి బ్రహ్మతో యోగము లేకున్నను నభ్యాసావస్థయందును యోగసిద్ధులను గొన్నిఁటిని పొందగల్గును. కాని వానియెడ వ్యామోహము పెట్టుకొనరాదు. పెట్టుకొన్నచో యోగ భంగమగును. ఎలుకలు, పిల్లులు, ముంగిసలు, ఉడుములు, కపింజలములు, యజమానునితోఁ బాటింటిలో నివసించును. ఒకవేళ నాయిల్లు కూలినను, గాలినను, దుఃఖము యజమానునికేకాని, వానికిలేదు. అవి వేఱొకచోటికిఁ బోయి సుఖముగా నుండును. ఇదే యుపమానముగాఁ గొని యోగి, తన్నావరించిన దారపుత్రాదులకును దనకును గల సంబంధ మింతటిదేయని గ్రహించి వానియెడ వెఱ్ఱిమోహము పెంచికొనక, తన గతికై తాను జూచుకొని యోగమును వదలక సిద్ధి నిబొందును. చీమ మిక్కిలి చిన్న శరీరము గలది. అయినను నది తన చిన్న ముక్కుతో మట్టిద్రవ్వి తెచ్చి పెద్ద పుట్టలు పెట్టును. ఈ యంశము యోగికి మంచి యుపదేశము. ఎట్లన, యోగసాధనకుఁ బూనుకొన్న వాఁడెన్నియో కష్టములకు లోనై, నడుమనడుమ, ఛీ! ఈ శరీరము యోగమునకుఁ బనికి రాదు. నేనసమర్థుఁడను, అని భావించి యా సాధనను నడు

మలో విడిచి బెట్టును. విఘ్నములకు బెదరి పోవును. చీమకుఁగల పట్టుదలచూచి తాను శ్రద్ధగలిగి సిద్ధిని సాధించునని దీని భావము. పశువులు, పక్షులు, మనుష్యులు మొదలగువారిచే వృక్షమనుభవింపఁబడి నశించుచు. అట్టి ప్రౌఢైన చెట్టును దృష్టిలో నిడికొని యోగులు సిద్ధినందుదురు. దీనినిబట్టి అణిమాది సిద్ధులు తమకుఁ గలిగినవని యెఱింగి, జనులు వివిధములయిన లాభములను దనవలనఁ బొందవలయునని చుట్టుముట్టెదరనియు, వారి వారికి నచ్చిన తన మహిమలను జూపి, యా వ్యావృత్తిలోఁ బడిపోయినచో యోగి, బ్రహ్మతాదాత్మ్యమును బొందనేరఁడనియు, సగములో యోగభ్రష్టుఁడగుననియు గ్రహించి, యా వినోదములకు లోఁబడని యోగియే పరమప్రాప్యమైన బ్రహ్మమును బొందుదుననియు గ్రహింపవలయును. చిన్నబొట్టు కనిపించు లేడికొమ్ము కొనను జూచి, యది లేడితోఁగూడఁ గ్రమముగాఁ బెరుగుటను గమనించి యోగి యోగసిద్ధిని బడయును. అనఁగా, యోగము నభ్యసించువాడు లోలోపల నేమి జరుగుచున్నదో, యెట్టి సిద్ధి పొందినామో, యని క్షణ క్షణము కుతూహల పడుట స్వభావము. మనసంత సులభముగా లొంగునది కాదు. ఆ మాట మఱచి, యభ్యాసి, తాను జేసినకొద్దిమాత్రము యోగమునకే పెద్ద లాభము కనబడలేదని నిస్పృహ చెంది విసివి సగములోనే దానిని మానివేసి భ్రష్టుఁడగును. యోగము క్రమముగా,విసుగుకొనకుండ సాధించువానికి ఫలము బాహ్యముగాఁ గనిపింపక పోయినను, దానిపని యది చేయుచునే యుండును. ఆ ఫలము కొమ్ము మొనవలె సుసూక్ష్మమై యోగి సామర్థ్యము కొలది వృద్ధి పొందుచునే

యుండును గాని యూరకపోదు. సిద్ధియొక నాతుంత పడక క్షణ క్షణము శంకించుకొనక, యోగి యభ్యాసముచేయవలెనని భావము. తనకున్న సొత్తెల్ల భూమిలోఁ బాతిపెట్టియు, లోభి యెట్లు తన బ్రదుకు గడపుచున్నాఁడో, యట్లే యోగి, తనకు లభించిన యోగసిద్ధులను విచ్చలవిడిగా బాహ్యముగా వినియోగింపక, బ్రహ్మసాక్షాత్కారము పొందుదనుక వానింగుప్త పఱచి కాపాడు కొనవలయును. ద్రవపూర్ణమగుకడవ నెత్తి నిడుకొని, పైకెక్కుమనుజునియొక్క కదలిక లేని శరీరము నుదాహరణముగాఁ బెట్టికొని యోగి లక్ష్యము నెడ చూపు చెదరనీక యోగారూఢుఁడు గావలయును.ఇట్లు నడచిన వానికిఁ గృతకృత్యత తప్పక గల్గును. యోగి తానెచట నిలుచునో యదే యిల్లుగా, దేనిచే శరీరము నిల్చునో యదే భోజనముగా, దేనిచే ప్రయోజనముసిద్ధించునో యదే సుఖముగా భావించును. ఎంత బ్రతిమాలినను, వాని యందు మమకారము పూనడు. సాధన సామగ్రిచే, కార్యమును సాధించినట్లు, యోగి, పరతంత్రము లయిన బుద్ధ్యాదీంద్రియములచే, పరమును (మోక్షమును) సాధించును.

ఇట్లు చేసినయోగ బోధమునువిని యలర్కుండు దత్తాత్రేయులకు వినయవినమిత సాష్టాంగ మాచరించి నాభాగ్యము కొలది నాకీ శత్రుపరాభవము దేవతలచే ననుగ్రహింపబడి నది. నాభాగ్యముకొలది యత్యంతమైన మృత్యుభయము నన్నావరించినది, కాశిరాజు నా అదృష్టముచే నాపై విక్రమిం చుట జరిగెను. నా భాగధేయమున నేను క్షీణబలుడనగుటయు, నా సైన్యములు నశించుటయు, నాకోశము తగ్గుటయు, నేను

బీతి నొందుటయు, జరిగెను. నా భాగ్యదేవతయెనన్ను శ్రీవారి పాదకమలములస్మరింపఁజేసి యిటకీడ్చి దెచ్చినది. నా పున్నెముచేఁ దమసూక్తులు నాడెందము నతుకుకొన్నవి. నాకు జ్ఞానము గలిగినది. నా సుకృతి విశేషముచేఁ దమతో సమాగమమయినది. తమ యవ్యాజదయామృత వర్షమునాపై నా యదృష్టముచేఁ గురిసినది. పురుషునికి శుభము రాకడ ననర్థమేని, యర్థమై తోఁచును. నాకీ శోకము మంచికే వచ్చినది. సుబాహువు మాయన్నకంటె నా కాప్త బంధువు కలఁడా ? కాశిరాజుకంటె మిత్రుఁడుండునే? దుఃఖ తరుగహనమైన గార్హస్థ్యమును వదలెదను. అని శ్రీదత్తస్వామికి మ్రొక్కులిడి, వచ్చి, కాశిరాజును సుబాహుడుంగల చోటికి వచ్చి తన విజ్ఞాన లాభమును వారి కెఱింగించి, వారియెడఁ దన కృతజ్ఞతను ప్రకటించుకొని, కాశిరాజు తిరిగి యిచ్చివేసిన రాజ్యమునఁ గుమారుని పట్టాభిషేకమొనర్చి యీజగమెల్ల గుణపాశములచేఁగట్టఁబడినదానింగాఁ గని యడవికిఁబోనెంచిన,కుమారుఁడీ యోగమును దనకనుగ్రహింపఁ గోరిననతని కట్లచేసి కృతార్థుఁడయ్యె. అలర్కుండును జ్యేష్ఠకుమారు నభిషేకించి వనమునకేగి, ద్వంద్వాతీతుఁడై, నిస్సంగుఁడై గసిద్ధివడసి, యోమోక్షముంబొందెను. ఇట్లు జడుండైన కుమారుఁడు తెలిపిన విజ్ఞానమును,యోగమును గ్రహించి, వానప్రస్థమున నిలిచి, క్రమముగ సన్న్యాసము స్వీకరించి, పరసిద్ధిని బొందెను. ఇక్కథఁజదివిన విన్నను నశ్వమేధఫలము గల్గు. దత్తాత్రేయాలర్క సంవాదము విన్నవారభీష్టములొంది ముక్తి గాంతురు. అని యిట్లు ధర్మపక్షులు తెలుప విని జైమిని, వారలను బెక్కుతీరులఁ గొని

యాడి, వారివలన, మఱియు, సృష్టిస్థితి లయములు. దేవర్షి పితృవంశ విస్తారము, ప్రళయములు, కల్ప విభాగము, తామసస్సృష్టి, క్రమము వినెను. [చూ-మూలమున 42- మొదలు 49 వరకు అధ్యాయము.]

— ♦ ఉత్తమగతులకుఁ బోవువారు ♦ —

ఉత్తములయిన బ్రాహ్మణాదివర్ణములకు లోకములెల్లన, కర్మసిద్ధులయిన బ్రాహ్మణులకుఁ బ్రాజాపత్యమను లోకము. యుద్ధములందు భయపడని క్షత్రియుల కింద్రలోకము, స్వధర్మ పరులగు వైశ్యులకు మారుతలోకము, వీరికి సేవచేసి ధన్యుల యిన శూద్రులకు గంధర్వలోకమును, బ్రహ్మచారి కెనుబది యెనిమిదివేలమంది యూర్ధ్వరేతస్కులయిన మునులుండు లోకమును, వానప్రస్థునకు సప్తర్షిలోకమును, సన్యాసికి బ్రహ్మపదవియు, యోగులకు జనన మరణాదులు లేని యమృతస్థానమును బ్రాపించును.

అవల నీలలో హితోత్పత్తి, భృగ్వాది సంతతివర్ణితములు. (చూ- 50-51 అధ్యా). ఆగ్నీధ్రుఁ డను వాని కుమారుఁడు ఋషభుఁడు. వాని కుమారులు నూరుగురు. అందు భరతుఁడు జ్యేష్ఠుండు. అతఁడు హిమమను వర్షమునకు రాజయ్యె. ఇది దక్షిణమున నున్నది. దీనికే భారతంబను పేరుగల్గె. అని మఱియు జంబువు మొదలుగ పుష్కరమువరకుఁగల ద్వీపముల వాని ప్రమాణముం దెలిపె.

## —: భారతవర్ష ప్రశంస :—

దీనికి కర్మభూమియని పేరుగలదు. దీనివలననే యుత్తమగతులు సాధింపఁబడు. ఇందు భాగీరథిప్రవర్తించి పావన మొనర్చుచున్నది. దేవతలుకూడ, యిందుమనుష్యత్వంబునొంది తగిన కర్మము లొనర్చి యింతకు నధికంబులగు పదంబుల నంద వలెనని యీ భారత వర్షమునఁ బుట్టవలెనని కోరుకొనుచుందురు. కర్మభూమియగు నిందు గడించికొన్న కర్మఫలము వలన స్వర్గాది లోకములందు సుఖమనుభవింపఁబడును. ఆ కర్మము క్షీణింపగానే భూమికి మఱలి రావలసినదే. అవి పుణ్యము వ్యయమగు చోటులే కాని యార్జించు చోటులు కావు.

## — ♦ కూర్మ సంస్థానము ♦ —

భారత వర్షమున శ్రీమన్నారాయణుఁడు, తూర్పు మొగముగా, కూర్మరూపియై యున్నాఁడు. ఇది తొమ్మిది భాగములుగా నున్నది. ఈ తొమ్మిది భాగములు నక్షత్రములు గూడ తొమ్మిది భాగములుగా నావరించి యున్నవి. అదెట్లన; వేదులు, మద్రములు, అరులు, మాండవ్యములు, శాల్వములు, అనీపములు, శకములు, ఉజ్జిహానములు, వత్సఘోషములు, సంఖ్యములు, ఖశములు, సారస్వతములు, మత్స్యములు, శూరసేనములు, మాధురములు, ధర్మారణ్యములు, జ్యోతిషికములు, గౌరగ్రీవములు, గుడాశ్మకములు, వైదేహకములు, పాంచాలములు, సంకేతములు, కంకమారుతములు, కాలకోటులు, పాషండములు, పారియాత్రములు, కాపింజలములు,

కురుదేశము పాలిమేరలు, ఔదుంబరములు, గజములు, ఇవి కూర్మస్వామియొక్క మధ్యభాగమందున్న దేశములు. ఇటనున్న నక్షత్రములు. కృత్తిక, రోహిణి, మృగశిర. అనునవి. ఈమధ్య దేశవాసులకివి శుభాశుభములయిన ఫలముల నిచ్చుచుండును.

కూర్మమూర్తికి ముఖముగా: — వృషధ్వజ, అంజన, జంబువు, మానవాచల, శూర్పకర్ణ, వ్యాఘ్రముఖ, ఖర్వార, కర్వటాశన, చంద్రేశ్వర, ఖశ, మాగధ, శిబి, మైథిల, శుభ్రి, వదనదంతుర, ప్రాగ్జ్యోతిష, లౌహిత్య, సాముద్ర, పురుషాదక పూర్ణోత్కట, భద్రగౌర, ఉదయగిరి, కాశి, మేఖల, ముష్ట, తామ్రలిప్తి, ఏకపాద, వర్ధమాన, కోసలములున్నవి. ఆర్ద్రి, పునర్వసు, పుష్యమి, యనునవి వీని నక్షత్రములు.

పూర్వదక్షిణపాదముగా:— కలింగ, వంగ, జఠర, కోసల, మూషిక, చేది. ఊర్ధ్వకర్ణ, మత్స్య, ఆంధ్ర, వింధ్య, విదర్భ, నారికేళ, ధర్మద్వీప, ఏలిక, వ్యాఘ్రగ్రీవ, మహాగ్రీవ, త్రైపుర, శ్మశ్రుధారి, కిష్కింధ, హేమకూట, నిషధ, కటక స్థల, దశార్ణ, హారిక, నగ్న, నిషధ, కాకుల, అలక, పర్ణ, శబర, ములున్నవి. ఆశ్లేష, మఖ, పూర్వఫల్గునీ నక్షత్రములు వీనివి.

దక్షిణకుక్షియందు:—లంకా, కాలాజిన, శైలిక, నికట, మహేంద్ర, మలయ, దర్దుర, కర్కోట, వన, భృగుకచ్ఛ, కోంకణ ఆభీర, కృష్ణానదీతీర, అవంతి, దాసపుర, ఆకారి, మహా రాష్ట్రి, కర్ణాట, గోనర్ద, చిత్రకూట, చోల, కులగిరి, క్రౌంచ ద్వీప,జలూధర, కావేరీతీర ఋశ్యమూక, నాసిక, శంఖ, శుక్తి, వైదూర్యములను శైలములందున్నవారు, కోల, చర్మ పట్టములు మొదలుగాగలవారు, జలవాసులు, గణబాహ్యులు,

కృష్ణద్వీపవాసులు,సూర్యాద్రియందు, కుముదాద్రియందు నున్న వారు, రౌద్రన్వనులు. పిశికులు, కర్మనాయకులు, దక్షిణులు, కారుషులు, ఋషికులు, తాపసులు, ఋషభులు, సింహళులు, కాంచీ వాసులు, త్రిలింగులు, కుంజరపర్వతపుచరియలందు, సమీపమునందున్నవారు, తామ్రపర్ణి, యను దేశముల వారు నున్నారు. ఉత్తర, హస్త, చిత్త యనునవి యిచ్చటి నక్షత్రములు.

రెండవ కుడిపాదమునందు:— కాంభోజ, పహ్లవ, బడబాముఖ, సింధుసౌవీర, ఆనర్త, వనితాముఖ, ద్రావణ, సార్గిగ, శూద్ర, కర్ణప్రాధేయ, బర్బర, కిరాత, పారద, పాండ్య, పరశు, కల, దూర్తక, హేమగిరి, సింధుకాలక, విరత, సౌరాష్ట్ర, దరద, ద్రావిడ, మహార్ణవ, దేశములవారున్నారు. స్వాతి, విశాఖ, అనూరాధ, యనునవి వీని నక్షత్రములు.

కూర్మముయొక్క తోకయందు:—మణిమేఘ,క్షురాద్రి ఖంజయ,అస్తగిరి,అవరాంతిక, అనోహాయ,శాంతిక,విప్రశస్తక, కోంకణ, పంచనద, వమన, అవర, తారక్షుర, అంగతక, శర్కర, శాల్మ, వేశ్మక, గురుస్వర, ఫాల్గుణాన, వేణుమతీర, ఫల్గులుక, ఘోర, గురుహాంత, కల, ఏకేక్షణ, వాజికేశ, దీర్ఘ గ్రీవ, చూలిక, అశ్వకేశ, దేశములవారు, జ్యేష్ఠ, (ఐంద్రము) మూల, పూర్వాషాఢ, యనునవి వీని నక్షత్రములు.

ఎడమ పాదమునందు:—మాండవ్య,చండఖార, అశ్వ, కాలనద, కున్య తాలరుహా, స్త్రీబాహ్యా, బాలిక, నృసింహా వేణుమతి, బలావస్థ, ధర్మబద్ధ, ఉలూక, ఉరుకర్మ, [ఫల్గులుక ఘోర, ఘురల, హేమతారక ఏకేక్షణ, వాజికోశ, దీర్ఘపాద]

దేశములవారున్నారు. ఉత్తరాషాఢ, శ్రవణము, ధనిష్ఠ వీని నక్షత్రములు.

కూర్మముయొక్క యెడమ కుక్షియందు:— కైలాస, హిమగిరి, ధనుష్మత్ వసుమంత్, క్రౌంచము, కురువక, క్షుద్ర వీణ, రసాలయ, కైకేయ, భోగప్రస్థ, యామున, అంతర్ద్వీప, త్రిగర్త, అగ్నిజ్య, అర్దన, అశ్వముఖ, చిబిడ, కేశధారి, దాసే రక, వాటధున, శవధాన, పుష్పల, అధమకిరాత, తక్షశిలా, అంబష్ఠా, మాలవ, మద్ర, వేణుక, నవదంతిక, పింగల, గాన కలహా, హూణ, కోహలక, మాండవ్య, భూతియువక, శాతక, హేమతారక, యశోమత్య, గాంధార, ఖర, సాగరరాశి, యౌధేయ, దాసమేయ, రాజన్య, శ్యామక, క్షేమధూర్త ములవారున్నారు. శతభిషము, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర వీని నక్షత్రములు.

పూర్వోత్తర పాదమున:— కిన్నరరాజ్య, పశుపాల, కీచక, కాశ్మీర, అభిసారజన, దరద, అంగణ, కులట, వనరాష్ట్రిక, సౌరిష్ఠ, బ్రహ్మపురక, తనబాహ్యక, కిరాతిక, ఉశికానంద, పహ్లవ, లోలన, దార్వ, దామరక, కురట, అన్న దారక, ఏకపాద, ఖశ, ఘోష, స్వర్గభౌమ, అనవద్యక, యవన, హింగ, చీరప్రావరణ, త్రినేత్ర, పౌరవ, గంధర్వ, దేశముల వారున్నారు. రేవతి, అశ్విని, భరణి, అనునవి యీపాదము నందు శుభాశుభ కర్మపాక మొనర్చుచున్నవి. ఈ నక్షత్రము లకుఁ బీడగల్గిన నీదేశములకుఁ బీడగల్గును. అవి శుభములయి యున్న శుభముగల్గును ఏనక్షత్రమునకేగ్రహము, అధిపతియో యాగ్రహముచ్చలోనున్న మంచిఫలమును, నీచలోనున్నఁ

జెడ్డ ఫలము గలుగును. ఆయా దేశముల నక్షత్రములను బట్టి యాయాదేశములకు శుభాశుభములు ప్రత్యేకము గలుగుచుం డును. ఏ నక్షత్రమున కేగ్రహ మధిపతియో, యది యుచ్చ లోనున్న మంచియు, నీచలోనున్నఁ జెడ్డయు గలుగును. పుణ్యా త్ములకు గ్రహము చెడుగానున్నచో, వారిద్రవ్యము, గోశాల నౌకరులు, మిత్రులు, కుమారులు, భార్యలు మొదలయినవారి యందా చెడుఫలము గానిపించును. పాపాత్ముల కదివారియందే కన్పట్టును. మిక్కిలి పాపులకు రెండువిధముల నష్టము గన వచ్చును. పాపమించుకయు లేనివారి కెన్నఁడు నపకారము కలుగదు. ఈ కూర్మ సంస్థానమును బట్టి దేశముయొక్క శుభాశుభ ఫలములు చెప్పవలెను, దేశనక్షత్రమెఱిగి తనకే గ్రహము పీడ గలిగియున్నదో తెలిసిగి శాంతి చేసికొన వలెను.

## లో క వా ద ము లు

దేవతలయొక్కయు, రాక్షసులయొక్క 'దౌర్హృదములు' (కోపములని యొకరు)ఆకాశమునుండి భూమిపైఁ బడుచుండును, వానికే లోకవాదములని పేరు. అవి ద్రవ్యాదులకు హాని చేయును. వానికిని శాంతులు చేయవలెను. ద్రోహకారులు గాని యుపవాసములను, దేవతావందనము, జపహోమాదులు, దానము, స్నానము, క్రోధాది గుణములను వీడుట, సర్వభూత మైత్రి, ద్రోహచింత లేకుండుటయు, దుష్టసంభాషణము లేకుండుట, మితభాషిత్వము, అను లక్షణములు గలిగి యుండ

వలయును. గ్రహశాంతియుం జేయవలయు. ఈ కూర్మ సంస్థాన మందన్ని నక్షత్రముల యధిదేవతలు నున్నారు.

## — కూర్మ సంస్థానమున దేవతలు, రాసులును —

కూర్మ మధ్యమున నగ్ని, భూమి, సోముఁడు నున్నారు. మేష వృషభ, మిథున రాసులునున్నవి. ముఖమున, మిథున కర్కాటకములు, తూర్పు దక్షిణములుగా నున్న పాదమునఁ గర్కాటక సింహములు, కుక్షియందు కన్య, తులయు, దక్షిణ పశ్చిమములుగానున్న పాదమున తులావృశ్చికములు, పృష్ఠ మున వృశ్చిక ధనుస్సులు, వాయవ్య పాదమున ధనుస్సు. మక రము, కుంభము, ఉత్తర కుక్షియందు కుంభ మీనములు, తూర్పు ఉత్తరములుగా నున్న పాదమున మీన మేషములు నున్నవి. రాసులు, నక్షత్రములు, గ్రహములు నను వీనికిఁ బీడ గలిగినపుడు శాంతి చేయవలయును. దీనికి నడుమ విష్ణుపాద మున్నది.

భారత భూమియందు కృత - త్రేతా - ద్వాపర - కలి యుగ భేదము, నాల్గు వర్ణముల విభాగము కలదు. ఈ యుగ ములయందు వరుసగాఁ బురుషాయుర్దాయము, నాలుగువందలు, మూఁడువందలు రెండువందలు, ఒకవంద సంవత్సరములు. తూర్పుననున్న దేవకూటమునకుఁ దూర్పున నున్నదిభద్రాశ్వ వర్షము, శ్వేతపర్ణము, నీలము, శైవాలము, కౌరంజము, పర్ణశా లాగ్రము,అనునవి కులపర్వతములు. వానినుండి పుట్టిన పెక్కువేల పర్వతములున్నవి. అట దేశములు కుముద (కలువలు)ములతో సమానములు. శుద్ధ సానువులు, సుమంగళములు, నగునవి

పెక్కులున్నవి. ఇచటి జనులు శంఖమువలెను, బంగారము వలె నుందురు. దివ్యసంగతి గలవారు. వేయియేండ్లు జీవించువారు. వారిలో నెచ్చుతగ్గులుండవు. అందు హరి హయగ్రీవమూర్తియై మూడు నేత్రములతో నాల్గు చేతులతో నున్నాఁడు. కేతుమాలమను మఱియొక వర్షము కలదు. ఇచటివారుకూడ వేయేండ్లు జీవింతురు. ఇచట హరి వరాహమూర్తియైయున్నాడు. మూఁడేసి నక్షత్రముల వంతున నీ మూర్తి ముఖాద్యవయవములచే కూర్మమూర్తివలెనే విభజింపఁబడియున్నది. దీని తరువాత దుత్తర కురువర్షము. అచటి చెట్లు నిత్యము పూచి కాచి పండుచుండును. చెట్లనుంచి వస్త్రములు పుట్టును. అవి కల్పవృక్షములవలెఁ గోరికలన్నిఁటిని దీర్చును. అచటి నేల రత్నమయము. ఎల్లప్పుడు పరిమళము గల గాలి వీచును. స్వర్గమునుండి జారిన వారే యచట పుట్టుచుందురు. మిథునములుగా జనులు పుట్టుదురు. పెక్కు నదులందున్నవి. అందు హరి తూర్పుమొగమై మత్స్యమూర్తియై మూఁడేసి నక్షత్రముల వంతునఁ దొమ్మిది భాగములుగా నావరించి యున్నాఁడు. కింపురుష వర్షము మఱియొకటి. అందలి జనులు భోగపరాయణులు, ఆరోగ్యవంతులు. శోక శూన్యులు. ప్లక్షము (జువ్వి)నుండి పుట్టిన పండ్లరసము త్రావి నిత్యయౌవనులయి ప్రజలానందింతురు. దీనికిఁ బిదప హరివర్షము. బంగరు రంగుగల జనులిట నుందురు. వారు భోగపరులు, చెఱకు రసము త్రావి సుఖింతురు. మేరుపర్వతము చుట్టియున్నది యిలావృతవర్షము. అచట సూర్యవేడిమి ప్రసరింపదు. గ్రహనక్షత్ర కాంతులు కనిపింపవు. నేరేఁడు పండ్లరసము ద్రావి జనులు, తామరపూల

వాసన గలిగి, యుందురు. వారు పదమూడు వేల సంవత్సరములు జీవింతురు. అటుపై రమ్యకవర్షము. అచట గొప్ప మఱ్ఱిచెట్టున్నది. దాని పండ్లరసము గ్రోలి ముదిమిలేనివారై జనులుందురు రమ్యకమునకు మీాద హిరణ్మయమను వర్షమున్నది. అట హిరణ్వతి యను నది ప్రవహించును. అందలి నీరు త్రావి జనులు నిత్యసుఖులై యుందురు. అని తెల్పి మన్వంతర కథా విశేషముల నిట్లని వినిపింపఁ దొడంగెను.

## — ♦ స్వారోచిషమను చరిత్ర ♦ —

వరుణానదీ తీరమున నరుణాస్పదమను నగరమున బ్రాహ్మణప్రవరుఁ డొకఁడుండెను. అతఁడు సాధువు. ధర్మవర్తనుఁడు వేదవేదాంగవేత్త. అతిథి పూజాపరుఁడు. రాత్రివచ్చినను నాతిథ్యమిచ్చువాఁడు. అతనికి భూమండల మెల్ల చూచిరావలెనని కోరిక గల్గెను. ఒక యతిథి సర్వౌషధుల మహత్త్వము తెలిసి మంత్ర విద్యా విశారదుఁడైనవాఁడు వచ్చి, యా బ్రాహ్మణుని ప్రార్థనముచేఁ దాను జూచిన దేశములెల్ల తెలిపెను. అంత నతఁడు నీవు కడుయువకుఁడవు. ఇంత చిన్న వయసులో నీ నేలయెల్ల యెట్లు చుట్టివచ్చితివి ? అన నతఁడు మంత్రౌషధి ప్రభావముచే నడ్డులేక వేలకొలది యోజనము లొక్క పూటలో గడచి రానేర్తును. నీ వేగఁదలఁతేని పాదలేపమొకటి పూయుదునని యాతని కాలికిఁ బూసెను. ఆ పసరుచే నాతఁడు తలంచినంతలో హిమగిరిపై వ్రాలెను. అటఁ దిరుగుచుండగా, నాతని పాదములం దంటిన పసరు కరిగిపోయెను. అందుచేఁ దిరిగి రాలేక యిట్టటుఁదిరుగాడుచుండ నొక మృదుమధుర

మైన వీణాగానము వీనులసోకిన నద్దాని నంటపోగా వరూథిని యను నొక దివ్యాంగన కానిపించె. చల్లనిగాలి వీచెను. కుసుమ వాసన లల్లుకొనియె. ఆమె యీ గృహస్థుంగాంచి మోహ వివశయయ్యె. అతడింటికి దారితెల్పుమన నా సుందరి ఓయీ! ఎక్కడియూరు? ఇంటికేల పోయెదవు? యజ్ఞములకు ఫలము దేవతా స్త్రీ సంభోగమేకదా? అట్టిది నీకు శ్రమములేకయే లభించినది. నాతోడ నిందుఁ గ్రీడించి నా మనను దీర్పుమన నాతఁడు బ్రాహ్మణులకు బ్రవాసము కూడదు. దేశదర్శనము మీఁది కోరికచే నేనపరాధి నైతిని. నిత్యనైమిత్తిక కర్మము లన్నియుఁ జెడిపోవును గదా! అన నామె యిదియేటివెట్టి. దివ్య సుందరినగు నా తోడిపొందు దోషము కాదని యెన్నో విధముల, వానిని వేడికొని, వలయు శృంగార భావముల వెలువరించి మోహమున నెంత పలికిన వినక, యాతఁడం గనా! నా కోరికలెల్ల గార్హపత్యాది త్రేతాగ్నులయందే యధీనములు, ధర్మవ్యతిక్రమమున కంగీకరింపఁ జాలను, ఇష్ట మగునేని నాకు రారింజూపి పుణ్యము గట్టుకొమ్ము. అన నామె నిమిషమాత్రమిట నిల్చి నా యభిమత మీడేర్చిన నప్పుడే నీకు మార్గము చూపెదను. నీవు కాదన్న నీ శరీరము విడిచెదను. అన నాతఁడు వినక, యుదకస్పర్శ మాచరించి, శుచియై, వార్చి, యగ్నిందలఁచి, సాష్టాంగ వందన మొనర్చి, తనలో "నోగార్హపత్యాగ్నీ! నీ వెల్ల కర్మములకుఁ గారణ మవు. నీ నుండి యాహవనీయము దక్షిణాగ్నియు నవతరించి నవి. నీ తృప్తిచే దేవతలు, వర్షములను బంటలను, దయచే యుచున్నారు. పంటలనుండి జగత్తు నడుచుచున్నది. నీచే జగ

మ్ములు పెంపునొందినట్లే యేనును నీ యనుగ్రహముచే సూర్యుఁడస్తమింపకముందే యింటికిఁ జేరెదనుగాక! నేను కాలము దాటకుండ, కర్మములు యథావిధిగ నిర్వర్తించు వాఁడనేని, పరదార ధనములను మనసులోఁగూడ వాంఛింప నేని, యాసత్యముచే సూర్యుఁడు మఱుగు పడకుండ, నేనిపుడే యింటికిఁ జేరెదనుగాక! అని యగ్ని దేవునికిఁ జేతులు జోడించి మ్రొక్కినంత. యా బ్రాహ్మణుని శరీరమునందు గార్హపత్యాగ్ని యావేశించి, యాప్రభావముచే నవ్వనమెల్ల తన కాంతులచే వెలిగింపఁజేయుచుఁ జని సుఖముగా నిల్లు సేరుకొనియె.

అచ్చట వరూధిని యాతని వియోగమునకుఁ గుములుచుండె. ఆలోనఁ గలియను గంధర్వుఁడామెపైవలపుగొని, యెట్లును వీలుగాక, వేచియుండి, యా బ్రాహ్మణుని వేషము వేసికొని వచ్చి యా యింతినిఁ గామించె. ఆమె మోహావేశమున, బ్రాహ్మణ ప్రవరుఁడే యనుకొని రతి సమయమునఁ గనులు మూసికొనవలయునని యాతఁడేర్పఱచిన నియమమున కొడంబడి వానితోఁ గ్రీడించె. ఆవల నామె గర్భముం దాల్చె. గంధర్వుని వీర్యమువలనను, బ్రాహ్మణుని రూపమును దలఁచుకొనుటవలనను, నామె కగ్నివలెఁ దేజశ్శాలియగు నొక బాలుఁడు పుట్టెను. తన కాంతులచే సూర్యుఁడెల్లలోకముల వెలిగించునట్లు, స్వకీయములయిన రోచిస్సులచే (కాంతులచే) నెల్లయెడల వెలిగించు నాబాలునికి 'స్వారోచి' యను పేరు పెట్టబడియె. ఆ కుమారుడు, ధనుర్వేదములోఁ గూడ యెల్లవేదములుఁ జదివి, సర్వకళాపూర్ణుఁడై కళానిధివోలె నలరారె.

అతఁడొకనాఁడొక బాలికం గాంచి, యామె భయపడుచుం డగా దరికేగి, బాలా! నీ వెవ్వరిదానవు? ఎవ్వతెవు? అని యడిగిన నామె స్వరోచిం గాంచి యిట్లనియె. ఓ సుందరా! నే నిందీవరుఁడను విద్యాధరుని బిడ్డను. మనోరమ యనుదానను. నా తల్లి మరుధన్వుని కుమార్తె. విభావరి యను నొక చెలికత్తె నాకుఁ గలదు. అది మందారుఁడను విద్యాధరుని కూతురు కలావతి యను మఱియొక చెలికత్తె నాకుఁ గలదు. ఆమె పారుఁడను మునీశ్వరుని కూతురు. ఒకమారు నే నా చెలికత్తె లతోఁగూడి, కైలాసగిరి తటమునకు విహారమునకై యేగితిని. అచట శల్యమాత్రావశిష్టుఁడై యున్న యొక తపశ్శాలింగని నేను నవ్వితిని. అతఁడు కోపముగొని, ఓసీ! నీవు రాక్షసివగు మని శపించె. నా చెలికత్తె లమ్మునిం జూచి "నీవు తాపసివి ఇంత కోపము చెల్లునా? ఏటి బ్రాహ్మణ్యము? ఇది!" యన నతఁడు వారి యెడం గడుంగడు నలిగి, యొకదానికి కుష్ఠము వేఱొకతెకు క్షయవ్యాధియుం గలుగునని శపించె. వారా శాపముం బొందిరి. అదిగో! కొండొక రక్షస్సు నన్నావేశించు చున్నది. ధ్వని వినఁబడుటలేదా? నేటికి మూఁడు నాళ్ళనుండి యా రక్షస్సు నన్ను వెంటాడుచున్నది. నే నస్త్ర హృదయము అను విద్య తెలిసిన దానను. అది నీ కుపదేశింతును. దానిచే నీవీ రక్కసుని జంపి నన్ను గాచికొనుము. మున్ని విద్యను రుద్రుఁడు స్వాయంభువున కిచ్చె. అతఁడు వశిష్ఠునకు, నతఁడు మా మాతామహుఁడగు చిత్రాయుధునకు, నతఁడు మా తల్లి వివాహవేళ తనయల్లుఁడైన మా తండ్రికి మా తండ్రినాకును నీ విద్యనొసంగెను. ఇది నేను నీ కిచ్చెదను. అన స్వరోచి

యా విద్యను గ్రహించి యా రక్షస్సు నోడించెను. వాఁడును స్వారోచిని శరణొంది ప్రభూ! నీచే నేను శాపముక్తిం గాంచితిని. బ్రహ్మమిత్రుఁడనుముని యెనిమిది విధములయియున్న యాయుర్వేదమును జదివికొన్నవాఁడు. నేను నలనాభుని కుమారుఁడను. ఇందీవరుఁడని నన్నందురు. ఈ బాలిక నా కుమార్తెయే. మున్ను నేను బ్రహ్మ మిత్రుఁడను నమ్మునికడకేగి యాయుర్వేదము నేర్పుమని కోరితిని. అతఁ డంగీకరింపలేదు. అంతట నేనంతర్ధానము నొంది యాతఁడు శిష్యులకు బాఠము చెప్పుచుండగా సర్వము విని నేర్చికొంటిని. ఆ విద్యయందు నేనట్లు పరిపూర్ణుఁడనై యా యానందము పట్టలేక, మాటిమాటికి నమ్మునింజూచి పకపక నవ్వితిని. అతఁడు గనిపట్టి, ఓరీ! నీవు రాక్షస వృత్తిచే నా విద్యను జాటుగ నుండి నేర్చితివి. కాన నీవు రాక్షసుఁడవే యయ్యెదవు కాక! పొమ్మని శాపమిచ్చె. అంతట నేనా తపస్విని దయ చూడుమని బ్రతిమాలితిని. అతఁడు ప్రసన్నుఁడై యీ విధముగా నాకు శాపమోచన మనుగ్రహించె. నీచే నేనీ జన్మము వాసితిని. ఈ బాలికను, ఆయుర్వేదవిద్యను నీకిచ్చెదను యని యొసంగెను.

స్వారోచి మనోరమను, పెండ్లియాడ నెంచిన, నామెతన చెలికత్తెలు రోగములచే బాధపడుచుండ, తానీ శోభనమునకంగీకరింప మన సొప్పకున్నదనియె. అంతట స్వారోచి, తానునేర్చిన యాయుర్వేదప్రభావముచే, కళావతీ విభావరులను శాపముక్తులంగావించె. అవల నమ్మువ్వురను వివాహమాడె. విభావరి, పక్షిభాషను దెలిసికొను విద్య నాతని కుపదేశించి యాతని

వరించె. కళావతియు తనకథయిట్లనిచెప్పె, పాఱుఁడనుమాతండ్రి బ్రహ్మచారియై యుండగా పుంజికస్థలయను నప్సర యాతని కడకేతెంచిన వారిర్వురకు సమావేశముకాఁగా నేను దయించితిని. మాతల్లి నన్నొంటరిగా విడిచి స్వర్గమునకేగె. నేను చంద్రకళలఁద్రావి పెరిగితిని.అందుచే కళావతి యని పేరుకల్గెను.

నన్నొక రక్కసుండు తనకిమ్మని కోరగా, మా తండ్రి యీాయననియె. వాఁడందులకుఁ గోపించి యెంటరిగానున్న మాతండ్రిని సంహరించె. ఆశోకమోర్వక ప్రాణములు విడతుననియున్న నన్ను బార్వతి వారించి నీకొక మహానుభావుఁడు భర్తయగును. మనువుకాఁగల కుమారుడు నీ గర్భమున జనించును. ఎల్ల నిధులు (గనులు) నీ యాజ్ఞకు లోఁబడి యుండును. కావలసినంత ధనముపొందెదవు. 'పద్మిని' యను విద్యను నీ కుపదేశించెద. గ్రహింపుమనియె. ఆ విద్యను నా శరీరమును గూడ నీ వశమొనర్చుచున్నాను. నీ వనుగ్రహింపుము.

ఇట్లా మువ్వురను బెండ్లియై స్వరోచి, క్రీడించుచుండగా నొకనాఁడొక కలహంసి, యొకచక్రవాకింజూచి, ఆహా! యీ యువతీయువకుల యన్యోన్యమెంత ముచ్చటగా నున్నది. ఈ పురుషుఁ డెంతధన్యుఁడు! అనికొనియాడ చక్రవాకి హంసీ! ఇతఁడు ధన్యుఁడుగాఁడు; ఇతర స్త్రీలయెదుట వీనికి సిగ్గులేదు. ఒక స్త్రీ యెదుట నింకొకదానిని బొందు వీని కందరయందు నొకతీరునఁ బ్రేమ యెటుండును? వీనికీ కాంతలుకాని, వీరికీ కాంతుఁడుగాని యిష్టులుగారు. ఇదంతయు వినోదమాత్రమే. ఒకతె మోహముచేఁ దనను దలంచుకొనుచుండ వేరొకతెం గౌఁగిలించుకొనుచున్నాఁడు. నిజముగా నితఁడు ప్రాణప్రియుఁ

డగునేని, యిక్కాంత ప్రాణములు వాయువలదా ? ఈ బాలి కలు విద్యనిచ్చి యీతని నొకరునట్లు కొన్నారు. హంసీ! చేనే ధన్యురాలను నా భర్తయే ధన్యుఁడు. బహు భార్యా పతియగువాఁడు పుణ్యమును బాపమును గూడ పొందును. పెద్దదానిం జిన్నగాఁ, జిన్నదానిం బెద్దగా నిట్లువిషమ భావము చేయువాఁడు పాపమొందును. గురువుకడ 'నాతిచరామి' (వేఱొకతెను బొందను) అని వరమిచ్చి వేఱొక దానింగూర్చి యగ్నియందు సమిధలు వేల్చుట ధర్మమగునా ? యథావిధి వివాహితయైన ధర్మపత్నితో నిత్యనైమిత్తికములు చేయదగి యున్నది. ఇట్లు పలుకు సప్పులుగుల పలుకులవిని పక్షిభాష నెఱింగి యున్నవాఁడగుటచేఁ దనకుఁ దాగ్రహించి మిన్న కుండె.

ఆవల నూరేండ్లకుఁ బర్వతము మీఁద వారితోఁ గ్రీడించుచు నొకలేడి నాడు లేళ్లగుంపులోఁ జూచెను, ఆడు లేళ్లు దాని నాఘ్రాణించుచు నుండగా నది వానింజూచి, ఓసీ! నేను స్వరోచినను కొంటిరా! వాఁడు గుణవంతుఁడని యందురా? సిగ్గులేనివాం డ్రు చాలమది యటనున్నారు. మీరు నటకే పొందు. ఒక్కస్త్రీ పెక్కుమంది పురుషులను బొంది యెట్లు పరిహాసము పొందునో యొక్క పురుషుఁడు పెక్కుమంది స్త్రీలను బొంది యట్లే పరిహాసము పొందును. అట్టి వానికి దిన దినము ధర్మక్రియాలోపము జరుగును. పరలోకము లట్టివానికిఁ గలుగవు. అనిన విని స్వరోచి మృగభాష లెఱింగిన వాఁడగు టచే నదియు గ్రహించి యావెంటనే తన భార్యల నందరిని విడిచి పెట్టవలెననుకొనియు వారితోఁ గొంతకాలమట్లే క్రీడిం

చుచుఁ దొంటి విచారము మఱచిపోయెను. అట్లు మఱియాఱు వందల యేండ్లు గతించెను. ధర్మము మాశ్రయించుకయుఁ దప్పక వాగితో విషయ సుఖము లనుభవించుచుండెను, అతనికి మనోరమయందు, విజయుడు, విభావరియందు మేరునందుఁడు కళావతియందుఁ బ్రభాసుఁడు నుదయించిరి. స్వరోచి 'పద్మిని' యను విద్యాప్రభావముచే మూఁడు పట్టణముల నిర్మించి యాముగ్గురకు నిచ్చె. విజయునకుఁ దూర్పుదెస 'కామరూపము' అను గిరిపై 'విజయము' అను పురము గట్టియిచ్చెను. పడమట మేరునందనునికి నందవతియను పురమిచ్చె, తాలమనుపురము దక్షిణాపథమునఁ బ్రభాసునికిచ్చెను.

ఒకప్పుడు స్వరోచి వనవిహారము సేయుచు నొక బాణముచే నొక పంది నేయఁబోయిన, నొకయాఁడులేడి నన్ను గొట్టుమని వచ్చె. నీకేరోగము కానిపింపదు. ఏల శరీరము విడువఁగోరెదవు? అన నది, ఇంకొక లేడిపై మోహముగొని యున్న యొక మగలేడిమీఁద నాకు మక్కువ యేర్పడినది. ఇందులకు మరణముకంటె వేరౌషధము నాకుఁగానిపింపదు. అనస్వరోచి, ఏదీ! నీముందొక మగజంతువు కానిపింపదే! నీ విట్లనియెద వేల? అననది, కాచుకాదు. నీయందే నాచిత్తము లగ్నమయినది. అన స్వరోచి, నన్నే కౌగిలింపుమని దానిని గౌఁగిలించుకొనెను. అది వెంటనే దివ్య శరీరముం దాల్చి సిగ్గుదొలుకాడ ఓయీ! నేనీ వనదేవతను. నాయందు మనువు కాదగిన కుమారుని నీవు గాంచవలయును. ఇది దేవతలవచనము. అననాతఁడు హర్షించి యామె యందఖిల లక్షణ లక్షితుండును దేజస్వియు నగు కుమారునిం గాంచె, అతడు పుట్టినవేళ దేవదుందుభులు

మ్రోసె. గంధర్వులుపాడిరి. అప్సరసలాడిరి. పూలవానగురిసె
స్వరోచి కుదయించిన వాఁడగుటచే నాతఁడు స్వారోచిషుండని
పేరొందె. స్వరోచి యావల నొకనాఁడొక హంస యాఁడుహంస
తోనుండగాఁ జూచెను. అది భార్యను జూచి, కామము
మానుము. ఎల్లకాలము భోగములతో నేగించుట న్యాయమా?
కాల మాసన్న మగుచున్నది. అనఁగా నాఁడుహంస, భోగ
ములకకాలము లేదు జగత్తే భోగాత్మకము. యజ్ఞములు
భోగములకొఱకే. వివేకులగు వారే, దృష్టములు (కనబడు
నవి) అదృష్టములు (కనఁబడనివి స్వర్గాదులు) నగు భోగ
ములను గోరుదురు. దానధర్మము లొనరించుట యందులకే,
అనిన పురుషహంస, "భోగములం దంటువడిన చిత్తము మఱ
లిరాదు. బురదలోఁ దిగఁబడిన ముసలియేనుఁగు చందాన
భోగాసక్తుఁడు భోగములం గూరుకొని పోవును. స్వరోచిం
జూడరాదా? బాల్యమాదిగ మోహపంకమున దిగఁబడి పడుచుఁ
దనమున నంగనల మఱగి యిప్పుడ బిడ్డలందు, మనుమలందును
దగుల్కొని వాని మనసు తేవలేకున్నది. వానివలె నేను స్త్రీ
దాసుఁడనుగాను, వివేకిని" అనియె. స్వరోచి విని తొట్రుపడి
భార్యలతో వేఱొక వనమున కేగి తపమొనర్చి పుణ్యుఁడై
యుత్తమలోకములఁ గాంచెను. అవల స్వారోచిష మన్వంత
రము ప్రవర్తించె.

## —♦ నవ నిధుల వృత్తాంతము ♦—

స్వారోచిష మనువునకుఁ బద్మినీమంత్ర ప్రభావముచేఁ
దొమ్మిది నిధులు (గనులు) స్వాధీనము లయ్యె. అందుమొదటిది

పద్మనిధి. అది కలవానికి దాక్షిణ్యము కలుగును. శాంతుఁడగును. ఇది సత్త్వగుణ ప్రధానమైన గని. బంగారము, వెండి, రాగి, మొదలగు ధాతువుల క్రయ విక్రయ వ్యాపారము చేయించును. ఇది కలవాఁడు భూరి దక్షిణలిచ్చి యాగములు సేయును. దేవాలయములఁ గట్టించును.

మహాపద్మనిధి :— సత్త్వగుణ ప్రధానము. ఇదికలవాఁడు సాత్త్వికుఁడగును. పద్మరాగము మొదలయిన రత్నములు, ముత్యములు మొదలయినవాని వ్యవహారము చేయును. యోగులకు దానముసేయును. యజ్ఞములు సేయును. చేయించును. వాని తరువాత నేడుతరముల దాఁక యిదేలక్షణము లుండును.

మకరము:— ఇది తామసము. (తమోగుణ ప్రధానము) దీనిచేఁ జూడఁబడువాఁడు తమోగుణము కల్గియుండును. బాణములు, కత్తులు, ధనుస్సులు, చర్మము మొదలగు వానిని గ్రహించును. రాజానుగ్రహమొందును. శౌర్యవంతులగు రాజులకు ధనమిచ్చును. ఆయుధముల క్రయ విక్రయ వ్యాపారము వానికెక్కువ యిష్టము. ఈ నిధియొక్క ఫలమొక్కనికే, సంతానమున కీ ఫలము లభింపదు. వీఁడు ధనాశచేనున్న దొంగల చేతనో, యుద్ధమునందో చనిపోవును.

కచ్ఛపము:- ఇది తమః ప్రధానము దీనిచేఁ జూడఁబడినవాఁడు కర్మపరులను నమ్మఁడు. తాఁబేలు ముడుచుకొన్నట్లు వీఁడు రత్నరాసులను లోననిముడ్చి కొనును ; ని యెవ్వరికి నీయఁడు. తాను ననుభవింపఁడు. ధనము నేలలోఁ బాతిపెట్టును. ఇది యొక్క తరమే నిలుచును.

ముకుందము.—రజోగుణ ప్రధానము. దానిచేఁ జూడఁబడువాఁడు రాజసుఁడు. వీణ, పిల్లనగ్రోవి, మృదంగము మొదలగు సంగీతపరికరము గలిగియుండును. వాని వ్యాపారము సాగించును. నట, విట, గాయకాదులకు సొమ్మిచ్చును. రేయింబవళ్ళు తానసుభవించును. రంకుటాండ్రతో వీనికి సక్తి హెచ్చు, ఇది యొక్క పురుషాంతరమే యుండునది.

నందము:—రజస్తమో గుణములు ప్రధానముగాఁ గలది. దీనిచేఁ జూడఁబడినవాఁడు, సమస్త ధాతురత్నములకు, ధాన్యములకు నధిపతియగును. వానికి సంబంధించిన వ్యాపారము సేయును. అతిథ్యభ్యాగతులకు, బంధువులకు నాధారమగును. పరాభవమించుకైన సైపఁడు. పుట్టగానే ప్రీతిని గలిగించువాఁడగును. దాతయగును సంతానవతులగు పెక్కుమంది భార్యలు గలిగియుండును. ఇదియెల్లరకు దీర్ఘాయు విచ్చును. బంధుపోషణము సేయును. ఉత్తమ లోకాదరముగల్గించును. మిత్రులయందుఁ బ్రేమనుంచదు. ప్రాతవారినివిడిచి క్రొత్త మిత్రులందు రుచిగూర్చును.

నీలము:—సత్త్వ రజోగుణమయము. దీనిచే జూఁడ బడువాఁడు సత్త్వరజోగుణ ప్రకృతి గలవాఁడగును. బట్టలు, దూది, ధాన్యాదికము పండ్లు, పువ్వులు అనువానిని గ్రహించును. ముత్యములు, పవడములు, శంఖములు, ముత్యపుఁజిప్పలు కలవ, నీటియందు జనించు వస్తువులు అను వీనితో వ్యాపారము సేయును. ఇంకే వస్తువునందు వీనికి బ్రీతియుండదు. చెఱువులు, సరస్సులు, ఉద్యానములు, గట్టించును. నదుల కానకట్టలు

కట్టును, పూవులు, గంధము మొదలగు విలాసవస్తువులచేఁ బ్రీతిపొందును.

శంఖము:—రజస్తమోమయము. అద్దానిచే జూడఁబడు వాడట్టివాఁడే యగును. ఇది యొక్కఁతరముమాత్రమే యుండును. తాను సంపాదించుకొన్న యన్నవస్త్రముల ననుభవించును. వీని పరివారము, నీచవస్త్రములను, నీచాన్నమును గలిగియుండును. ఎవ్వరికి నీయఁడు. తాను దినడు.

ఈ తొమ్మిదియు ధనదేవతలగు నిధులు. ఈ నిధులొకదానితో నొకటి గలిసిచూచినచో మిశ్రఫలము కలుగును. వీని కన్నిటికి నాధిపత్యము వహించి పద్మిని (విద్య) రాణించును.

## —: ఔత్తమ మన్వంతరచరిత్ర :—

మూఁడవదగు నౌత్తమ మన్వంతర కథ తెల్పుమన మార్కండేయుండు క్రౌష్టి కిట్లనియె. ఉత్తానపాదునికి సురుచి యందుఁ గల్గిన వాఁడుత్తముఁడు. అతఁడు మంచివీరుఁడు అతనిభార్య బహుల. ఆమె బభ్రుని కూతురు. ఆమెపై నుత్తమునికింతంతనరాని మోహముండెను. కలలోనైన నాతఁడామెను మఱచి యుండఁడు. కాని, యామెకతనిపై నట్టిప్రేమ లేకుండెను ఒకనాడు రాజకుమారులు చూచుచుండ, వారస్త్రీలతోఁగూడి పానముచేయుచుఁ దాను త్రాగిన పానపాత్రమును భార్య కందించిన నామె పెడ మొగము పెట్టుకొని యాపానపాత్రమునంది కొనదయ్యె. ఆరాజు రాజకుమారులయెదుటఁ దనకు గలిగిన యాపరాభవము సైపక, వెంటనే దాని నడవిలో విడువ

నంపెను. రాజు తనకంటఁబడకున్నందుల కాయింతి సంత సించెను. అతఁడు మాత్రము తద్వియోగము భరింపక తపించు చుండెను. వేఱొక్కతెను పెండ్లియాడకుండెను. ఒక బ్రాహ్మ ణుడు వచ్చి "రాజా! నాభార్య నెవ్వఁడో హరించెను. వాని జాడ తెలియకున్నది. నీవామెం దెచ్చియిమ్ము" అనియె. భూపతి నేను వానినిగాని యామెనింగాని యెఱుంగననియె. విప్రుఁడు నీవు ప్రజలవల్ల నాఱవపాలుపన్ను పుచ్చుకొనువాఁడవు. నేనె ఱుంగ నన్నచోఁ జెల్లదు, మాబాధలవారింప వలసినవని నీయది యనియె. ఱేఁడు, ఆర్యా! నీ భార్య యెట్లుండును ? వయసెంత? వివరముగా దెలుపుమనియె. బ్రాహ్మణుఁడు, నా భార్య మిడి గ్రుడ్లు కలది. మిక్కి పొడవుగానుండదు. చిన్నచేతులు కలది. మొగము చిక్కియుండును. వికార రూపముకలది. నేను దాని నేమియు దూషింపను. అది నన్నుదిట్టి పోయును. సాధు స్వభా వము లేనిది. ఆమెకు తొలివయస్సు గడచినది అని తెలిపెను. రాజువిని. ఓ వెఱ్ఱిబాపఁడా! ఇట్టి భార్యతో నీవేమి సుఖించె దవు. పోయినదే పోనిమ్ము, రూపమూ లేదు; శీలమంతకు మున్నే సున్నగదా! ఎవఁడో హరించెనంటివి, పీడవదలినది; శాంతిం పుము అనియె. ఆ బ్రాహ్మణుడు భార్యను రక్షింపవలెనని శ్రుతి చెప్పుచున్నది. దాని రక్షణముచే సంతానము రక్షింప బడును. సంతానరక్షణ మాత్మ రక్షణమేకదా! ఆత్మయే (తానే) పుత్రుఁడను పేరొంది భార్యగర్భమునఁ బుట్టును. ఆమెను గాపాడకున్న కులము సంకరమగును. ఆదోషముచేఁ బూర్వులు, పితరులు క్రిందఁ బడిపోవుదురు. గురునొద్దఁ బ్రమా ణము నేసి, యగ్నిలో సమిధవేల్చి చేసుకొన్న భార్యను

విడిచి, నే నింకొక్కతె నిపుడెట్లు పెండ్లి యాడెదను. ఆమెను విడిచిన నేకర్మము ఫలింపదు. అగ్నితోఁగూడి యామె మొదట నాయింటికి వచ్చినది. ఆమెయే ధర్మాచరణమునకుఁ దోడు. ఆమెయే నీకు ధర్మమేతువై నీ కాఱవభాగము పన్ని చ్చినది. అనినవిని యారాజు రథమెక్కి, భూమియెల్ల గాలించి యొక మునివాటమున కేగె. ముని యాతని నతిథిగా నాద రింపఁబోయియు నాగి, నృపతీ! నీవు భార్యను వదలి పెట్టి నాఁడవు. దానితో ధర్మమెల్ల విడిచినట్లే. పదునైదు రోజులు కర్మము మానిన బ్రాహ్మణుఁ డస్పృశ్యుఁడగును. నీ వొక్క యేడాదినుండి కర్మత్యాగ మొనర్చితివి. భార్య దుష్టురాలైనను భరింపవలసినదే అనియె. రాజదివిని వెలవెలఁబోయి నారాజ్య మున నొక విప్రుని భార్య నెవ్వఁడో దొంగిలించెను. మీరు త్రికాలజ్ఞులు, మీవలన నది తెలియవచ్చితిని. అనిన ఋషి, అద్రి కుమారుఁడగు బాలకుఁడనెడి రాక్షసుఁ డామెం గొని పోయెను. ఆమె నీ 'ఉత్పలావతము' అను వనమున గన్పట్టును, ఆమెం గొనివచ్చి బ్రాహ్మణునికిప్పుడే యప్పగింపుము. నీవలె నాతఁడు పాపము నొందకుండుఁగాక! అనిన రాజు రథమెక్కి యామెంజూచి, ప్రశ్నించి, సుశర్మ భార్యను నేనేయని యామె తెలుప రాజారక్కసునికడ కేగెను. వాఁడు, పరివారముతో వచ్చి రాజుంజూచి, యతిథి మర్యాద సేయుదురమ్మనియె. నృపుఁడు "చాలుఁజాలు! నీ వెల్లపూజ సేసినట్లే. బ్రాహ్మణభార్యను హరించితివి. ఈమె యేమంత యందగత్తెయనియా? తిననెంచి తివా? అదియుంజేయవైతివి" అన వాఁడు, ఓయీ! మేము మనుష్యులందినము. పుణ్యఫలము నే తినెదము. మానవుల స్వభా

వమును దినుటయే మాపని. అందకత్తెలగు చాలమంది స్త్రీలునాకున్నారు. ఈమనుష్యస్త్రీ మాకక్కఱలేదు అనియె. రాజు, "అట్లయిన నీమెను వెంటనే యింటికి బంపుము." అన వాఁడు, "ఈమె మగఁడు మంచి మంత్రవేత్త. ప్రతియజ్ఞమునందును, రక్షోఘ్నములగు మంత్రములను బఠింపుచు, రాక్షసులమగుమమ్ముచ్చాటనము సేయుచున్నాఁడు. అందుచేమేమాకలి గొనియున్నాము. మే మెక్కడికిఁ బోవలయును? అందుచే వానికర్మము సాగకుండుట కీమెను, గొనివచ్చితిని." అనెను. భూపాలుఁడామాటలువిని.మున్నా విప్రుఁడును, ఇప్పుడీ రాక్షసుఁడును గూడ నన్నే దూషించిరి. భార్యాహీనుని పాపమెఱుఁగఁ జెప్పిరి. అని తెలిసి, ఓయీ! నీవు మానవుల స్వభావమును దినుదునంటివి. ఈమెలోని క్రూరస్వభావముం దిని వేయుము. ఇఁకమీఁద నీమె భర్తకు లొంగియుండును. ఈమె నాతనికిచ్చిరమ్ము. ఇదే నీవునాకుఁజేయు నాతిథ్యము అనియె. వాఁడంతట నామెలోఁ బ్రవేశించి, యామె దుర్వృత్తిని దిని వేసిన నామె రాజుంజూచి "నేఁ జేసినపాపముచే భర్తను బాసితిని. ఏదంపతులఁ బాపితినో వీనిదోషము కాదు. నాదే యీ పాపమనియె. అవల నాయసుర యామె నామె మగనికిఁ జేర్చెను.

రాజు మున్ను దాఁగనిన ముని కడకేగి యీ వృత్తాంతమంతయుఁ జెప్పిన నతఁడు రాజా! నేనిదంతయు నెఱుంగుదును. భార్యయే పురుషార్థములకు సాధనము. ధర్మమునకు మిక్కిలియు సాధనము. ఎల్లవర్ణములవారికిసంతి నే నీభార్య పాతాళముందున్నది. ఆమె ప్రవర్తన కేలోపముగా లేదు. నాగులకు

రాజగు కపోతరాజను వాఁడామెను పాతాళమునకుం గొంపోయెను. అతఁడు త్రికాలము లెఱింగినవాఁడు. వానిభార్య మనోరమయు, కూతురు నందయు నీభార్యను గాపాడుచున్నారు. నందకు నీభార్య సవతియగునని వారెఱుంగుదురు. అని తెల్పిన రాజాశ్చర్యపడి, మునీంద్రా! నాభార్యకు నాపై ననురాగము లేకుండుటకేమికారణము? అన నతడిట్లనియె; నీ వివాహమున నీవు సూర్య, కుజ, శనులచేఁ జూడబడితివి. నీ భార్య శుక్ర గురులచేఁ జూడఁబడెను. ఆ లగ్నమున చంద్ర బుధులు మీ యిద్దరకు ద్వేషకారకు లయిరి. అందుచే మీకీభేదముఁగల్గినది. ఇఁక నీవు నీ భార్యం గదిసి ధర్మము లాచరింపుము.

రాజింటికివచ్చి బ్రాహ్మణదంపతులయన్యోన్యము చూచి హర్షించెను. ఆబ్రాహ్మణుఁడు 'మిత్రవింద' యను నిష్టి నేడుమారులు సేసి, నీ భార్యను గొనిరమ్మని రాజునంపెను. రాజు మున్ను దాఁజూచిన రాక్షసుని స్మరించెను. వాఁడుపోయి రాజభార్యను పాతాళము నుండి కొని వచ్చెను. ఆమె వచ్చి రాజునెడ నపరిమితానురాగముం బ్రకటించెను. రాజు హర్షించె. ఆమె నాగరాజు శాపముచే వానికూతురు మూగయయిన వార్త తెలిపిన, రాజు బ్రాహ్మణులచే సారస్వతేష్టిని జేయించి, యామెశాపము వోఁగొట్టెను. ఆ నాగకన్య నందయనునది ప్రత్యుపకారముగా దనచెలికత్తెయందు మన్వంతరాధిపతి యుదయించునని వరమిచ్చి పాతాళమునకేగెను. అవలరాజునకుఁ గుమారుఁడు కలిగెను. ఉత్తముడగు అతనిరూపమును, గుణమును, గని పెట్టి మునులాతనికి 'ఔత్తముఁడు' అని పేరుపెట్టిరి. ఉత్తమవంశమున, నుత్తమ

సమయమున, నుత్తమాకారము గలిగి జనించినవాఁ డగుటచే వాని కాపేరు తగియుండునని వారెంచిరి.

## —♦ ఔత్తమ మన్వంతరము ♦—

ఇది మూఁడవ మన్వంతరము. ఇందు, సుధర్మ, (స్వధామ) సత్య, శివ, ప్రతర్దన, వశవర్తి అను పేరుగల దేవతాగణ దేవతలు పాపములఁ బోగొట్టి సార్థక నాములై యజ్ఞములందు హవిర్భాగము లనుభవింతురు. దేవగణములు పంద్రెండు. వానికి సుశాంతి యనువాఁడు రాజై యింద్రపదవి నధిష్ఠించును.

"సుశాంతిర్దేవరాట్ఛాంతో నస్సుశాంతిం ప్రయచ్ఛతు
సహిత శ్శివసత్యాద్యై స్తథైవ వశవర్తిభిః"

అనుశ్లోకముచేనయ్యింద్రునివినుతించినసర్వోపద్రవములు నశించును. ఇప్పటికి నీ కథ ప్రసిద్ధికెక్కినది. అజుఁడు మొదలుగాగల మనువుకుమారులు, వారి తరములవారు రాజులయిరి. నాల్గు యుగములు గలిసి యొక్కమహాయుగము. అట్టి మహాయుగములు డెబ్బదియొక్కటియైనచో మన్వంతరమగును.

## —♦ తామస మన్వంతరము ♦—

మున్ను స్వరాష్ట్రుఁడను రాజుండెను. పెక్కుయజ్ఞములు సేసెను. సూర్యునివరముచే దీర్ఘాయువు పొందెను. అతఁడు దీర్ఘాయువై యుండుటచే నతని భార్యలు నూర్గురు ముందే గతించిరి. అతని మంత్రులు పెక్కుమంది నశించిరి. అందులకై యాతఁడు దుఃఖించి చాల కృశించెను. వానిని విమర్దుడను రాజోడించెను. స్వరాష్ట్రుఁ డడవికేగి తపమొనర్చె. అతని

తీవ్రతపముచే మేఘములు గ్రమ్మి యెడతెగని వర్షములు గురిసె. ఆ రాజు నీటం గొట్టుకొనిపోయి, యొక యాఁడు లేడి తోకపట్టుకొని గట్టుసేరెను. రమ్యకమను వనమునఁ బ్రవేశించిచీకటి గ్రమ్మియున్న యా యడవిలో నయ్యాడు లేడి శరీరముదాకి మోహపరవశుఁడయ్యె. తన పృష్ఠభాగము నంటుచు వెన్నంటివచ్చు రాజుంగని లేడి, మనుజవాక్యములచే 'ఓయీ! నీకునేనుబొందగూడనిదాననుగాను కాని యీ బురదలో నాకుఁ గాలు సాగకున్నది. లోలుఁడను వాడిదిగో మనకడ్డు దగులు చున్నాఁడనియె. రాజు నీకి మనుజ భాషణము లెట్లు వచ్చినవి, ఎవఁడో లోలుఁడడ్డువచ్చుచున్నాఁడంటివే! వాఁడెవఁడు? తెల్పుమన నది యిట్లనియె. రాజా! నేను నీ భార్యను; ఉత్పలావతియను పేరి దానను, దృఢ ధన్వుని కూతురను లేడి మిథునము క్రీడించుచుండగా జిన్నతనములోఁ జూచితిని. ఆడులేడిని నేను గొట్టితిని. మగలేడి మూఢురాలా మమ్మేల బాధితివి; పాపినివి, అన, మనుష్య భాషణము లాడు దానిం జూచి నేను భయపడి యెవ్వరవని యడిగితిని. అది నేను నిర్వృతి భక్షుడను మునికొడుకను సుతపుఁడను వాడను. ఆడు లేడిపై మోహముగొని లేడినైతిని. నీవిపుడు మాకు విఘ్నము సేసితివి గాన శపింతుననియె. వలదని నేను బ్రతిమాలితిని. అతడు, నాకోర్కె తీర్చువేని నిన్ను శపింపననియె, నేను మృగ రూపముతో నున్న నీతో నెట్లు క్రీడింతునన, నాతడి జన్మమందే లేడి వయ్యెదవు. నీ కడుపులో లోలుపుఁడను మునికుమారుఁడు పుట్టును. అతఁడు గర్భములో నుండగా నీకు జన్మాంతర స్మృతి కల్గును. అతఁడు పుట్టగానే పుణ్యలోకమున కేగదవు.

ఆలోలుడు శత్రువులగెల్చి, రాజ్యమేలి మనువగును" అనియె.
నీ కతములఁదాకుటచే నాకిపుడు చూలయ్యె. ఇఁక నన్నీవు
కూడందగదు.గర్భమునందున్న 'లోలుఁడు' విఘ్నముచేయును.
అని లేడి పలికిన రాజు హర్షించెను.ఆ మెకుఁ గుమారుఁడ దయిం
చెను. తమోగుణ ప్రధానమగు మృగజన్మమునందు తల్లికిఁ
గలిగిన వాఁడగుటచే మును లాతనికిఁ దామసుఁడను పేరుం
చిరి. అతఁడు పుట్టినతోడనే తల్లి శాపముక్తయై యుత్తమగతి
నొందెను. ఆ బాలుఁడు శత్రులగెల్చి రాజయ్యెను. వానితండ్రి
హర్షించి, కొండొక కాలమునకుఁ బరమపద మందెను.లోలుఁడు
మనువయ్యె. ఆ మన్వంతరమున తురాషాడ్వరులు, సత్యసుధీ
స్వరూపులు, హృదయులు ననువారు గణదేవతలు. దేవగ
ణము లిరువదియేడు. శిబిచక్రవర్తి యింద్రుఁడు, జ్యోతిర్ధా
ముఁడు, పృథువు, కావ్యుడు, చైత్రుఁడు, అగ్ని, వలకుడు'
పేవరుఁడు ననువారందు ఋషులయిరి. తామసుని పుత్రులు
రాజులైరి

## — రైవతమను వృత్తాంతము —

అయిదవది రైవత మన్వంతరము, ఋతవాక్కను ముని
కొక దుష్టుఁడగు కొడుకు పుట్టెను. వాఁడు పుట్టినది మొదలు
తండ్రి రోగియయ్యె. తల్లి కుష్ఠరోగము నొందెను. వాఁడొక
ముని భార్యను దొంగిలించినఁ దండ్రి "ఛీ! చెడుకుమారుఁడుం
డుటకంటె పుత్రులు లేకుండుటయే మంచి"దని దుఃఖించుచు
గర్గునితో "మునీంద్రా! నేను గర్భాధానము కేవలకాముకుడనై
చేయక వంశము నిలుపవలెనన్న ధర్మదృష్టిచే నొనర్చితిని. అన్ని

యోగ్యతలుకల నాకిట్టి కొడుకేల కల్గెను?" అన గర్గముని "రేవతీ నక్షత్రమునం దుదిపాదమున వీఁడు పుట్టెను. అదే వీని నడవడి చెఱచినది." అనియె. ఋతవాక్కుఁడది విని, రేవతీ నక్షత్రమింత దుష్టమగునేని యిపుడేయది క్రిందబడుఁగాక యనియె. అది యప్పుడే కుముదాద్రిమీఁద రాలెను. అందుచే నాకొండ రైవతకమను పేరు పొందెను. ఆ నక్షత్ర కాంతిచే నచట తామరకొల నేర్పడియె. అందుండి రేవతి యను కన్యక పుట్టెను. ప్రముచుఁడనుముని యామెను పెంచెను. అతఁడగ్ని దేవునడిగి, యామెకుఁ దగిన భర్త దుర్గముఁడను రాజు కలడని తెలిసికొనెను. ప్రియవ్రతుని వంశములోని వాఁడగు నాదుర్గముఁడు వేటకురాగా, నతని సత్కరించి, నీ భార్యకుఁ గుశలమే కదా? యనియె. ఆరాజు, నాకు సుజాత, కదంబ, విపాత, నందిని యను భార్యలున్నారు. వారు కుశలురే. అన నమ్ముని, ఓయీ! నీ భార్యనే నీవెఱుంగవా? రేవతి యను నీమె నీ భార్య. ఈమె నేల మఱచితివి? అనియె. అతఁడు మునీంద్రా నిజముగా నే నెఱుంగను తాము కోపింపవలదు, అని ప్రార్థించె. ఋషి యగ్ని దేవుఁ డిట్లానతిచ్చెను. నీ వీమెనిపుడు వివాహమాడుమనియె. రేవతీ నక్షత్రమందు మాకుఁ బెండ్లిచేయింపుఁడని బాలికముని నడిగె. "కుమారీ! రేవతీ నక్షత్రమిపుడు చంద్రునితో లేదు. ఇతరములయిన నక్షత్రములు వైవాహికములయినవి చాల యున్నవి." అన నాబాలిక, అది లేకున్న సమయము వ్యర్థము, నాకట్టి వివాహము బాగుండదనియె. ప్రముచుఁ"డమ్మా! అది ఋతవాక్కనుముని యిచ్చిన శాపముచే యాకాశమునుండి పడిపోయినది. నేను నిన్నిత్తునని చెప్పితిని.

నీవంగీకరింపనిచో నాకు సంకటము వచ్చును." అన నాబాలిక "నేనొక తపస్వికిఁ గూతురనుగాని, సామాన్య మానవుని బిడ్డను గాను నాతండ్రి ప్రభావశాలి యగునేని యీరేవతి నాకాశ మెక్కించి నాకందుఁ గల్యాణము చేయలేఁడా!" అన ముని గ్రహించి, తనతపోమహిమచే రేవతి నాకాశమున నిలిపి చంద్రునితోఁగూర్చి, యాశుభలగ్నమున నాపిల్లకు వివాహము కావించె. ఆసమయమున నీకేమి కట్నముగావలెనో కోరుమని యల్లునడిగిన నారాజు, నేను స్వాయంభువమనువు వంశములోని వాఁడను. కాన నాకు మన్వంతరాధిపతి కాఁగల కుమారుఁడు కలుగునట్లు వరమిమ్మన నాతఁడట్లొసగె. రేవతి యందా రాజునకు రైవతుఁడుదయించె. అతనివలన రైవత మన్వంతరము ప్రవర్తిల్లె, అతఁడు మనువు దెల్పిన మార్గమున భూమిం బాలించెను రైవతమన్వంతరమున అమితభానులు, వైకుంఠులు, భూతరజులు, సుమేధులు నను నల్గురు గణదేవతలు, పదునాల్గు దేవగణములు, వీరికి దొర (ఇంద్రుఁడు) విభుఁడనువాఁడు, హిరణ్యారోముఁడు, వేదశ్రీ, ఊర్ధ్వబాహుఁడు, వేదబాహుఁడు, సుధాముఁడు, పర్జన్యుఁడు, వశిష్ఠుఁడు నను వారు సప్తర్షులయిరి. బలబంధుఁడు మొదలగువారు రైవతుని కుమారులు భూపతులుగ నుండిరి. స్వారోచిషుండుతక్క యింతవరకుఁ దెల్పిననల్గురు మన్వంతరాధిపతులును స్వాయంభువునివంశములోనివారే

## — చాక్షుష మన్వంతరము —

ఆఱవది చాక్షుషము. 'చక్షువు' అను బ్రహ్మకుఁ బుట్టుటచే నిమ్మనువు చాక్షుషుఁడని పేరొందె, అనమిత్రునకు

భద్రయను దానియందు శుచియను విద్వాంసుఁడు జనించె. అతఁడు జాతిస్మృతి కలవాఁడు. తల్లి వానిని తొడపై నిడికొని ముద్దులాడుచుండగా, వాఁడు విచిత్రముగా నవ్వుచుండెను. ఆమె యా నవ్వుచూచి, యీ నవ్వు చాల వికృతముగా నున్నది. భయము వేయుచున్నది, ఈడుకుఁ దగని చర్యకాన నిది యశుభమేమో యనియె. శిశువది విని "అమ్మా! నన్నొక పిల్లి తినఁబోవుచున్నది. అదిగో! కనిపించుట లేదా? జాతహారిణేయని దానిపేరు. నీవు తల్లివని నాపై మోహము చూపెదవు. నీతోడి సంబంధము నా కాతేడు రోజులనుంచియే. నా తండ్రీ! నా కుఱ్ఱ! యనుచు నన్ను లాలించుచున్నావు" అనియె. కుఱ్ఱా! ఇది నీకుఁ బ్రీతి కలిగింపదేని నే నేటికింత శ్రమ పడవలెను? చాలుచాలు! నని యామె పురిటిల్లు విడిచి వెళ్ళిపోయెను. పిమ్మట నా పిల్లి, జితేంద్రియుఁడు, జ్ఞానియు నగు నా బాలునెత్తికొని, విక్రాంతుఁడను రాజుయొక్క భార్యకడ నుంచి, యామెగన్న కుమారుని మఱొక యింటనుంచి, యా యింటనున్న పసిబిడ్డను దొంగిలించి తినివైచెను. ఇట్లా పిల్లి యుండగా, విక్రాంతుఁడు తనయింటఁ బెరుగుచున్న బాలుఁడు తనవాఁడనియెంచి, జాతకర్మాదులొనర్చి, 'ఆనందుడు' అని పేరిడియె. వాని కుపనయనమొనర్చిన తఱి, నీ తల్లికి మ్రొక్కుమన వాఁడు, "నా కన్నతల్లి యీమెకాదు. విశాలయందు బోధుఁడను బ్రాహ్మణునికడ నెదుగుచున్న చైత్రునికీమె తల్లి. నేను వేఱొక తల్లిబిడ్డను" అనియె. రాజాశ్చర్యపడి నిజమడిగిన నాతఁడుపిల్లి చేసినపనియెల్ల వివరించెను, నీసుతుడు బ్రాహ్మణుని సంస్కారముచేఁ బవిత్రుఁడయ్యె. నేనీచే బుణ్యుడనై తిని.

నీకుఁ గుమారుఁడనుగానే యుండెద గాక ! నాతల్లి యెవరో తెల్పుమనియె. రాజునాకిదియంతయు భ్రమగానున్నది. ఇదిచాల గహనమైన విషయము. కాన స్పష్టముగా నిది యెఱింగింపుమన నక్కుమారుఁడిట్లనియె.

రాజా ! ఎవని కెవడు పుత్త్రుఁడు ? ఎవని కెవ్వఁడు బంధువు? జన్మమే యీ లంకె పెట్టును. మరణము దీనిని విడదీయును. సంసారబద్ధులకొక బంధుత్వముగాదు. నాకీ జన్మమున నిద్దఱు తల్లులు నిర్వురు తండ్రులయిరి. ఇతర జన్మములలో వారిసంఖ్య తెలుప గలమా? నీకొడుకు విశాలయందున్నాఁడు. వానిని రప్పించి కొనుమన నారాజు వానిందెచ్చి, పట్టాభిషేక మొనర్చె. ఆనందుఁడు గృహము వదలి తపమొనర్చె. అతఁడు తీవ్రనిష్ఠనుండగా బ్రహ్మవచ్చి వరముకోరుమన 'ఆత్మశుద్ధిని' గోరి తపమొనర్చు చున్నాననియె. బ్రహ్మ, ఓయీ ! కర్మశుఁడగువాని యధికారము చిన్నది. నీకు మోక్షమున కధికారము చాలదు. కానమనువుగానయ్యెదవనియె. మునుపటిజన్మము నందలి పేరుతో నతఁడు చాక్షుషుఁడనంబరగుమనువయ్యె. ఉగ్రుఁడను రాజు కూతురగు విదర్భను బెండ్లియాడె. చాక్షుష మన్వంతరము నందు, ఆప్యులు, ప్రభూతులు, భవ్యులు, నిలింపులు, లేఖకులు, ననునైదు దేవగణములు హవిర్భాగములఁ బొందు దేవగణము లుండిరి. నూరుయజ్ఞము లొనర్చిన 'మనోజవుడు' అను నింద్రుఁడు వీరికి దొరయయ్యె. సుమేధుఁడు, విరజుఁడు, హవిష్మంతుఁడు, ఉన్నతుఁడు, మధువు, అవంతుడు, సహిష్ణువు, నను వారిందున ఋషులైరి. ఊరువు మొదలుగాగలచాక్షుషుని కుమారులు రాజులైరి. ఇప్పటిది వైవస్వత, మన్వంతరము.

## —♦ వైవస్వత మన్వంతరము ♦—

వివస్వంతుఁడు (సూర్యుఁడు) విశ్వకర్మ కుమార్తెయగు సంజ్ఞాదేవియందు వైవస్వతుని గనెను. అతఁడు మన్వంతరాధిపతియయ్యె. ఒకప్పుడు సంజ్ఞ భర్తకాంతినోర్వక కనులు మూసికొనగా నతఁడు కోపించి "నీ కఖిలలోక సంయమనుఁడగు యముఁడు పుట్టును" అనియె. సంజ్ఞాదేవి భయపడి, చూపులు చలింపఁజేయగా నతఁడు చూచి, మరల, చంచల స్వభావయగు నది యొకటి నీకుఁ గూతురగుననియె. అందుచే యమున జనించె. సంజ్ఞాదేవి మగని వేడిమికోర్వక తన నీడను "ఛాయాదేవి" యనుపేర సృజించి, సూర్యునికడ నుండుమని తెల్పి, "నా బిడ్డలను బెంచుచు నా మగనియందనురాగము కలిగియుండుము. నామాట సూర్యుఁడడిగినను దెల్పవలదు. నేనే సంజ్ఞ నన్నట్లుండుము" అనియె. ఛాయ "నీమగఁడు కోపించి శాపమిత్తు నన్నపుడే నిజము తెలుపుదును" అనియె. సంజ్ఞ తండ్రితడ కేగిన నాతఁడు పుట్టిటఁ బెద్దకాలముండుట స్త్రీకిఁ దగదనిన నామె యిల్లువిడిచి యుత్తరకురు భూములయందు నివసించె. ఛాయాదేవియందు రవి యిద్దరు కొడుకులను, నొక్క కూతురనుగాంచె. పిమ్మట ఛాయ, సంజ్ఞసంతానముపై నశ్రద్ధ వహించె. వైవస్వతుఁడోరిమితో నున్నను యముఁడు మాత్ర మామెందన్న బోయెను. ఛాయ కోపించి, నీకాలు తెగిపడుఁ గాక యని యముని శపించె. అతఁడు భయపడి, తండ్రికడకేగి, "తల్లి యెందైన శపించుట కలదా! ఇదేమి చిత్రము!" అన సూర్యుఁడు శపింతునని భయపెట్టగా, ఛాయాదేవి తన నిజ

మైన వృత్తాంతము తెలిపె. రవి విశ్వకర్మకడ కేగి యాతనిచే గౌరవింపఁబడి నీభార్యను నీకడ కంపితిని రాలేదా? అని యడిగిన లేదని తెల్పి, వెంటనే పోయి యుత్తర కురుభూములయందు బడబారూపమున (గుఱ్ఱము రూపమున) నున్న భార్యం గాంచె.

ఆమె యచట భర్తకు సౌమ్య రూపము రావలయునని తపము చేయుచుండెను. సూర్యుఁడు తన బింబమును గొంత తరణిఁ బట్టుట కొప్పికొని విశ్వకర్మచే నట్లొనర్పఁబడి సౌమ్య మూర్తియై వచ్చె. విశ్వకర్మ యంత్రము నందెక్కించి సూర్యుని తరిమెన పట్టగా రాలిన పొడి పదునైదు భాగములొనర్చి, శివునికి శూలము, విష్ణునకు చక్రము, వసువులకు శంకువను పేరు గల యాయుధము, అగ్నికిశక్తి, కుబేరునికి శిబిక (పల్లకి) దేవ యక్ష గంధర్వ సిద్ధ విద్యాధరుల కుగ్రములయిన శస్త్రంబులు నగునట్లు విశ్వకర్మతయారుసేసెను. పదునాఱవ భాగముచే సూర్యుఁడు మగ గుఱ్ఱమై కురుభూములందు భార్యం గూడిన నామె నాసికనుండి నాసత్యులుదయించిరి. అశ్వముఖులగుటచే వారిద్వరకు నశ్వినులను పేరుగలిగె. సూర్యుని శుక్రపాతమున హయారూఢుఁడు, కవచధారి, బాణబాణాసన తూణీరాది పరికరములతో రేవంతుఁడనువాఁడు జనించె. అవల సూర్యుఁడు సంజ్ఞాదేవితోఁగూడ సంప్రీతుఁడై యేగెను. ఆమె తొలికాను పయిన వైవస్వతుఁడు మనువయ్యె. యముని పాదము పుడమి మీఁదఁ బడినంత, నది క్రిములు భక్షించిన నతని పాదమెప్పటి యట్లగునని శాపవిమోచనముం బడిసి యెప్పటి కాలును బొందెను. మిత్రామిత్రులయందు సమభావము గలవాఁడగుటచే నాతఁడు దక్షిణ దిశకధిపతియై సమవర్తియను పేరువడసె. అశ్వి

నులు దేవవైద్యులైరి. రేవంతుఁడు గుహ్యకులకు, ప్రభువయ్యె. ఛాయాదేవి మొదటికొడుకు సావర్ణి, బలిచక్రవర్తి యింద్రుడై నపుడు మన్వంతరాధిపతియగును. ఛాయ రెండవ కొడుకు శనిని గ్రహంబులందొకనిగా రవిగావించె. మూడవది యగుతపతి సంవరణుఁడను రాజునకు భార్యయై చక్రవర్తియగు కుమారుం గాంచె. వైవస్వంతమన్వంతరమున రుద్రులు, వసువులు, ఆదిత్యులు, సాధ్యులు, మరుత్తులు, విశ్వులు, భృగువులు, అంగిరసులు ననువారు గణదేవతలు, అందు మొదటిముగ్గురు కశ్యపవంశీయులు. తరువాతి ముగ్గురు యముని సంతానము. భృగుని సంతానము భృగువులు. అంగిరసుని సంతానమంగిరసులు, ఈవైవస్వత సర్గమునకు మారీచమునియు, బేరుగలదు. ఇందోజస్వియనువాఁడు యజ్ఞభాగము లనుభవించు దేవేంద్రుఁడు. ఇది నేటిమన్వంతరము.

దీనియందువలెగడచినట్టియు, రాఁబోవునట్టియు మన్వంతరము లందుండు నింద్రులందరు సహస్రాక్షులే. వృషులు, శృంగులు, పురందరులు, మఘవంతులు, కులిశహస్తులు, గజారూఢులు, అనంతవీర్యము కలవారునై, భూతముల నతిక్రమించిన తేజముతో శుద్ధవైభవగుణములచే వెలుఁగుచు ముల్లోకములను బాలింతురు. అత్రి, వశిష్ఠుఁడు, కాశ్యపుఁడు, గౌతముఁడు, భరద్వాజుఁడు, కౌర్మికుఁడు, ఋచీకునికుమారుఁడైన జమదగ్నియను వారిందు సప్తర్షులు. వైవస్వతుని కుమారులయిన ఇక్ష్వాకువు, నాభాగుఁడు మొదలుగాఁ జాలమంది రాజ్యము సేయుదురు. ఇకథ పాపహారము. వైవస్వతునికిఁ బిమ్మట ఛాయాదేవి కుమారుఁడు సావర్ణిమనువు కాగలఁడు.

అది యెనిమిదవ మన్వంతరము. ఇందు, కృపుఁడు, దీప్తి మంతుఁడు, వ్యాసుఁడు రాముఁడు, గాలవుఁడు, ఋశ్యశృంగుఁడు, ద్రౌణి (అశ్వత్థామ) యనువారు సప్తర్షు లగుదురు. సుతపుఁడు మొదలగు వారిందు ముగ్గురుగణదేవతలు. తపస్వి మొదలగువారిరువది గణములవారు సుతపు లనంబరగుదురు. ఋతుండు మొదలుగా మూడవ గణంబునందలి దేవతలీ యుగమ్మున నధికార దేవత లనఁబడుదురు. మారీచుని కుమారులు దేవత లగుదురు. అందు బలియింద్రుండగు, అతఁడిప్పుడు పాతాళమున బంధింపఁబడి యున్నాఁడు. విరజుండు మొదలుగా గల మనుపుత్రులు లప్పుడురాజులయ్యెదరు. సావర్ణి మహామాయయగు దేవి నర్చించి యామె యనుగ్రహముచేమనువైన వృత్తాంతము వినిపింతునని క్రోష్టుకి మార్కండేయున కిట్లనియె.

## —♦ సప్తశతి యను దేవీ చరిత్రము ♦—

స్వారోచిష మన్వంతరమున జైత్రుఁడను రాజవంశంబున, సురథుఁడను వాఁడు జనించి రాజయ్యె. అతఁడు కోలా విధ్వంసు లను శత్రుల కోడిపోయి, మంత్రుల దుస్తంత్రముచే సైన్యాదులను గోలుపోయి, గుఱ్ఱముమీఁద నడవి కొంటరిగా నేగి సుమేధుఁడను ముని దగ్గరకుఁ జేరెను. అచట నొక వైశ్యుంజూచి నీ వెవరవని యడిగిన నాతఁడిట్లనియె, "నేను సమాధి యనువాఁడను. నా భార్యయు, పుత్రులును నా ధనము లాగికొని, వెడలగొట్టిన నీ యడవికి వచ్చితిని. వచ్చినదిమొదలుగ వారెట్లున్నారో? యనియే విచారించుచున్నాను. ఘాత కులైన వారియెడ నీకింత మోహమేలయని యడిగితేని యదే చిత్రము. ఏలనో నా మనసు వారియెడఁ దగిలియున్నది,

ఎంతకును నా మోహము పోవుటలేదు." అన వారిరువురు సుమేధుని దర్శించి, రాజ్యమోహ మొకరికిని, బంధుమోహ మొకరికిని కలుగుట తెలిపి, మాకు జ్ఞానోపదేశము చేయుఁడని కోరిన నమ్ముని వారలకిట్లని దెలుపం దొడంగె.

ఎల్లజంతువులకు విషయజ్ఞానమున్నది. ఆయాజాతి ననుసరించి విషయములు వేరువేరుగ నుండును. కొన్నిప్రాణులు పగలు గ్రుడ్డివి. కొన్ని రాత్రి గ్రుడ్డివి. కొన్ని పగలు రాత్రి యుంగూడ సమముగానే చూచును. మనుష్యులు జ్ఞానులే కాని వారే జ్ఞానులనుట మాత్రము చెల్లదు. కాని యాయుభయుల జ్ఞానము నొకటే తీరనుటకు వీలుగాదు. గింజగింజగా నేరి పులుగులు తమ పిల్లలకందించి తాము తినక యుండును. ఇట్లే మానవులు మోహవశులై తాము గుడువక యాలుబిడ్డలకై పలుపాట్లు గుడుతురు. ఇట్లు చేయుట యెల్ల ప్రత్యుపకారము కోరియా? కాదు. వట్టి మోహమే దీనికిఁ గారణము. మమకారమను సుళ్ళుదిరిగి, మోహమను గుంటలోఁబడి మహామాయాప్రభావముచే సంసార మహాప్రవాహములోఁ గొట్టుకొని పోవుచు జీవు లిట్లయ్యెదరు. ఇంతకు విస్మయంపడఁబని లేదు. జగత్పతియైన హరియొక్క యోగనిద్రారూపమైన యీ మాయ లోకములను మోహింపఁజేయుచున్నది. అది జ్ఞానులనే కంగారుపెట్టును. ఆమెయే సృష్టి స్థితిలయముః లాచరించును. దయచే వరము లిచ్చునది యామెయే. ముక్తి నామె చేకూర్చును. అనిన విని రాజు, మాయాదేవి యెవరు? ఆమె ప్రభావాదులను విశదీకరింపుఁడన నమ్ముని వల్లభుఁడా భూవల్లభున కిట్లనియె.

జగన్మాత యగు నాదేవి నిత్యురాలు. ఆమెచే జగము లల్లుకొనియున్నవి. ఆమె జనించినట్లు పెక్కురీతుల వర్ణింపఁబడినది. ఆకర్ణింపుము. దేవకార్యమునకై యామె ప్రత్యక్షమయి నపుడామె జనించినదని లోకమెన్నును. లోకమేకార్ణవమైనపుడు భగవంతుఁడగు విష్ణువు శేషశాయియై యోగనిద్రలో నుండగా, విష్ణుని చెవులయందలి మలమునుండి మధుకైటభులను రాక్షసులు పుట్టి, బ్రహ్మను జంపఁబూనిరి. బ్రహ్మ నాభికమలమునుండి వారిం జూచి, బెదరి, హరి నిద్రలోనున్నట్లు చూచి, యాతని నేత్రములం దిరవుకొని యున్న యోగ నిద్రనిట్లని వినుతించెను.

## — బ్రహ్మ కృత దేవీ స్తవము —

విశ్వేశ్వరియు, జగత్తును ధరించి పోషించి సంహారమొనర్చు నసామాన్య తేజస్వియగు విష్ణుని నిద్రయగు భగవతిని నుతించెదను అనగా బ్రాహ్మి, వైష్ణవి, మాహేశ్వరి యనం బరగు శక్తిని నుతించెదననుట. భూతస్వరూపవై, విశ్వవ్యాపినివై, ధ్రువవై యుండుటచే 'అక్షర' అని పిలువఁబడు నోదేవీ! నీవే స్వాహాకారమవు. నీవే స్వధాకారమవు. నీవే వషట్కారమవు, నీవేసుధవు. లేక సుధాభక్షిణివి. నీవే త్రిధవు. అనఁగా ముల్లోకములను, మూఁడు వేదములను, ముమ్మూర్తులను ధరించుదానవు. నీవు హ్రస్వదీర్ఘప్లుతములను మాత్రల స్వరూపము. లేక అకార, ఉకార, మకార రూపమగు 'ఓం' కార స్వరూపమవు. పరమాత్మ రూపవగుటచే 'అనుచ్చార్యవు' అనఁగా "యతోవాచో నివర్తంతే" అను శ్రుతి చెప్పినట్లు నీవు

వాక్కులకు (వేదములకు) అందవనుట. అర్థమాత్రచే నీవు 'ముక్తిరూపిణి'వని లక్షింపవలయునే కాని వాచ్యమవుకావు. నీవే సంధ్యయు, (పితృదేవతల తల్లియనుట) నీవే సావిత్రివి, (ఋగ్వేదమనుట)లేక వైష్ణవీశక్తివి. నీవే వేదజననివి (గాయత్రి యనుట) నీవు పరమవు- శ్రేష్ఠవు. లేక పాలించుదానవు. వేద జననివనగా బ్రాహ్మ్యాదిశక్తుల పొందించుదానవనుట బ్రాహ్మి, వైష్ణవీ, మాహేశ్వరీశక్తులచే సృష్ట్యాది కార్యములొనర్చు దానవు నీవు. సృష్టిచేయునపుడు సృష్టిరూపమవు. పాలనమున స్థితిరూపమవు లయమున సంహార రూపమవు. నీవే మహా విద్యయు. మహామాయవు, మహామేధవు, మహాస్మృతివి. మహా మోహవు, భగవతివి, మహాదేవివి, మహేశ్వరివి, మహావిద్యవు. అనఁగా పరబ్రహ్మగోచరమైన జ్ఞానమే నీ వనుట. మహా + అవిద్యవు. అనిర్వచనీయ విద్యవు. మహామాయవు. ఆత్మకాని దానియం దాత్మబుద్ధి, ఆత్మయంద నాత్మబుద్ధి, మాయ యనం బడు.అదినీవే,నీవేమేధవు. అనగా ధారణాశక్తిగలబుద్ధి నీరూపమే, మహా + అమేధ.ధారణాశక్తిలేనిబుద్ధియునీవే.మహాస్మృతివినీవు. అనఁగాధ్యానరూపవు, అధ్యానరూపవు నీవేయనుట. మహామో హవు,మమతా స్వరూపవు. అమమతా స్వరూపవునీవే.భగవతివి ఐశ్వర్యవంతురాల వనుట. అనైశ్వర్యయుక్తవు నీవే.మహాదేవివి. (మహాదేవుని యిల్లాలివి) మహేశ్వరివి. వ్యాపక స్వభావవు. నీవంతటఁ బ్రకృతివి. (ప్రకృతియనఁగా సత్వరజస్తమో గుణ ముల సామ్యావస్థ) అవ్యక్తము, ప్రధానము నన బడు దానవు నీవు. నీవే సత్త్వాది గుణములఁ బాలింతువు, అనఁగా భిన్నమైన జగద్రూపమున నుండెదవనుట,సత్త్వముచే జ్ఞాన సుఖ హేతువు,

రజస్సుచే రాగాత్మకదుఃఖ హేతువు. తమస్సుచే నావరకమైన మోహహేతువు నీవు. ప్రకృతిధర్మములయిన గుణముల బాలించుదానవు నీవు. నీవే కాలరాత్రివి. జగత్సంహార కారిణివనుట, నీవే మహారాత్రివి. చతుర్ముఖుఁడు ముక్తినొందు సమయము నీవనుట (కల్పరూపిణివనుట), నీవే ధారణవు. మోహరాత్రివి. జగత్కర్త్రివనుట, నీవు శ్రీవి. (సంపదవు; హరిప్రియవు) ఈశ్వరివి, శివపత్నివి. జగద్వ్యాపినివనుట, హ్రీవి నీవు. (ప్రాణము) ప్రణవమవనియు చెప్పనగును. నీవు బుద్ధివి (బోధస్వరూపురాలవు లేక వివిధాగమస్వరూపమవు.) లజ్జ (వ్రీడ) నీవే. నీవే పుష్టివి. (అవయవముల యభివృద్ధి స్వరూపురాలవు.)తుష్టివి. ప్రీతివి నీవు. శాంతివి నీవే. (శాంతి=విషయములనుండి మఱలుట)నీవే క్షాంతివి. తితిక్షవును. ఓ చండికా! నీవే ఖడ్గినివి, గదినివి, శూలినివి. చక్రిణివి, శంఖినివి, చాపినివి బాణాసనబాణవతివి. పరిఘవు. కానసే అఘోరవు, అత్యుగ్రదర్శనవు. భుశుండియను నాప్పుదవు. ఎనిమిది భుజములచే నెనిమిది యాయుధములం దాల్చి శత్రుల జయింతువు. నీవే సౌమ్యవు. సోమదేవతవనుట వేదానుఃమంచి మఃలక్ష్మికలవాఁడు(విష్ణువు) వాని స్వభావము సౌమ్యము. అది గలది సౌమ్య. అట్టిదానవు నీవు. అనగా శోభనలక్ష్మి కలదానవనుట. సోమియనఁగా అమృతము. దాని కర్తలు సౌమ్యులు. దేవతలు, వారే నీవు కానసౌమ్యవు. సౌమ్యతరవు నీవే. సుందరములన్నిఁటికంటె నతిసుందరివినీవు. నీవే పరమవు. ఓ అఖిలాత్మికా! సత్తు, అసత్తు అను పదార్థములందలి శక్తివినీవు పదము, పదార్థము వానిచేఁజేయఁబడు స్తుతి వ్యాపారము, స్తోత్రముచేయువాఁడు స్తుతివిషయము వానివాని కుచితమైన

శక్తియునీవే. నీ కంటె వేరొకటిలేదు. కాన భేదమూలమైన స్తుతియెట్లు ప్రవర్తించును. ఏ నిన్నాధారముచేసికొని, లోకములఁబాలించి సంహారించునో, యట్టివాఁడు నిద్రా వశుండై యుండగా నిన్నెవఁడు నుతింపఁగలఁడు. విష్ణువు, నేను, శివుఁడును నీచే శరీరము పొందినాము. కాన నిన్నెవ్వఁడుకొనియాడఁగలఁడు. అట్టి నీవీ యుదారమగుస్వభావముచే వినుతింపఁబడుచు, నీ మధుకైటభులను రాక్షసులను మోహింపఁజేయుము. జగదీశ్వరుఁడైన యీవిష్ణువు మేల్కొనుంగాక! లేపుము. వీరినితఁడు సంహారించును.

అని యిట్లు బ్రహ్మచే వినుతింపఁబడి తామసరూపయగు దేవి (యోగమాయ) నేత్రములు, నాసిక, బాహువులు, హృదయము, శిరస్సనను నవయవములనుండి వెలువడి బ్రహ్మకు దర్శన మొసంగెను. ఆమె వీడినంతనే హరి మేలుకొనెను. వెంటనే మధుకైటభులాతని చూపులంబడిరి. కోపముచే విష్ణుని నేత్రము లెఱ్ఱవారెను. వారితో నైదు వేలేండ్లు పోరుజరిగెను. బలోన్మత్తులై యాదానవులు పోరిరి. హరి యవిద్యాదేవి మోమువంకఁ జూచిన నామె ప్రభావమునఁ దేజమినుమడింప, ఓ రక్కసులారా! మీ బలమునకు మెచ్చితి; నేదేని వరమడుగుఁడనియె. వారు మాయాదేవిచే మోహింపఁ బడినవారై, నగుచు, మాకేటివరము? నీవిచ్చుటేమి? నీకేవరమిచ్చెదము. కోరుకొమ్మని దర్పము నూపిరి. మావలన నీకేమి గావలయునని హరి నడిగిరి. హరియు, "నాయెడమీకుఁదుష్టి కలిగెనేని, వేరువరము లేల? నాచేతిలో మీరు చచ్చుటయేవరముగా నిండు" అన "వారట్లే కానిమ్ము. నీరులేనిచోటున మాత్రమేమమ్ము సంహారింపుమనిరి"

శ్రీపతి శంఖచక్ర గదాధారియై వారిని తన తొడల నడిమి నిడి కొని చక్రముచే నరికి వారిమేధస్సుచే నీభూమినిగావించె. అది మొదలుగ నేలకు 'మేదిని' యనుపేరువచ్చె. బ్రహ్మస్తుతి కిట్లు ప్రీతయై యావిర్భవించి, దుష్టసంహారమొనర్చి, జగమ్ములు పాలించె. వెండియునామె ప్రభావము వినుమని, మహిషాసుర, ధూమ్రలోచన, చండముండ, రక్తబీజ, శుంభనిశుంభాది రాక్షసుల నంహరించిన విధంబు వర్ణించి యిట్లనియె. (ఈకథలు దేవీభాగవతమునందు విపులముగా వ్రాసితిని గాన యిచట మానితిని).

ఇట్లు దుష్టసంహారమొనర్చి శిష్ట రక్షణమొనర్చిన జగజ్జననిని ఋషులు వినుతించిరి. జగన్మాతా! ప్రసన్నురాలవగుము. విశ్వమునకు నీవు బీజమవు నీవేముక్తి హేతువవు సర్వవిద్యలు నీరూపములు. స్త్రీలెల్లరు నీమూర్తులు. జగమెల్ల నీచేనిండినది. నిన్నునుతింప నేమిమాటలు మాకు స్ఫురించును? అందరహృదయమునందును బుద్ధివై నీవుందువు. స్వర్గాపవర్గముల నిచ్చు నారాయణీ! నీకిదే నమమస్కారము. కళ, కాష్ఠ మొదలగు భేదముచే జగత్పరిణామము కూర్చుకాలము నీరూపము. "సర్వ మంగళ మాంగళ్యే! శివే! సర్వార్థ సాధికే! శరణ్యేత్ర్యంబకే దేవి! నారాయణినమోస్తుతే" అని నిన్ను భజించెదము. శరణాగత దీనావనము నీకార్యము. నీవు సర్వార్తి హారిణివి. హంసలతోగూడిన విమానమధిష్ఠించి వచ్చి కుశోదకముల శత్రులపైఁ జల్లివారిని హరించు నీకుమ్రొక్కు. త్రిశూల, చంద్ర, నాగములఁ దాల్చి, వృషభమెక్కి మాహేశ్వరీ స్వరూపముతో వర్తించుదేవీ! నీకు వందనము. నెమలి, కోడి, యనువానితోఁ

గూడి మహాశక్తిందాల్చి, యనఘవై కౌమారీరూప సంస్థానము కలిగిన నీకు నమస్సులు. శంఖాదిధారిణీ! చక్రముఁదాల్చి కోరలచే భూమినెత్తిన వరాహావతారమూర్తివినీవే. నృసింహావతారమైన దేవికి నతులు. వేయినేత్రములు కలదానా! కిరీటినీ! వజ్రధారిణీ! ఐంద్రీ! వృత్రాసుర సంహారిణీ! నారాయణీ నీకు నమస్కారములు. ఘోరా! మహారావా! కోరలచే భయంకర రూపము కలదానా! చాముండీ! ముండమథనీ! నారాయణీ! ఇదె నమస్కృతులు. లక్ష్మీ! లజ్జా! మహావిద్యా! శ్రద్ధా! పుష్టీ! స్వధా! ధ్రువా! మహారాత్రి! మహామాయా! ప్రణమిల్లెదము. సరస్వతి! వరే! భూతీ! బాభ్రవీ (భరించువాఁడు విష్ణువు. వాని భార్య బాభ్రవి) తామసీ! నియతా! ఈశానీ! నారాయణి! దయ చూడుము. సర్వతః పాణిపాదములు, సర్వదోఽక్షి శిరోముఖములు, సర్వతశ్శ్రవణ ఘ్రాణములు కల జగన్మాతకు ప్రణమిల్లెదను. సర్వరూపా! సర్వేశీ! సర్వశక్తీ! భయమ్ములనుండి మమ్ము రక్షింపుము. దుర్గాదేవీ! నీకు నమస్కారము. కాత్యాయనీ! నీ సౌమ్యమగు ముఖము మూఁడు నేత్రములచే నలంకృతమై మమ్మెల్ల భయములనుండి కాపాడుఁగాక! జ్వాలాభీలమై యుగ్రమై యెల్ల రక్కసుల నుక్కడంచిన నీ శూలము మాకభయమిచ్చుగాత! భద్రకాళీ! రక్షింపుము. నీవు బిడ్డలట్ల మమ్ములాలింపుము. రక్కసుల మెదడుచే రక్తముచేఁ దడిసిన నీ ఖడ్గము చండికా! మాకుశుభము లిచ్చుత! నీవుతుష్టిచెంది రోగములెల్లహరింతువు. సకల వాంఛితము లిత్తువు. నిన్నాశ్రయించిన వారికి విపత్తులు లేవు. వారందరికి నాశ్రయులగుదురు. అంబా! ధర్మద్వేషులతో బెక్కురూపములఁదాని నీ విపుడుచేసిన యుద్ధము నెవ్వరు చేయు

గలరు ? విద్యలందు, వివేక దీపములగు శాస్త్రములందును దొలుతొల్లిటి వాక్యములలో (వేదములందు) నీకంటె నెవ్వతె యున్నది ? మమకారమను గుంటలో గాఢాంధకారమున నీవు లోకమును భ్రమింపఁ జేయుచున్నావు రక్షస్సులు, ఉగ్రవిషంబులగు నాగములు, దొంగలు, శత్రులు, దావానలముగల సముద్రమున నిల్చి నీవు విశ్వము నేలుచున్నావు. నీవే విశ్వేశ్వరివి, విశ్వపాలన కర్త్రివి. విశ్వాత్మవు. విశ్వధారిణివి, నీయెడ వినమ్రములగువారు విశ్వేశునికి వంద్యులయి విశ్వాశ్రయులగుచున్నారు. దేవీ! అనుగ్రహము చూపుము. మమ్ముల నరివర్గమునుండి, రక్కసులనుండి వలెఁగాపాడుము. పాపములఁబాపుము. విశ్వార్తిహారిణీ! త్రిలోకవినుతా! వరదవుగమ్ము" అని పెక్కు తెఱంగుల వినుతించు సురలం గనుగొని దేవి యిట్లనియె.

ఓ అమరులారా! వరము కోరుఁడు. మీరు కోరినదెల్ల యిత్తునన, "వైవస్వత మన్వంతరమున శుంభనిశుంభులను రాక్షసులు పుట్టెదరు. వారిని సంహరించి మాకు శుభము కూర్పుమని వారర్థించిరి. ఆమె యట్లే చేయుదుననియె, మఱియు, రౌద్రరూపమున నవతరించి వైప్రచిత్తులను రాక్షసుల భక్షించెద. అపుడు నా దంతములు రక్తముచే దానిమ్మగింజలట్లెఱ్ఱబడును. అపుడు దేవ మానవులు 'రక్తదంతిక'యను పేరఁ బూజింతురు. పిమ్మట నూరేండ్లు వానలు లేకున్న నయోనిజనై పుట్టి నూరుకన్నులచేఁ గటాక్షింతును. 'శతాక్షి' యని నన్ను వారర్చింతురు. నా మేనఁబొడమిన శాకములచే లోకములను వర్షము కురియుదాక పోషింతును. అందుచే 'శాకంభరి' యని పేరొందెద. అపుడే దుర్గముఁడను నసురను జంపెదను. హిమ

వత్పర్వతమున నున్న యరుణుడను దానవుని భ్రమరరూపము నొంది (తుమ్మెద రూపమున) సంహరింతును. అప్పుడు 'భ్రామరి' యను పేర లోకులు నన్ను బూజింతురు. ఇట్లు లోకపీడ గలిగినపుడెల్ల పెక్కు నవతారముల దాల్చి శత్రు క్షయమొనర్చి సాధువులకు శుభము గూర్చెదను. ఈ సప్తశతి యను గ్రంథముచే నన్ను వినుతించువారికెల్ల శుభములు నను గ్రహించెదను. అష్టమి, చతుర్దశి, నవమి, యను తిథులయందు దీనిం బఠించువారికి దారిద్ర్యము, బంధువియోగము, శత్రు భయము, చోరభీతి, నీరు, నిప్పు, ఆయుధములు ననువానివలన భయము గలుగదు. ఇది చదివినను విన్నను సర్వపీడలు పోవును. మహామారి శాంతించును శరన్నవరాత్రాదులందు, మహోత్స వములందు నిది పఠింపదగినది. అటనే నేను వసింతును. దీనిచే గ్రహపీడ శాంతించును. భూతప్రేత పిశాచాది బాధలు తొలం గును. ఆరోగ్యాది లాభములు కలుగును. ఈ స్తుతులు సద్గతి నిచ్చును. నా మహిమచే సింహవ్యాఘ్రాదులు దూరమునుండి తొలంగును. "ఇట్లు దేవి పలికి, యంతర్ధాన మొందెను. దేవ తలు తమ తమ యధికారము లొందిరి. దైత్యులు మిగిలిన వారు పాతాళమునకుఁ బోయిరి. ఇట్లు నిత్యయయ్యు దేవి మరల మరల యవతతార వైభవము చూపును. ఆమెయే యర్చితయై విత్తము, సంతానము, ధర్మము,బుద్ధి, మొదలగు నెల్ల కల్యాణ ములను బ్రసాదించుచుండును.

ఇట్లు దేవీచరిత్రమును దెలిపిన సుమేధమహర్షికి సుర థుండు మ్రొక్కి వెంటనే తపమ్మునకుఁ జనియె. సమాధి యను నా వైశ్యుఁడును దేవీ సూక్తమును జపించి, పూజించె. వారి

ద్దరు నామె మూర్తిని గల్పించుకొని షోడశోపచారము లొన ర్చుచు తమ మేనిరక్తమునే బలియిచ్చుచు. మూఁడేండ్లు దీక్షతో నర్చించిరి. చండిక ప్రత్యక్షమై రాజునకు రాజ్యమును, వైశ్యు నకు జ్ఞానమును దయచేసెను. మఱియు రాజునకు సూర్య కుమారుఁడవై సావర్ణియను మనువువయ్యెదవని వరమిచ్చెను. అతని మన్వంతరమునఁ గలుగు దేవతాది గణములం గూర్చి యిదివరకే తెలుపఁబడినది.

## —♦ దక్షసావర్ణి మన్వంతరము ♦—

ఇందు పారులు, మరీచులు, సుధర్మలు ననువారు మూఁడు విధములగు దేవతలుందురు. పండ్రెండు దేవగణము లుండును. అద్భుతుఁడను పేర వేయికన్నులు గలిగి యగ్ని కుమారుఁడగు కుమారుఁడింద్రుండగును. మేధాతిథి, వసుసత్యుఁడు జ్యోతిష్మంతుఁడు, ద్యుతిమంతుఁడు, సవనుఁడు, హవ్యవాహనుడు ననువారు సప్తర్షులు. దక్షసావర్ణి కుమారులు తొమ్మండుగురు రాజు లగుదురు.

## —♦ బ్రహ్మ సావర్ణి ♦—

పదియవవాఁడు. అతనిపేరు ధీమంతుఁడు. ఇతని మన్వంత రమున సుఖాసీనుఁడు, అనిరుద్ధులు ననువారు రెండు విధము లగు దేవతలుందురు. ఒక్కొక్కరు నూరేసి సంఖ్యగల గణము లయియుందురు. అందొక శతంబు ప్రాణులకు సంబంధించినది. రెండవశతము దేవతలకు సంబంధించినది. శాంతి యనువాఁ డింద్రుఁడగును. తపోమూర్తి హవిష్మంతుఁడు, సుకృతి, సత్యుఁడు, నాభాగుఁడు, అప్రతిముఁడు, వాసిష్ఠుఁడు ననువారు

సప్తర్షు లగుదురు. అమ్మనువునకు సుక్షేత్రాదులు కుమారు లయి యిల యేలుదురు.

## — ధర్మసావర్ణి —

పదునొకొండవవాఁడు. ఇతని మన్వంతరమున, విహంగమ, కామగ, నిర్మాణరతులను వారొక్కొక్కరుముప్పదిమందిగా దేవతా గణము లుందురు. నిర్మాణరతులు, మాసములు, ఋతువులు, దినంబులుగానుండెదరు. విహంగములు రాత్రులయ్యెదరు. కామగులు మాహూర్తంబు నొందెదరు. వృషుఁడను వాఁడింద్రుఁడు. హవిష్మంతుఁడు, వరిష్ఠుఁడు, ఋష్టి, అరుణి, నిస్వరుఁడు, వ్యష్టి, అగ్నితేజుఁడు ననువారేడ్గురు ఋషులు. సర్వాంతగాదులు వాని పుత్రులందు రాజులగుదురు.

## — రుద్రసావర్ణి —

పండ్రెండవవాఁడు. ఇతని మన్వంతరమున, సుకర్మ, సుమనస్క, హారీత, రోహిత, సుధారులను వారలు పది పది వంతున దేవగణంబు లయిదుగానుందురు. ఋతుధాముఁడింద్రుఁడగును. ద్యుతి, తపస్వి, సుతపుఁడు, తపోమూర్తి, తపోనిధి, తపోధనుఁడు, తపోద్యుతి యనువారు సప్తర్షులు. దేవగాదులు రాజులు.

## — రౌచ్య మన్వంతరము —

పదమూఁడవది. రుచియనురాజు గృహమునొల్లక, యగ్ని నర్చింపక, విరక్తుడై యుండగాఁ బితృదేవతలు ఋణత్రయము

దీర్ఘక యిట్లులచరింతు వన నాతఁడు, సంసారము బంధ హేతువు కాన, ముక్తికామినగు నాకదియేటి కనియె. వారు విద్యకు కర్మ మార్గంబవశ్యంబు. దాని విడువరాదన, నతఁడు నేను చాల ముసలినైతిని. నాకు బిల్ల నెవరిత్తురని చింతించి బ్రహ్మం గూర్చి తపమొనర్చె, అతడు పితృదేవతలగొల్చిన నీ కోరిక సిద్ధించుననియె. అతఁడట్లే యొనర్చి వారిని వినుతించె. (ఇట మూలములోని పితృస్తవము పారాయణమునకర్హమయినది.) వారు దయగొని, నీవిపుడొనర్చిన స్తోత్రము శ్రాద్ధాదులంద మూల్య ఫలమిచ్చునని తెలిపి యతని కోరిక నొసఁగిరి. వెంటనే నదిలో ప్రమోచన, అను నప్సరయుదయించి "వరుణ కుమారుఁడగు పుష్కరుఁడు నాతండ్రి, నాకుమార్తె మాలినియను దాని నీ కిచ్చెదనని యిచ్చిన, నాతఁడుదానిని వివాహము చేసికొనియె. ఆమెయందు రౌచ్యుఁడుదయించె. అతఁడు మన్వంతరాధిపతియయ్యె. ఇందు సుధర్మ, సుకర్మ, సుశర్మలనువారు దేవతలు. బృహస్పతివీరికింద్రుఁడు. ద్యుతిమంతుఁడు, అవ్యయుఁడు, తత్త్వదర్శి, నిరుత్సుకుఁడు, నిర్మోహుడు, సుతపుఁడు నిష్ప్రకంపుఁడు, నను వారు సప్తర్షులు. చిత్రసేనాదులు మను పుత్రులు రాజులు.

## —◆ భౌత్య మన్వంతరము ◆—

పదునాల్గవది. అంగిరశ్శిష్యుఁడు భూతియనుముని కోపి యొకఁడుండె. అతఁడు పుత్రునికై తపమొనర్చె. చంద్ర సూర్యులు వాయువును నాతనికి భయపడి మెలంగిరి; కొన్నాళ్ళకతఁడా తపమును సగములో మానివేసి తమ్ముఁడు సువర్చుడు

చేయు యజ్ఞమునకు వెళ్ళెను. అట్లు వెళ్ళుచు సుశాంతియను శిష్యు నగ్నికార్యాదులందు నియోగించె. సుశాంతియగ్ని కార్యము చేయుచుండగా నగ్నియదృశ్యుండయ్యె. గురుడు కోపించునని వెఱచి యతడగ్నిని స్తుతించి పునః ప్రతిష్ఠ సేసె. మఱియు గురువునకుం బుత్రభిక్ష పెట్టుమని యగ్నిదేవు నడిగె. అతఁడుచేసిన అగ్నిస్తవము పరమపుణ్యము. (మూలము చూడుఁడు)అగ్ని వానియెడఁబ్రసన్నుఁడై సర్వవిద్యా సంపన్ను నొనర్చె. వాని గురునికి కుమారునిచ్చె. అతఁడే భౌత్యుఁడను పేర మన్వంతరాధిపతియయ్యె. అతని యంతరమున చాక్షుషులు, కనిష్ఠులు, పవిత్రులు, భ్రాజితరులు, ధారావృకులునను దేవగణంబు లయిదుండును. శుచియనువాఁడు వీరి కింద్రుఁడగు. అగ్నీ ధ్రుఁడు, అగ్నిబాహుఁడు, శుచి, ముక్తుఁడు, మాధవుఁడు, శుక్రుఁడు, అజితుఁడు ననువారు సప్తర్షులు. గంభీరావులీ మనువు కొడుకులురాజులగుదురు.

ఇట్లుక్రోష్టికి పదునల్గురు మనువుల చరిత్రలుం దెలిపి యీకథలు పాపముల హరించును. పుణ్యముగూర్చును. సంతతి కలిగించును. మొదటి మన్వంతర చరిత్ర ధర్మవృద్ధి, స్వారోచిష చరిత్ర ధనములు. ఔత్తమచరిత్ర కోరినకోర్కులు, తామస కథ జ్ఞానమును, రైవతకథవృద్ధి, సుందర స్త్రీ ప్రాప్తిని, చాక్షుషచరిత్ర మారోగ్యము, వైవస్వత కీర్తనమున బలము, సూర్యసావర్ణి చరితము పుత్రపౌత్రులను, బ్రహ్మసావర్ణి కథ, శత్రుజయమును, రుద్రసావర్ణివర్తనము శుభమును దక్షసావర్ణి వృత్తాంతము గుణసంపదను, రౌచ్యవర్తనము శత్రుమర్దనము, భౌత్యకథ దేవతాభక్తియనుఫలములనునిచ్చును. అనిమార్కం

డేయునికిఁ దెలిపి, పిమ్మట సృష్ట్యాదికమును, రాజవంశచరిత్ర ములను వినిపించె. (అవి పురాణాంతరములందు వ్రాయుటచే జర్విత చర్వణమగునని యిందు మానితిని).

—♦ సూర్యుఁడు ఆయుష్కారకుఁడు ♦—

క్రోష్టికి యిట్లనియె. యముని కుమారుఁడు రాజ్యవర్ధనుఁడు. అతనిభార్య మానిని. ఆమె భర్తకభ్యంజనము చేయుచు కన్నీరు పెట్టుకొన, నేలదుఃఖింతువని భర్తయడిగిన, మీ తలపై, నెరసిన వెంట్రుకలంగని చింతిల్లెదననియె అతఁడు తన తండ్రి తాతలవలె వానప్రస్థధర్మమున నడవికేగి తపమ్ము చేయు సమయము వచ్చెనని యెంచి సంతసించెద; దీనికి నీవింత వగచెదవేల యన, నాయింతి హర్షించె. అతని పౌరులు మాత్ర మాతని యాయువు వృద్ధికావలయునని సూర్యునర్చించి పదివేల వత్సరములు సంపాదించిపెట్టిరి. అతఁడందుల కెంతయుఁ జింతించి తానును భార్యయుం జని సూర్యునర్చించి తన రాష్ట్రప్రజలకు దీర్ఘాయువు సంపాదించె.

—♦ నా భా గ చ రి త్ర ♦—

మనుసుతుండగు ధృష్టునకు నాభాగుఁ డుదయించె. అతఁడొక వైశ్యకన్యంగని మోహించిన వలదని తండ్రి వారించిన వినక యామెం బెండ్లియాడె. దానికై తండ్రికొడుకులకుఁ బోరుపొసఁగె. అది తీవ్రమైనతఱి, పరివ్రాజుఁ డను ముని తగవరియై, "నాభాగుఁడు చేసినది తప్పుగాదు. కాని, యీతఁడు తొల్త క్షత్రియస్త్రీని పెండ్లియై వైశ్యకన్యం జేపట్టుట న్యాయము. అట్లు చేయని కతన నితనికి వైశ్యత్వము కల్గినది. శుద్ధ క్షత్రియు

డగు నీవువీని తో నిపుడు యుద్ధము చేయకూడదు" అనియె. నాభాగుఁ డంతటఁ దండ్రియానతిచే, పశుపోషణ వాణిజ్యాది వైశ్యకృత్యములం బ్రవర్తించె. అతనికి భనందుఁ డను కొడుకు గలిగె వానిని దల్లి గోపాలుఁడవు కమ్మనిన, నాకు గోవెక్క డిది. గోరూపయగు భూమిని శత్రువులు కదా యేలుచున్నారు" అన, నమ్మని వానిమాటల కలరి దివ్యాస్త్రము లుపదేశించె. అతఁడు పినతండ్రి కుమారు సురాతు గెల్చి రాజ్యము తండ్రి కిచ్చె. నా భాగుఁడు నేను రాజు కాఁదగను, నీ వార్జించి కొన్నది నీవే యేలుకొమ్మనియె. ఆ మాట నాభాగుని భార్య సుప్రభవిని, నేను వైశ్యసుతనుగాను సుదేవుఁడను రాజు భార్యలతో స్నేహితుఁడగు నలునితో (ధూమ్రాశ్వుని కొడుకు నలుఁడు) నామ్రవనమున ద్రాగి క్రీడించుచుండ ప్రమతియను ముని భార్య కానిపించె. నలుఁడామెను బలాత్కరింప నది గోల పెట్టిన, సుదేవుఁ డూరకుండె. ప్రమతి వచ్చి రాజవుగాదా? ఇట్టి పాపము చూచుచు నూరకుందువా? అన, వాఁడు నేను కోమటిననియె ఋషి వానినిజమెఱింగి, ఓరీ! ఇప్పుడే నీవు భస్మ మయ్యెదవని శపించె. వాఁడు తప్పుద్రావి యిట్లు సేసితి; క్షమింపు మని ముని పాదముల వ్రాలె. ముని "నామాట తప్పదు. నీ కూతు నొక క్షత్రియుండు పెండ్లియాడు. అపుడు నీవు క్షత్రియుండ వయ్యెదవు పొమ్మనియె. కాన నీవు వైశ్యుండవు గావు. రాజ్యమేలుమని నాభాగునికిఁ దెలిపి వెండియు సుప్రభ యిట్లనియె.

సురథుఁడను ముని గంధమాదనమునఁ దపము చేయు చుండగా నొక గోరువంక డేగ నోటినుండి జారిపడి యేడ్చు

చుండగాఁ జాలిపడి మూర్ఛనొందునంతలో నాశారిక యందు నేను జనించితిని. కృపగొనిన సమయమునఁ బుట్టుటచే నాకు "కృపావతి" యనుపేరు గల్గె. నేను చెలికత్తెలతోఁగూడి వనమ్మున విహరించుచుండగా నగస్త్యభ్రాత యీ దారి నేగుచుండ, నా చెలికత్తెలు ఓయీ! నీవు కోమటివా? అని గేలి సేసిరి. అతఁడు కోపించి నామోమువంకఁజూచి నీవు కోమటిపిల్లవయ్యెదవని శపించె. ఇతరులుచేసిన తప్పునకు నన్నేల శపింతురని నేనడిగిన దుష్టసహవాస దోషముచే నీ కిది తటస్థించె. పంచగవ్య మించుక కల్లుచుక్కచేఁ జెడినట్లు నీవు చెడితివి. అని నా ప్రార్థనమున నీవిధముగా శాపమోక్షమును గ్రహించె. నా భాగుడందులకు హర్షించె. వాని సుతుఁడు రాజ్యమును చక్కగా నేలె.

## — వత్సంధ్రు చంత్ర —

భనందుని కొడుకు వత్సంధ్రుఁడు. అతఁడు కుజంభుఁడను రాక్షసుం జంపి, వాఁడు హరించిన సునందను పెండ్లియాడె. ఆమె విదూరథుని కుమార్తె, విదూరథుఁడు సుమతి సునీతులను కొడుకులతో వేటకేగి, యొకచోఁ బెద్ద కన్నము చూచి యడిగిన, సువ్రతుండను ముని "ఇటకుజంభుఁడను రాక్షసుఁడున్నాడు. వాఁడు సునందమును రోకలిగొని భూమికిఁ బెక్కు కన్నములు దొవ్వినాఁడు. నీవు వానిం జంపుము" అనిమె. అతఁడు పురమ్మునకేగి మంత్రులతో నాలోచించు నంతలో నా దానవుడు వాని కుమార్తె నెత్తికొనిపోయె, ఆమెం గొనితెమ్మని రాజు కుమారులం బంపె. వారా రక్కసునిచే బంధింపఁబడిరి. రాజా

రక్కసుని జంపి, తన వారిం దెచ్చినవారికా పిల్లనిత్తుననియె. వత్సంధ్రుఁడట్లుచేసి సునందను బెండ్లియాడె. ఆ బిలమునందున్న పుడు తన్నర్చించెనని యామెకు సునంద యను పేరుపెట్టె, ఈవత్సంధ్రు వంశమున ఖనిత్రుఁడు పుట్టి అతఁడు వశిష్ఠు దయచే జ్ఞానియై పుణ్యలోక ప్రాప్తుండయ్యె. అతఁడు పెక్కువేల యాగములు చేసి భూమిని బ్రాహ్మణులకిచ్చి మఱల దానిని ధనము పెట్టికొని మరల యజ్ఞములు సేసెనని గంధర్వులతని కీర్తిని గానము చేయుదురు. అతఁడు పితృయాగము చేయుటకు కడలికేగగా, నొక మృగము నన్నుజంపుమనివచ్చె. కారణమేమని రాజడుగ నేను సంతానహీనుఁడను. నాబ్రతుకు వ్యర్థములనియె. మఱొక మృగమువచ్చి, నేను బడరాని పాట్లు పడుచున్నాను. ఆత్మఘాతుకుల కుత్తమ లోకములుండవు. కాన నాయంత నేను జావరాదు. ఇది సంతానములేనిది, కాన దీనికి దుఃఖమొక్కటే. నాకు సంతానమున్నది. బహుశరీరుడను గాన నా దుఃఖము బహురూపము. కాన నన్నే చంపుమని మఱియొక మృగమనియె. ఇది విని రాజు సంతానము లేకుండుటయు, సంతానముండుటయుం గూడ దుఃఖకారణమట్లయున్నది. కాన నేను జీవవధ చేయక, తపమొనర్చెదనని గోమతీ తీరమున నిండుప్రేమ నర్చించి బలాశ్వుండను సుతుంగాంచె. అతఁడే కరంధముండని పేరొందె. కరముల నూదినంత జనించిన బలము కలవాఁడగుటచే నాతని కా పేరుగల్గె.

## —♦ అవీక్షిత్తు చరిత్ర ♦—

కరంధముఁడు వీరయను నింతియందు శుభగ్రహములచే నవీక్షితుండగుట నవీక్షితుండను పేరొందిన కుమారుం

గాంచె. అతడు కణ్వపుత్రునికడ సర్వవిద్యలు నేర్చె. అతఁడు విశాల యను రాజకన్యం జేకొనిన రాజులాతని నెదిర్చి యధర్మ యుద్ధమున నోడించిరి. విశాల యతని నేకాని వరింప నని తండ్రికిఁ దెల్పె. కరంధముఁడు పోయి వాని శత్రులఁ గూల్చె. అవీక్షితుండు నేను శత్రులకోడిన వాఁడం గాన యీామెను వివాహ మాడనన, నా యింతి వేఱొక జన్మమందేని యీాతని సేవరింతునని తపమొనర్చి కృశించి ప్రాణములు విడుతునని యున్నంతలో దేవదూత వచ్చి నీవు చక్రవర్తి తల్లి వౌదు వనిరి. ఆమె శాంతింబొంది యుండె. అవీక్షితుని తల్లి కిమిచ్ఛక వ్రతము సేయఁబూని, దానిని నెర వేర్పుమని కుమారునడిగెను. అతఁడంగీకరించె. ఆమె లక్ష్మీపూజ లొనర్చుచుండె. అవీక్షితుని తండ్రి తనకు మనుమని ముఖముం జూడవలయునని కోరిక గల దనియు, తన భార్యచేయు వ్రతమ్మున కది ఫలముగాఁగావలయు నని కోరె. అవీక్షితుండది విని నేను బ్రహ్మచారినై యున్నాను. ఈ వ్రతమున కట్టి ఫలమెట్లు గలుగును ? అనఁ దల్లి, నీవు నా కోరినట్లు నా వ్రతము నెర వేర్పవలయునని శాసించె.

అంత నవీక్షితుండు వేటకేగి, దృఢకేశుఁడను రాక్షసుని జూచె వాఁడునీభార్యంగొంపోవ వచ్చితిననియె. "నాకేటిభార్య" యని పోయిపోయి వైశాలింజూచె. ఆమె యాతనింజూచి యంగ లార్చె. రాక్షసుంజంపి భార్యతో నింటికేగె. అతని భార్య తన వృత్తాంతమిట్లు తెలిపె.

నాకుఁ జక్రవర్తి యుదయించునని దేవదూతవలన విని గంగలో స్నానమాడుచుండగా నన్నొకనాగరాజు పాతాళము నకుం గొంపోయె. అట నాగులు నన్నర్చించి నీకొడుకునకీ

రక్కసుని జంపి, తన వారిం దెచ్చినవారికా పిల్లనిత్తుననియె. వత్సంధ్రుఁడట్లుచేసి సునందను బెండ్లియాడె. ఆ బిలమునందున్న వృషు తన్నర్చించెనని యామెకు సునంద యను పేరుపెట్టె, ఈవత్సంధ్రు వంశమున ఖనిత్రుఁడు పుట్టి అతఁడు వశిష్ఠు దయచే జ్ఞానియై పుణ్యలోక ప్రాప్తుండయ్యె. అతఁడు పెక్కువేల యాగములు చేసి భూమిని బ్రాహ్మణులకిచ్చి మఱల దానిని ధనము పెట్టికొని మరల యజ్ఞములు సేసెనని గంధర్వులతని కీర్తిని గానము చేయుదురు. అతఁడు పితృయాగము చేయుటకు కడలికేగగా, నొక మృగము నన్ను జంపుమనివచ్చె. కారణమేమని రాజడుగ నేను సంతాన హీనుఁడను. నాబ్రతుకు వ్యర్థముఅనియె. మఱొక మృగమువచ్చి, నేను బడరాని పాట్లు పడుచున్నాను. ఆత్మఘాతుకుల కుత్తమ లోకములుండవు. కాన నాయంత నేను జావరాదు. ఇది సంతానములేనిది, కాన దీనికి దుఃఖమొక్కటే. నాకు సంతానమున్నది. బహుశరీరుడను గాన నా దుఃఖము బహురూపము. కాన నన్నే చంపుమని మఱియొక మృగమనియె. ఇది విని రాజు సంతానము లేకుండుటయు, సంతానముండుటయుం గూడ దుఃఖకారణమట్లయున్నది. కాన నేను జీవవధ చేయక, తపమొనర్చెదనని గోమతీ తీరమున నిందుని నర్చించి బలాశ్వుండను సుతుంగాంచె. అతఁడే కరంధముండని పేరొందె. కరముల నూదినంత జనించిన బలము కలవాఁడగుటచే నాతని కా పేరుగల్గె.

## — అవీక్షిత్తు చరిత్ర —

కరంధముఁడు వీరయను నింతియందు శుభగ్రహములచే నవీక్షితుండగుట నవీక్షితుండను పేరొందిన కుమారుం

గాంచె. అతడు కణ్వపుత్రునికడ సర్వవిద్యలు నేర్చె. అతఁడు విశాల యను రాజకన్యం జేకొనిన రాజులాతని నెదిర్చి యధర్మ యుద్ధమున నోడించిరి. విశాల యతని నేకాని వరింప నని తండ్రికిఁదెల్పె. కరంధముఁడు పోయి వాని శత్రులఁ గూల్చె. అవీక్షితుండు నేను శత్రులకోడిన వాఁడం గాన యీమెను వివాహ మాడనన, నా యింతి వేఱొక జన్మమందేని యీతని నేవరింతునని తపమొనర్చి కృశించి ప్రాణములు విడుతునని యున్నంతలో దేవదూత వచ్చి నీవు చక్రవర్తి తల్లి వౌదు వనిరి. ఆమె శాంతింబొంది యుండె. అవీక్షితుని తల్లి కిమిచ్ఛక వ్రతము సేయఁబూని, దానిని నెరవేర్పుమని కుమారునడిగెను. అతఁడంగీకరించె. ఆమె లక్ష్మీపూజ లొనర్చుచుండె. అవీక్షితుని తండ్రి తనకు మనుమని ముఖముం జూడవలయునని కోరిక గల దనియు, తన భార్య చేయు వ్రతమ్మున కది ఫలముగాఁగావలయు ననికోరె. అవీక్షితుండది విని నేను బ్రహ్మచారినై యున్నాను. ఈ వ్రతమున కట్టి ఫలమెట్లు గలుగును? అనఁ దల్లి, నీవు నా కోరినట్లు నా వ్రతము నెరవేర్పవలయునని శాసించె.

అంత నవీక్షితుండు వేటకేగి, దృఢకేశుఁడను రాక్షసుని జూచె వాఁడు నీభార్యం గొంపోవ వచ్చితిననియె. "నాకేటి భార్య" యని పోయిపోయి వైశాలిం జూచె. ఆమె యాతనిం జూచి యంగ లార్చె. రాక్షసుం జంపి భార్యతో నింటికేగె. అతని భార్య తన వృత్తాంతమిట్లు తెలిపె.

నాకుఁ జక్రవర్తి యుదయించునని దేవదూతవలన విని గంగలో స్నానమాడుచుండగా నన్నొకనాగరాజు పాతాళము నకుం గొంపోయె. అట నాగులు నన్నర్చించి నీకొడుకునకే

పాము లపకారము చేయుదురు. అపుడునీవు మాకులంబుఁగాపా డవలయును. అని కోరిరి. సరియంటెని. నన్నీవు వివాహముగమ్మ నియె. అతఁడు నిన్ను విడిచినాఁడను, మఱలయెట్లు గ్రహింతు నన్నంతలో నొక గంధర్వుఁడువచ్చి "ఈమె నాకూతురు. ఇది యగస్త్యు నాశ్రమంబున విహరించుచుండ నాతఁడు మనుష్య స్త్రీ వై జనింపుమని శపించె" నీవిద్దానిం బరిణయము గమ్ము... అనియె. అతఁడంగీకరించె. వారు గంధర్వలోకమునఁ గొన్నాళ్లు విహరించిరి. వారికొక కుమారుఁడుదయించె. అతడు మరుత్తుఁ డనుపేరునఁ జక్రవర్తి లక్షణుఁడై యొప్పె. సర్వదేవత లతనికిఁ దోడ్పైరి. అవీక్షితుఁడు భార్యతో, సుతునితో స్వపురంబునకు వచ్చి తలి దండ్రుల నానందపఱచె.పిమ్మట పెక్కుసంవత్సరము లిలయేలి మరుత్తునికిఁ బట్టాభిషేక మొనర్చె.

## —: మరుత్తను చక్రవర్తి కథ:—

మరుత్తు చక్రవర్తియై పెక్కు యాగములొనర్చె. ఒక ముని యాతని కడకువచ్చి "మీపితామహి నీతోనిట్లు చెప్పు మన్నది. ఓయీ! నీవు మంచి చెడ్డ లెఱుఁగ లేకున్నావు. చారుల నెడికన్నులు నీకు లేవు. నాగలోకమునుండి పాములు వచ్చి యేడుగురు మునులం గఱచినవి. విషముచే నీటిం జెఱచినవి. హవిస్సులఁ బాడుచేసినవి. రాజకుమారుఁడభిషేకజలములచే శిరమ్ము తడియుదాక భోగలంపటుఁడై యుండిన నుండవచ్చుం గాక! అభిషిక్తుఁడైన పిమ్మట నట్లుండ రాదు. రాజు శరీరము భోగార్థముగాదు, ఇట కష్టమనుభవించి ధర్మమును బాలించిన రాజు పరలోకమున సుఖమనుభవింపఁగలడు" అనినవిని మరు

చ్చక్రవర్తి వింట బాణములు దొడిగి, యౌర్వునియాశ్రమమున
కేగి పితామహికిని, మునులకును బ్రణమిల్లి, సర్పదష్టులై పడిన
మునులఁజూచి, తన్నుదా నిందించుకొని సంవర్తకమను నస్త్ర
ముందొడిగి సర్పములు నశించుగాక యనివిడిచె. అది యోర్వ
లేక సర్పలోకము మరుత్తుని తల్లిని శరణొందిరి. ఆమె మున్ను
వానికి వరంబిచ్చిన మాటతలంచి యవీక్షితుని గాంచి, నీకొడు
కును వారింపుమన నతఁడు విరోధులగు వీరి నెట్లు రక్షింతునని
మఱియుఁ జెప్పిచూచెద; వినకున్నచో నేనే యాయస్త్రంబు
నాపెదనని పోయి ప్రయత్నించె. కొడుకందులకు వినకున్న వారి
ర్వురకు ఘోరసమరమ్మయ్యె. అంత నయ్యాశ్రమమునులడ్డము
వచ్చివారించిరి. విషహరంబులయినమంత్రములజపించిసర్పహతు
లగు మునుల బ్రతికించిరి. మరుత్తుఁడు తండ్రికి మ్రొక్క, నతఁడా
తని దీవించె. మరుత్తునికి నరిష్యంతాదులగు పదునెనమండ్రు
గురు కుమారులు పుట్టిరి. అతఁడంతర్బాహ్యశత్రులఁ గెలిచి పుడ
మిని సుభిక్షముగాఁ బాలించె.

—: నరిష్యంతుని చరిత్ర :—

మరుత్తుని సుతుఁడు నరిష్యంతుఁడు. అతఁడెనుబది యైదు
వేలేండ్లు రాజ్యముసేసె. పెక్కుయజ్ఞములొనర్చె. అతఁడొక
యాగదీక్షగొని ఋత్విక్కుగా నొక్కబ్రాహ్మణుఁడైన లభింపఁ
డయ్యె. బహిర్వేదియందైన దాన మీయ వలయునని
యాతఁడెంత యత్నించినను, విప్రులు "మాకు ధనధాన్యాదు
లందేలోపమును లేదు. దానములు పట్టమనిన, నతఁడు వారి
నెంతో బ్రతిమాలి, తెచ్చి యజ్ఞముగావించె. అతని పాలనము
నెటఁజూచినను యజ్ఞములే సాగె.

## —♦ దమునిచరిత్ర ♦—

నరిష్యంతుని కుమారుఁడు దముఁడు అతఁడింద్ర సమ బలుఁడు. మునివలె దయాస్వభావుఁడు. తొమ్మిదేండ్లు తల్లి గర్భమున నున్నవాఁడు. తండ్రి శత్రువుల నోడించి యతనికి శాంతి గూర్చెను.

## —♦ ఫలశ్రుతి ♦—

మార్కండేయమహర్షి జైమినీయుండగు క్రోష్టుకికిఁ దెల్పిన యిక్కథ పవిత్రతమము. జ్ఞానదీప్తి గలిగించునది. అని విజ్ఞాన చక్షులగు పక్షులు పారాశర్య శిష్యుఁడైన జైమినికిం దెలిపి, యిప్పురాణము చదివినను విన్నను సర్వ తీర్థయాగదాన ఫలములు నొనగూడును. పాపములెల్ల తొలంగు. సర్వశుభంబులు నొదవు. దివ్యవిజ్ఞానముదయించునని తెల్పిన నప్పక్షుల నమ్ముని దీవించి, నిజాశ్రమంబున కరిగి పరమానంద భావితుం డయ్యె.